
యస్వీ అవలోకనలో

# చిత్ర శిల్ప జగత్తు

యస్వీ రామారావు



యస్వి అవలోకనలో

# చిత్ర శిల్ప జగత్తు

☆

యస్వి రామారావు

☆

రేఖ ప్రచురణలు

హైదరాబాద్ – 500 033

**SV AVALOKANALO**
**CHITRA SILPA JAGATHU**
Articles on art and Artists
by S.V. Rama Rao


First impression : 1999
Copies : 1000
Price Rs : 50/-

A C NO. 83863
-500 044.
750
C. 12774

*Published by :*
Rekha Publications
"VINDHYA"
B - 76, Journalists Colony
Jubilee Hills, Hyderabad - 500 033

*Sole distributors :*
Navodaya Book House
Opp : Lane of Arya Samaj
Sulthan Bazar, Hyderabad.

*Printed at :*
Kala Jyothi, Hyderabad, India



# ఆప్తవాక్యం

ప్రతిమనిషీ కూడ కొన్ని అడుగుల ఎత్తు మాత్రమే వుంటాడు కాని ఆ మనిషిలో దాగివున్న మనిషి మాత్రం కొన్ని మైళ్ల ఎత్తు కలిగి వుంటాడు. అడుగుల నిడివిలో మైళ్ల నిడివి ఇమిడి వుండగలదా అనే అనుమానం అవసరం లేదు. ఆవగింజంత మర్రిగింజలో అంత బ్రహ్మాండమైన మర్రిచెట్టు ఇమిడి వుంటుంది. పరమాణువులో బ్రహ్మాండం ఇమిడి వుంటుంది. క్షణం అనేదాని గర్భంలో సంవత్సరాలు ఇమిడివుంటాయి. Microcosm లో Macrocosm ఇమిడి వుంటుంది.

బయటికి కనిపించే రామారావు నిజమైన రామారావు కాడు, లోపల ఇమిడివున్న మైళ్ల ఎత్తుగల రామారావు మాత్రమే నిజమైన రామారావు. ఆ కనిపించని రామారావే ఈ కనుపించే రామారావు ద్వారా చిత్ర రచన చేయిస్తూంది. అందుకే ఆ చిత్రాలకంత విలువ! రచనలు అంత బరువు!

- సంజీవదేవ్


(1967)

★

# యస్వీ అవలోకనలో
# చిత్ర శిల్ప జగత్తు

| | | |
|---|---|---|
| 1. | భారతిలో నేను.. | 9 |
| 2. | నేటి చిత్రకారుడు – అతని కళ | 15 |
| 3. | కళలు – ప్రచురణలు | 23 |
| 4. | శాస్త్రయుగంలో కళాకారుడు | 29 |
| 5. | మన చిత్ర కళ | 35 |
| 6. | జానపద చిత్రకళ | 43 |
| 7. | జామినీరాయ్ | 47 |
| 8. | లండన్‌లో మన చిత్రకారుల పద్ధతులు! | 57 |
| 9. | కామన్ వెల్త్ చిత్ర కళా ప్రదర్శన | 63 |
| 10. | బ్రిటిష్ చిత్రకళ | 73 |
| 11. | అమెరికన్ – బ్రిటిష్ శిల్పాలు | 85 |
| 12. | ఐకన్‌లు | 97 |
| 13. | ఆఫ్రికన్ కళాసంపద | 103 |
| 14. | కళలో కవిత్వం చెప్పే జీన్ ఆర్ప్ | 107 |
| 15. | రోదాఁ | 115 |
| 16. | బెన్ నికల్‌సన్ | 121 |
| 17. | మహోన్నత చిత్రకారుడు – బ్రాక్ | 129 |
| 18. | డన్ అంతర్జాతీయ చిత్రకళా ప్రదర్శనము | 141 |
| 19. | ఇక నా గురించి ........ | 155 |
| 20. | చిత్రకళ – నా భావన | 159 |

★



# ప్రొఫెసర్ చిల్లాపల్లి వెంకటరావు, శారదాంబగార్లు

నా మామగారు డా. చిల్లాపల్లి వెంకటరావుగారు 1911లో గుంటూరు జిల్లాలోని సత్తెనపల్లికి దగ్గరలో వున్న గ్రామంలో జన్మించారు. చాల కష్టపడి, స్వయంకృషితో విద్య నభ్యసించారు.

మొదటి నుండి ఆంధ్ర యూనివర్శిటీలోనే ఉద్యోగం చేస్తూ రిటైర్ అయినారు. విద్య తప్ప మరొక వ్యాపకం లేదు జీవితంలో. బీదవాళ్ళకు విద్య వొక్కటే మార్గం జీవితంలో అభివృద్ధి చెందాలంటే అని వీరి గాఢ విశ్వాసం. ఇంగ్లండులో మాస్టర్స్ డిగ్రీ, అమెరికాలో Ph.D. డిగ్రీలను కెమికల్ ఇంజనీరింగులో పొందారు.

లోహ సంగ్రహణం, ఆయస్థ మార్పిడి, వాయు - ద్రవ స్థితులలో ద్రవ, ద్రవ స్థితులలో సమతాస్థితి, మాంగనీసు ఖనిజం శుద్ధి చేయడం వంటి ఎన్నో అంశాలపై, వందల వ్యాసాలు, పేపర్లు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రచురించారు.

తాను జీవితంలో స్వయం కృషితో, కష్టపడి విద్య నభ్యసించారు గనుక, తన వద్ద చదువుతున్న విద్యార్థులను గూడ అంత కష్టపడి చదివి, తమ విద్యారంగంలో పేరు ప్రఖ్యాతులు సంపాదించాలి అని వుత్తేజపరచేవారు. అమెరికాలో చాలచోట్ల, ఎంతోమంది

నన్ను కలసినప్పుడు ''మేము మీ మామగారి శిష్యులం'' అని గర్వంగా చెప్పుకుంటూ శ్రీ వెంకటరావుగార్ని సగౌరవంగా తలచుకుంటుంటే నేను అనుకునేవాణ్ణి ఆయన జీవితం ధన్యమైనది అని. ఆంధ్ర యూనివర్శిటీ ఇండియాలోనే మొట్ట మొదటగా 'కెమికల్ ఇంజనీరింగు డిపార్టుమెంటు'ను స్థాపించింది. Prof. వెంకటరావుగారే ప్రారంభించారు డిపార్టుమెంటును. అందుకే వీరిని "Father of Chemical Engineering in India" అంటారు.

వీరు ముప్పై ఏండ్లుగ ఆంధ్ర యూనివర్శిటీలోని కెమికల్ ఇంజనీరింగుకు Head of the Department గ వున్నారు. తన పరివేక్షణలో 1200 మంది డిగ్రీ, 450 మంది పోస్టు గ్రాడ్యుయేట్సు, 22 మంది Ph.D. లను దేశానికి అందించారు.

వీరి సంతానం అంతా చదువుకున్నవాళ్లే. 1986లో ఆంధ్ర యూనివర్శిటి Prof. వెంకటరావుగార్ని "Doctor of Science" డిగ్రీ ఇచ్చి సత్కరించింది. 1998 డిశంబరులో Indian Institute of Chemical Engineering Society వారు Dr. చిల్లాపల్లి వెంకటరావుగారికి "Life Time Achievement Award" ఇచ్చి గౌరవించింది. ఈ సంస్థ విశాఖపట్నం వచ్చి, పెద్ద సభలో, ఆంధ్ర యూనివర్శిటీలో ఇచ్చింది. ఈ జాతీయ సంస్థ స్థాపించిన తర్వాత ఇదే మొట్టమొదటిగ ఒక శాస్త్రవేత్తకు ఇచ్చిన గౌరవం. భారతదేశంలోనే వీరినే గుర్తించి ఇచ్చిన ఈ గౌరవానికి ఈయన అన్నివిధాల అర్హులు.

నా మామగారు Dr. చిల్లాపల్లి వెంకటరావు గార్కి, అత్తగారు శారదాంబగార్కి నా పుస్తకాన్ని అంకితం చేయుటం నాకెంతో సంతోషాన్నిస్తున్నది. ఇలా నన్ను నేనే గౌరవించుకుంటున్నాను అని భావిస్తున్నాను. ఇలాంటి సదవకాశాన్ని కలుగచేసినందుకు శ్రీ వెంకటరావు గార్కి కృతజ్ఞత తెలుపుకుంటున్నాను.

- యస్వీ రామారావు

☆

# డాక్టర్ బోడేపూడి రాజ్

మిలీనియమ్ వస్తున్నది. ఆసందర్భంగా భారతదేశపు గత చరిత్ర గురించి విశ్లేషణ పూర్వక విచారణ, భవిష్యత్తు పురోగమనాన్ని గురించి ఆలోచనలు ప్రారంభమైనాయి. వేదకాలపు జ్ఞాన విచారణ పెద్దలకు వదలివేసి, చిత్రకారుడు విదిలించిన కుంచెలో నుండి చిలికిన రంగుల మాదిరిగా, నా వివిధ భావాల్ని మీ ముందు వుంచుతాను. నా ఆధ్యాత్మిక చింతన అనే కాన్వాస్‌పై చిత్రించినవి రెండు రూపాలు - భగవాన్ కృష్ణుడు మరియు కరుణామయ బుద్ధుడు. ఇద్దరూ ధర్మాన్ని బోధచేసారు. జీవితాన్ని మంచి చెడ్డల గుండా ఎలా సాగించాలో చెప్పారు. ఆధ్యాత్మిక చింతన జ్ఞాన సంపూర్ణతలతో నిండిన, భారతదేశాన్ని మనకిచ్చివెళ్ళారు.

మిలీనియమ్ కాలంపైగా మనదేశం శత్రువులచే పదేపదే జయింపబడడంతో జీవితాలన్నీ తారుమారయ్యాయి. నిజానికి బయటనుండి వచ్చిన శత్రువుల దాడికంటే మనదేశాన్ని నాశనం చేసింది "అందరు మానవులూ సమానం'' అనే తత్వాన్ని మన యొక్క హ్రస్వ దృష్టితో గుర్తించక పోవడం. "ఒకర్ని మార్చే ముందు నీవే మారవలసి వుంది. అప్పుడు గాని మంచి చెడులకు మధ్య సామరస్యం ఉండదు'' - అనే శ్రీకృష్ణ భగవానుని ప్రవచనము గ్రహించగల్గుతాం. మానవజాతికి జరుగుతున్న ఘోరాలను, ముఖ్యంగా స్త్రీలకు జరుగుతున్న అఘాయిత్యాలకు సంఘపరంగా, వ్యక్తిగత రూపేణా సానుభూతులతో, భగవత్ కృపతో నిర్మూలించాలి.

బోడేపూడి రాజ్‌గారు అన్న మాటల్నే పైన ఉదహరించాను. ఆధ్యాత్మిక చింతనా పరుడు క్రియాశీలి, చిరకాల మిత్రుడు అయిన డా॥ బోడేపూడి రాజ్‌గారి ప్రోత్సాహం, సహకారం నా పుస్తకం మీముందుకు రావడానికి సహకరించాయి. అందుకు హృదయపూర్వక అభినందనలు.

డా॥ బోడేపూడి రాజ్‌గారి కుటుంబానికి నా కుటుంబానికి 1981 నుండి చికాగో నగరంలో వున్నప్పటినుండి, స్నేహం వుంది. తానా సభలు కానీయండి, ఏ సంఘపరమైన కార్యక్రమం కానీయండి, వారితోడ్పాటు వుంటుంది. Information Technologies లో International Banking లో వారి అనుభవం దశాబ్దాలుగ వుంది, అమెరికాలో. భారతదేశంలోని ప్రధాన మంత్రులకు, రాష్ట్రాలలోని పలు ముఖ్య మంత్రులకు సలహాలిస్తూ, క్రొత్త technologies ను industries ను ఇండియాకు తెస్తూ అందరి మన్ననలను పొందిన వ్యక్తి.

– యస్వీ రామారావు

★

# మరొక్క మాట

ఇవన్నీ ఇండియాలోను, లండన్‌లోను వుండగా కళ, కళాకారుల మీద వ్రాసిన వ్యాసాలు. నామీద అపారమైన గౌరవంతో, అనురాగంతో, ప్రేమతో సాహిత్య మాసపత్రిక ''భారతి'' కోసం నాచేత వ్రాయించారు, ప్రేమ మూర్తులు, ఆంధ్రపత్రిక, భారతి పత్రికల అధినేతలు కీ.శే. శివలెంక శంభుప్రసాద్‌గారు, శ్రీ శివలెంక రాధాకృష్ణగారు. వీరిని తలుచుకుంటూ నా కృతజ్ఞతాభి వందనాలు తెలుపుకుంటున్నాను.

ఈ వ్యాసాలు వ్రాయడానికి, చిత్రాలు చిత్రించడానికి సహకారాన్ని, జీవితానికి ప్రేరణ నిచ్చి సదా అండగా నిలచిన నా భార్య డ్యాక్టర్ సుగుణ, మా ఏకైక పుత్రిక పద్మలను ఈ సందర్భంగా- ప్రేమంగా తలచుకుంటున్నాను.

తోటి చిత్రకారుడు, విఖ్యాత పాత్రికేయుడు, రచయిత, అభ్యుదయ భావనిలయం శ్రీచలసాని ప్రసాదరావుగారు 1956 నుండి నాకు ఆప్తమిత్రులు. ఈ గ్రంథం ఇలా రూపొందించింది ఆయనే. ఈయన సారధ్యం వహించక పోతే నాపై పుస్తకాలు, కార్డులుగా నా చిత్రాలు వచ్చేవి కావు. నా కంటే వయసులో చిన్నవారు గనుక, హృదయపూర్వక అభినందనలు తెలుపుకుంటున్నాను

– యస్వీ రామారావు
డిశంబర్ : 1999

★

# ''భారతి'' లో నేను....

నాకు సాహిత్యం అంటే ఎనలేని గౌరం. సాహిత్యం మేధస్సుకు పదును పెడ్తుంది అని నమ్ముతాను. చదవడం తీవ్రాలోచనలకు దారి తీస్తుంది. కళల్లోని లోతుపాతుల్ని, కళామర్మాల్ని విశదీకరిస్తుంది. ప్రాచీన సంస్కృతిపై, చరిత్రపై గౌరవం పెంచుతుంది. అన్ని మతాల లోని నిగూఢ రహస్యాల్ని, సంప్రదాయాలను పరిచయం చేస్తుంది. శ్రద్ధ, ఓపిక అలవాటు చేసి సృజనాత్మక వ్యక్తిగా తయారు చేస్తుంది.

మైకెలాంజిలో, లియోనార్డో డావిన్సి, కాన్‌డిస్కీ, వాన్‌గో ( అన్నయ్య థియోకు వ్రాసిన వుత్తరాలు) ఇంకా ఎంతోమంది చిత్రకారులు విస్తృతంగా వ్రాసిన వారే. వారు చిత్రకారులుగా ఎంత గొప్పవారో, రచయితలుగ గూడ అంతగొప్పవారు. రాజకీయాలలో, మానవ చరిత్రలో చిరస్థాయిగ నిలచిన మహాత్మాగాంధి , నెహ్రూ, చర్చిల్, లెనిన్ మొదలగు వారు గొప్ప రచయితలు. జీవితంలో ముఖ్య వ్యాపకం ఏదైనా సరే, సాహిత్యాభిలాష తప్పకుండా మానవునికి, సాత్విక గుణాన్నిస్తుంది. తాత్వికుణ్ణి చేస్తుంది, సత్యానికి దగ్గరగా తీసుకు వెళ్తుంది.

ఈ వ్యాసాలు వ్రాసేందుకు పూర్వం నాకు కొంత సాహిత్య పరిచయం వుంది. గుడివాడ కాలేజీలో చదువుతున్న రోజుల్లో 1952 - 1955 కాలంలో, చందోబద్ధంగా పద్యాలు, భావకవిత్వాలు వ్రాయడం, ప్రచురింప బడడం జరిగింది. నేను మద్రాసులో వుండగా ఈ కవితా రచనే, వచన రచనలకు దారి తీసింది. మరొక అదృష్టం ఏమంటే మద్రాసులో వుండగా ఎంతోమంది ప్రముఖ రచయితలతో గాఢ స్నేహాలు కల్గడం. నాకు అప్పుడూ, ఇప్పుడూ ముఖ్య స్నేహితులు రచయితలే. నార్ల వెంకటేశ్వరరావు, ఆమంచర్ల గోపాలరావు, ఎల్లోరా, మాధవపెద్ది గోఖలే, కొడవటిగంటి కుటుంబరావు, డి. ఆంజనేయులు, చలసాని ప్రసాదరావు, ఆచంట జానకిరామ్ గార్లు.... ఇలా ఇంకెంత మందో! గుడివాడలో ఉండగా ''కాలాతీతవ్యక్తులు'' వ్రాసిన డాక్టర్ శ్రీదేవి, కళావిమర్శకుడు సంజీవదేవ్,

కవి శ్రీ సి. ఆర్. దాసు, రచయిత బి.వి. నరసింహారావు గార్లు ముఖ్య స్నేహితులు. ఇంతమంది ప్రభావం నామీద ఉన్నది. ఆ ప్రభావాలు, అనుభవాలే ఈ వ్యాస రచనలకు ప్రాతిపదికలు.

నా చిత్రాలు రూపరహిత సంబంధితాలు. అందువల్ల చిత్రాలు చూచేవారికి కొన్ని యిబ్బందులున్నాయి. చాల సంవత్సరాలు భారతదేశంలోనే చిత్రకళ నేర్చుకున్నా, ఎక్కువ కాలం యూరప్, అమెరికాలలో ఉండిపోయి చిత్రాలు వేస్తూ, చిత్ర ప్రదర్శనలు చేస్తూ ఉన్నందువల్ల, నా కళలో చాల మార్పులు వచ్చాయి. భావాల్లో మార్పులు వచ్చాయి. ప్రాక్ పశ్చిమ దేశాల సమన్వయం నా చిత్రాల్లో, ఆలోచనలలో, జీవిత పంథాలో నిబిడీకృతమైనాయి. ఇవి భారతదేశంలో వుండి చిత్రాలు వేస్తూ, ప్రదర్శిస్తున్న వారి చిత్రాలతో పోలిస్తే, కొంత భిన్నంగా ఉండడం సహజం. ఈ వివరాలు విశదీకరించాలి అనుకున్నాను. చిత్రకారునిగ, నేను చేరుకున్న స్థానానికి చేరిన యాత్రలోని, మజిలీలను గురించి వ్రాస్తూ, సాహిత్యం, సాహిత్యానికి చెందిన నాస్నేహితులు, నాచిత్రకళకు ఎలా దోహద పడ్డారనేది చెప్ప దలచుకున్నాను.

నా చిత్రాలు అర్థం అవ్వాలంటే, నాకు నాంది నుండి, ఎవరు ఎటువంటి కళా పద్ధతులు నేర్పిన వారిని నా జీవితానికి, చిత్రకళకు పదును పెట్టిన వివిధ దేశాలలోని అనుభవాలు, నామీద వివిధ రచయితల, మేధావుల ప్రభావం తెలియాలి. ఈ పై విషయాలన్నీ కొంతవరకు నా చిత్రాలు అర్థం అవడానికి సహకరిస్తాయి. నా చిత్రాల విషయంలో, కళా శైలులు ఒక్క భారతదేశానికే పరిమితం కావు. నాది 'యూనివర్సల్ ఆర్ట్!' 'సర్వమానవ సౌభ్రాతృత్వం' అనే భావాన్ని నమ్మే వ్యక్తిని. 1962 నుండి యూరప్, అమెరికాలలో నివసిస్తూ, అక్కడే ప్రదర్శిస్తూ వుండే వాని మీద, తప్పక ఆ ఖండాల ప్రభావం పడి తీరుతుంది. ''నాకు తెలిసినంత వరకు, ప్రపంచంలోవున్న చిత్రకారులందరిలో, ప్రాక్ పశ్చిమ దేశాల కళలో, రామారావు సృజనాత్మకంగా తెచ్చినంత, పరిపూర్ణమయిన సమన్వయం, ఇంతవరకు ఎవరూ సాధించలేదు'' అన్నారు మాక్స్ వైక్స్ జాయిస్ అనే ప్రముఖ కళా విమర్శకులు, పారిస్ నుండి వచ్చే ''హెరాల్డు ట్రిబ్యూన్'' అనే దిన పత్రికలో నా చిత్రాన్ని ప్రచురించి, నాగురించి వ్రాసినప్పుడు. అలాగే ''రామారావు భావాల్ని చిత్రిస్తాడు చిత్రాల్నికాదు'' అని వ్రాశారు ఎ. ఎస్. రామన్ గారు ''హిందు'' దిన పత్రికలో.

రాజ్‌పుత్, మొగల్, దక్కన్, బౌద్ధ, జైన చిత్ర, శిల్ప కళలు సర్వమానవ జాతికి చెందినవి. మన అజంతా, ఎల్లోరా, అమరావతి, తాజ్‌మహల్, రామాయణ, భారత,

వేదాంత ఉపనిషత్తులు ప్రపంచ సంపదలు. ఆ దృష్టితో చూస్తే మన భారతదేశపు పాలు ప్రపంచ చరిత్రలో ఎక్కువగానే వున్నది. అందుకే భారతీయుడిగా గర్వం నాకు. నా చిత్రాలన్నిటిమీద 1962 నుండి ఈ రోజు వరకు తెలుగులోనే సంతకం చేస్తున్నాను, భారతదేశపు గడ్డలో పుట్టిపెరిగాను గనుక, తెలుగువారి రచనలు నన్ను ప్రభావితం చేసి 'కుర్రవాణ్ణి' మనిషిగ చేసి, ఇతర దేశాలకు పంపాయి గనుక. నామీద వున్న భారతీయ సంస్కృతి ముద్ర చెఱపలేనిది. ఈ సమ్మేళనమే నేను. అదే నా ఆర్ట్.

నేను మద్రాసులో వుండి చిత్రాలు వేస్తున్నప్పటి నుండి పత్రికలలో రాసిన వ్యాసాలు ఇందులో వున్నాయి. నేను చిత్రాలు వేసే 1955-1962 రోజుల్లో చాలమంది రచయితలు కలంపేరుతో వ్రాసేవారు. ''ఆరుద్ర'' ''కరుణశ్రీ'' ''ఆత్రేయ'' ''బైరాగి'' అన్నపేర్లు ఉదాహరణలు. ఆ ధోరణిలో స్వంత పేర్లనే అక్షరాల్లో కుదించి గూడ, కొంతమంది వ్రాసేవారు. 'శ్రీశ్రీ', 'భరాగో', 'చేరా', 'కారా' పేర్లలాగ. ఆ కాలానికి చెందిన వాడిని గనుక నాకూ ఒక 'కలంపేరు' కావాలని సరదాపడ్డాను. 'శాంతిదేవ్' అని తెలుగులో సంతకం చేశాను, మొదట్లో చిత్రించిన చిత్రాలపై. తర్వాత ''ఆర్యదేవ్'' అన్నపేరును చాల కాలం వుంచుకున్నాను. ఈ పేరుతోనే కొన్ని గేయాలు వ్రాసి ప్రచురించాను. చాల చిత్రాల్లో ఈ పేరుతోనే తెలుగు భాషలో సంతకం చేశాను. ''ఆర్యదేవ్'' ఆచార్య నాగార్జునుని ముఖ్య శిష్యుడు - బుద్ధునికి ఆనందుని లాగ. ఆర్యదేవ్ గొప్ప తాత్వికవేత్త. మన ఆంధ్రదేశంలో ఉన్న గొప్ప మహనీయుడు గనుక ఆయన పేరు కలంపేరుగ ఉంచుకున్నాను. ఇంగ్లండు, అమెరికాలలో వేసిన చిత్రాలపై ''రామారావు'' అని తెలుగులో సంతకం చేయడం ప్రారంభించాను - ఈనాటికి గూడ.

గుడివాడలో కె. వేణుగోపాలరావుగారివద్ద, మద్రాసులోని అడయారులో వున్న, కళాక్షేత్రంలో పనిచేస్తున్న, ప్రఖ్యాత భారతీయ చిత్రకారుడు కె. శ్రీనివాసులు గారిదగ్గర 'టెంపెరా', నీటి రంగుల చిత్రాలు, రాజపుత్, మొగల్‌శైలిలో చిత్రాలు వేశాను. మద్రాసు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో విఖ్యాత చిత్రకారులు కె.సి.యస్.పణిక్కర్‌గారి దగ్గర తైలవర్ణ చిత్రాలు వెయ్యడం నేర్చుకున్నాను. మద్రాసులో ఉండగనే, కళలో పాశ్చాత్య పద్ధతుల గురించి తెలిసికొనడం జరిగింది. 'ఇంప్రెషనిజం' 'క్యూబిజం' 'సర్రియలిజమ్' పద్ధతులలో చిత్రాలు వేసి, వివిధ శైలులలో ప్రయోగాలు చేశాను. జాతీయ స్థాయి ప్రదర్శనలలో అనేక బహుమతులు పొందడమూ జరిగింది.

మద్రాసులో వుండగానే చాల వ్యాసాలు వ్రాశాను, ఆంధ్ర చిత్రకళపై, భారతీయ చిత్రకళపైన.

1962లో లండన్ వెళ్ళాను. చిత్రకళలో కామన్‌వెల్త్ ఫెలోషిప్పు తెచ్చుకున్న మొట్టమొదటి భారతీయుణ్ణి. అంతకుముందే భారత ప్రభుత్వం ఇచ్చే ఒక్కగానొక్క ఫెలోషిప్పును, మూడు సంవత్సరాలు వరుసగా గెలుచుకున్న ప్రథమ చిత్రకారుణ్ణి. ఫలితంగా లండన్ వెళ్ళకముందే నాకు ''నేషనల్ ఆర్టిస్టు''గ గుర్తింపు వచ్చింది. నేషనల్ గాలరి ఆఫ్ మోడరన్ ఆర్ట్, న్యూఢిల్లీ వారు అయిదు చిత్రాలను కొనుగోలు చేశారు. మద్రాసు మ్యూజియం, సాలార్‌జంగ్ మ్యూజియం, ఆంధ్రప్రదేశ్ లలితకళా అకాడమి, రాజ్‌భవన్, కేరళ ప్రభుత్వం ఇంకా ఎన్నో ప్రయివేటు, పబ్లిక్ కలెక్షన్స్‌లోకి నా చిత్రాలు సేకరింప బడ్డాయి, నేను ఇండియాలో వుంటున్నప్పుడే.

ఇటువంటి చరిత్రతో లండన్ వెళ్ళాను. ఇంగ్లండు నుండి 'భారతి'కి వ్రాసింది ఎక్కువగా పాశ్చాత్య చిత్రకారుల గురించి. భారతి సంపాదకులు శివలెంక శంభుప్రసాద్‌గారు, శివలెంక రాధాకృష్ణగార్లు ఎంతో అండగ వుండి నన్ను వ్యాసాలు వ్రాయమని ఉత్తేజపరచారు. వారి ప్రేరణ లేనిదే, ఇన్ని వ్యాసాలు వ్రాసి వుండివుండేవాడిని గాను. నా భావ విస్తీర్ణతకు లండన్ నగరం చాల సహాయ పడింది. పెద్ద పెద్ద మ్యూజియములున్నాయి. చిత్రకారుల ప్రదర్శనలను భారీ ఎత్తున గ్యాలరీలు నిర్వహించేవి. ప్రపంచం నలుమూలల నుండి వచ్చిన చిత్రశిల్పకారులు వారి ప్రదర్శనలు ఏర్పాటు చేసుకునేవారు. న్యూయార్క్, పారిస్ నగరాల వలె లండన్ గూడ ప్రపంచ కళలకు, సంస్కృతికి నిలయం. నేను లండన్‌లో 1962 నుండి 1969 వరకు వున్నాను. అప్పుడు నా అదృష్టం పండింది. పికాసో, మీరో, డాలి, మథీస్, కొకోష్కా, హెన్రీమూర్, జీన్ ఆర్ప్, రోడా, బెన్ నికల్సన్, గ్రహం సదర్‌లాండ్ ఇంకా ఎంతో మందివి వన్‌మాన్ షోలు చూడడం జరిగింది. అది నా జీవితంలో అదృష్టంగా భావిస్తున్నాను.

ఈ మహోన్నత చిత్రకారుల విశేష ప్రదర్శనలు చూస్తుంటే, నాలో కళపై అవగాహన పెరిగింది. ఈ ప్రదర్శనలు నన్ను పెంచి పెద్ద చేశాయి. మానవ జాతిని ఉత్తేజ పరచేది, ఆలోచింపచేసేది కళ. ఆ కళ నన్ను తాకి తట్టింది. ప్రదర్శనలు చూడ్డానికి చాలదేశాలు, ఊళ్ళు వెళ్ళాను. 'మోనాలిసా' చిత్రం చూడడానికి ''పారిస్'' వెళ్ళాను. రెంబ్రాన్ట్, వాన్‌గో చిత్రాలు చూడడానికి ''ఆమ్‌స్టర్‌డాం'' వెళ్ళాను. యూరప్‌లో అన్ని దేశాలు విస్తీర్ణతలో చిన్నవే. దగ్గరదగ్గరగా వుంటాయి. అంత కష్టంకాదు ప్రయాణం చెయ్యడం, ఒక దేశం నుండి మరొక దేశానికి.

ఇంతగా కళమీద అవగాహన అయినమీదట, ప్రదర్శనలు చూచిన తర్వాత ఒక ఆలోచన వచ్చింది. నేను చూచిందంతా తెలుగు వారికి చెప్తే ఎలా వుంటుంది అని.

భారతి సంపాదకులు ''ఒకే'' అన్నారు. ఎన్ని వ్రాసినా, ఏమి వ్రాసినా ప్రచురిస్తామన్నారు తండ్రీకొడుకులు శివలెంక శంభుప్రసాద్, రాధాకృష్ణ గార్లకు - మనసులోనే నమస్కారాలు పెట్టి వ్రాయడం సాగించాను. అదే ఈ సంకలనం. చాలవరకు నేను వ్రాసిన వ్యాసాలు దొరకలేదు. కొంతమంది మిత్రులు ఇచ్చినవి, నేను సంపాదించినవి కలిపితే ఈ సంకలనం తయారయింది. అన్నీ దొరికితే ఇంకా పెద్ద పుస్తకమే అయ్యేది. ఈ వ్యాసాలు 1958 నుండి 1964 వరకు వ్రాసినవి. వ్యాసాల్లో వైవిధ్యం ఉండాలని, రకరకాల శైలులలో చిత్రిస్తున్నవారిని పరిచయం చేశాను. చిత్రశైలులను వివరించాను. ఒక్కొక్క వ్యాసం వ్రాయడానికి చాల కాలం పట్టేది. ఎవరిమీద వ్రాయదలిస్తే, వారి మీద వచ్చిన పుస్తకాలన్నీ చదివే వాడిని. అలా చదవడం వల్ల నా చిత్రకళలో గూడ అనుకోనంత మార్పులు వచ్చాయి. భావానికి ప్రాధాన్యం పెరుగుతూ వచ్చింది. అన్ని దేశాల కళలు (యూరప్, ఆఫ్రికా, ఆసియా) వారి దేశ చరిత్రలు, సంస్కృతులు అవగాహన అవడం వల్లనే, నాకు లోతైన, భావమయ చిత్రాలు వేయడానికి కావలసిన సత్తా వచ్చింది. నా చిత్ర కళాభి వృద్ధికి దోహదపడిందీ, రచనలు చేయించిందీ, నే చదివిన గ్రంథాలే! నా చిత్రాలకు గుర్తింపు వచ్చిందంటే రహస్యం ఏమీలేదు. చిత్రకళపై వున్న అవగాహనవల్లనే, చదవడం వల్లనే వచ్చింది. అందుకే 'రీడింగ్ మేకెత్ ఎ మాన్' అంటారు పాశ్చాత్య దేశాల్లో. ఈ రోజుకు గూడ ఏదైనా చదవందే నిద్రపోను. అది నాకు అలవాటు అయిపోయింది, రాత్రి పన్నెండు గంటల వరకు చడవడం రోజూ - ఈనాటికి గూడ.

చిత్రకారులు ఏవిధంగా చిత్రాలు, శిల్పాలు చేస్తారో తెలుసుకుంటే, ఏవిధంగా ఆలోచిస్తారో తెలుస్తుంది. ఆలోచనలు వివరంగా, తేలిక భాషలో అందరికి అర్థం అవ్వాలని రాసినవే ఈ వ్యాసాలు.

☆



# నేటి చిత్రకారుడు - అతని కళ

చిత్రకారుడు చిత్రకళపై రాయడం విశేషమే. అది అతని మనస్సుని తెల్పుతుంది. మనస్సుని అర్థం చేసుకోవడం కొంత కష్టమే. అర్థం చేసుకుంటే దానితో ఏకీభవించడం జరుగనూవచ్చు, లేక జరుగకపోనూవచ్చు. అందువల్ల అది వివాదగ్రస్తం. వివాద గ్రస్తతవల్లనే విమర్శన పుట్టుతుంది. పుట్టుకలో జీవం వుంటుంది, గనుకనే తొణికిసలాడుతుంది. కదుల్తుంది, కదిలిస్తుంది.

కళ కదిలిస్తుంది. ఆ శక్తి నిగూఢితమైనది. కదిలించకపోనూ వచ్చు. అది దాని లోపం కాదు. స్వీకరించే వాని అంతస్థుని బట్టి, లోతుని బట్టి గూడ వుంటుంది. అందం అన్నది వస్తువులో వుంటే చూసేవారి దృష్టిలో గూడా, ఆ రమ్యతను చూసే శక్తి వుండాలి. లేకపోతే బూడిదలో పోసిన పన్నీరవుతుంది.

ఆధునిక కళ ముఖ్యంగా ఈ భావంచుట్టూ తిరుగుతుంది. చూసేవారిలో కూడా కళలోని అంతస్థును చూస్తుంది, ఈ ఆధునిక కళ. మనం చిత్రాన్ని చూస్తున్నట్లుగనే చిత్రం గూడ మనల్ని చూస్తుంది. అది గ్రహిస్తే ఈనాటి కళారీతులలోని మర్మం అవగాహన అవుతుంది.

నాకు అవగాహన అవుతుంది, అలాగే నాలాంటివారికి. మరి అందరూ నాలాంటివారే గాదు గనక, చాలామందికి అర్థంగాదు. అందువల్ల అందులో అర్థం లేదని చాలామంది తలపోస్తారు. అలా అని ఊరుకోక వారికి తోచినవిధంగా ఎగతాళి చేస్తారు. ఇలాంటివారి సంఖ్య చాల ఎక్కువ. అందువల్లనే వివాదగ్రస్తంగా, విమర్శనాయుతంగా తయారైంది, ఈ నాటి కళ.

జనం - సంఖ్యలో తక్కువగానున్న ఈ చిత్రకారుల కళా శైలులను నిరసిస్తే, చిత్రకారులు గూడ ఈ జన సమూహాన్ని దద్దమ్మలని వుమ్మడిగ చుట్టి, దూరంగా నెట్టివేశారు. అందువల్లనే వీరి చిత్రకళ ఎప్పుడూ వెక్కిరిస్తుంది ఎంతోమందిని.

అమెరికాలోని నేటి చిత్రకళా రంగంలో కనిపిస్తుంది దీనికి జవాబు. ఇలాంటి సమయంలోనే కళా విమర్శకులు ముందుకు వస్తారు, ఈ అగాధాన్ని నింపడానికి. పరిశీలనా మేధస్సుతో పరిచయం చేస్తారు కళను, కళాకారుల భావాలను ప్రజలకు. విచిత్రమేమంటే ప్రజలు వీరిని నమ్మడం - చిత్రకారులకంటే, వారి చిత్రాలకంటే కూడ. విమర్శకులు యింత మందిని కట్టగట్టి, నోరు తెరిచి, బలవంతంగా పోస్తారు వారు తయారించిన విమర్శనా ఔషధాల్ని. ఈ ఔషధం త్రాగేవారి సంఖ్య అమెరికాలో చాలా ఎక్కువ. అందువల్లనే ఎంతోమంది (ధనికులు) చిత్రాలను కొంటారు, కొందరు వేలం వెర్రిగానూ. నేను చిత్రకారుని గనుక, నావద్ద ఔషధం లేదు. చిత్రకారునిగ ఈ హడావుడిని చూస్తూ, నాలో నేనే నవ్వుకుంటూ దూరంగా నిలబడి వున్నాను. అలానే మీరున్నూ దూరంగా నిలబడి నాతోబాటుగ చూస్తూ, నవ్వు వస్తే నవ్వండి. నవ్వు ఆరోగ్యానికి మంచిది.

ఔషధం పుచ్చుకున్నవారిలో కొంతమందికి సుగుణం కనిపిస్తుంది. అది చిత్రకారుల దృష్టిని అర్థం చేసుకోడానికి దోహదపడ్తుంది. ఈ స్థితి పాశ్చాత్య దేశాలలో ఎక్కువ, మన దేశంలోకంటె. అందువల్లనే నూత్న వినూత్న ప్రయోగాలకు నిలయమైంది ఈ ప్రాంతం. ఎవరైనా ప్రయోగాలను చూడాలన్నా, అందులో చేరాలన్నా యిక్కడకు వస్తారు.

ప్రయోగం పాశ్చాత్య దేశాలకు ప్రాణం. అన్ని రంగాలలోను ఈ ప్రయోగాలు తీవ్రంగా జరుగుతాయి. జేబులు కొట్టడంనుండి, చంద్రమండలం చేరడం వరకు. ఈ మధ్యలో ఎక్కడో వస్తుంది కళ గూడ. సజీవ భరితమైనది గనుక కళ, తానూ ప్రయోగాలు చేస్తూ చుట్టూ వున్నవాటితో సంబంధం పెట్టుకుంటుంది. అయినా దీని తీరు వేరు. చుట్టూ వున్నదాన్ని చూస్తూ, గ్రహిస్తూనే సుదూరంగా ఎక్కడో వుంటుంది. మనం అర్థం చేసుకోవాలంటే దూరంగా వున్న దానివైపుకు వెళ్లాలి. అలా వెళ్లడంలోనే కళయొక్క ముందడుగు కనిపిస్తుంది. కళ ఎప్పుడూ సంఘానికి చాలా దూరంగా ముందున వుంటుంది. సంఘం సదా ప్రయత్నిస్తుంది చేరుకోడానికి - గనుకనే ఎప్పుడూ రెండడుగులు వెనుకబడి వుంటుంది. ప్రస్తుతం యిది ఎంతో నిజం.

కళ కాలాన్ని ప్రతిబింబిస్తుంది అన్నది కొంతవరకు నిజం. చరిత్రకారులు మరుగునపడి దొరికిన శిల్పాలు, చిత్రకళా ఖండాలను చూచి, ఊహలకు దారాలు గుచ్చి ఆనాటి కాలాన్ని తెలియపర్చడం మనం ఎరిగున్నదే. అందువల్లనే గాబోలు కళ కాలాన్ని ప్రతిబింబిస్తుందనడం. కాని యిది పూర్తిగ నిజంకాదు. ప్రస్తుతపు కళను చూస్తే ప్రతి వ్యక్తి ఏవిధంగా ప్రత్యేకమో, అలాగే ప్రతి చిత్రకారుని కళ గూడాను. కళ అతని పద్ధతిని,

భావాల్ని వెలిబుచ్చుతుందే కాని, అతని చుట్టూ వున్న సంఘపు స్థితిగతులను తెలుపడంలేదు. పరిశీలించి చూస్తే, ఎలా తమ చిత్రాలను చూడాలో కళాకారులు చెప్పుతున్నది జాగ్రత్తగ వింటే, ఒకమార్గం దొరుకుతుంది, నడచి పోడానికి. ఇదీ అసలు కీలకం ప్రస్తుతపు కళను అర్థం చేసుకోడానికి.

'జోసఫ్ ఆల్బర్స్' ''కళ ఒక విషయం గాదు ఒక అనుభవం'' అన్నాడు. దీని అర్థం ఏమంటే విషయంలోని సంగతి వింటే తెలుస్తుంది, సమగ్రమైనది గనుక. అనుభవం అలాగాదు, అది పొందినవారికే తెలుస్తుంది. దాన్ని మాటలలో వ్రాసి ఒక విషయ పూర్వకంగా ఖచ్చితంగా చెప్పలేం.

అందుకే గాబోలు 'వాల్టర్ స్లేట్' అనే చిత్రకారుడంటాడు ''ఒక్క కవులు మాత్రమే చిత్రకళ గురించి వ్రాయాలని తలుస్తాను. వీరికి మహత్తరమైన వూహాసంపద వుంది. దీనికితోడుగ చూచి ఆనందించే, అనుభూతిని మాటలలో వర్ణించి చెప్పగలిగే , సృజనాత్మక శక్తివున్నది''.

చిత్రం చూచి మాటలలో చెప్పాలనే తాపత్రయంలో చాలమంది మరొక ఎరిగిన వస్తువుతో పోల్చి చూచుకొని నిర్ణయానికి వస్తారు. ఈ పద్ధతివల్ల అసలు చూడవలసిన మార్గాన్నే తప్పడం జరుగుతున్నది. అలా పోల్చి చూడకుండా, చూచి అనుభూతిని పొందవలసిందని చెప్తారు ప్రస్తుతపు సృజనాత్మక చిత్రకారులు. ఇక్కడే తేడా చిత్రకారులకు, మిగతావారికి.

విసుగెత్తిన 'జాక్ ట్వోర్కోయ్' అంటారు ''ప్రజలకు బేస్ బాల్ ఆట నచ్చినప్పుడు వారికి వారే 'అయితే దీని అర్థం ఏమిటి?' అని ప్రశ్నించుకుంటారా? బేస్‌బాల్ ఆటను ఆనందించేవారు అదృష్టవంతులే. ఏదో ఒకటి వుందిగదా ఆనందించడానికి! చిత్రకళ విషయం వచ్చినప్పుడు గూడ అంతే''

ఇంకొంచెం కవితాధోరణిలో పికాసో అంటారు ''పిట్ట గానాన్ని విని మనం ఎలా అయితే అర్థం చేసుకోవాలని ప్రయత్నం చెయ్యమో, అలానే కళను అర్థం చేసుకోవాలని ప్రయత్నం చెయ్యగూడదు''.

పై విషయాల్ని సావధానంగా విచారించి చూస్తే నేటి పాశ్చాత్య కళాకారుని మనోరీతులు, దానికి అనుసరించే అతని పద్ధతులు తెలుస్తాయి. వీరందరు చెప్పుతున్నది ఏమంటే యిప్పటివరకు మనమెరిగిన చిత్రకళ ఏదో ఒక విషయాన్ని చూపించి చెప్పినట్లుగ, ఈనాటి చిత్రకళ చెప్పదు. ఆధునిక కళలో చెప్పే కథ ఏమి లేదు. చిత్రకారుడు ఏ కథనూ చెప్పగోరడంలేదు. ఏ విషయాన్నీ బంధించి రంగులు వేసి ఒక పేరును

యివ్వడంలేదు. ఒక నూత్నానుభూతిని అందిస్తున్నాడు. చిత్రకారుడు గనుక దానికి రంగులు పూస్తున్నాడు. చరిత్రలో జరిగినదానితోగాని, జరుగబోయే దానితోగాని సంబంధం లేదు. దేనికైనా కళ ప్రతిరూపం కాదు. ఒక్కమాటలో చెప్పాలంటే చిత్రాన్ని చూచి ఆనందించితే సరేసరి, లేకపోతే లేదు. అంతే. ఇది చాల కటువుగ వినిపిస్తుంది చెవులకు, అర్థంలేని వ్యర్థంగా. ఏమీ చెప్పలేని కళ చెత్త అని ఎందరో అనడం మనమెరిగినదే. వీరి అభిప్రాయాన్ని గురించి తర్జన భర్జన చేసి వ్రాయడం ఈ వ్యాసపుటుద్దేశ్యం గాదు. ఈ నూత్న భావసంపద గూర్చి, యిది నేటి చిత్ర, శిల్ప కళలలో ఎలా వెలువడుతున్నదో తెలియపర్చడమే నా పని.

రూపాన్ని అపురూపంగా చిత్రించే ప్రయత్నంలో, చిత్రకళ చాలా ముందడుగువేసింది. ద్వితీయ ప్రపంచ యుద్ధానంతరం కళ అనేక రూపాలను చూపప్రయత్నించింది. యుద్ధాన్ని, దాని స్వరూపాన్ని, దాని వినాశకర శక్తిని చూపే ఎన్నో చిత్రాలు, శిల్పాలు వచ్చాయి యూరప్‌లో. పారిస్ ముఖ్య కేంద్రంగా వుండి ఈ రీతులకు జీవంపోసింది. యూరప్‌లో ఎన్నో చిన్న చిన్న కేంద్రాలు గూడ కృషి చేశాయి. ఇంప్రెషనిజం, పోస్టు యింప్రెషనిజం, క్యూబిజం, ఫ్యూచరిజం, పోయింటలిజంలాంటివి ఎన్నో రకాల స్కూల్ ఆఫ్ థాట్స్ వచ్చాయి. నేను వ్రాయదలచింది వీటన్నిటి తర్వాత వస్తున్న మార్గాల గురించి - నేటి కళ గురించి. అమెరికా దీనికి జీవంపోసి పెంచుతోంది.

ముఖ్యంగా ధనిక దేశం అవడంవల్లను, నానా దేశాల ప్రజలు వలస వచ్చిన వారవడంవల్లను, వీరందరి అభిరుచులు భిన్నంగా వుండడంవల్లను, తనకున్న ధనాన్ని, శక్తిని మాత్రమే గాకుండ కళారంగంలో కూడా అభివృద్ధి చెందాలనే తృష్ణవల్లను, అనేక రకాల కళలకు అమెరికా నిలయం అయింది. ఎంతోమంది చిత్రకారులు యూరప్‌నుండి వచ్చి అమెరికాలో ఉండిపోయారు. ప్రతి నగరం ఒక మ్యూజియమును ప్రారంభించింది. యూనివర్సిటీలలో చిత్రకళకు స్థానం లభించింది. చిత్రకారులకు వుద్యోగాలు బాగా దొరకడం, మ్యూజియములు చిత్రాలు విరివిగ కొనడం, సంపన్నులు తమ ఉన్నత స్థితిని చూపేందుకుగాను, కొంతమంది నిజంగా ప్రేమ వుండి చిత్రాలు కొనడం జరిగింది. ఇంతగా ఎప్పుడైతే అండ వచ్చిందో, తీరికగ కూర్చొని సృజనాత్మకంగా చిత్రరచనలు చేసేవారి సంఖ్య గూడ పెరిగింది. అలా అమెరికాలో కళకు ప్రాధాన్యత వచ్చింది. న్యూయార్క్ కళా కేంద్రంగా బలపడి పారిస్‌ను ప్రక్కకు నెట్టివేసింది.

చాలమంది ప్రస్తుతము వస్తున్న అనేక రకాల చిత్రకళా పద్ధతులను 'ఫేషన్' క్రింద జమ కడ్తున్నారు. ఫేషను మారుతుంది చాల వేగంగా పాశ్చాత్య దేశాలలో. బట్టల ఫేషనులు

ఈ శీతాకాలంలో ఒకటైతే, మళ్ళీ వచ్చే శీతాకాలంలో మరొక రకంగా ఉంటాయి. అలాగే అన్ని రంగాలలోను. చిత్రకళ గూడ అలాగే వుందని అంటారు. ఇందులో కొంత సత్యమున్నది - వేగంగా మారడంలో.

యాక్షన్ పెయింటింగులను ఎరుగుదుము. చిత్రకారులు కాన్వాసును నేలపై పరచి రంగులు చిలకడం, నగ్న స్త్రీకి రంగులు పూసి కాన్వాసు పై దొర్లించడం, తుపాకిలో రంగులు దట్టించి షూట్ చెయ్యడం, రంగులతో వున్న కాన్వాసుపై సైకిల్ త్రొక్కడం లాంటివి. అప్పటికే రూపం నిరూప రూపాన్ని ధరించిన చిత్రకళ దీనితో క్రొత్తమార్గం త్రొక్కింది. చిత్రకళ 'ఫార్సు'గ తయారైందన్నారెందరో. చిత్రలేఖనంలో ఒక నూత్న శైలితో నూత్న విధానాన్ని చూపడమే ప్రధానం. చిత్రకళ ఏదో ఒక్క పద్ధతిలోనే బంధింపబడలేదు. మనసు వూహలలో ఎలాగైతే తేలిపోతూ ఆనందాన్ని అనుభవిస్తుందో, చిత్రకళగూడ ఏ బంధనం లేకుండ, సెలయేటిలా ప్రవహిస్తుంది. గాలి మేఘంలా క్షణంలో రూపాన్ని మార్చుకుంటుంది. క్రొత్త రూపాల్నిస్తుంది.

చిత్రలేఖనం శృంఖలాలు త్రెంచుకొని నూత్న మార్గాన్ని త్రొక్కగానే, యువ చిత్రకారులు ఎన్నో పద్ధతులను తీసుకొని వచ్చారు. ఆవిధంగా సెలయేరులన్నీ కలసి మహాప్రవాహమైంది. నేటి చిత్రకళే ఈ ప్రవాహం - ఇది అంతులేనిది. తెలిసినవారికి దీని లోతు, వూహకు అందుతుంది. అందరికీ అందుబాటులో లేనిది ఏదైతే వున్నదో అది అందరికీ తెలిసిన రోజు పర్వదినంగదూ!

''పాప్ ఆర్ట్'' అని మరొక చిత్రకళ వచ్చింది. మన మెరిగిన రూపాలను వున్నది వున్నట్లుగ చిత్రించడంలో ఒక క్రమం అక్కరలేదు ఈ రూపాల పొందిక ఏర్పాటులో. ఉదాహరణకు చర్చిల్ ముఖంక్రిందగాని, ముఖం మీదగాని ఏ పక్షినో లేక జంతువునో చిత్రించవచ్చును. వీటినన్నిటిని చేర్చి ఒక చిత్రంగా ఏర్పాటు చెయ్యడం, వీటిపై మరల చిత్రించడం, కాంపొజిషన్, వర్ణ సమ్మేళనలను సర్దుకుంటూ, ఆకారాలను తనకు తోచినవిధానంలో వుపయోగించుకోవడంలోనే చిత్రకారుని మనసు కేంద్రీకరించి వుంటంది. ఇది చర్చిల్ తలా లేక గాంధీ గారి తలా అనే సమస్య లేదు. ఇతనికి వీరిద్దరి తలలు ఒక్కటే. కొంత మంది చిత్రకారులు యింకొంచెం ముందుకు పోతారు. ఏదో ఒక వస్తువుని తీసికొని దాన్ని ఆపాళంగా చిత్రించడం. మోకాళ్లవరకు వచ్చే తోలుతో చేసిన ఆడవాళ్ల బూటులను ఆవిధంగానే సీసంలో పోతపోస్తాడు ఓ శిల్పకారుడు, పాతబడి నలిగినట్లుండేలా రంగులు వేస్తారు. వీటిని గదిలో అన్ని శిల్పాలను వుంచినట్లుగనే వుంచితే, ఎంత ప్రాముఖ్యతను వహిస్తాయో చెప్పలేను. మనం చూచే పద్ధతే మారిపోతుంది. ఇవి

మామూలు బూటులకు నమూనాలే అయినా ఒక క్రొత్త జీవితాన్ని పొంది గొప్పగ అగుపిస్తాయి. ఇది ఒక అనుభూతి.

మరొక చిత్రకారుడు సినిమాతార మార్లిన్ మన్రో ముఖచిత్రాన్ని చిత్రించాడు వరుసగ ఎన్నోసార్లు కాన్వాసుపై. అన్ని ముఖాలు ఒకేలాగ కన్పిస్తాయి. రోషన్‌బర్గ్, రాయ్ లిచిన్ స్టైన్ మొదలగు చిత్రకారులు ముఖ్యంగ చెప్పుకోదగ్గవారు. చిత్రంలో నిజమైన గోడ గడియారాన్ని లేక పెద్ద ఫోటోగ్రాఫ్‌లను, లేకపోతే **stuffed goat** కు రబ్బరు టైరు యిరికించో, కాకపోతే పనిచేసే రేడియోనో అతికిస్తారు. రోషన్‌బర్గ్ ఇవన్ని అతికించి, రంగులు వేసి చిత్రంగా ప్రదర్శిస్తారు. మనం రేడియో వినవచ్చు చిత్రం చూస్తూ. అజంతా చిత్రాలలో ప్రకృతి రూప వర్ణనలు, గౌతమ బుద్ధుని జీవిత గాధలు, ఆయన బోధనలు ఎలా అయితే కలిసిపోయి ఒక మహత్తర కళాఖండమైందో పాప్‌కళ గూడ అంతే. నిజమైన వస్తువులు, వర్ణ సమ్మేళనాలు కలిసి అలాంటి అనుభూతినే కలుగజేస్తాయి. తేడా అల్లా మనం ఇటువంటి వాటికి అలవాటుపడి ఆనందించడంలో వుంది.

నాకు బాగా నచ్చిన మరొక చిత్రకారుడు మార్క్‌రెల్లీ. ఇతను రంగు రంగుల కాన్వాసులను ఎన్నో ముక్కలుగ కత్తిరించి, చింపి, మరొక కాన్వాస్‌పై అతికించి రమ్యాతి రమ్యమైన చిత్రాలుగ చేస్తాడు. వాషింగ్‌టన్‌లో యితని చిత్రాలు చూచి తన్మయం చెందాను.

''ఆప్ ఆర్ట్'' విచిత్రమైనది. మనం చూచేదే నిజమైనది గాదనీ అదంతా వట్టి భ్రమ అనే సత్యాన్ని నిరూపిస్తాయి. విక్టర్ వాసరెల్లీ, బ్రిడ్జెట్ రాలీ అనే వారు ఎంతో చక్కటి చిత్రాలు వేశారు. దగ్గర దగ్గరగా, దూరం దూరంగా వుండేట్లుగ జాగ్రత్తగ స్కేలుతో గడులు గీసి, నలుపు తెలుపు రంగులతో, లేక పలువిధాల రంగులతో నింపుతారు. దూరం నుండి చూస్తే ఇవి కదుల్తున్నట్లుగ వుంటాయి. ఈమధ్య ఒక శాస్త్రజ్ఞుడు టెలివిజన్‌లో చూపాడు ఎలా, వస్తువులు విభిన్నంగా కన్పిస్తాయో మన కంటికి ఒక వెలుతురులో. డొల్లగ వున్న వస్తువును చూపాడు. అదే వస్తువు వుబ్బెత్తుగ కన్పించింది వెలుతురు మారిస్తే. అసలు వస్తువు డొల్లగ వుందో, ఉబ్బెత్తుగ వుందో తెలియదు మనకు. ఇది శాస్త్రజ్ఞులకు బాగా తెలుసు. ఇలా సైన్సు చిత్రలేఖనంలోకి ప్రవహించింది 'ఆప్ ఆర్ట్'లో.

'కనెటిక్ ఆర్ట్' మరింత విచిత్రమైనది. దారాలకు వ్రేలాడదీస్తారు, రంగురంగుల, లేక బాగా మెరిసే చిన్న చిన్న రేకులను. వెనుక అద్దం ఒకటి వుంచుతారు. గాలికి కదుల్తూ పలు విధాలుగ మెరుస్తూ ఎంతో ముచ్చటగ ఉంటాయి. వీటిపైన రంగురంగుల ఎలక్ట్రిక్ బల్బులను వెలిగిస్తూ, ఆర్పుతూ, వెలుగు ప్రసరింపచేస్తే యింద్రభవనంలా వుంటుంది. ఎవరైనా చెయ్యవచ్చునుగదా అనవచ్చు. కాని ఒక్క చిత్రకారుడే చెయ్యగలడు. ఎంత

వెలుతురు? ఎప్పుడు ప్రసరింపచేయాలి? ఏ విధంగా కావాలో నిర్ణయించి, అతను చిత్రంగ తయారుచేస్తాడు, మనకందరకు తెలిసినదాన్నే - మరి అందుకే అతను కళాకారుడు.

'నియాన్‌లైట్లు' పబ్లిసిటీకి ప్రాణం. ప్రపంచంలో ఏ మహానగరాన్నైనా తీసుకోండి. దాని ధనికత్వం నియాన్ లైట్ల ఎడ్వర్‌టైజ్‌మెంట్ల ద్వారా తెలుస్తుంది. న్యూయార్క్, లండన్, టోకియో, పారిస్ నగరాలు రాత్రిపూట ఎంతో మహానగరంగా కనిపిస్తాయి ఏవేవో వస్తువులను ఎడ్వర్‌టైజ్ చేస్తూ. వీటిని చిత్రాలుగా (లేక శిల్పాలా?) ఏర్పరచడం జరుగుతున్నది.

మరికొంతమంది విసుగెత్తి గాబోలు పబ్లిక్‌పై కొన్ని తమాషాలు చేస్తారు. (తమాషె అన్నది సరిగ్గా వాడవలసిన పదం కాదు. ఈ సందర్భంలో నాకు మరొక మాట తట్టక వ్రాస్తున్నాను.) ఎంత చెప్పినా అర్థం చేసుకోలేని పబ్లిక్ అంటే కసి. క్లేస్ ఓల్డన్ బర్గ్ అనే అతను న్యూయార్క్‌లోని సెంట్రల్ పార్క్‌లో గొయ్యి త్రవ్వించాడు, శ్మశానాల్లో చచ్చినవారిని పాతిపెట్టే కాటికాపరుల చేత. తర్వాత వారిచేతనే పూడిపించాడు. ''భూగర్భంలోని అదృశ్యమయ శిల్పం'' అని పిలిచాడు దాన్ని. ఎవరు కాదంటారు? అది చూచేవారికి చెంపదెబ్బా, లేక రాబోయే ఏదో మరొక నూత్న కళకు నాందియా? చెప్పలేం. మానవ మేథస్సును తరచి చూచేందుకు అసాధ్యం.

ఇలాగ ఎన్నో ప్రయోగాలు జరుగుతున్నాయి. క్రొత్త భావాలు రంగులలో రూపాలు పొందుతున్నాయి.

లండన్‌లో జరిగే ప్రదర్శనలన్నీ చూస్తాను. అమెరికాలో జరుగుతున్న ప్రయోగాలను బాగా ఎరుగుదును. ఇక వచ్చే క్రొత్త పద్ధతులేమిటా అని వూహిస్తున్నాను. 'రోషన్‌బర్గ్' చిత్రాలు ఎంతగానో ఆకర్షించాయి నన్ను. ఇతనివి న్యూయార్క్‌లో, ఫిలడెల్ఫియాలో చూశాను. తర్వాత పెద్ద ప్రదర్శన లండన్‌లో చూచాను. ముఖ్యంగా యితను చేసింది శిల్పాన్ని చిత్రంలోకి తేవడం. అంటే ఘనమైన వస్తువులను చిత్రంలో యిమడ్చడం. చిత్రం చూస్తుంటే ఒక్కోసారి సందేహం వేస్తుంది యిది చిత్రమా, శిల్పమా అని. ఆవిధంగా చిత్రలేఖనం శిల్పాన్ని తనలో యిముడ్చుకుంది. ఇలాంటివి ఎన్నో వచ్చాయి తర్వాత.

ఇవి చూస్తుంటే అనిపిస్తుంది నాకు, శిల్పం చిత్రలేఖనాన్ని ఆకర్షిస్తున్నదని. అంటే శిల్పాల్ని మామూలుగ ప్లాస్టర్‌లోగాని, యితర లోహాలలోగాని పోత పోస్తారు. కొయ్యలో చెక్కుతారు. చిత్రలేఖనంలో మాదిరిగ జాగ్రత్తగ శిల్పాలకు రంగులు వేస్తున్నారు. చూస్తానికి ఎంతో గంభీరంగా వుంటాయి చిత్రలేఖనంకంటే. ఒకే ఒక్క పుష్పించిన చెట్టు

సుందరయ్య గ్రంధాలయ
A.C. No. 83863

ఎంత అందంగా కనిపిస్తుందో - అలాగే ఈ శిల్పాలున్నూ. చిత్రలేఖనం మ్యూజియము లలో యిమిడితే, శిల్పం మ్యూజియములను వదలి ప్రకృతిలో లీనమవుతున్నట్లున్నది. అందుకే గాబోలు లండన్‌లోని బెటర్సి పార్కులోనూ, న్యూయార్కులోని సెంట్రల్ పార్క్‌లోను శిల్ప ప్రదర్శనలు ఏర్పాటు చేస్తారు. మరొక శిల్పం సుందరాతి సుందరంగా, సన్నగా, ఎంతో బారుగ మలచిన వెదురు కర్రలవలె, రేకులు ఆకాశాన్ని చీల్చుకు పోతున్నట్లుంటాయి. గాలికి అవి కదిలి, ఒకదానికొకటి రాచుకొని, లోహంతో చేసినవి అవడంవల్ల, కీచురాయి ధ్వనులు చేస్తాయి. పార్కులో యిటువంటి శిల్పాన్ని వుంచితే ఎప్పుడూ చప్పుడులు చేస్తూ పలుకరిస్తుంటుంది గదూ అందరినీ. మరొకాయన రంగులతో చిత్రించి పలు విధాలుగ మలచిన, పెద్దపెద్ద లేక చిన్న చిన్న ముక్కలుగ చేసిన శిల్పాలను, అక్కడక్కడ ఏర్పాటుచేస్తాడు. ఆటలాడి, అల్లరిచేసి, అప్పుడే నిద్రపోతున్న పసిపాప గది ఎలా వుంటుంది? చిందరవందరగ విసిరివేసిన బొమ్మలతో, అలాంటి అనుభూతినే కల్గిస్తుంది ఈ శిల్ప పద్ధతి గూడ. మహానగరాలన్నీ ఆకాశాన్నంటేట్టుగ పెరుగుతుంటే భవనాలతో, శిల్పం గూడ ఆకాశాన్ని ముద్దుపెట్టుకుంటూ పెరుగుతుంది. లేకపోతే గలివర్, లిల్లీపుట్స్‌ల ఆకారాల తేడాలవలె సంబంధం వుండదు శిల్పానికి, అది వుండే స్థలానికి. చికాగోలో వుంచిన ఒక పికాసో శిల్పం ఎంతో పెద్దది. ప్రక్కన వున్న బ్రహ్మాండమైన భవనాలతో సరితూగుతుంది.

ఇలా ఎన్నో పద్ధతులు వస్తున్నా, చిత్రకారుడు ఏ శైలులలోనూ యిమడక, తనదే అయిన ఒక శైలికై కృషి చేస్తున్నాడు. ఏ పద్ధతిలోను యితన్ని యిమడ్చలేం. ఫ్రాన్సిస్ బేకన్‌ను చెప్పుకొనవచ్చును యిలాంటి పద్ధతుల్లో. వంకర తిరిగిన అద్దంలో కన్పించే ముఖాల్లా రూపులు పోయి, ఈయన చిత్రాలు ఎవరినైనా యిట్టే ఆకర్షిస్తాయి. చాలామందికి వాంతులు తెప్పిస్తాయి. చిత్రకారులను నోరు తెరిపిస్తాయి, ఆశ్చర్యంతో. ఈయన వాడే రంగుల పద్ధతి, కుంచె నడచిన తీరు అద్భుతం. అంత శక్తిని చూపాడు కుంచెను మలపడంలో. యమ బాధతో కుర్చీలో కూర్చుని అరుస్తున్న పోపు, ఇరువదవ శతాబ్దంలో గొప్ప కళాఖండం. తాను జూయిష్. అందువల్ల జ్యూయిష్ వాళ్ళు అనుభవించిన బాధల్ని, చూపుతారు తన చిత్రాల్లో.

మానవ మేధస్సు పెరగందే, చిత్రకళలో జిజ్ఞాస సక్రమమైన మార్గంలో పోషించబడకపోతే, చూచేవారికి ఏ చిత్రకళైనా గందరగోళంగా కన్పిస్తుంది - ముఖ్యంగా నేటి చిత్రకళ.

*('కళ' రెండవ సంపుటి: 1968)*

★

# కళలు - ప్రచురణలు

పుస్తకాలకు పెయింటింగ్స్‌కు తేడా అంతగా లేదు. పుస్తకాల్ని తెరిచి చదివితే గాని అవగాహన అవదు. అందుకే పెయింటింగ్‌లను కూడా పుస్తకాలు అని అనవచ్చు అనుకుంటాను. చిత్రాల్ని కూడా తరచి చూస్తేనే గాని అర్థం గాదు. ఒకటి అవగాహన, రెండవది అర్థం. అవగాహన అయిన తర్వాతే అర్థం తెలుస్తుంది. అందుకే చిత్రాలు కొన్ని రకాల School of thought లో చేసినవి అర్థంగావు. అర్థం అయి జీర్ణం అవటం, చూచేవాని సత్తాని బట్టి వుంటుంది. బలవంతుడే బరువైన భోజనం చేసి అరిగించుకో గలడు. సుకుమార శరీరం గలవాడు తక్కువగానే భోంచేస్తాడు. ఎక్కువ తింటే అరగదు.

అలాగే పుస్తకాలు! ముఖ్యంగా ఒక కళకు సంబంధించిన పుస్తకాలు ఆ కళకు సంబంధించిన వారికి గాని, ఆ కళని ప్రేమించే వారికి గాని ఎక్కువగ అవగాహన అవుతాయి. ఆర్ట్ మీద పుస్తకాలు చాలా వస్తున్నాయి, చాలా కాలం నుండి పాశ్చాత్య దేశాల్లో. ఈ పుస్తకాలు ప్రచురించడానికి ఖర్చు ఎక్కువ. రంగుల చిత్రాలు వేయాలి గదా. ఇవి ఎక్కువగా ఇంగ్లీషు, ఫ్రెంచి, స్పానిష్ భాషల్లో వుంటాయి. కారణం ఆ భాషల దేశాల వారు ప్రపంచంలోని చాల దేశాలను పరిపాలించటమే. కనుక, ఆ పరిపాలిత దేశాల్లో వున్న ప్రజలకు, ఆ భాష వచ్చు. ఆయా భాషల్లో వేసిన పుస్తకాలు ఖరీదైనప్పటికి, మొత్తం మీద ఎక్కువగానే అమ్ముడు పోతాయి. పబ్లిషర్స్ కూడా పుస్తకాలు ప్రచురించడానికి ధైర్యం చేస్తారు.

మన తెలుగులో గాని ఏ ఇతర రాష్ట్ర భాషలో గాని ప్రచురించడానికి ఈ Art - books ఖరీదైనవి గనుక పబ్లిషర్సు కొద్దిగ వెనుకాడతారు. అందుకే ఈ భాషల్లో రావడం లేదు, ప్రపంచ భాషల్లో వచ్చే ఖరీదైన Art books లాంటివి. అదీగాక అంతగా art మీదగాని లేక, సృజనాత్మకమైన ఏ కళలోనైనా వేసే పుస్తకాల్ని గాని ప్రజలు కొనడం లేదు.

అంతగా వోపిక లేక పోవడమో, తమకు అర్థం అవడానికి ఏమైన కష్టమనిపిస్తే అవతల పెట్టే మనస్తత్వమో మరి!

ఏది ఏమైతేనేం చిత్రకళకు సంబంధించిన పుస్తకాలు తెలుగులో రావడం లేదు. అది తెలుగు వారికి చిత్ర కళలో అవగాహన లేకపోవడానికి కారణమైంది. అటువంటి వారి మధ్య చిత్రకారులు బ్రతక లేరు. బ్రతకాలంటే ఇతర చోట్లకో, దేశాలకో పోవాలి. అందువల్ల తెలుగు జాతి నిర్జీవమవడానికి అవకాశం కల్గుతున్నది. ఈ సమయంలో కొద్దో గొప్పగనో, చిత్రకారులు, అందరిని అలరించే, ముచ్చటైన చిత్రాలు వేసి తెలుగు జాతి కళలు నిర్జీవ మవకుండా కాపాడుతున్నారు. అటువంటి చిత్రకారులందరికి నమస్కారాలు చేయాలి. కొద్దిమంది చిత్రకళ మీద తెలుగులో వ్యాసాలు వ్రాస్తున్నారు. తెలుగు చిత్రకారుల జీవిత చరిత్రలు, వారి చిత్రాలతో ప్రింటు చేస్తున్నారు, పుస్తక ప్రచురణల పరంగా. తెలుగు మహామేధావులు, జ్ఞాన మూర్తులు శ్రీ సంజీవ దేవ్‌గారి రచనలు, కళల మీద వారి వ్యాసాలు, శ్రీ చలసాని ప్రసాదరావు గారి 'కళ' సంచికలు, కళను సంగ్రహ రూపంలో అందించి తెలుగు జాతి ఋణం తీర్చుకోలేనంతగా కృషిచేశారు. చిత్రాలు రంగుల్లో ప్రచురించినవి తక్కువ. కళారంగాన్ని భావ, భాషల. రూపేణా వీరిద్దరూ మనకు అందించారు. రంగులు కూడా అందించేందుకు వీరి ద్వారా ఏ ఆర్థిక స్తోమత వున్న సంస్థో, వ్యక్తులో తోడ్పడితే బాగుంటుంది. 'మిసిమి' పత్రిక బహుచక్కటి ముద్రణలో, రంగుల్లో వున్న చిత్రాలతో, చక్కటి వ్యాసాలతో, వస్తున్నది. ప్రచురణ కర్తలకు తెలుగువారు జేజేలు చెప్పాలి. నష్టం వస్తున్నా ప్రచురిస్తున్న ''మిసిమి'' పత్రిక అధినేతల వారి కళా సేవకు, వారి సహృదయతకు మనం ఋణపడివున్నాం.

నేను లండన్‌లో వున్నప్పటి నుండి, 1962 నుండి చూస్తున్నాను, ఎంత చక్కటి పుస్తకాలు వస్తున్నాయో చిత్ర కళమీద. Rutledge & Kegan Pane, Thames & Hudson, The Macmillan Company, Penguin Books ఇంకా ఎందరో ప్రచురణ కర్తలు రంగుల్లో పుస్తకాలు తెచ్చారు. ఏ పుస్తకాల షాపుకు వెళ్ళినా వీరి పుస్తకాలు విరివిగ వుండేవి. కొనబడేవి. నాకు, నిజానికి భారత దేశపు చిత్రకళ మీద, శిల్పకళ మీద Temple Architecture మీద తెలిసినదాంట్లో లండన్, అమెరికా దేశాలలో ప్రచురించబడిన పుస్తకాలు చదవడం వల్లనే, ఎక్కువగా తెలిసింది. భారత దేశ కళలనే గాకుండా జాపనీస్, చైనీస్, యూరోపియన్, దక్షిణ అమెరికా, ఆఫ్రికా దేశాల ఆర్ట్ మీద, వచ్చిన పుస్తకాలు చదవడం వల్లనే, నేను ఎదిగాను. ఆ అవకాశం తెలుగు దేశంలో తక్కువగా ఉంది.

మన భారత దేశంలోనూ ఈ మధ్య మంచి రంగుల్లో వేసిన ఖరీదైన Art-books వస్తున్నాయి. Rupa & Company వారు ముఖ్యులు. ఇంకా ఇతర చిన్న చిన్న పబ్లిషర్స్ గూడ ఖర్చుతో కూడిన మంచి పుస్తకాలను ప్రచురిస్తున్నారు. చాల మంది పాశ్చాత్య పబ్లిషర్స్ ఇండియాలోనూ ప్రచురణ సంస్థలు పెట్టి Reprint చేస్తున్నారు తక్కువ ధరలో. ఆ విధంగా గూడ మనకు మేలు జరుగుతుంది. Art పుస్తకాలు రంగుల్లో ఇండియాలో వేయటం ఖరీదని ప్రచురించని రోజుల్లో, కొంతగా కొరత తీర్చాయి మ్యాగజీన్‌లు. Marg ప్రత్యేకంగా art, architecture మీద చక్కటి సంచికలు బ్రహ్మాండంగా ప్రింటుచేసి తెచ్చింది. అలాగే 'సెంట్రల్ లలిత కళా ఎకాడమీ', రాష్ట్ర లలిత కళా ఎకాడమీలు ఢిల్లీలోని National Gallery of Art, National Gallery of Modern Art, న్యూఢిల్లీ వారు ఎంతో చక్కటి పుస్తకాలను ప్రచురించారు.Illustrated Weekly of India ఎన్ని సంచికల్లో చిత్రాలను రంగుల్లో ప్రచురించిందో చెప్పలేను. ముఖ్యంగా భారతదేశం రుణపడివున్నది తెలుగువాడైన A.S. రామన్‌గార్కి, ఆయన ఈ పత్రికకు ఎడిటరు. ముల్కరాజ్ ఆనంద్ ''మార్గ్‌కు'' ఎడిటర్.

జపాన్‌లో పుస్తక ప్రచురణ ఒక art. నిజానికి చిత్రకళ ఎంత గొప్పదో అంత గొప్పగా పుస్తక ప్రచురణలను ఉన్నతస్థాయికి తెచ్చారువారు. గుడ్డతో కవరు చేసి, ఆ గుడ్డ కవరుపై రంగులో చిత్రాన్ని ప్రింటుచేసి, ఆ గుడ్డ కవరును పుస్తకం చుట్టూ చుట్టి, ఒక కర్ర ముక్కకి తాడుకట్టి, ఆ కర్రముక్కను పుస్తకం పైన loop లాగ వున్న తాడులో దూర్చుతారు. అలా అయితే పుస్తకం తెరవకుండ మూసుకొని వుంటుంది. మన పాత యిళ్లకు తలుపు గడియలు వున్నట్లుగా, చూడటానికి విచిత్రంగా వుండే విధంగా వుుతకగా వున్నకాగితాలపై, (hand made paper) ప్రింటు చేస్తారు. ఒక మ్యూజియమ్‌లో వున్న చిత్రాల్ని వర్ణిస్తూ వ్రాసిన పుస్తకానికి ఒక టేపును జతపర్చారు. ఆ tape లో మాట్లాడింది గ్రంథకర్త. స్వంత గొంతుకలో చిత్రాల్ని వర్ణించారు. మరువలేని జ్ఞాపకంగా వుంది పబ్లిషర్స్ కృషి. జపనీస్ వాళ్ళు ఎక్కువగా పుస్తకాల్ని, poetry books గాని, art books కాని, paintings కు యిచ్చేంత గౌరవంతో ప్రచురణలు చేస్తారు. జపనీస్ ప్రచురణకర్తలంత గొప్ప artistic publishers ఇతర దేశాల్లో ఎక్కడాలేరు.

నేను పాత పుస్తకాల్ని collect చేస్తాను. 100-150 ఏండ్లనాటి పుస్తకాలు, ముఖ్యంగా అమెరికాలో, ఇంగ్లండులో ప్రచురించినవి అట్టమీద (cloth bound, hard bound) అక్షరాలు, డిజైన్లు బొమ్మలు లోతుగా వుండే విధంగా ముద్రించినవి. అవి గిల్టు బంగారంలో ముద్రించినవి. అవి చూస్తే పటం కట్టించుకోవాలనిపిస్తుంది. పుస్తకానికి

మూడు ప్రక్కలవున్న కాగితాలను సమానంగా కత్తిరించకుండా natural paper edges ను వొదిలేస్తారు. కొన్ని పుస్తకాల్లోని పేజీల్లో ముద్రించిన అక్షరాల, చిత్రాల సముదాయం కంటే, అచ్చు వేయకుండ వొదిలిన స్థలమే ఎక్కువగా వుంటుంది. అలా చేయడానికి కారణం ఖర్చుకు ఆలోచించకుండ, అందానికి ప్రాధాన్యత యివ్వడమే! అటువంటివి కొనే కళా హృదయులు వుండబట్టే అలా ప్రచురించడం జరుగుతుంది. ప్రచురణ కర్తలు chance తీసుకొంటారు పబ్లిషింగ్‌లో - ధనిక దేశాల్లో.

ఒక్కొక్కసారి బుక్ క్లబ్బులు ప్రత్యేకంగా ముద్రింపించిన పుస్తకాలు, limited editions గా, ప్రతి పుస్తకం మీద artist చేసిన సంతకంతో అమ్ముతారు. Artistic publishing మీద వుద్దేశ్యం వుంచి ప్రచురిస్తారు ఇలాంటి బుక్ క్లబ్బుల వాళ్ళు.


మరొక విషయం జ్ఞాపకానికి వస్తుంది. అవి children books. కోటలు నిలువెత్తున లేచినట్లుగా రంగుల్లో ముద్రించి, కాగితాల్ని మడచి, పుస్తక రూపంలో చేస్తారు. తెఱచిన పుస్తకంలోని బొమ్మలు పైకి లేచి పిల్లలకు, ఎంత ఆహ్లాదాన్ని యిస్తాయో చెప్పలేం. ప్రచురణకర్తలు ఎంతో డబ్బు ఖర్చు పెట్టి ప్రచురిస్తారు. గొప్ప చిత్రకారులకు commission యిచ్చి చిత్రాలు వేయిస్తారు. పుస్తకంలో పూలగుత్తి వుంటే, ఏ పూవు చిత్రాన్ని గోరుతో గీకితే, ఆ పూవు వాసన వస్తుంది. అలాగే పండ్ల గంపలోని ఏ పండును గీకితే, ఆ పండు వాసన వేస్తుంది. చాల పుస్తకాలు, బొమ్మలతో బాటువున్న tape లో, పక్షుల, జంతువుల అరుపులతో, మనుషుల నవ్వులతో ఎంతో విజ్ఞాన కరంగా వుంటాయి. పిల్లల్ని ప్రపంచ పౌరులుగా చేస్తున్నాయంటే ఇటువంటి పుస్తకాలను ప్రచురించే మహానుభావులైన పబ్లిషింగ్ అధినేతలే అందుకు కారణం.

ప్రచురణ రంగం ఎంత గొప్పదంటే అది జాతికి చిహ్నం. ఎన్ని మంచి పుస్తకాలు అందరికి అందుబాటులోకి తెస్తామో, అంతగా అవి జాతి విజ్ఞానానికి తోడ్పడుతాయి. అందుకే పాశ్చాత్యదేశాల్లో "Reading maketh a man" అంటారు. పుట్టాం గనుక బ్రతుకుతాం. కాని మానవునిగా - ప్రపంచంతో సంబంధంగల మానవునిగా - మనుగడ కావాలంటే ఎందుకు మనం పుట్టాం, ఏ విధంగా మనం ప్రపంచానికి వుపయోగ పడ్డాం అని విచక్షణ చేసుకోవడానికి చదవడం అవసరం. జాతిని విజ్ఞాన వంతం చేయ వలసిన బాధ్యత వారిదే! యూనివర్శిటీలు, కాలేజీలు, హైస్కూల్స్ లపై ఎంత బాధ్యత వుందో పబ్లిషర్స్ మీద కూడా అంత ఉన్నది. Third World Publishers పై మరింతగా వుంది.

నా చిన్నప్పుడు, దేశి కవితా వాళ్ళు శరత్ నవలల్ని అన్నిటిని అనువదించి తెలుగులో ప్రచురించారు. నా తరం వాళ్ళం శరత్, బంకించంద్ర ఛటర్జీ, ప్రేమ్‌చంద్ నవలల్లో మునిగితేలాం. ఈనాడు T.V. ముంచి తేలుస్తోంది జనాన్ని. అటువంటి ప్రమాదంలో వున్న ఈరోజుల్లో, తెలుగు పబ్లిషర్స్‌కు బాధ్యతలు మోయలేనంత బరువైనాయి. అయినా పండ్లు బిగపట్టి తెలుగు వారికి అండగ వుండాలి. ఒక షాపులో అడిగాను ''సంజీవదేవ్‌గారి పుస్తకాల సెట్టువుందా'' అని. ''ఇప్పుడు ఎవరూ reprint చెయ్యరు. ఎవరు చదువుతారు సార్ అటువంటి పుస్తకాలు? చదువరుల రుచులు మారాయి సార్'' అన్నారు. చాల పుస్తకాల షాపుల్లో కొన్ని పుస్తకాలు అడిగితే reprint లో లేవు అంటున్నారు. ఏదో National Book Trust ప్రచురిస్తే తప్ప, దేశంలో ఇతర రచయితల పుస్తకాలు దొరకని స్థితి రాకుండా కాపాడవలసింది ప్రచురణ కర్తలే. చాల మంది రచయితలే వారి స్వంత డబ్బుతో పుస్తకాలు ప్రచురించుకుని, పబ్లిషర్స్ వద్ద కొన్ని కాపీలు ఉంచి, ఏ ఆరు నెలలకో ఓసారి వెళ్ళి, అమ్మిన డబ్బు తెచ్చుకుంటున్నారు. పబ్లిషర్స్ పాఠకులకు రుచులు క్రొత్తవి నేర్పాలి, చదువరులకు కళా ప్రపంచాన్ని దగ్గరగా తేగలగాలి. చూస్తుంటే కొరత కనిపిస్తుంది గొప్ప రచయితలు అంతగ రావడం లేదని, ఆంధ్రదేశంలో నిన్నమొన్నటి వరకు బ్రతికివున్న మాధవ పెద్ది గోఖలే, కొడవటిగంటి కుటుంబరావు, త్రిపురనేని గోపీచంద్, చలం, శ్రీ శ్రీ, విశ్వనాథ సత్యన్నారాయణ గార్ల వంటి universal human beings పదే పదే జ్ఞాపకానికి వస్తారు మనందరికి, వారు మన తెలుగు జాతిని వుత్తేజ పరచారు. ఈనాడు ఏమయింది సాహిత్యంపై ఆ అభిలాష? ఎన్నో యూనివర్శిటీలు క్రొత్తగా వచ్చాయి. అవి ఎంతవుంది సాహితీ పరుల్ని, రచయితలుగా మారడానికి దోహద కారి అవుతున్నాయా అనే ప్రశ్న వేసుకుంటే సరియైన, తృప్తి కరమైన జవాబు రాదు! ఇది జాతికి మంచిది కాదు. ఇటువంటి పరిస్థితుల్లో చక్కని కృషి చేయవలసిన బాధ్యత తెలుగు పబ్లిషర్స్ మీద వున్నది. వ్యాపార దృష్ట్యానే కాకుండా, జాతి పట్ల బాధ్యత గుర్తించడం కూడ మన పబ్లిషర్స్ ముఖ్య కర్తవ్యం. ఆ సత్తా తెలుగు పబ్లిషర్స్‌కు వున్నది అని మేము అనుకోవడంలో ఏ మాత్రం సందేహం లేదు. అది నిజం చేయవలసింది పబ్లిషర్స్. తెలుగు వారలం కార్యశూరులం. ఇది సత్యం.

*(విజయవాడ బుక్ ఫేర్ వారి సావనీర్ - 1996)*

★



# శాస్త్ర యుగంలో కళాకారుడు

''...మనం దేనినైతే స్థూలంగా ''ఆధునిక కళ'' అని పిలుస్తామో దానిని గురించి ఎస్. వి. రామారావు రచన ఇది. ''ఆధునిక కళ'' అనే పదజాలంలో గత 50 సంవత్సరాలలో జరిగిన కృషి ఇముడుతుంది; సమ్మోహించి పారవేసే రామారావు సంభాషణలో పాల్గొన్న మా సంపాదకవర్గం వారెవరూ, ఈ అంశంమీద ఆయన భావాలతో ఒక వ్యాసం తయారు చేసే ఏర్పాటులో, ఇప్పటికే ఆలస్యం అయిందని ఒప్పుకోకుండా ఉండలేరు''.

*- లండన్ మాసపత్రిక ''ది కామన్వెల్త్ స్కాలర్'' సంపాదకుల నోట్.*

''ఆకారం అనేది ఒక పెద్ద దృష్టి సంబంధమైన మాయ, కంటికి తోచే మిధ్య. అందుకనే అది ఒక భౌతిక భారం, సాకార వస్తు బంధనం, సత్యాన్ని కప్పిపుచ్చే తెర. కళ ఆకారంతో మొదలై, నిరాకార స్థితిలో ఉచ్ఛ స్థానాన్ని అందుకుంటుంది. అందుచేతనే కళాకారుడు తన సృష్టి పరిణామంలో, ఆత్మ ప్రవచనం అనే కాంతివంతమైన యాత్రలో, మరికొంత స్వేచ్ఛ కోసం, ఆకారానికి అతీతుడు కావాలి.'' అంటారు శ్రీ సంజీవదేవ్.

ఈ శతాబ్దం - ఇరవయ్యవ శతాబ్దం - చంచలమైనది. దీనిలో దేశ, కాలాలకి ప్రత్యేక ప్రాముఖ్యత చేకూరాయి. అంతరిక్ష యానం సాధనతో ప్రపంచం ఇంకా ఇంకా చిన్నదైపోయి, మానవుడి సారూప్యం మరింత క్షీణించి పోతోంది.

ఒకప్పుడు మానవుడు ఈ భౌతిక ప్రపంచాన్ని తన ఆధ్యాత్మిక ఆధిక్యతతో జయించాలని ప్రయత్నించాడు. నేడు, కొంతకాలంగా సమకూర్చుకుంటున్న తన వైజ్ఞానిక శక్తులద్వారా ఆధిపత్యం వహించాలని ఆశిస్తున్నాడు. ఈ రకం ఆధిపత్యం తక్కిన వాటికన్నా అధికం అయినప్పుడు, అతని జీవితంలోని అంశాలన్నీ విజ్ఞానానికి లొంగిపోతాయి. ప్రకృతినే సవాలుచేసే పరిస్థితి ఏర్పడుతుంది. ప్రకృతితో యుద్ధం వల్ల అతనికి ఎన్నో జయాలు, అపజయాలు కలుగుతాయి. ఈ యుద్ధంలో అతను తన ఆత్మ శాంతిని తరచు కోల్పోతూ ఉంటాడు. ఒకవైపు శాంతి కోసం చేసే అపురూప

కృషి, మరొకవైపు ప్రకృతిమీద ఆధిపత్యం వహించాలనే అనంతమైన ఆశ, ఇవి రెండూ ''మనయుగం'' అనే నాణానికి రెండు వైపులనూ సూచించే చిహ్నాలు.

అయితే, ఒక వ్యక్తి తనంతటా తాను ఎలా జీవిస్తాడు?

అతని జీవిత విధానం ఎటువంటిదైనప్పటికీ, విజ్ఞానంతో జరిగే యుద్ధంలో పాల్గొన లేకుండా ఉండలేడు. అలాగే, మానవునిలోని సాంస్కృతిక, సౌందర్యాంశాలు విజ్ఞానంతో కలిసి పనిచెయ్యాలి. కొన్ని సమయాలలో దానిని స్వీకరిస్తూ, కొన్ని సమయాలలో గర్హిస్తూనే. ఈ వైరుధ్యం, యుద్ధం అనేవి సంస్కృతి, సృష్టి సంబంధించిన రంగాలలోని, ప్రతి కార్యక్రమంలోనూ కనిపిస్తాయి. అక్కడి సంగీత, నృత్య, కావ్య చిత్రకళల వైఖరులు ఎన్నో! కళాకారులు ఎందరో!! ఇది ఆశ్చర్యం కలిగిస్తుంది. నమ్మలేన టువంటి మార్పు చూస్తాం. ఈ వైఖరులనే ప్రవాహాలలో మన యుగం ప్రతిబింబిస్తుంది- ఇది ప్రతి యుగంలోనూ జరిగేదే.

వైరుధ్యాలతో నిండిన యీ యుగంలో జీవిస్తూ, కొంచెం శాంతికోసమని, కళాకారుడు గతంలోకి చూశాడు. గతం యొక్క చరిత్ర, సిద్ధాంతం దాని వివిధ దశలలో పరిస్థితులలో వ్యక్తమయ్యే వైఖరుల పరిణామాలు, వీటిని హృదయపూర్వకంగా అర్థం చేసుకొనే ప్రయత్నంలో నిమగ్నుడైన కళాకారుడిని చూస్తాము. కాలగర్భంలో తప్పిపోయిన ''నీగ్రో'', ''మాయా'' కళాస్వరూపాలని ప్రత్యేకంగా పరిశీలించాడతను. వారి అలంకరణలు, నిత్య జీవితానికి అవసరమైన వస్తువులు, చిన్నపిల్లలు గీసే గీతలు, జీవన విధానాలు, కృత్రిమ ముఖాలు, వీటి ద్వారా శాంతి, యదృచ్ఛ పొందాలని ప్రయత్నించాడు. వైజ్ఞానిక మానవుడికి సంక్లిష్టత గురించి తెలిసిన జ్ఞానాన్నీ, సామాన్య మానవుడి మీద దానికి ఉండే ప్రభావాన్నీ, కౌతుకంతో వీక్షించాడు. ఆ రెండిటినీ తన స్వానుభవంతో కలిపాడు. వర్తమాన యుగం యొక్క నిజస్వభావాన్ని, భావి తరాలకి దక్కేట్లు చెయ్యటం తన ధర్మం అని హృదయపూర్వకంగా నమ్మాడు. ఈ ధర్మం కొందరికి సచేతనంగా అవగాహన అవుతుంది - మరికొందరికి అచేతనంగా తెలుస్తుంది. కొందరేమో, సమాజం పట్ల ధర్మబద్ధులై ఉండాలన్న భావాన్నే నిరసిస్తారు; సమాజం అంటే వర్తమాన తరాలే కాక, భావి తరాలు కూడా. అయినప్పటికీ, పరోక్షంగా నైనా వారు తమ క్రియతో ఈ ఆశయానికీ సేవ చేస్తారు. అంటే కళాకారుని ప్రయత్నాలలో వివిధ ఆత్మ ప్రవచనాలు ఇమిడి ఉంటాయి. భౌతిక, రసాయన శాస్త్రాలు రాజ్యం చేస్తున్న ఈ ప్రపంచంలో, సాంస్కృతిక సృష్టిలో తన సారూప్యం పోకుండా, ఈ యుగ ప్రవాహాలలో

కొట్టుకుపోకుండా ఉండాలని కోరుకుంటాడన్నది, మనం మర్చిపోరాదు. మానవుడు తన సారూప్యం, వాస్తవిక వ్యక్తిత్వం పోగొట్టుకోకూడదనే విషయం అతనే చెప్పాలని, బోధించాలని (ఈపదం వాడటం నాకు ఇష్టంలేదు) కోరుతాడు. ఈ యుగ ప్రవాహశక్తిలో, తన సారూప్యమే కోల్పోయిన ప్రజాసామాన్యంలో, కళాకారుడు నవ్వులపాలు కావటానికి ఇదీ ఒక కారణమే అనుకుంటాను. అందుచేత, దృఢమైన నమ్మకాలతో ప్రబలంగా తను తానుగా ఉండాలని ప్రయత్నిస్తున్న కళాకారుడు, అవహేళనకి గురి అవుతాడు. ''సర్ హెర్బర్ట్ రీడ్ '' చెప్పిన 'అన్ ఏస్తటిక్ ఎడ్యుకేషన్' అబ్బటానికి, గుడ్డిగా తెరిచి ఉన్న కళ్లు చాలు; 'లాండ్ స్కేప్'లు వాస్తవికంగా, సహజంగా చిత్రించిన 'కొరో' తన సమకాలికులు సరైన ఆదరణ చూపనందుకు ఎంత కష్టపడ్డాడో మనకు తెలుసు. తమ సృష్టికి తగిన ఆదరణ లభించకముందే చనిపోయిన వాన్గో, గోగాన్ వంటి 'ఇంప్రెషనిస్ట్'ల బాధ కూడా మనకు తెలిసినదే. ఈ మహోన్నత కళాకారులు, వాస్తవిక ఆకారాలను వదులుకోలేదు. అయినా వారి కాలపు ప్రజలు వారి విశిష్టతను గుర్తించలేదు.

ప్రాచ్య ప్రాంతాల నుంచి వచ్చిన యువ కళాకారుడిని కాబట్టి, నామీద పడ్డపాశ్చాత్య ప్రభావాలని నాకై నేనే కొలిచి చూడాలని ఉంది. తూర్పు మనిషి కళాదృష్టి, పశ్చిమదిక్కు వారికి సంబంధించిన దానితో పోల్చి చూస్తే చాలా భేదం కనిపిస్తుంది. రోమన్, గ్రీక్ (చివరి దశల) శిల్పాలు పరిశీలనగా చూస్తే, మూలానికి అన్నివిధాలా సరిపోయే ప్రతిరూపం సృష్టించాలని ప్రయత్నించేవారని, గ్రహిస్తాము. పరిచయం ఉన్న వస్తువు ప్రతిరూపం నిర్మించి ప్రేక్షకుల కంటికి ఆనందం కలిగించాలనేది కళాకారుని లక్ష్యం. సజీవ రూపాల బాహ్య సౌందర్యాన్ని గ్రహించిన వారు ఈ పాశ్చాత్య కళాకారులు. ఇలా రూపాల ప్రతిబింబాలు నిర్మించటం తేలిక కాదు; సంవత్సరాల సాధన, శిక్షణతో ఏర్పడిన నైపుణ్యం, పనితనం అవసరం. కాని కళ పనితనం కాదు - కనీసం పనితనం మాత్రమే చాలదు. మానవుల కొలతలు తీసుకుని, ఒక శిల్పం చెక్కగలం. ఒక వస్తువుయొక్క వెలుపలి ఆకారానికే కాక లోపలి స్వభావం, గుణం వీటికి కూడా ప్రాతినిధ్యం ఇవ్వాలన్న నమ్మకం ఉన్నప్పుడే కళ సజీవంగా ఉంటుంది. వస్తువుకీ ఒక సారూప్యం ఉంది. ఈ విషయంలో మొత్తానికి పడమరమీద తూర్పుదే పైచెయ్యి. తూర్పు కళాకారులు దృష్టి ప్రధానమైన ఆకారం ఛేదించి లోపలి ఆధ్యాత్మిక, శాశ్వత ఆంతర్యాన్ని బయటికి తీసుకురాగలిగారు. నాలుగువేల ఏళ్ల క్రితం ఈజిప్టువారు, భారతీయులు చిత్రాలు వేశారు, శిల్పాలు చెక్కారు. నమ్మ శక్యంకానంత అందంతో, శాశ్వతంగా ఉండిపోగల నిర్మాణాలు చేశారు. గ్రీక్‌లు, రోమన్‌లవలె వస్తువుయొక్క బాహ్య స్వరూపం చిత్రీకరించే బదులు లోపలి సౌందర్యాన్ని, శాశ్వత గుణాన్ని బయటికి తీసుకువచ్చారు.

పాత జపాన్ చిత్రపటాలు చూశారనుకోండి, ఆత్మను కదిలించివేసే ఆ లావణ్యవతులైన వనితల ఇంద్రియానుభోగ్యమైన సౌందర్యం, మిమ్మల్ని స్తబ్ధుల్నిగా చేసేస్తుంది. నగలతో అలంకరించుకున్న భారతీయ దేవతలు, రాజులు, కాల్పనికంగా సాక్షాత్కరించినట్లున్న వారి నిత్య జీవితంలోని చేష్టలు, రసపూరితమైన ప్రకృతి దృశ్యాలు, అద్భుతంగా అలంకరించిన భవంతులు స్ఫటికం వంటి వాటి సౌందర్యం, అనంతమైన ఆనందం ముందు, మీరు అత్యల్పులనే భావం కలుగుతుంది. చైనా ''సిరామిక్'' పాత్రలు, పర్వత దృశ్యాలు మిమ్మల్ని అయోమయంలో పడేస్తాయి. ఈ తూర్పువారు తమ సృష్టిని ఏవిధంగా భావించుకో గలిగారో మీరు వూహించలేరు. కాని గ్రీక్ వస్త్రాదులనీ, కండలు ఉబికే పురుషుల నగ్నశరీరాలనీ, వీనస్ శిల్పాలను ఎలా చెక్కారో అర్థం చేసుకోగలరు. తూర్పు నుంచి వచ్చే కళను అర్థం చేసుకొనటం కష్టం.

బ్రతికివున్న జీవులన్ని ఎప్పటికయినా నశించేవని వారికి తెలుసు. దీనినే 'మిధ్య', 'శూన్యం' అంటాము. భ్రమ అన్నమాట. ఈ సాధారణ భ్రమల భావాలని, ప్రకృతి లోని సజీవ జీవాలలోని అమర్త్యతని చెక్కి, చిత్రించటానికి ప్రయత్నించారు కొందరు. మనిషే మిధ్య కాబట్టి కంటికి కనుపించే రూపాన్ని అతిక్రమించాలని కోరారు. పాశ్చాత్యులు మానవ శరీరాకారాన్ని ఆరాధించి, దానిని కళలో బంధించివేద్దామని ప్రయత్నించారు. ఒకటి కంటికి ఇంపుగా ఉంటే, రెండవది అంతర్చక్షువుకి హాయిని కలిగిస్తుంది.

అవును, ఇదంతా గతం. ప్రపంచం పరిభ్రమించిన కొద్దీ కాలంలోనే చలనం ఏర్పడుతుంది. మానవుడు స్థిత ప్రజ్ఞత కలవాడు కాడు. మొదట అతను అన్నిటినీ స్వయంకృతమైన విజ్ఞానం - శాస్త్రం -తో జయించాలని ప్రయత్నిస్తాడు. దానిని సాధనంగా, ఆయుధంగా వాడుదామనుకుంటాడు. నిజంగా మానవుని స్వభావం ఎంత చిత్రమైనది! శాంతి సమయాలలో, గడించిన విజ్ఞానంతో, జీవన వినాశకములైన ఆయుధాలని కనిపెడ్తాడు. ఈ శాంతి యుగమే సమృద్ధితో నిండిన యుగం. యుద్ధకాలంలో ఆయుధాలు వినియోగించే సమయం వచ్చేసరికి - మానవుడు శాంతికోసం ప్రయాసపడ్తాడు. ఎంత అసంగతం! ఈ ప్రపంచంలో అన్నీ క్లిష్టమై పోయాయి. కళాకారుడు ఈ అంశాన్నే చిత్రీకరించటానికి ఇష్టపడ్తాడు - ఇదే విజ్ఞాన, విభజన యుగం.

విప్లవాలూ, యుద్ధాలూ ! వీటితో ఆర్థికంగా అభివృద్ధి చెందిన పాశ్చాత్య దేశాల కళాకారుడు ఈ విషయం గ్రహించాడు. తన గ్రీక్, రోమన్, పూర్ణ, అర్ధ నగ్నశిల్పాలు, స్త్రీ మూర్తులు, గడ్డాలున్న పురుషుల కండలవంపులు, పట్ల అసంతృప్తి కలిగింది.

ఆర్థికాభివృద్ధి, వైజ్ఞానిక విజ్ఞానం, మానవజాతిమీద పారిశ్రామిక యుగం యొక్క యాంత్రిక సంకీర్ణ ప్రభావం, కళ్లారా చూశాడు. ఇదంతా తన సాధనలో వ్యక్తపరచాలనుకున్నాడు. అందుకోసం, ఒక క్రొత్త చిత్రలేఖనం, శిల్పం, సిద్ధాంతం సృష్టించవలసి వచ్చింది. వీటి ద్వారానే కళాకారుడు జీవితంలోని తన అనుభూతులు నిండుగా, నైపుణ్యంతో చెప్పగలుగుతాడు. చిత్రలేఖనంలో భావభరిత వర్గాలు కొన్ని ఏర్పడ్డాయి- ఇంప్రెషనిజమ్, ఎక్స్‌ప్రెషనిజమ్, క్యూబిజమ్, ఫావిజమ్, ఫ్యూచరిజమ్, ఆబ్‌స్ట్రాక్ట్ ఎక్స్‌ప్రెషనిజమ్, డాడా యిజమ్, సర్రియలిజమ్, ఇండివిడ్యువలిజమ్ మొదలయినవి. ఒక్కొక్క వర్గం ద్వారా ఒక కొత్త ఊహని వ్యక్తపరచగలిగాడు. పాశ్చాత్య కళాకారుడు ఒక 'వర్ణ పరిభాష' సృష్టించగలిగాడు. ఒక కొత్త సాధనంతో ఈ శతాబ్దపు భాష మాట్లాడగలిగాడు. ఈ విషయంలో ప్రపంచలోని కళాకారులంతా ఇతనికి రుణపడి ఉన్నట్లే. తూర్పు నుండి వచ్చే కళాకారుడు, పశ్చిమ చిత్రలేఖన వర్గాలని నిశితంగా అనుశీలించిన తర్వాత, మరింత శక్తివంతంగా, విలాసంగా, కవితాదృష్టితో తన భావాలని వ్యక్తపరుచుకొన గలుగుతాడని గట్టిగా నమ్ముతాను. ఎందుకంటే, అతనిలో ఎలాగూ ఒక ప్రత్యేకమైన సాత్విక గుణం, జాతీయ కళాశైలి - ఇది యదృచ్ఛంగానే కాక స్వాభావికంగా స్వచ్ఛమైనదీ, జాతీయమైనదీ కూడా - ఇమిడి ఉన్నాయి. ప్రాగ్దిశ నుండి వచ్చిన కళాకారుని పరమ కర్తవ్యం, పశ్చిమ కళా విభేదాలని నేర్చుకుని, అర్థం చేసుకుని తన కళకి వినియోగించి ఒక కొత్త స్వంత భాష మాట్లాడటమే అవుతుంది. అప్పుడే ప్రాక్పశ్చిమ కళలలోని ఉత్తమ అంశాలను కలుపగలుగుతాడు. ( ప్రాక్పశ్చిమ విభేదాలు కేవలం చిత్రలేఖన వర్గాల కోసం చేస్తున్నాను. ) ఈ లక్ష్యం కోసం తూర్పు పడమర ప్రదేశాలలో కళాకారులు కష్టపడి, భావయుక్తంగా కృషి చేస్తున్నారు. ఇదొక పెద్ద పరిశోధన - సమైక్యత కోసం అంతర్జాతీయాన్వేషణ. ఈ లక్ష్యం నాముందు పెట్టుకుని నా పని నేను చేసుకుంటూ వచ్చాను. నాకు కావలసిన పదార్థాలు తీసుకుని అక్కరలేనివి దూరంగా పారవేశాను. అదృష్టవశాత్తు, నేను వేసిన నా 'ఆబ్‌స్ట్రాక్ట్' చిత్రాల్లో భారతదేశానికి ప్రత్యేకమైన లయ, లావణ్యంతోబాటు పాశ్చాత్య వర్గాలలో సామాన్యంగా కనిపించే గుణాలు - ఆకారం యొక్క తుల్య దృఢత్వం మొదలయినవి - కనిపించినట్లయితే, ఈ యుగంలో, ఈ తర్క విజ్ఞానపూరితమయిన ప్రపంచంలో నేను విజయం సాధించినట్లే భావిస్తాను -

*( ది కామన్‌వెల్త్ స్కాలర్ నుంచి ''భారతి'' ఫిబ్రవరి 1964)*

☆



# మన చిత్ర కళ

నేటి ఆంధ్రులకు లలితకళల కన్న సినిమాలు, రాజకీయాలంటే అభిలాష ఎక్కువ అని ఎందరో అనగా విన్నాను. ఇందులో సత్యం కనిపిస్తూనే ఉంది. తెలుగు వారి ధనం ఎన్ని కోట్లు మద్రాసుకు తరలివస్తున్నదో సినిమా ప్రపంచంలోకి! శాసన సభల, పురపాలక సంఘాల, పంచాయతీల ఎన్నికలకు గ్రుమ్మరించే ధనం లెక్కకట్టి చూస్తే పరమ సత్యం బయటపడుతుంది. ధనాశ, కీర్తిదాహాలకు దారితీసే రెండూ బాగా ఆకర్షించాయి మన యువకుల్ని. ఈ మార్గాల నుండి మరలడానికి ఎంతకాలం పడుతుందో మరి! అయినా ఇలాగ ఎంతోకాలం సాగదు. తప్పకుండా ఆంధ్రులలో అంతర్గతమై ఉన్న రసజ్ఞత, కళారాధన మరల విజృంభిస్తాయి.

నిజానికి అలనాటి ఆంధ్రులకు శిల్ప చిత్రకళలంటే ఎంత ప్రేమో లేపాక్షి, అజంతా, అమరావతి, నాగార్జునకొండ, గోలి, సాంచి చెపుతాయి బలంగా! ఆంధ్రత్వము నూటికి నూరుపాళ్లు నిండిన మన చిత్ర శిల్ప కళలలోని సునిశిత మయిన పనితనం, సోయగం, లావణ్యం, రంగుల పొందిక, ఉన్నతభావాలు అమరత్వం పొందాయి వీనిలో. ఎందువల్ల? ఈ ప్రశ్న వేసుకుంటే తెలుస్తుంది నేటి చిత్రకళ దుస్థితి. కళల ఔన్నత్యాన్ని, వాటి పూర్ణ సృజనాత్మక రూపంలో చూచి ఆనందించగల రసజ్ఞత నాటి ప్రజలలో, ప్రభువులలో ఉండేది. సంపన్నులు తమ ఇండ్లగోడలపై చిత్రాలు వ్రాయించుకునేవారు. అంత ఆదరణ ఉన్నందువల్లనే లోక ప్రసిద్ధిపొంది, కాలానికి నిలువగల్గినంతటి ఉన్నత కళ ప్రదర్శించారు తెలుగువారు. కళలలో ఆసక్తిలేని మనస్తత్వంగల నేటి తెలుగు ప్రజల మధ్య, సృజనాత్మక చిత్రకళ ఎలా రాణిస్తుంది? ఏనాడో మూతపడిన మాచెర్ల చిత్రకళాకేంద్రము, మచిలీపట్నం జాతీయ కళాశాలలే నిదర్శనాలు మనవారి కళాభిలాషకు! ఇంతకంటే విచారకరమైన విషయం మరొకటి వుండదు ఎవరికైనా.

మన కళాతృష్ణ యిలా యిగిరిపోవడానికి కారణాలు ఎన్నో ఉన్నాయి. బ్రిటిషు పరిపాలన వచ్చిననాటి నుండి మన దృష్టి, ధ్యాస మరో ప్రపంచంవైపు మరలింది. మొక్క-

అసలు స్థానంనుండి పెరకబడి మరోచోట, క్రొత్త గాలిపీలుస్తూ విభిన్నంగా పెరిగినట్లు ఇంగ్లీషువారి భాష, పద్ధతులు, భౌతికవాదం మనవారి నింకొక వేరుదారిలోనికి మరలించాయి. ఏదైనా క్రొత్తది కన్పిస్తేచాలు ముందుగా స్వీకరించే మనస్తత్వం మన తెలుగువారిది. దక్షిణాదిన బౌద్ధమతం, బౌద్ధకళ అమరత్వం పొందింది ఆంధ్ర దేశంలోనే. బ్రహ్మ సమాజ మతాన్ని విరివిగా స్వీకరించింది మన తెలుగువారే. స్వదేశోద్యమంలో ముందడుగు మనదే. దీనివల్ల మంచీ, చెడూ రెండూ ఎదురయ్యాయి. ముఖ్యంగా చిత్రలేఖనాన్ని దృష్టిలో పెట్టుకొని, తెలుగు ప్రజలలో కలిగిన మార్పును కొంత వివరిస్తాను.

ఉదాహరణకు మన ప్రజలలో రాజా రవివర్మ, కనూ దేశాయిల చిత్రాలు ఎంతగా హత్తుకుపోయి కదలక నిలచిపోయినాయో చెపుతాను. వీరి తరువాత ఎంతోమంది చిత్రకారులు ప్రశంసాపూర్వకమైన కృషి చేశారు. ఎన్నో రకాల కళాధోరణులుద్భవించాయి. ఎంతో ముందుకుపోయింది నేటి భారతీయుల చిత్రకళ. కాని మన ప్రజలు యింకా రవివర్మ, కనూ దేశాయిల మత్తులోనే వున్నారు.

రాజపుత్ర, మొగలాయి చిత్రకళ ఔన్నత్యాన్ని, దేశీయతను మరిచిన మనకు, రవివర్మ చిత్రాలు ఒక్కసారి మిరుమిట్లుగొల్పాయి. ఆయన చిత్రకళ ఒక తుఫాను. అతని విజృంభణ నిరాఘాటంగా ప్రజల్లో చొచ్చుకుపోయింది. కొత్త చిత్రకళ కావడం, అతని కాలంలో మరో పెద్ద చిత్రకారుడు లేకపోవడం, ఆబాలగోపాలానికి సులువుగా తెలిసేటట్లు చిత్రించడంవల్ల బాగా ఆకర్షణ పెరిగింది. దైవభక్తి, పుణ్యం, పురుషార్థం ఎక్కువగ నున్న ఆనాటి ప్రజలకు ఆయన చిత్రించిన లక్ష్మి, సరస్వతి, శకుంతల మొదలగు చిత్రాలు ఎంత నచ్చుతాయో వూహించవచ్చును. రవివర్మ తమ చిత్రాలను జర్మనీలో అతి జాగ్రత్తగా ప్రింటు చేయించి తెప్పించే వారట. మైసూరు మహారాజు ప్రాపకం ఆయన కీర్తికి ఎంతో దోహదం కలిగించింది.

ఒకందుకు రవివర్మను మెచ్చుకోవాలి. నిద్రాణమై ఉన్న జాతిలో ఒక్కసారి పిడుగులా అలజడి తెచ్చి, చిత్రకళ వైపు ప్రజలను మరలించాడు. ఆ విధంగా ఆయన చిరస్మరణీయుడు. కాని ప్రజల్లో ఉన్న పేరునుబట్టి ఏ చిత్రకారుని శక్తి నిర్ణయించలేము. ప్రజలకు నచ్చేవిధంగా వేసిన క్యాలండర్లను, సినిమా బ్యానర్లను కళాఖండాలనలేము. భావాన్ని ఏవిధంగా చిత్రకారుడు రంగుల రూపంలో ప్రదర్శిస్తున్నాడు అనేది అతని కళా నైపుణ్యాన్నిబట్టి, భావవిస్తృతినిబట్టి, సాధననుబట్టి వస్తుంది. ఇవి నిర్ణయించ వలసినవారు మామూలు ప్రజలుగాదు. చిత్రకళా మర్మములను ఎరిగిన విమర్శకులు, చిత్రకళలో సాధన చేస్తున్న చిత్రకారులు. ఈ విధంగాచూస్తే రవివర్మకు సృజనాత్మక చిత్రకారుల

స్థాయిలో చోటులేదు. ఆయన పాశ్చాత్య పద్ధతిలో నూటికి నూరు పాళ్లు చిత్రించినా ఆ చిత్రాలు పాశ్చాత్యుల చిత్రాలముందు దిగదుడుపు. రసజ్ఞత, కళాపటిమ లేని చిత్రకారుడని చాలమంది విమర్శకుల, చిత్రకారుల అభిప్రాయం. నేను తిరువేంద్రం స్టేట్‌గ్యాలరీలోను, మద్రాసులోను రవివర్మ చిత్రాలను అనేకం చూశాను. ఆయన చిత్రాలలోని రంగులలో మార్దవం లేదనిపిస్తుంది. రంగుల మిశ్రమంలో సహజ కాంతిని కోల్పోయి మడ్డిగా తయారయినాయనిపిస్తుంది. ఇది నా స్వంత అభిప్రాయం.

ఢిల్లీలో అమృతషేర్‌గిల్ చిత్రాలు చూచాను. స్తబ్దుడనైనాను. ఆమె వాడిన విధానం రంగులకు లేని జీవాన్ని తెచ్చింది. ఆమె చిత్రాలు ప్రముఖ విదేశీ చిత్రకారుల ఏ చిత్రాలతోనైనా సరే తులతూగ గలవు. ఒక ముఖ్య విశేషమేమంటే పూర్తిగా పాశ్చాత్య పద్ధతిలో చిత్రించినా భారతీయుల స్వభావాలను, ఆంతర్యాన్ని గ్రహించి వ్యక్తపరచింది తన చిత్రాలలో. ఆ చిత్రాలు చూస్తుంటే మనం మనవాళ్ళమధ్య వున్నట్లు భావిస్తాము. ఆ చిత్రాలకు అంతర్జాతీయ ఖ్యాతి వచ్చింది. ఆమె చిత్రాలు చూచిన, కళా విమర్శకులు అందరు మెచ్చుకున్న వారే. శ్రీమతి షేర్‌గిల్ చిత్రాలు చిత్రకారులకు, విమర్శకులకు కనుల పండుగలు. భారత ప్రభుత్వం దాదాపు ఆమె చిత్రాల నన్నిటిని కొని దేశ ప్రజలందరు సదాచూచే అవకాశం కలుగచేసింది. రవివర్మ, షేర్‌గిల్ ఇద్దరూ పాశ్చాత్య పద్ధతులలో చిత్రించినవారే. వారి వారి చిత్రాల విలువ అంత విరుద్ధంగా ఎందుకు వుంది? ఇదే చిత్రకారుల పూర్ణత్వానికి నిదర్శనం. మరోమాట అనకుండా భారతీయులందరు ఏకగ్రీవంగా అమృత షేర్‌గిల్ చిత్రాలను వుత్తమ కళాఖండాలంటారు ఎల్లప్పుడూ. అవి కాలానికి నిలిచేవి. కాని రవివర్మ చిత్రాలు ప్రతి తెలుగువారింట పూజలందుకొన్నాయి. ఆ అలవాటుతో ప్రజలు ఏ చిత్రాన్నయినా రవివర్మ చిత్రాలతో పోల్చిచూడడానికి అలవాటు పడ్డారు ప్రజలు. తరువాత మరొక క్రొత్త గాలి బలంగా వీచింది.

బెంగాలీ చిత్రకారులు అవనీంద్రనాథ్ ఠాగూర్ గురుత్వాన చిత్ర రచన దేశీయపద్ధతిని సాగించారు. హేవెల్, పెర్సీబ్రౌన్, ఆనందకుమారస్వామి ఒక్కసారిగా భారతీయ చిత్రాల నిజస్వరూపాన్ని, ఔన్నత్యాన్ని తెలియజేసి విశేషంగా ప్రచారం చేశారు. స్వాతంత్ర్య సమర రంగంలో అంతకుముందే ముందడుగు వేసిన ఆంధ్రులు, తటాలున బెంగాలీ చిత్రకళను స్వీకరించారు. బందరు జాతీయ కళాశాల, ప్రమోదకుమార్ చటర్జీ గురుత్వాన ఎంతోమంది సృజనాత్మక చిత్రకారులను తయారు చేసింది. ఆ చిత్రాలలో తెలుగుతనం తొణికిసలాడేది. ''భారతి'' పత్రిక త్రివర్ణ చిత్రాలు ప్రచురించి తెలుగువారికి చిత్రకళలో అభిరుచిని ఎంతగానో యినుమడింపచేసింది. జాతీయ కళాశాల, శాంతినికేతనము

ఎంతోమంది తెలుగు ప్రముఖ చిత్రకారులను తయారు చేశాయి. వీరందరు జాతీయభావాలు గలవారు. ఎంతో కృషి చేశారు. నిత్యజీవితాన్ని ప్రతిబింబింపజేశారు తమ చిత్రాలలో. ఈ విధంగా కొంతకాలం సాగింది మన చిత్రకళ. జాతి మరల మేల్కొన్నది.

దేశీయ చిత్రకళయందు అభిమానం వుండవచ్చుగాని విదేశీ చిత్రకళను విసర్జించరాదు. క్షణక్షణం మారుతున్న ఈ ప్రపంచం ఎంతో దగ్గరవుతున్నది. ఉన్నకొద్దీ ఎన్నో విషయాలు మనం ఇతరుల నుండి నేర్చుకొంటున్నాము. ఈ యాంత్రిక యుగంలో ఏవొక్కదేశం యితర దేశపు అవసరం లేకుండ మనలేదు. చుట్టుపక్కల ఉన్న దేశాల్లో ఏం జరుగుతున్నదో తెలుసుకోవాలి - మంచిని తప్పక గ్రహించాలి.

అన్ని రంగాలలో మాదిరిగా మన చిత్రకారులు గూడా విదేశీ చిత్రకారులతో పోటీపడి కృషి చేస్తున్నారు. పశ్చిమదేశాలలో పుట్టిన ఆధునిక చిత్రకళ ఒక ప్రళయాన్ని లేపింది. నేడు అన్ని దేశాలలోను ఆధునిక చిత్రకళలో కృషి చేస్తున్నారు. అతి తీవ్ర భావాలను వ్యక్తపరచడానికి ఈ కళ ఎంతో వుపకరిస్తుంది. ''పికాసో ప్రపంచ ప్రసిద్ధి పొందిన ''గురినికా'' చిత్రంలో యుద్ధం విలయతాండవాన్ని, అతి ప్రతిభావంతంగా చిత్రీకరించాడు. అంత ఉద్రేకపూరితంగా, భావయుక్తంగా రణభీభత్సాన్ని సృష్టించడం ఆధునిక చిత్రకళలోనే వీలుపడింది. ఎన్నో ప్రసిద్ధ చిత్రములు ఎంతమందో చిత్రించారు. ''జాడ్కిన్'' అనే అతని శిల్పం రోటర్‌డామ్‌లో వున్నది. రెండవ ప్రపంచయుద్ధంలో శరీరంలోని గుండెను బాంబు తొలచివేసింది. ఆర్తనాదంతో చేతులెత్తి శాంతిని ఆశిస్తున్న మానవుని శిల్పం.

ఎందరో తెలుగు చిత్రకారులు ఆధునాతన చిత్రకళా రీతుల్లో కృషిచేస్తున్నారు. అయినా ఈ చిత్రకారులు, పద్ధతులు, వీటి వల్ల వ్యక్తమయ్యే భావాలు తెలుగు ప్రజలకు దూరంగానే వున్నాయి. తెలుగు ప్రజలస్థాయి యింకా రవివర్మ, జాతీయ కళాశాల, కనూదేశాయి చిత్రకారుల స్థాయిలోనే వుంది గనుక.

మరొక విషయం. ఒక ప్రసిద్ధ తెలుగు రచయిత యింట్లో నేను కనూదేశాయి చిత్రాల ఆల్బమ్ చూశాను. కళంటే అచ్చం అలా వుండాలని, అంతటి భావౌన్నత్యంగల చిత్రకారులు అరుదనిచెప్పి ఆయన ప్రతి చిత్రకారుని చిత్రాల్ని వాటితో పోల్చడం నాకు విచారం కలిగించింది - అంత విజ్ఞానవంతులకు యింత తక్కువ అభిరుచి చిత్రకళలో వున్నందుకు. నిజానికి కనూదేశాయి చిత్రాలు రేఖామార్దవంలో, లేత రంగుల్లో

చూడముచ్చటగా వుంటాయి. ఈయన చిత్రాలు ఆబాలగోపాలానికి సులువుగ అర్థం అవుతాయి. నిత్య జీవిత ఘట్టాలను, స్త్రీలలోని నాజూకుతనాన్ని, భావ చిత్రాల్ని ఎన్నో వయ్యారాలతో వంపులతో చిత్రిస్తాడు అందంగా. కాని నందలాల్‌బోసు, రెహమాన్ చుగతాయ్, గుర్రం మల్లయ్యగార్ల చిత్రాలముందు నిలువగలవా? వారి చిత్రాలముందు కనూదేశాయి చిత్రాలు ఎంతో పేలవంగా వుంటాయి. చవకగా చిత్రాల ఆల్బమ్‌లు ప్రింట్ చేసినందువల్ల ప్రజలలోకి ఎక్కువగా వచ్చాయి అతని చిత్రాలు. ఒకరిని ఒకరితో పోల్చిచూడడమే నా ముఖ్యోద్దేశం గాదు. ఎంతోమంది ప్రజ్ఞగల చిత్రకారులుంటే ఎవరిని గుర్తించక ఏ ఒక్కరిచిత్రాలనో అంటిపెట్టుకొని వున్న ప్రజలకు, ఎవరు ఎంత గొప్పో చూచాయగా తెలియచెప్పడం నా వుద్దేశ్యం. వివిధ చిత్రకారులు చిత్రించే పద్ధతులు బాగా అవగాహన కావడానికి, విరివిగా చిత్రకళా ప్రదర్శనలు చూడడం, విమర్శకుల, చిత్రకారుల అభిప్రాయాలు తెలిసికోవడం చాలా అవసరం. అప్పుడు ఏ చిత్రకారులు సృజనాత్మక చిత్రకారులో ప్రజలే గ్రహిస్తారు. ఈ విషయంలో ముఖ్యంగా ఆంధ్రులు ఉత్తరాదివారికన్నా చాలా వెనుకబడి ఉన్నారు. అజంతా, రాజపుత్ర, మొగలాయి, దక్కనీ శైలుల చిత్రాలు, లేపాక్షి, శాంతినికేతన పద్ధతి చిత్రాలు, బందరు జాతీయ కళాశాలలో అభివృద్ధి అయిన చిత్రపద్ధతులు, దామెర్ల రామారావుగారి చిత్రశైలి, పాశ్చాత్య పద్ధతిలో వేసిన వాస్తవ రూప చిత్రణలు, యిప్పుడు వస్తున్న ఆధునిక చిత్ర కళారీతులు, ప్రజలకు కొద్దిగానైనా తెలిసిన నాడు, వారే ఏవి చవకబారు చిత్రాలో, గ్రహించగలరు. దీనికై మన చిత్రకళా విమర్శకులు ఎంతైనా కృషి చెయ్యవలసి ఉన్నది. ఈమధ్య కొంతమంది ప్రముఖులు శ్రద్ధ తీసుకుంటున్నారు. కాని యిది చాలదు.

పాశ్చాత్య దేశాల్లో ఎన్నో విశ్వ విద్యాలయాలలో చిత్రకళ ప్రత్యేకంగా నేర్పబడు చున్నది. విద్యార్థులు చదివే పాఠ్య గ్రంథాలలో చిత్రకళకు గూడ ప్రాముఖ్యత ఉన్నది. యూనివర్శిటీ విద్య పూర్తిఅయ్యేవరకు చిత్రకళ గురించి తెలుసుకుంటూనే వుంటారు. అందువల్లనే ప్రజలకు అక్కడ చిత్ర, శిల్ప కళలందు అభిరుచి మెండు. చాల మంది ఇళ్ళలో ఒకటో రెండో చిత్రాలు వుంటాయట చిత్రకారుల వద్దనుండి కొన్నవి. అంటే చిత్రకారుని స్థితి ఇక్కడికంటె ఎంత మెరుగో బాగా అర్థం అవుతుంది. అక్కడ యూనివర్శిటీలు ఎంతో విలువైన చిత్ర శిల్ప కళలపై వచ్చే గ్రంథాలకు ధనసహాయం చేస్తాయి. యూనివర్శిటీలు ఎన్నో కళాఖండాలను కొని, స్వంత ఆర్ట్ గ్యాలరీలను ఏర్పాటు చేసి, మ్యూజియములు, యితర ఆర్ట్‌గ్యాలరీలతో పోటీపడతాయి. పెద్ద చిత్ర కారులకు పార్ట్‌టైమ్, ఫుల్‌టైమ్ ఉద్యోగాలుయిచ్చి సహాయపడతాయి. స్కాలర్‌షిప్పులిచ్చి యితర దేశ విద్యార్థులకు ఆ

యూనివర్శిటీలలో చదివి నేర్చుకునే అవకాశం కల్గిస్తాయి. ప్రముఖ దేశి విదేశీ చిత్రకళా విమర్శకులను పిలిచి తరచుగా కళలపై ఉపన్యాసాలిప్పించి, వాటిని పుస్తకరూపాన ప్రకటిస్తాయి. మన విశ్వవిద్యాలయాలు తలుచుకుంటే కళాభివృద్ధికి ఎంతో సహాయపడవచ్చును. ఈ విషయంలో మన రాష్ట్రంలోని మూడు ప్రముఖ విశ్వ విద్యాలయాలు కొంతైనా శ్రద్ధ తీసుకొని ముందడుగు వేయాలని ప్రతి కళాభిమాని ఉద్దేశ్యం. అవి ఖర్చుపెట్టే డబ్బులో, వీటిక్రింద అయేది ఏమంత లెక్కలో ఉండదు. మన యూనివర్శిటీలు చిత్రకళకు కనీసం యివ్వవలసిన ప్రాధాన్యతయిచ్చి, వస్తున్న యువతరం విద్యార్థులనైనా కళను ఆనందించేవిధంగా తయారు చెయ్యడం, తమ విధిగా భావించాలి. దేశ గౌరవం, శతాబ్దాలుగ నిలిచేది, కళాభివృద్ధి వలననే. ఈజిప్టు అంటే పిరమిడ్లు జ్ఞాపకం వస్తాయి. రోమ్ అంటే శిల్పాలు జ్ఞాపకం వస్తాయి. అలాగే మన దేశ సంస్కృతికి చిహ్నాలుగా నిలిచినవి అజంతా, తాజ్‌మహల్, ఎల్లోరా, ఎలిఫెంటా, అమరావతి, నాగార్జున కొండ, కోణార్క్, ఖజురహో, మౌంట్ అబూ, హలిబీడ్, రాజపుత్ర, మొగల్, దక్కనీ చిత్రశిల్ప కళలే,

పేరున్న చిత్రకారులు ఎంతోమంది వున్నారు ఆంధ్రదేశంలో. వీరందరు నడుంకట్టి, ప్రదర్శనాలు తరచుగా ఏర్పాటుచేసి, పత్రికా ముఖాన చిత్రకళపై వ్యాసాలను, చిత్రాలను ప్రచురించి ఉత్తేజాన్ని కలుగచేస్తే మన తెలుగుజాతి మేలుకుంటుంది. చిత్రకళకు మరలా ఒక నూత్నశకం ఆరంభం అవుతుంది. అది చెయ్యడానికి కళాభిమానులు, ప్రభుత్వం చేయూత నివ్వాలి. నిన్నగాక మొన్న ఉద్భవించిన ఆంధ్రప్రదేశ్ లలిత కళా ఎకాడమీ ప్రభుత్వ సహకారాన్ని పూర్తిగ పొందగలదని ఆశిద్దాం.

ఎందువల్లనో మన లలితకళా ఎకాడమి అంత సంతృప్తి కరంగాలేదు. ఉన్న సభ్యులను చూచి చాలమంది నిరుత్సాహపడ్డారు. సమర్థులైనవారిని చాలమందిని వదలివేశారు. ఏవిధంగా ఈ సభ్యుల నిర్ణయం జరిగిందో, ఎవరెవరి సలహాలతో సభ్యులుగా వారిని ఎన్నుకున్నారో, ప్రభుత్వానికి, బహుశః ఆ సభ్యులకు తప్ప మరెవరికి తెలియదు. సభ్యులుగా ఉండడానికి ఏ ఏ అర్హతలు వుండాలో సభ్యుల పేర్లను చూచిన తరువాత అర్థం కాలేదు. సహజంగా చిత్ర, శిల్ప కళల్లో బాగా తెలిసిన వారిని, చిత్రకారులు గానీయండి, విమర్శకులు గానీయండి మరెవ్వరైనా కళాభిమానుల్ని గానీయండి ఎకాడమీలో సభ్యులుగా వెయ్యడం జరుగుతుంది. ఇందులోని సభ్యులు చిత్రకారులో, విమర్శకులో, మరెవరో గూడా తెలియని విధంగా వుంది. ఏ విశేషంవల్ల వీరందరిని లలితకళా ఎకాడమీలో సభ్యులుగ ఎన్నుకున్నది తెలియలేదు. ఇద్దరు ముగ్గురు ఎన్నికైన సభ్యులే

నన్ను మిగిలిన మెంబర్లలో కొంతమందినిగురించి ''వీరు ఎవరు?'' అని అడిగారు, వారు చిత్రకారులా? విమర్శకులా? ఎవరని. పేర్లు వినడం గూడ అదే మొదటిసారి. మన ప్రభుత్వ లలిత కళా ఎకాడమీని గురించి ''లింక్'' పత్రికలో (28-5-1961) ప్రచురింపబడిన విషయం చదివితే సిగ్గుపడవలసి వస్తుంది! ఇంతకాలం ఏదో బ్రహ్మాండంగా వెలువడుతుంది ఎకాడమీ అనుకొని కండ్లు కాయలుకాచి, ఎదురు చూచిన వారికి ఆశాభంగం అయింది. విచిత్రమే మరి. సహృదయులు, ఎంతో జ్ఞానసంపన్నులు, కళా విషయాలలో అపారమైన అనుభవమున్నవారు, కేంద్ర లలిత కళా ఎకాడమీలో సభ్యులు అయిన శ్రీ యం. ఆర్. అప్పారావు గారు, ఆంధ్రులు గర్వంగా చెప్పుకునే విఖ్యాత చిత్రకారులు శ్రీ కె. శ్రీనివాసులు గారు, ప్రముఖ రచయితగా, చిత్రకారులుగా ఎంతో పేరుపొందిన శ్రీ మాధవపెద్ది గోఖలేగారు ఎకాడమీలో సభ్యులుగా లేరు. శ్రీ సంజీవదేవ్, శ్రీ గుర్రం మల్లయ్య యింకా కొద్దిమంది హేమాహేమీలను ఈ సభ్యుల పట్టికలో చేర్చినందుకు ఎంతో ఆనందం. వీరితోబాటు కొంతమంది ప్రముఖ చిత్రకారులు, విమర్శకులు, సభ్యులుగా ఉన్నందుకు సంతృప్తి కలిగింది. ఏవో లోపాలు కొద్దో గొప్పో వుండవచ్చు. మరచిపోవడం మంచిదని సర్దుకుపోవాలి. మన ఎకాడమీ చిత్రకారుల శ్రేయస్సుకు ఎంతో కృషి చేస్తుంది. సందేహంలేదు. మిగిలిన ప్రముఖ కళావేత్తలను గూడా జేర్చి, సభ్యుల సంఖ్యను విస్తృత పరచి, ప్రజా సహకారాన్ని, చిత్రకారుల సహకారాన్ని పూర్తిగాపొందేట్లుగ ఎకాడమి మారాలి. ఆ సుదినం అతి త్వరలోనే వస్తుందని ఆశిద్దాం. ఆలస్యమైనా అసలు ఎకాడమీ స్థాపించబడింది. ప్రభుత్వమే ఎకాడమీ పెట్టడంవల్ల ధన సహాయం పుష్కలంగా లభిస్తుంది. ముఖ్యంగా ఎకాడమీ ఆశయాలను ఆర్థిక బాధ అంతగా బాధించక పోవచ్చును. ఎకాడమీ చిత్ర, శిల్ప కళా విషయాలను బహుళ ప్రచారంలోకి తేవాలి. ముందుగా యూనివర్శిటీలను కలుపుకొని, చిత్రకారులకు సముచిత స్థానాల్ని యిచ్చేట్టు చూడాలి. ప్రజలకు, కళాకారులకు సన్నిహిత సంబంధం పెంపొందించాలి. అప్పుడే వారు తమ తమ భావాల్ని పంచుకోవడం జరుగుతుంది. ఇది ఇటు చిత్రకారులకు అటు ప్రజలకు దోహదం చేస్తుంది. కళాభివృద్ధికి ముఖ్యంగా అవకాశం కలుగచేయవలసింది ఎకాడమీ. ఇది చేయాలి, అది చేయాలి అని పదే పదే చెప్పనక్కర లేకుండానే జయప్రదంగా మన ఆంధ్ర లలితకళా ఎకాడమీ సాగాలని ప్రార్థిద్దాం.

*(భారతి అక్టోబర్ 1961)*

★



# జానపద చిత్రకళ

కళ మన దేశములో ప్రతి వొక్క చిత్రకారుని పనిలో ఏదో ఒక రూపాన కనిపిస్తున్నది. ఆయా పరిసర ప్రాంతములను బట్టి, ఆ ప్రాంత ప్రజల జీవిత వైవిధ్యాన్ని బట్టి పలురకములుగ మారుతూ అభివృద్ధి చెందుతుంది. గ్రామములలో నివసించు ప్రజల నుండి అభివృద్ధి గాంచిన ఈ కళ, ''జానపదచిత్రకళ'' అని పిలువబడుచున్నది.

జానపద చిత్రకళ ప్రాంతమున కొక రీతిగ సర్వశోభలతో, వివిధ రూపములతో దేశములోని ప్రతి ప్రాంతమందు అభివృద్ధి గాంచినది. ఎందరో ఈ జానపద చిత్ర కళను జీవనోపాధిగా వుంచుకొని తరతరముల నుండి దాని మీదనే బ్రతుకుచు ఈ చిత్ర కళను అభివృద్ధి పరచిరి.

దేశవ్యాప్తముగ ప్రచారమైన ''తోలు బొమ్మలు'' జానపద చిత్రకళకు చెందినవి. కాని కొందరు ఈ తోలుబొమ్మలు మొదట మహారాష్ట్ర దేశమున పుట్టినవని, దానికి అచ్చట ఆదరణ లేక ఆంధ్రకు ప్రాకినవని చెప్పుదురు.

కాని ఈ తోలు బొమ్మలు శాతవాహనుల కాలము నుండి ప్రచారములో నున్నవి. అందుకు చాల నిదర్శనములుగలవు. ఆంధ్రులు కళాపిపాసకులగుటచే దానిని ఆద్యంతము భావములతో, రూపములతో, కౌశలముతో, జాతీయతను మేళవించి అభివృద్ధి పరచిరి. తరువాత తమిళనాడుకు, కేరళకు అందచేసిరి. పిమ్మట చైనా, ఇండోనేషియా, జావా, బోర్నియో, సుమిత్ర మొదలగు ఇతర దేశములకు ప్రాకి ప్రపంచ ప్రసిద్ధి పొందినది. దేశపు మత, సాంఘిక, సాంస్కృతిక సంప్రదాయములతో సంబంధము కల్గి అభివృద్ధి పొందినది. దేశములో ఎన్ని భాషలున్నవో అన్ని రకములుగా ఆయా ప్రజల మనోచేష్టలను ప్రతిబింబించినవి తోలు బొమ్మలు. చదువు సంధ్యలు లేని నిష్కల్మషులైన బీద గ్రామీణ ప్రజలచే చేయబడి, ప్రాగ్దేశీయుల సిద్ధాంతముల కనుగుణముగ, అతి నిరాడంబరముగ, ఆహ్లాద కరముగ, ప్రతి వారికి అర్థమగు రీతిన, చేతితో చేయబడిన

పిల్లల ఆట వస్తువులు, మట్టికుండలు, తోలుబొమ్మలు, భగవంతుని రూపములు గల పేడతో చేసిన బొమ్మలు, అద్దకములు ఈ జానపద చిత్ర కళకు ఆటపట్టులు. జాతరలు, సంతలు, వుత్సవములలో వీని స్థానము గమనార్హము. ముఖ్యముగ ''కొండపల్లి బొమ్మలు'' మన ఆంధ్రదేశ కళా కౌశలమును చాటుచున్నవి. పాశ్చాత్య దేశములలో వీటికి వున్న విలువ, ఆదరము మన దేశమందు లేకపోవుట విచారకరము. ఒక విధముగ చూచిన, పుట్టిన ప్రతిపాపకు దేశీయతను, ఈ బొమ్మల, చిత్రముల ద్వారా నేర్పుటకే ఇవి తయారు చేయబడిన వనిపించును. గ్రామ ప్రజల నిజాయితీ, నిష్కల్మషత్వము, పట్టుదల, సులభశైలిని పుణికి పుచ్చుకొన్నది. జానపద చిత్ర కళ పరుగిడు బలిష్టమైన రేఖా విన్యాసముతో, ప్రకాశ వంతమైన రంగులు, వర్ణమిశ్రమము కల్గి కళాత్మక జిజ్ఞాసను రేకెత్తించును.

ఈ జానపద చిత్రకళను నీటి రంగులలోను, పోస్టరు రంగులలోను చిత్రించెదరు. చిత్రకారుని వుద్దేశమును వెంటనే సూటిగా చెప్పగలుగు శక్తి ఈ రంగులకు వుండుటయే యిందుకు కారణము. సాధ్యమైనంత తక్కువ రంగులు, వర్ణమిశ్రమము చేసి చిత్రింతురు. పాశ్చాత్యులవలె వెలుగునీడలను పాటించక సూటిగ రంగులలో చిత్రింతురు, దూరము, ఎత్తు పల్లములు చిత్రములో కన్పించక, గుడ్డపైన అద్దకమువలె చిత్రములను సరాసరిగా చిత్రింతురు. భావ, రసములను జానపద చిత్ర కళ ద్వారా వ్యక్తీకరించుట సులభము.

ఈ సందర్భంలో ఉత్తర దక్షిణ భారతదేశముల జానపద చిత్రకళలను వెలికి తెచ్చిన మహామహుల చిత్ర రచనా రీతుల గురించి వ్రాయుట అనుచితంకాబోదు.

భారతదేశములో జానపద చిత్రకళను పైకి తెచ్చి దానికి విశిష్టస్థానమును కల్పించినది జామినీరాయ్. ఆయన మొదటి మార్గదర్శకుడు. జీవితమంతా జానపద చిత్ర కళలోనే సాధన చేసినారు. ఆయన చిత్రకళకు మూలము బెంగాలీ పటచిత్రములు, కాళీఘట పటములు. జానపద చిత్రకారులు వారి వారి వ్యక్తిత్వమును నిలుపుకొని వారి ప్రాంతపు పూర్వీకుల కళను అవగాహన చేసుకొని, కృషిచేసి సాధించినదేకాని మరేమీకాదు.

ఇప్పటికీ కొంతమంది విమర్శకులు జానపద చిత్రకళను పాతకాలపు దనియు, భావములను ప్రదర్శించుటకు వీలుపడదనియు, సిద్ధాంతములు కట్టుబాట్లు లేక ఏమియు తెలియని పల్లెటూరువారు కాలక్షేపము కొరకు వేసెడి కళయనియు, దానికింత ప్రచారము యిచ్చుట తగదని అభిప్రాయపడుచున్నారు. ఈ జానపద చిత్రకళను చౌకబారుదానిగా చూచి గ్రహింపజాలకున్నారు. వారి అభిప్రాయము మార్చుకొనుటకు

ఒక నిదర్శనము చాలును. ఇప్పుడు మన దేశములోని పెద్ద ఆర్టిస్టులలో ఒకరైన సుధీర్ కస్తగిర్ ప్రపంచ ప్రసిద్ధిగాంచిన చిత్రకారుడు, శిల్పకారుడు అయిన ఎరిక్‌జిల్ అను చిత్రకారుని కలుసుకొనగా, ఆయన మన దేశీయులు వేసిన కాళీఘట్ పఠము ఒకటి చూపి ''మీ దేశీయ చిత్రకారులు యిటువంటి గొప్ప చిత్రరచన చేసిరి. మీ 'యిండియన్స్'కు మేము ఏమి నేర్పగలము?'' అని ప్రశ్నించెను. ఇంతకంటె వేరు నిదర్శనము ఈ జానపద చిత్రకళను గురించి ఏమి కావలెను? పారిస్ చిత్రప్రభావము పూర్తిగా ఆవరించిన మన కండ్లకు, మన చిత్రముల విలువ మనకు తెలియక పోవచ్చును. కాని ఇతర దేశీయులు వీటి విలువ గ్రహించి మన చిత్రములను, శిల్పములను మ్యూజియములలో వజ్ర వైడూర్యములకన్న విలువగా భద్రపరచిరి. గౌతమ బుద్ధుడు ఈ జానపద చిత్రములను మెచ్చుకొనినట్లు నిదర్శనములు గలవు. బుద్ధఘోషుడు 1వ శతాబ్దములో వీని మీద సవిమర్శ చేసినాడు. కాళిదాసు, భవభూతి, విశాఖదత్త వంటి మహాపండితులు వారి రచనలలో ఈ జానపద చిత్రకళకు చోటిచ్చి ఆదరించినారు.

ఈనాటి ఆధునిక చిత్రకారులు రంగులు వాడుటయందును, కాంపోజిషన్‌లోను, భావమును సూటిగా చెప్పుటకు కావలసిన ప్రతివిషయము నందును ఈ జానపద చిత్రకళనే దోహదముగా తీసుకొనుచున్నారు. అధునాతన చిత్రకళకు అతి ప్రధానమైన సిద్ధాంతములలో ముఖ్యమైనది సాధ్యమైనన్ని తక్కువ రంగులు వాడుట, భావమును సూటిగా తెలియచెప్పుటకు కంటికి కనుపించు బాహ్యరూపమును విరిచి భావానుగుణముగ ఏర్పరచుట.

ఒక్క మాటలో చెప్పవలెనన్న ముఖ్యముగ ఈనాటి మన దేశపు చిత్రకారులందరిలో జానపద చిత్రకళ ప్రభావము మూడువంతులు కనిపించుచున్నది. జానపద చిత్రకళకు గల స్వచ్ఛత, సంపూర్ణత, సౌందర్యములే ఈ కళ యింత కాలం నిలబడుటకు మూలము. ఈ చిత్రములలోని మాధుర్యము, సూక్ష్మత చిత్రకారుని హృదయమునుండి, మనసు నుండి వచ్చినవేకాని పాశ్చాత్య చిత్రకళవలె యాంత్రికమైనదికాదు. అపూర్వకళ ఇది. హిందు దేశపు జాతీయతను, పూర్వ ఔన్నత్యమును, సంప్రదాయములను జీవన విధానములను ప్రతిబింబించు ఈ జానపద చిత్రకళ మన గౌరవమును దేశదేశముల వేనోళ్ళ చాటుచున్నది.

*(భారతి : 1961)*

★



# జా మి నీ రా య్

కళ గురించి ఆలోచిస్తే రెండు రకాల అభిప్రాయాలు ముందుకు వస్తాయి. కళ సంఘంకోసరమని, కళ కళకోసమేనని. కళారంగంలో ఈరెండు విభిన్న దృక్పథాల వాదాలు నేటికీ వెంటాడుతూనే వున్నాయి. ఈ రెంటిలో ఏది సరియైనదో ఖచ్చితంగా నిర్ణయించలేకపోయారు విజ్ఞానులు, తార్కికులు. సగంమంది ఒక వైపు, సగంమంది మరియొకవైపు ఉండటంవల్ల తెగేసమస్య గాకుండా పోయింది. కళ కళకోసరమే అయితేగానీ కళ ఉత్కృష్టస్థాయికి పోదని చాలమంది అభిప్రాయం. కళ సంఘం కోసరమయితే కళ ఎప్పుడూ మామూలు మనిషి స్థాయిలోనే వుంటుంది. ఉన్నత స్థాయికి పోదు. నిజానికి కళ ఎప్పుడూ సంఘానికి మూడడుగులు ముందే వుంటుంది నడకలో. సంఘమే ప్రయత్నించి అందుకుంటుంది. అలా అందుకునే ప్రయత్నంలోనే అది విజ్ఞాన వంతం అవుతుంది. ఇక రెండో అభిప్రాయం, సామాన్య మానవుని స్థాయికి దిగి అతన్ని ఉన్నత స్థాయికి తీసికొనిపోవడమే కళ కర్తవ్యం అనేది. లేకపోతే కళకు, సంఘానికి మధ్య పెద్ద అఘాత మేర్పడుతుంది.

జానపద కళల్లో ఆయాదేశాల, ప్రజల సంస్కృతి, అభిరుచులు సువ్యక్తమవుతాయి సూటిగా. ఈ కళ పుట్టి పెరిగింది గ్రామాల్లో, గ్రామీణులు తమ ఆనందాన్ని, భావాల్ని, భక్తిని, భయాన్ని బహుకొద్ది రంగుల్లో ఎలాతోస్తే అలా వ్యక్తపరచారు చిత్రాల్లో, బొమ్మల్లో. కళ కోసరమై పనిపెట్టుకొని చేసిందేమీ లేదు. అవసరానికి పనికివచ్చే వస్తువుల్నే అందంగా, వారికి తట్టిన నాజూకుతనంతో, సుందరమయం చేసారు. బెంగాల్ పట్ వర్ణ చిత్రాలు, కాళికాదేవి మట్టి బొమ్మలు, మన తిరుపతి కొయ్యబొమ్మలు, బందరు కలంకారి వస్త్రాలు, ఒరిస్సా జగన్నాథుని చిత్రాలు, మహారాష్ట్రుల, ఆంధ్రుల తోలుబొమ్మలు, తంజావూరు చిత్రపటాలు చూస్తే తెలుస్తుంది జానపదుల పనితనం, వారి మోటైన నాజూకుతనం. బహుకొద్ది రంగుల్లో ఎన్నో డిజైనులు, లతలు, పువ్వులు చిత్రిస్తారు. తిరునాళ్ళల్లో

తయారుచేసి అమ్మే మట్టి, పేడ బొమ్మలు ఎంతో ముచ్చటగా వుంటాయి. దేవుని విగ్రహాలు చూస్తే, ఎంత భక్తి ప్రపత్తులతో తయారుచేశారో తెలుస్తుంది. అలా ఈ జానపదకళ పల్లె వాతావరణానికి చుట్టుకొని వుండి అభివృద్ధి అయిందేగాని, పట్టణాల్లో నాగరికులైన చిత్రకారులవల్ల కానేకాదు. పల్లెటూరివారు సరదాగానూ, కొంతమంది వృత్తిగా పెట్టుకొనీ అభివృద్ధి పరచిందే ఈ జానపద చిత్రకళ.

భారతదేశ కీర్తి నలుదిశల విస్తరింపచేసిన జానపద చిత్రకారుడు జామినీరాయ్. భారతీయ చిత్రకళలో ఆయన ఒక మైలురాయి. జామినీరాయ్ చిత్రాన్ని ఇద్దరు చూస్తే, ఇద్దరికి రెండు వేరు వేరు అభిప్రాయాలు కలుగుతాయి. ఒకరు భారతదేశ చిత్రకారుల్లో అత్యంత ప్రతిభాశాలి, మహామేధావి, సాహసిగా లెక్కవేస్తే, రెండవవారు జానపదులు ఏనాడో వేసిన చిత్రాలకు నకళ్ళు తయారుచేసే అతి సాధారణ, చవుకబారు చిత్రకారుడుగ పరిగణిస్తారు. ఇలా విభిన్న కోణాల్లో చిక్కుకున్న వ్యక్తిని గురించి బెవర్లీనికలస్ సంవత్సరంపాటు భారత దేశమంతా తిరిగి ఎన్నో చిత్రాలు చూసి, ఎంతోమంది చిత్రకారుల్ని కలిసినమీదట ''భారతదేశంలో గొప్ప చిత్రకారులను గురించి చెప్పాలంటే ఒక్క జామినీరాయ్‌ను గురించే చెప్పాలి'' అన్నారు.

రష్యా నుండి ఇటీవల వచ్చిన సాంస్కృతిక సంఘ సభ్యులు గూడ రాయ్ చిత్రాలు చూచి, భారతీయ జానపద చిత్రకళాశైలిని మూడుమూర్తుల ప్రతిబింబింపచేస్తున్న చిత్రకారుడన్నారు.

శ్రీ సంజీవదేవ్‌గారు ''జామినీరాయ్ చిత్రాల్లోని విషయవస్తువులోకాని, ప్రక్రియలో కాని, రూపసృష్టిలోకాని, ఊహాపుష్టిలోకాని నాకేమాత్రం లోతు, లావణ్యం కనుపించదు. ఆయనది కేవలం జానపదచిత్రకళ మాత్రమే కాని Modernist చిత్రకళ కాదు'' అన్నారు.

Illustrated Weekly ఎడిటరుగారైన శ్రీ ఎ. ఎస్. రామన్ ''జామినీరాయ్ కౌశలం అద్భుతం అనడంలో సందేహంలేదు. కాని విమర్శనాదృష్టితో తీక్ష్ణంగా చూచినట్లయితే తెలుస్తుంది ఆయన చిత్రకళలోని శూన్యం. బెంగాల్ జానపదచిత్రకళకు కార్బన్ కాపీలాంటిది రాయ్ చిత్రకళ'' అని నిరశించాడు. ఇలా విరుద్ధ విమర్శనాశక్తుల మధ్య నిలచి, చిత్రకారుడుగ విజయం సాధించిన వ్యక్తి ఎంత గట్టివాడో ఊహించగలం.

జామినీరాయ్ ఉండేది కలకత్తాలో బహు జనసమర్దమైనచోట. ఇరుకు సందుల్లోంచి, జనసమూహం మధ్యనుండి వెళ్తే వస్తుంది ఆయన యిల్లు. అదే రాయ్ నివసించేదీ, చిత్రించే స్థలమూ గూడ. భారతీయ చిత్రకారులు వారువుండే ఇంట్లోనే ఒక గదిలో

చిత్రరచన సాగిస్తారు. ప్రత్యేకంగా చిత్రరచనకు వేరే ఇల్లు వుండదు. కాని పాశ్చాత్యులు చాలమంది సంసారంతో వుండేది ఒకచోట, చిత్రరచన చేసేది మరొకచోట. సాంసారిక వాతావరణానికి సుదూరంగా వుండి చిత్రిస్తారు ఏకాంతంగా, ప్రశాంతంగా. మనకు, వారికి గల ఈ తేడా ఆర్థిక కారణాలే అనుకుంటా. వచ్చిన కళాపిపాసకుల్ని రాయ్ ఎంతో ఆదరంతో, ముకుళిత హస్తాలతో, గుమ్మం దగ్గరే యెదురై లోనికి తీసుకొని వెళ్ళారు. గోడలకు తగిలించిన ఎన్నో చిత్రాలు వెలుగును సృష్టిస్తూ, ప్రకాశిస్తుంటాయి, ముదురు రంగుల్లో. సిగ్గుతో ముడుచుకొన్న కండ్లతో పిలిచే పల్లెటూరి భామలు, రాధాకృష్ణులు, శివపార్వతులు, శిష్ట వైష్ణవబ్రాహ్మణులు, రామాయణ, భాగవతాలలోని ఘట్టాల చిత్రాలు, క్రీస్తుమతసంబంధ చిత్రాలు ఎన్నో యింటి గోడలనిండా, ఒక మూల దొంతర్లగా వుంటాయి. రాయ్ చూపిస్తున్న చిత్రాలు చూస్తూ, ఆయనవైపు ఒకసారి చూస్తే తెలుస్తుంది చిత్రకారుని నిశ్చలత, దృఢనిశ్చయం, గాంభీర్యం. పొడవైన నిండు విగ్రహం, గుండ్రని ముఖం, బలమైన అవయవాలు, వయసుతో పండిన రంగులో వుంటాయి. నెరసిన జుట్టు, సుమారు డెబ్బదిరెండుయేండ్ల రాయ్‌కి, ఒక ప్రత్యేకశోభ చేకూర్చింది. ఎంత గొప్ప చిత్రకారుడో అంత నిరాడంబరజీవి, అంత మితభాషి.

బంకురా జిల్లా యందలి చెలియతోర్ గ్రామంలో జన్మించాడు రాయ్. ఆ గ్రామంలో కుమ్మరులు చేసే కుండలు, బొమ్మలు, వాటికి వేసే రంగులు ఎంతో ఆకర్షించాయి. చిన్నప్పటి నుండి వారితో తిరిగి మట్టిబొమ్మలు వారిలా చేస్తూ, రంగులు వేస్తుండేవాడు. రాయ్ తండ్రి, కొడుకుకు గల కళాభిలాషను గ్రహించి కలకత్తాలోని స్కూల్ఆఫ్ ఆర్ట్స్‌లో చేర్పించాడు. ఎంతో శ్రద్ధతో చిత్రకళ నేర్చుకొని పట్టుదల గలవాడనిపించుకున్నాడు. రూపచిత్రాలు వెయ్యడంలో దిట్ట. ఎంతోమంది రూపచిత్రాలు వేసి డబ్బు, కీర్తి గడించాడు. ఆ రోజుల్లోని రాయ్ చిత్రాలు అమెరికన్ చిత్రకారుడు 'విజ్‌లర్' చిత్రాలకు దగ్గరగా వుండేవి. దృశ్యచిత్రాలను, అవనీంద్ర నాధటాగూర్ గురుత్వాన వర్ధిల్లిన బెంగాల్ చిత్రకళా పద్ధతుల్లోనూ విరివిగా చిత్రాలు వేస్తూ వుండేవాడు. తైలవర్ణాల్లో, నీటి రంగుల్లో, వివిధ రకాల ప్రయోగాలూ చేస్తుండడం మొదటి నుండి అలవాటు. వాన్‌గో, గోగాన్‌ల ప్రభావం రాయ్ చిత్రాలమీద ఉండేది. రాయ్ విచిత్రమైన వ్యక్తి. అందరి చిత్రకారుల్లా దేశం తిరిగిచూచిన మనిషిగాదు - అంతగా చదువుకున్నవాడు గాదు. కలకత్తా నగరమే ఆయనకు ప్రపంచం. అక్కడి జనసమ్మర్దమే రాయ్‌కి అనుభూతుల్ని, అనుభవాల్ని అందజేస్తుంది.

ఇన్నిరకాలుగా చిత్రించినా రాయ్ హృదయాంతరాళాల్లో తన చిన్నతనంలోని మట్టిబొమ్మలు, చిత్రాలు మెదుల్తూనే వున్నాయి. ఏదో చిత్రిస్తున్నాడేగాని ధ్యాస లేదు. ఏదో సంపాదిస్తున్నాడేగాని ఆత్మసంతృప్తిలేదు. అశాంతితో అలానే బ్రతుకుతున్నాడు. ఒక్కసారిగా ఏదో మార్పు వచ్చింది రాయ్‌లో. తను సాధించదలుచుకున్నదానికి తను వేస్తున్న పద్ధతులు పనికిరావని గ్రహించాడు. తన చిన్నతనంలో చేసిన, వేసిన పద్ధతికి వెళ్ళాడు. అప్పటివరకు నేర్చిన చిత్రకళా కౌశలంతో, ఆనాటి జానపద చిత్రకళే తన మార్గంగా నమ్మి, ప్రస్తుతం ప్రచారంలో వున్న చిత్రకళా పద్ధతులను, చిత్రకారులను వదిలివేసి, తీవ్రమైన కృషిపెట్టాడు ఒక్కడే. అంత పేరున్న చిత్రకారుడు, పెద్దగా ఆర్జిస్తున్న వ్యక్తి అన్నీ వదలి, భవిష్యత్తు లేని అయోమయ జానపదకళలోనికి వెళ్ళడం, ఎవరూ నమ్మలేని విషయం. అదే ఆయనలోని విశేషం. తనకు ఏది తోస్తే అది సాధించేంతవరకు నిద్రపోనిరకం రాయ్. కొంతమంది ఆధునాతన పాశ్చాత్య చిత్రకారులు 'అల్టామిరా' గుహ చిత్రకళా పద్ధతులకు వెళ్ళారు, రాయ్ బెంగాలీ జానపదచిత్రకళ వద్దకు వెళ్ళినట్లుగ. దీన్ని వివరిస్తూ శ్రీ బిష్ణూడే, జాన్ ఇర్విన్‌లు ''ఎవరో క్రొత్త వారు జానపదకళ నుండి ఏదో గ్రహించేందుకు ఆ కళను సమీపించినట్లుగాగాక, జానపద సంప్రదాయాన్ని క్షుణ్ణంగా అవగాహన చేసుకొని జీర్ణించుకున్నవానిలా తిరిగి వెళ్లాడు రాయ్'' అన్నారు.

అవును నిజంగా ఆయన అలానే సమీపించారు జానపద చిత్రకళను. చిన్నతనంలో తను జానపద చిత్రకారుల్తో కలిసిపోయి నేర్చుకున్న చిత్రకళలోని వర్ణమాధుర్యం, రేఖావిన్యాసంలోనికి వెళ్ళడం ఆయనకు అతిసహజం. అందుకే రాయ్‌కి, కొంతమంది ప్రఖ్యాత భారతీయచిత్రకారుల మాదిరిగా, పాశ్చాత్య చిత్రకారులైన డెరైన్, మథీస్‌ల పద్ధతులవద్దకు వెళ్ళవలసిన అగత్యం లేకపోయింది, జానపద చిత్రకళా నైర్మల్యాన్ని పట్టుకుంటానికి.

జామినీ రాయ్‌కి జానపద చిత్రకళలో శాంతి లభించింది. తలచిన భావాన్ని వెంటనే అతి కొద్దిరంగుల్లో, బలమైన రేఖల్లో చెప్పడం అలవడింది. ఈ సాధనకు టెంపరా వర్ణ పద్ధతి ( ధవళ వర్ణమిశ్రమ విధాన పద్ధతి) ఎంతగానో ఉపకరించింది. జానపదులు భగవంతుని చిత్రాలు వేయాలంటే, గ్రంథాలలోని రూపలక్షణ వివరాలకై అంతగా బాధపడరు. ఎలా ఊహిస్తే అలా నిండైన మనస్సుతో, భక్తితో చిత్రిస్తారు. హనుమంతుణ్ణి చిత్రిస్తే ఆయన్ని ఎంతో గంభీరంగాను, చిత్రములో ఉన్న ఇతర రూపాలకంటే పెద్దదిగాను చిత్రిస్తారు. వారి దృష్టిలో భగవంతుడు సర్వ చరాచర ప్రాణికోటికంటే ఉన్నతమైనవాడు.

అందుకే అలా చిత్రిస్తారు. హనుమంతుడు హిమాలయ పర్వతాల వద్ద ఉన్నా సరే హిమాలయాల్ని చిన్నవిగా చేసి, హనుమంతుణ్ణి పెద్దగానే గాంభీర్యంగా చిత్రిస్తారు. ఇక్కడ వస్తు గుణాలకు, రూప భేదాలకు తారతమ్యం లేదు. వారి మనో దృష్టికి అందిందే కళ. అందుకే అది అంత స్వచ్ఛమైంది. పవిత్రమైంది.

రాయ్ చిత్రకళను సమీక్షిస్తూ శ్రీ ముల్కరాజ్ ఆనంద్‌గారు ''భారతీయ తత్వం, తంత్రాలలోని నిబిడీకృత జీవాన్ని ఒకవైపు, నేటి మధ్యతరగతి ప్రజా జీవితాన్నంటి పెట్టుకున్న మనో వైకల్యం, ఆకలి, క్రూరత్వం, బాధల్ని, రెండవవైపున అధిగమించి, తన భావాల్ని, అనుభవాల్ని మనో దృశ్యాల్ని విడమర్చి ఈ దృశ్య సంబంధమైన చిత్రకళలో చెప్పడంలోనే వుంది రాయ్ ప్రజ్ఞ'' అన్నారు. మరుగుపడిన జానపద కళలోని ఔన్నత్యాన్ని వెలికితీసి, ప్రాణప్రతిష్ట చేయడంలోనే వుంది రాయ్ గొప్పతనం. దేశంలో ఎంతోమంది విజ్ఞుల, విమర్శలకు గురియైనా రాయ్ చిత్రకళ విజయం పొందింది. ధనం ఆర్జించింది. ఎంతో మంది చిత్రకారుల్ని ఆకర్షించింది ఆయన మార్గదర్శకత్వంలో జానపద చిత్రకళ అంటే జామినీరాయ్‌కి మారుపేరు అయ్యింది. వారి చిత్రాలు కొన్నంతగా ఏ చిత్రాకారుని చిత్రాలు భారతీయులు, పాశ్చాత్యులు కొని వుండరు.

జామినీరాయ్‌కి రెండవ ప్రపంచయుద్ధం ఎంతో కీర్తిని, ధనాన్ని ఆర్జించిపెట్టింది. కలకత్తాకు వచ్చిన విదేశీ సైనికులు నూత్నంగావున్న ఈ చిత్రాల్ని విరివిగా, వేలంవెర్రిగా కొన్నారు. అప్పటి బెంగాల్ గవర్నరుకు రాయ్ చిత్రాలంటే పిచ్చి. ఎన్నో చిత్రాలు కొని తన స్నేహితులతో కొనిపించాడు. ఇంగ్లండులో రాయ్ చిత్రాల ప్రదర్శన ఏర్పాటు చేయించాడు. అదే రాయ్ జీవితంలో పెద్దమార్పు తెచ్చింది. అక్కడి ప్రదర్శన విజయం కావడంతో ప్రపంచ ఖ్యాతి వచ్చింది. ఈనాడు ఎన్నో దేశాలలో రాయ్ చిత్రాలున్నాయి.

తన చిత్రాలకు పేరు ప్రఖ్యాతులు పెరుగుతున్నకొద్దీ ధరలు పెంచటానికిబదులు తగ్గించాడు. దానితో మధ్య తరగతి ప్రజలు సహితం కొనడం ప్రారంభించారు. బహుశ ప్రజల అందుబాటులోకి తనచిత్రాలు రావడం రాయ్‌కి ఎంతో ఆత్మసంతృప్తి ఇచ్చి వుండవచ్చు. ఇలా సృజనాత్మక చిత్రకళని ప్రజల్లోకి తీసికొని వచ్చిన చిత్రకారుడు ఈయన ఒక్కడే. ఒక్కొక్క చిత్రాన్ని షుమారు రూ. 75 లకు గూడా అమ్మితాడు అంత ప్రసిద్ధ చిత్రకారుడు. అంత చవుకగా చిత్రాలను అమ్మేవారు భారతదేశంలో ఏ చిత్రకారుడు లేడు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని చూస్తే, జామినీరాయ్ వ్యాపార సరళి తెలిసిన దిట్టగూడ అనిపిస్తుంది. [illegible]లకంటే కొనేవారు

A.C. No. 83863

ఎక్కువ ఉండడంవల్ల, లోగడ వేసిన వాటినే మరల మరల చిత్రిస్తుంటాడు. అక్కడికి చిత్రాలు కొనేవారి సంఖ్యకు తట్టుకోలేక, కొడుకులు తనలాగే చిత్రించిన వాటిమీద సంతకం చేసి ఆయన వేసినవిగ అమ్ముతాడు. ఈ విధంగా కుటీర పరిశ్రమ క్రిందకు దింపాడు తన కళని రాయ్. ఈ పద్ధతివల్ల ఆయనకు చిత్రకారుల్లోను, విమర్శకుల్లోను ఎంతో చెడుపేరు వచ్చింది. A.S. రామన్ బాహాటంగా తన ప్రఖ్యాత Illustrated Weekly లో ఈసంగతి వ్రాయటం గూడ జరిగింది.

వేసిన చిత్రాలనే మరల మరల వేసి అమ్మడం ఏమంత క్రొత్తవిషయం కాదు. ప్రసిద్ధ చిత్రకారుడు టిషియన్ (Titan) గూడ అలాగే చేసేవాడు. ఇప్పుడు చిత్రాలకు, వుడ్‌కట్స్, లినోకట్స్‌కు పాశ్చాత్య దేశాలలో ప్రింట్సు పరిమితంగా తీసి అమ్ముతారు, చాల ఎక్కువ ధరలకు. తరువాత అసలు చిత్రాన్ని ధ్వంసం చేస్తారు. యూరప్‌లో ఉన్న మన ప్రసిద్ధ తెలుగుచిత్రకారుడు కృష్ణారెడ్డిగూడా అలాగే చేస్తాడు. ఆయనే తన చిత్రాలకు ప్రింట్సు బహుపరిమితంగా తీసి ఇండియాలో పలుచోట్ల ప్రదర్శనలలో అమ్మారు. బొంబాయి లోని ప్రముఖ చిత్రాకారుడు అల్మేల్కర్, ఒకే చిత్రాన్ని రెండుమూడు సార్లు వేసి, ఇద్దరు ముగ్గురికి ఒరిజినల్ చిత్రం యిది ఒక్కటే వేశానని చెప్పి, అమ్మాడు. ఒక రోజున అలా కొన్నవాళ్ళు ఒకరింట్లో ఒకరు ఆ చిత్రాల్ని చూచుకొని, తెల్లమొఖం వేశారు. వారు మద్రాసు వచ్చి నా దగ్గర గూడా కొన్ని చిత్రాలు కొనడం జరిగింది. ఈ సంగతి వారు చెప్పితే ఆశ్చర్యమేసింది. కృష్ణారెడ్డి, జామినీరాయ్ అలా చెయ్యరు. కొనేవాళ్ళు ఇష్టపడితే కొంటారు లేకపోతే లేదు. రాయ్ వద్దకు వచ్చి, కొనేవాళ్ళు, ఆయన లోగడ వేసిన చిత్రాలమాదిరివి మరల వేసిమ్మని అడిగి వేయించుకుంటారు. ఇది తప్పాకాదా అనేది మనం చూచే కోణాన్నిబట్టి ఉంటుంది.

విచిత్రమైన విషయమేమంటే రాయ్ దాదాపు చిత్రకళా ప్రదర్శనలకు చిత్రాలు పంపడనే చెప్పాలి. ఆయన ఇల్లే చిత్రకళా ప్రదర్శనశాల. కొనదలచుకున్నవాళ్ళు రాయ్ ఇంటికే వెళ్ళి కొంటారు. ఆయన బెంగాలీ వాడవడం అదృష్టం. దేశంలో అన్ని భాషల్లో, అన్నిచోట్ల ఎన్నో వ్యాసాలు, చిత్రాలు ప్రచురణలు జరిగాయి. ప్రముఖ విమర్శకులు ఆయన్ని గురించి ప్రచారంచేశారు కొంతమంది గొప్పవాడని, కొంతమంది నమూనాలు తీసే యంత్రమని. చిలికి చిలికి గాలివాన అయినట్లు బ్రహ్మాండమైన కూర్చున్నాడు రాయ్. దాదాపు అంతగొప్పవాడైనా, మన తెలుగు చిత్రకారుడు శ్రీ కె. శ్రీనివాసులుకు అలా జరుగలేదు. అది శ్రీనివాసులుగారి దురదృష్టం. మన ఆంధ్రుల దురదృష్టం.

''ఏమిటి నీ అధునాతన సృష్టి రాయ్?'' అని సుప్రసిద్ధ కళా విమర్శకుడు, రచయిత శ్రీ జి. వెంకటాచలంగారు అడిగితే ఒక చిన్న మట్టిపాత్రను, కొద్ది డిజైనులతో అలంకరించి వున్నదాన్ని చూపిస్తూ, ''ఇదే నా ఉత్తమోత్తమమైంది, అధునాతనమైంది'' అని చెప్పాడు.

''అక్కడి నుండేగా నీవు కళని ఆరంభించింది'' అని చురకవేస్తూ అడిగారు వెంకటచలంగారు.

''ఆది అంతాలు ఒకటికాదూ?'' అని వేదాంతీకరించాడు రాయ్. తోటి చిత్రకారులు అనుకునేంతటి అమాయకుడు, చదువుకోనివాడు కాదనిపిస్తుంది ఈ జవాబు వింటే.

రాయ్ చాలా సుకుమార మనస్కుడు. ఏమాత్రం కష్టమైన మాటైనా భరించలేడు. అసాధ్యమైన ఓపికతో, ఎవరి అండా లేకుండ, తను నమ్మిన కళలో సాధన చేశాడు ఎన్నో సంవత్సరాలు. అలా ధైర్యంగా, దూరంగా వుండి కృషిపెట్టిన చిత్రకారులు మనదేశంలో ఎవరూలేరు. ఆయనకు అదృష్టం కలిసివచ్చింది. అనుకున్నది సాధించాడు. విత్తం, విఖ్యాతి రెంటినీ పొందాడు ఎవరూ ఊహించలేనంతగా. మనం అందరం సంతోషించదగిన విషయమే యిది. కాని తోటి చిత్రకారుల సంగతి వేరు. పద్మశ్రీలు, మరెన్నో ప్రభుత్వ గౌరవాలు పొందిన ప్రముఖ భారతీయ చిత్రకారులు కొందరు బాహాటంగా, రహస్యంగా ఎన్నో పరుషాలు పలికారు రాయ్‌ని గురించి. రాయ్ ఔన్నత్యాన్ని ఓర్వలేక కుతకుత ఉడికిపోయారు. వారు చెయ్యగలిగినంతగా విషపూరితం చేసారు వాతావరణాన్ని రాయ్‌కి వ్యతిరేకంగా. కాని రాయ్ నిలిచాడు. ఎందువల్ల? చిత్రకారుడూగా ఆయన నిజాయితీ, పట్టుదల, కృషి అండగా నిలిచాయి. ఆయన్ని గురించి తోటి చిత్రకారులు, అలా అసూయపడడం, పరుషంగా ప్రచారం చెయ్యడం రాయ్ హృదయానికి గ్రుచ్చుకుంది. రాయ్ మాట్లాడుతుంటే ఎవరితోనైనా ఈ బాధ బహిర్గతమవుతుంది. తన బాధను ఒకసారి జి. వెంకటాచలంగారికి వెళ్ళగ్రక్కుకున్నాడు. ''ఎందువల్ల నా పాత స్నేహితులంతా వ్యతిరేకం అయ్యారు నాకు? నేనేమీ హాని చెయ్యలేదే వారికి. నమ్మండి. ఇల్లువదలి అసలు బయటికే వెళ్ళను. ప్రదర్శనలకు గాని, శుభకార్యాలకుగాని వెళ్ళి పది సంవత్సరాలుపైన అవుతుంది. ఇతరుల చిత్రాల గురించి విమర్శించే అంత తెలివి అయినా లేదు. నా సిద్ధాంతం ప్రకారం అలా విమర్శించను గూడాను'' అని ఎన్నో చెప్పుకుని తన మానసిక బాధను తేలిక పర్చుకున్నాడు.

చిత్రకారునికి ఒక్కసారిగా అదృష్టం కలిసివచ్చి, చిత్రాలపై మెచ్చుకోలు, కీర్తిరేఖలు నలుదిక్కులా ప్రాకితే గవర్నర్లు, ధనికులు, విదేశీయులు ఎడతెగక చిత్రకారుని

ఇంటికివచ్చి చిత్రాలు కొనుక్కువెళ్తుంటే, అసూయతోనిండిన తోటి చిత్రకారులకు మరుగుతున్న పాలకుండలో ఉన్నట్లుంటుంది, నిజమే. అయినా సహించగల నిబ్బరం రాయ్‌కి ఉంది. చిత్ర రచనకై కూర్చోగానే ఇవన్నీ మర్చిపోయి రంగుల లోకంలో విహరిస్తూ, ఆనందాన్ని తను పొందుతూ, ఇతరులకు గూడ పంచిపెడ్తాడు.

నేను ఎన్నో చిత్రాలు చూచాను రాయ్‌వి పెక్కుచోట్ల. ఆయన అంటే ఎంతో గౌరవం, ఆయన చిత్రాలంటే అభిమానం. నన్ను మరో లోకాలకు తీసుకుపోతాయి. ఆయన బెంగాల్ పట్ చిత్రాల నుండి వెయ్యనివ్వండి, స్వంతంగానే వెయ్యనివ్వండి, అది వేరే విషయం. కండ్లకు హాయిగా, మనసుకు ప్రశాంతంగా వుంటాయి చిత్రాలు. అయినా ఒకటి నాకు తోస్తుంది. రాయ్ చిత్రాలు ఎప్పటి నుండో చూస్తున్న తరువాత ఆయన చిత్రశైలి గిడసబారిపోయిందనిపిస్తుంది. ఆశించినంత మార్పు, చేర్పు రాలేదు రాయ్ చిత్రసంచయంలో. ఇది నే చెప్పక తప్పదు. పది సంవత్సరాలక్రితం చిత్రాలకు యిప్పటి చిత్రాలకు తేడా ఏమిటి అని రెండు చిత్రాలు దగ్గరగా పెట్టి చూస్తే, అంతగా భేదం కనిపించదు. కాలంతోబాటు చిత్రాలలో మార్పు రాలేదు. బహుశః రాయ్ ఆర్థిక విజయమే యిందుకు కారణమయితే అయివుండవచ్చు ననుకుంటాను. పాతపద్ధతిలోనే పదే పదే చిత్రించినా, వెంట వెంటనే అమ్ముడుపోతుంటే క్రొత్త పోకడలతో వేసే ప్రయత్నానికి అవకాశమేది? అలావేసే అవసరం గూడ లేదేమో వారికి! విమర్శనాదృష్టితోచూస్తే ఎలా రాయ్‌ని యిప్పటి అధునాతన చిత్రకారుల స్థాయిలో వుంచగలం? నిత్యం మారుతున్న కాలాన్నిబట్టి ఎన్నో ప్రయోగాలు ఎడతెగక చేస్తున్న మన చిత్రకారుల్లో రాయ్‌కి చోటు అంతగా వుండదేమో! అవే రంగులమిశ్రమం, అవే రేఖల వంపులు, అవే ఆకార వికారాలు ఎంతగా ఎన్నిసార్లు చూస్తాం. విసుగు పుడ్తుంది. అలానే తయారయింది రాయ్ చిత్రకళ యిప్పుడు.

జామినీరాయ్ భారతీయ చిత్రకారుల్లో చిరస్థాయిగా నిలచే ధ్రువతార. జానపద కళకు ఉన్నత గౌరవాన్ని తెచ్చిన పితామహుడు. వెలికితెచ్చిన ఈ కళలో ఎంతో మంది చిత్రకారులు సాధనచేసి, ఖ్యాతిపొందారు. అత్యంత ఆధునికంగా వస్తున్న చిత్రకళా రంగంలో ఆయన విడిగా నిలబడి పలుకరిస్తాడు. ఒకనాడు గ్రామాల్లో బీదవారిండ్లలో వుండే ఈ జానపద చిత్ర కళ, నేడు ఆధునిక గృహాలను అలంకరించింది. మరచిపోయిన మన గ్రామ జీవిత కళా శోభల్ని, గ్రామీణుల అభిరుచుల్ని సంతోషాన్ని, వారి ధర్మాల్ని మనకు చిత్రాల ద్వారా ఎరుకపరచాడు. ఆకర్ణాంత నయనాలతో, పల్లెటూరి ముతక రంగుబట్టల్లో వయ్యారంగా వివిధభంగిమల్లో నిలచి, పసుపు పూసుకొన్న ముఖాలతో

నిండుగా, ఆధునికులమైన మనల్ని, అమాయకంగా తేరిపారచూస్తారు జామినీరాయ్ స్త్రీలు. తీర్చిదిద్దిన తిలకం, అప్పుడే చేయించుకున్న వెండి, బంగారు ఆభరణాలతో వివిధ ముఖభావాల్లో మనకు ప్రత్యక్షమవుతారు. జీవితంలో నిరాడంబరంగా, హాయిగా ఎలా ఉండవచ్చో నేర్పుతారు. క్రీస్తు చిత్రాల్లో బాధని, దయని ఒలికిస్తాడు రాయ్. క్రీస్తు, ప్రజలే తనను చంపుతున్నా ఆ ప్రజలనే దయతో చూస్తాడు. వారికై జాలిపడతాడు. వారి జ్ఞానానికై, మేలుకై భగవంతుణ్ణే ప్రార్థిస్తాడు. ఈర్ష్యకి, కోపానికి, బాధకి అతీతుడు క్రీస్తు. ఆయన కండ్లలోని లోతు అనంతం. ఆయన ఒలికించే కరుణ అపారం. ఏమిటి ఆయన సందేశం మనకి? ఏమిటి ఆయన నోటితో చెప్పే శక్తిలేక కండ్లతో అందిస్తున్న ఉపదేశం? అది తెలుసుకునేందుకే మనం రాయ్ వేసిన క్రీస్తు చిత్రాన్ని సదా చూస్తుంటాం. ఎంత చూచినా తనివి తీరని, మనం తెలుసుకోలేని సందేశం ఆ క్రీస్తు చిత్రం యిస్తుంది. శివుడు, పార్వతి, గంగ చిత్రం ఎంత పెద్దవాళ్ళమైనా, వయసులో మనల్ని చిన్నపిల్లల్నిగా చేస్తుంది మరల ఒక్కసారి. చిన్నతనంలో మనం ఆడుకున్న దేవుళ్ల బొమ్మల్ని జ్ఞాపకం తెస్తుంది. ఎంత భక్తిగా మొక్కేవాళ్ళమో ఆ బొమ్మలకు. మనం మొక్కుకొన్నది, కోరికలు చెప్పుకొన్నది, కోపంతో నృత్యంచేసే తాండవశివుణ్ణే కాదు. ఇలాంటి కరుణా పూరిత దయామయుణ్ణే. శివ తాండవాన్ని మనం చూచి జడుసుకుంటామని, పెద్దవాళ్ళు ఇలాంటి నిండైన బొమ్మలు ఇచ్చే వారు మనకి, ఆడుకోవడానికి. చిత్రం గూడ అంత పవిత్రమైన పసిమనస్సుతో వేసిందే. అందుకే చిత్రం మనల్ని నిలబెడ్తుంది. ఇంత సునాయాసంగా ఇలాంటి చిత్రాన్ని వెయ్యడం. చాలా కష్టం చిత్రకారులకు. ఇది నా అనుభవంలోని మాట. నిజానికి ఒక్క జామినీరాయే వెయ్యగలడు అంత తేలికగా. మరో సిద్ధహస్తుడు లేడు. Madonna & Childలో ఆధునిక పోకడలు పోయాడు రాయ్. నేటి చిత్రకళకు ఎంత దూరంగా వున్నా, ఈ కాలంలో వున్నాడు గాబట్టి ఆధునిక చిత్రకళా ప్రభావాన్ని తప్పించుకోలేకపోయాడు. పలు ఆయతనాలతో చిత్రాన్ని నింపాడు. అవే ఇండ్లు. గాలిలో ఈదుతున్న చేపలు, ఎగిరివస్తున్న రూపాలతో వింతగా ఉంటుంది చిత్రం. ఆయనలో వచ్చిన పెద్దమార్పు ఈ చిత్రంలో కనిపిస్తుంది. రాయ్‌కి సహజంగావున్న రేఖమీదగల అధికారం సుస్పష్టంగా కన్పిస్తుంది ఈ చిత్రంలో. మామూలుగా అన్ని చిత్రాలలో వమాదిరిగా, ద్వి ఆయతన విధానంలో చిత్రించినా, నూత్నత్వం కొట్టవచ్చినట్లు చిత్రంలో కన్పిస్తుంది. రాయ్ చిత్రాలు రంగుల్లోనే చూడాలి. ఆయన ఎంతెంత భావాన్ని ఒక్క రంగులో చూపగలడో తెలుస్తుంది. అప్పుడే మనం ఆనందించగలం.

''జీవితానుభవం, బాధలు, మానసిక శారీరక సమస్యల చికాకుల నుండి వచ్చేదే కళ'' అంటాడు రాయ్. ఇది ఎంతైనా సత్యం. ఆయన జీవితాన్ని చూస్తే తెలుస్తుంది ఎన్ని కష్టాలను, ఎదురుదెబ్బలను తిన్నాడో, మానసికంగా ఎంత కుతకుత ఉడికి పోయాడో. అది అంతా తానే దిగమ్రింగి, మనకు అందిస్తున్నాడు వెన్నెలలాంటి స్వచ్ఛమైన, అపూర్వమైన జానపదకళని. నిజానికి రాయ్ పేరులోనేవుంది అది. యామిని అనే పదాన్ని జామిని అని పలుకుతారు బెంగాలీయులు. యామిని అంటే చీకటి అని అర్థం. ఆయన చిత్రాలు ఎప్పుడూ మన మనస్సులో మెదుల్తుంటాయి. చిత్రాలతోబాటు ఆ చిత్రాల వెనుకగా జామినీరాయ్ మసకగా కన్పిస్తుంటాడు మన అంతర్ దృష్టికి.

(భారతి)

★

# లండన్‌లో మన చిత్రకారుల పద్ధతులు!

కొంతకాలం క్రిందట ఇద్దరు యువచిత్రకారులు తమ చిత్రాలను ప్రదర్శించారు లండన్‌లో. ఒరిస్సా నుండి ప్రఫుల్ల మహంతి, కలకత్తా నుండి ఆషూరాయ్. వీరు చాలకాలం నుండి లండన్‌లో వున్నారు, ఉద్యోగాలు చేస్తూ. ఆషూ ఫిజిక్స్‌లో ఆనర్స్ డిగ్రీ, ప్రఫుల్ల ఆర్కిటెక్చర్‌లో డిగ్రీని తీసుకున్నారు. ఇద్దరికి చిత్రకళపైనే బ్రతకవలసిన అవసరం లేదు. కాని చిత్రకళతో పేరు తెచ్చుకోవాలని ఆశిస్తూన్న యువకులు.

కామన్‌వెల్త్ ఇన్స్టిట్యూట్‌లో ఆషూ ప్రదర్శన, డ్రియాన్‌గాలరిలో ప్రఫుల్ల ప్రదర్శనలు జరిగాయి. ఆషూ 50 చిత్రాలు (శిల్పాలా?) ప్రదర్శిస్తే, ప్రఫుల్ల 38 చిత్రాలను ప్రదర్శించారు. ఇద్దరు ఎన్నో విధాల విభిన్నులు. ఆషూవి, శిల్పమయ చిత్రాలు. పల్చని చెక్కలతో పేర్చి అల్లినవి. ఎన్నో ఆకారాలలో మలచినవి. వీటికి రంగులువేసి గోడకు తగిలిస్తాడు. అన్నీ ఆధునిక కళకు చెందినవే. వీటి సైజులు 60" x 40" నుండి 8"x3"లకు మధ్యన వుంటాయి. ధరలు 30 పౌండ్ల నుండి వున్నాయి. ఇంత తక్కువ ధరలతోవున్న ఏ చిత్ర కళాప్రదర్శనను నేను చూడలేదు. ఈ ధరలు లండన్‌లో ధరలు కావు. అంతతక్కువ. నిజానికి చాలా చిత్రాల 'ధర'లు వాటి చెక్కలకు, రంగులకు, ఫ్రేములకు అయిన ధరలకంటె తక్కువ. చూచిన వారు - ఎక్కువగ బెంగాలీయులు - మూడు, నాలుగు చిత్రాలు కొన్నారు ఏవొక్క పత్రికా వీరినిగురించి వ్రాయలేదు. అసలు ఈ ప్రదర్శన జరుగుతున్నదని ఎంతమందికి తెలుసు?

ప్రఫుల్ల చిత్రాలు కాన్వాస్‌పై చిత్రించినవి, కాగితంపై నీటిరంగులలో వేసినవి. చాలా డ్రాయింగులు (డిజైనులా?) గూడా వున్నాయి. చాల డబ్బు ఖర్చు పెట్టాడు పోస్టర్లకు. సినిమాపోస్టర్ల మాదిరిగ రంగులలో ప్రింటు చేయించి లండన్‌లోని అండర్ గ్రౌండు స్టేషన్లలో అతికింపించాడు.

తనకు వున్న గుణగణాలను బాహాటంగా చాటుకున్నాడు. చిన్నపిల్లలంటే ఎంతో ప్రేమ అని, నృత్యంగూడ చేస్తానని, చిన్నపిల్లలకు చిత్రలేఖనం, నృత్యం నేర్పడంలో తాను మహదానందం చెందుతానని, ఎంతో బీదప్రాంతమైన గ్రామంలోనుండి వచ్చానని - యిలా ఏవేవో కబుర్లతో, కథలతో, ఇండియాను వర్ణించి తాను యిండియన్ ఆర్టిస్టునని, చెప్పుకున్నాడు.

ఇతని ప్రదర్శన ఆషూకంటే కొద్దిగ విజయవంతమనే చెప్పాలి, ఆర్థికంగా.

మన దిండ్ల గలీబులకు వేసే డిజైనులను కాగితంపై గీసి, డ్రాయింగులుగా ప్రదర్శించాడు. కమలము మాదిరిగ రంగులలో, ఎక్కువగా కుంకుమరంగులో చిత్రించాడు. నాల్గైదు చిత్రాలు చూస్తే చాలు అన్నీ అలాగనే వుంటాయి. తాను మోడరన్ చిత్రకారుడనని చెబుతాడు. స్వతహాగా చిత్రకళను నేర్చుకొని ప్రదర్శిస్తున్న యువకుడు.

ఇక్కడ చాలమందిని చూచాను, భారతీయులను, ముఖ్యంగా బొంబాయిలో ఆర్కిటెక్చరు నేర్చుకున్నవారిని. ఇక్కడకు వచ్చిన తరువాత మరల ఆర్కిటెక్చరు - ముఖ్యంగా టౌనుప్లానింగ్ చదువుతారు. వీటిలో ఉద్యోగాలు తేలికగా దొరుకుతాయి. కాస్త ఆర్థికంగా బలపడిన తర్వాత చిత్రలేఖనం మొదలు పెడతారు, ఏదో ఈవినింగు ఆర్ట్ స్కూల్‌లో కొద్దికాలం, వారానికి నాల్గైదు గంటలు నేర్చుకొని.

వారి చిత్రాలతోబాటు ఇండియాను ప్రదర్శిస్తారు, ఎన్నో చిలవల పలవల కథలతో వర్ణిస్తూ. చిత్రకళా ప్రదర్శనలలో, ముఖ్యంగా అంతర్జాతీయ కేంద్రమైన లండన్ నగరంలో ఏ విమర్శకుడూ, 'కళ' అంటే ఏమాత్రం తెలిసిన వాడైనా, చిత్రకారుడు ఏదో పాపం ఇతర దేశం నుండి వచ్చాడు గదా అని మెచ్చుకోడు చిత్రాలను. ఆ సంగతి తెలుసుకున్న ఏ చిత్రకారులు యిలా కథలు చెప్పుకోరు తమ గురించి, తమ దేశం గురించి.

వారి ప్రదర్శనలు విఫలమైతే ( అంటే వారనుకున్నంతగా విమర్శకులు మెచ్చుకోకపోతే, అమ్మకపోతే చిత్రాలు) అందరిని పట్టుకొని తెగతిడతారు - అసలు వీరికి ఇండియన్ కల్చర్ అంటే ఏమి తెలుసునని.

ఈమధ్య ఒకావిడ బొంబాయి జే.జే. స్కూల్‌లో డిప్లమో పొందివచ్చింది. సౌత్ ఆఫ్రికాలో ప్రదర్శించింది. లోకల్ పేపర్లు వ్రాసాయి బాగా వున్నాయని. అవన్ని పట్టుకొని లండన్ వచ్చింది భర్తతో. ఎన్నో గాలరీలు చూచింది. తన చిత్రాలను చూపించింది. పాపం ఏ గాలరీకి ఈవిడ చిత్రాలు నచ్చలేదు. వారికి తెలిసిన ఒకాయన, నన్ను కలుసుకోమని

చెప్పగా కలిసింది. చిత్రాలను చూపించి నా అభిప్రాయం అడిగింది. చిత్రాలు చాల మామూలు పద్ధతిలో 'బావినుండి నీరు తెస్తున్న యువతి, లేక చెట్టుకు ఆనుకొని నిల్చున్న స్త్రీ'ల లాంటివి. కొన్ని బలవంతంగా ఆబ్ స్ట్రాక్ట్ పద్ధతిలోను, మరికొన్ని ఇంప్రెషనిస్ట్ పద్ధతిలోను చేసినవి. ఇలా కలగాపులగంగావుండి, అసలు ఏమి చెప్పదలచుకున్నదో చిత్రకారిణి, ఎవ్వరికి తెలియదు. నా అభిప్రాయం చెప్పమని ప్రాణంతీస్తే, నిజమేకదా అని, తోటిచిత్రకారుని అభిప్రాయాన్ని స్నేహపూర్వకంగా తీసికొంటుందని భావించి, నాకు తోచినట్లు విమర్శనగా చెప్పాను ఆవిడ చిత్రాలను గురించి బుద్ధి పొరపాటున అంతే. మరల ఆవిడను యింతవరకు చూడలేదు. నాకు చాలామంది తెలుసు గనుక నా చిత్రాలను గురించి వ్రాశారని, అంతా నాకున్న influence అని, ఏదేదో అన్నదట. నా అభిప్రాయం అడిగితే తోచింది చెప్పాను. నేను కొన్ని గ్యాలరీల పేర్లిచ్చి, వెళ్ళి చిత్రాలను చూపించమని సలహా గూడా యిచ్చాను. కాని ఆవిడ వెళ్లినట్లు లేదు. అలా వుంటుంది మనవారి పద్ధతి.

లండన్‌లో ఏదైనా భారతీయుల చిత్రకళా ప్రదర్శన ఏర్పాటుచేద్దామని సదుద్దేశ్యంతో ఎవరైనా పూనుకుంటే ఎంతోమంది నుండి చిత్రాలు వస్తాయి. ప్రతివారు ''పికాసో''నే అనుకుంటారు. ఎంతో కష్టమైనపని.

నిజానికి చెప్పుకోవాలంటే ఇక్కడ పేరున్న భారతీయ చిత్రకారులు యిద్దరే, సూజా, అవినాశ్ చంద్ర. సూజా ఈమధ్యన సాంఘికంగా, ఆర్థికంగా దెబ్బ తిన్నారు. కోర్టు వ్యవహారాలలో ఆయన చిక్కుకున్నారు. దురదృష్టవశాత్తు ఆయన రెండు ప్రదర్శనలు విఫలమయ్యాయి - పేపర్లన్నీ చాల విమర్శిస్తూ, సూజా చెప్పదలచుకున్నదివుంటే అది అంతా చెప్పడం అయిపోయింది, అని వ్రాశాయి. అవినాశ్‌చంద్ర చిత్రాలు వేయడం కంటే, గోడలపై మ్యూరల్స్ చేయడం ప్రారంభించారు, గ్లాసుతో. వీటిలో అయితే డబ్బు బాగా వస్తుంది గనుక. ఏది ఏమైనా భారతీయ చిత్రకారులుగా పేరు తెచ్చుకున్న ఈ యిద్దరూ భారత దేశానికి ఎంతో పేరు తెచ్చారు లండన్‌లో. ఎంతో కాలం నుండి లండన్‌లో వుండి, ఎంతో శ్రమించి, చిత్రకళను క్షుణ్ణంగా అర్థం చేసుకొని, నూత్న చిత్రాలతో తమకు, తమ దేశానికి పేరు తెచ్చారు.

'చూడండి. ఇతను అయినకాడికి, ఎంతవస్తే అంతకమ్మి డబ్బు తీసుకుందామని కాకపోతే ఏమిటిది? చిత్రం ధర రెండు పౌనులా? దానికి అయిన అసలు ఖరీదు అంతకంటే ఎక్కువ. ఇది ఏమైనా కూరగాయల షాపా? ప్రదర్శించకపోతే ఏమి సహాయంచేయడంలేదని నిందచేస్తారు. తీరా ప్రదర్శిస్తే యిలా వుంటుంది. ఇక ఈ

గ్యాలరీకి స్టాండర్డ్ ఏముంటుంది' అని నాతో అనడం జరిగింది, ఒక ప్రముఖ కళా విమర్శకుడు, కామన్‌వెల్తు గ్యాలరీలో 'ఆషూ' చిత్రాలను చూడడానికి వెడితే. గ్యాలరి క్యూరేటరును అడిగి ఆషూ చిత్రాల ఫోటోలు తెచ్చాను ఈ వ్యాసంలో ప్రచురించడానికి.

ఎంతో ఆలోచించాను ఈ వ్యాసం వ్రాసే ముందు. ఈ ప్రదర్శనలు అంతబాగుండలేని కాడికి ఎందుకు వ్రాయడం అని. భారతీయ చిత్రకారులు లండన్‌లో ప్రదర్శిస్తున్నారు గనుక, మన దేశంలో తెలియాలిగదా అనే నిర్ణయానికి వచ్చాను. విమర్శనగ వ్రాస్తే, తప్పక చెప్పవలసి వస్తుంది, ఏమాత్రం ఈ చిత్రాలు విజయవంతమైనవి అని. లండన్‌లో మంచి ప్రదర్శనలు జరుగుతాయి; మామూలువి చెప్పుకోదగనివీ జరుగుతాయి. వ్రాసి తెలియపరచడం ఒక పరిచయ కర్త, విమర్శకుని విధి. అందువల్ల వ్రాసాను ఈ వ్యాసం. ఇక్కడ ఏమి జరుగుతున్నది తెలియపరచడమే నా పని.

లండన్‌లో ప్రదర్శిస్తే మంచి గ్యాలరీలలో ప్రదర్శించాలి. చిత్రకళలో తగినంత ఉన్నతస్థాయి స్తోమత వుంటేనేగాని ప్రదర్శించరు. అందుకు నిలబడగల్గితే మంచిదే. ఇక ఎలాంటి విమర్శలు వస్తాయి ప్రదర్శనకు అన్నది, ఎవరూ చెప్పలేరు విమర్శకులు తప్ప. మన భారతీయ చిత్రకారులకు, మంచి గ్యాలరీలు దొరకవు ఏ వొకరికో యిద్దరికోతప్ప. అదిగాక మన చిత్రకారులకు ఎలాగోలాగా, ఎక్కడోక్కడ చిత్రాలు ప్రదర్శిస్తే చాలు అనే దూకుడు అభిప్రాయం ఎక్కువగా వున్నది. లండన్‌లో ప్రదర్శించాను అనేది తమ పేరుకు తగిలిస్తే చాలు అనుకుంటారు. ఢిల్లీలో పేరున్న ఒక చిత్రకారుడు, లండన్‌లో మారుమూల ఎక్కడోవున్న ఒక టెక్నికల్ కాలేజిలో తమ చిత్రాలను ప్రదర్శించడం జరిగింది. పాశ్చాత్యులు భారతీయ కళను బాగా కొంటారని ఆశించి గాబోలు, ఎన్నో రేఖాచిత్రాలను, నీటిరంగుల చిత్రాలను, మన క్రిస్టమస్ గ్రీటింగ్‌కార్డుల మాదిరిగా చిత్రించి ప్రదర్శించడం జరిగింది. ఇండియాలో ఆధునిక చిత్రాలు ప్రదర్శించే ఈ ఆర్టిస్టు, లండన్‌లో రాజపుట్ మొగలులాంటి చిత్రాలు ప్రదర్శించాడు. ఇలా ప్రదర్శించడంలో చిత్రకారునికి ఏ అభిప్రాయం వుందో నాకు అర్థంకాదు. దీనివల్ల చిత్రకారులకుగాని, చిత్రాలకుగాని ఏవిధమైన న్యాయం జరగదు.

దీనికి తగినట్లు మన భారత హైకమిషన్, ఏవిధంగాను చిత్రకారులకు తగినవిధంగా సహాయపడదు. ప్రపంచం అంతటా వున్న అమెరికన్ ఎంబసీలు తమ చిత్రకారుల ప్రదర్శనలకు ఎన్నో ఏర్పాట్లు చేస్తాయి. అసలు ఎలా ప్రదర్శన ఏర్పాటుచేయాలి అన్నది ఒక కళ. మన హైకమిషనులో ఎవరికీ ఏమాత్రం కళ గురించి రుచివున్నట్లు గాని,

తెలిసినట్లు, నాకుగాని, చూచిన ఎవరికైనాగాని అనిపించదు. మన హైకమీషను భవనంలో విండో డిస్ప్లే చేయడానికి ఎంతో అవకాశముంది. పల్లెటూరి దుకాణంలో మాదిరిగా వుంటుంది, వారి Display మరమేకులు, ఇనుపబందులు, చిన్న వూరగాయసీసాలు ప్రదర్శిస్తూ, చూస్తే డోకు వచ్చేలా ఉంటుంది - ఇవే ఇండియా ప్రంపచానికి అమ్మే వస్తువులు అని.

అదృష్టంకలిసివచ్చి ఇటీవల కొద్దికాలంపాటు యాక్టింగ్ హై కమీషనర్‌గా శ్రీ హక్సర్‌గారున్నారు. ఈయనకు కళలంటే ఎంతో యిష్టం. మన కళలకు కాస్త జీవం పోసారు లండన్‌లో. చాలా సంగీతకచ్చేరీలు ఏర్పాటుచేశారు. ఎంతోమందిని వివిధదేశాల రాయబారుల కార్యాలయాల నుండి ఆహ్వానించి, మన కళలను తెలియపరచేవారు. ఎన్నో విలువ గల చిత్రాలు వున్నాయి, వారి స్వంత కలక్షన్‌లో. ఆతర్వాత ఇండియాకు వెళ్లారు ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధి గారికి ప్రధాన కార్యదర్శిగా! నా చిత్రప్రదర్శనను మన హై కమీషను భవనంలో బ్రహ్మాండంగా ఏర్పాటు చేయాలని తలచారు. ఈలోగా వారిని శ్రీమతి గాంధిగారు ఇండియాకు పిలవడం, నాకు అదృష్టవశాత్తు మరొక ప్రసిద్ధ బ్రిటిష్ గ్యాలరిలో ప్రదర్శించే అవకాశం దొరకడం జరిగింది. మన హైకమీషను తలచుకుంటే, చాల తోడ్పడగలదు చిత్రకారులకు. వచ్చే హై కమీషనరుగారు ఎవరోగాని, కాస్త కళలంటే ఏమిటో తెలిసినవారు వస్తే, యిక్కడవున్న కళాకారులకు, భారతదేశానికి ఎంతో సేవచేసిన వారవుతారు. ఇదివరకు హై కమీషనరుగా వున్న శ్రీ కృష్ణమీనన్‌గారు లండన్‌లో చేసిన అపారమైన సేవ, ఎవరూ మరువరానిది. ఇక్కడవున్న భారతీయులేగాదు, ఇంగ్లీషువారు గూడ ఎంతగానో చెప్పుకుంటారు. ముఖ్యంగా ఆయన మన భారతీయ చిత్రకారుడు సూజాకు ఎంతో సహాయపడ్డారు. సూజా అప్పుడు ఎవరికి తెలియదు. సూజా ఈనాడు యింతగా పేరు తెచ్చుకున్నాడంటే శ్రీకృష్ణమీనన్ దానికి ఎంతో కారణం, ఆరంభంలో. అలాంటి వారు ఎవరైనా మరల లండన్‌కు హై కమీషనరుగ వస్తారని ఆశిస్తాను.

*(భారతి)*

★



# కామన్‌వెల్త్ చిత్రకళా ప్రదర్శన

మానవుడు చంద్రుణ్ణి చూచేందుకు వెళ్తున్నాడు. దానికి కావలసిన సరంజామాఅంతా ఎప్పటి నుండో సేకరిస్తున్నాడు. ఎంత సాధించినా ఇంకా సాధించ వలసింది మిగిలిపోతూనే వుంది. ఎంత వరకు ఇలా పయనం సాగిస్తాడో ఎవరికి తెలుసు? ఇలా నిరంతర శ్రమతో పోరాడుతున్న జీవికి శాంతి ఎక్కడ? ఎవరిస్తారు? ఎవరూ యివ్వరు. అతనికి అతనే సృష్టించుకోవాలి. తను వున్న ఈ ప్రపంచాన్ని, తను చేస్తున్న ఈ ఎడతెగని శ్రమని మరచిపోయి, మరో లోకంలో పయనించే అవకాశాన్ని వెతుక్కోవాలి. అంటే తను చూచేదికాక, చూడలేనిదాన్ని సృష్టించుకొని, తద్వారా ఆనందాన్ని అనుభవించాలన్న మాట. అందుకే అనేక రకాల ప్రయత్నాలు చేశాడు. కళలను సృష్టించు కున్నాడు. ఈ కళలన్ని సత్యానికి, దృష్టికి అందనివి. అయినా, అతని వూహకు అందేవి. ఊహకు అందడంవల్లనే కండ్లు మూసుకొని ( తెరచివున్నా) మానసికంగా ఆనందిస్తున్నాడు. అదే శాంతి అతనికి. ఈ శాంతి కరువైనప్పుడు అతను ఏమి చెయ్యలేడు.

మానవుడు రాతియుగం నుండే మానసిక శాంతికి కృషి చేశాడు, తను వున్న ప్రపంచానికి దూరంగా వెళ్లాలని, దూరంగా ఉండాలని. అందుకే గుహల్లో, రాతి ముక్కలతో, దొరికిన రంగు రంగుల మట్టితో చిత్ర శిల్పాలను తన వూహకు అందినవి, అందనివి గూడ చిత్రించి, కాసేపైనా తాను వున్న పరిసరాల్ని మరచిపోయాడు. ఇలా తన్ను తాను మరచిపోయి ఆనందించే స్థితి మానవ నైజమేమో. రకరకాల నృత్యాలను, అలంకారాలను, సంగీతాలను, వాద్యములను, చిత్రాలను, శిల్పాలను, నాటకాలను, కథలను సృష్టించాడు. ఈ మానవ సృష్టి ప్రతి యుగంలోను మార్పు చెంది, ఆ యుగానికి చరిత్రగా నిలిచింది. అందువల్లనే ఏ యుగపు కళలను చూచియైనా ఆ యుగపు జీవితాలను, చరిత్రలను చదువగల్గుతున్నాము.

మనం ఉన్నది అధునాతన యుగరి. ఈ యుగపు కళలనుచూస్తే నూతన యుగ లక్షణాలు

అవలీలగా తెలుస్తాయి. శాస్త్ర విజ్ఞానం జీవితపు అన్ని రంగాలలోను ప్రవేశించింది - యంత్రమయమై పోయింది జీవితం.

ముఖ్యంగా ఈ శాస్త్రవిజ్ఞానం, పాశ్చాత్య దేశాలలోని ప్రజల జీవితంలో ప్రథమ స్థానం అలంకరించింది. ప్రజలు యంత్రాలలో ఒక భాగంగా అయిపోయారేమో అనిపిస్తుంది. వారి కళల్లో ముఖ్యంగా శిల్పం, చిత్రలేఖనాలలో ఈ యంత్రాల ప్రభావం విపరీతం. యంత్రాల భాగాల రూపాలు ఈ కళలకు మూలములై , క్రొత్త ఆకారాలకు దారితీశాయి.

ఉదాహరణకు, రైలు ఇంజను పై కప్పు రేకుతీసిచూస్తే, ఎన్నో గొట్టములు బారుగా సాగిపోతూ, యంత్రభాగాల్ని ఒక దాన్ని ఒకటి కలుపుతూ పోతుంటాయి. మధ్య మధ్య గుండ్రని, బల్లపరుపు ఆకారాల దిమ్మలు, కదులుతూ వుండే భాగాలు, ఒక క్రొత్త ఆకారాలకు, దృశ్యాలకు నిలయాలు. వీటి నన్నిటిని చిత్రలేఖనంలో చూపించారు. అసలు భాగాలకంటే చిత్రించిన భాగాలు సజీవరూపాలై ఉత్తేజాన్ని, ఆహ్లాదాన్ని కలుగ చేస్తాయి. ఆది మానవుడు చిత్రించిన గుహాలయాలలోని రేఖా చిత్రాల నుండి, అడవిజాతి వారి అలంకారాల నుండి, మరల ఒక క్రొత్త కళను, ఈ అధునాతన యంత్ర యుగపు భావాలకు జోడిస్తూ, సృష్టించారు పాశ్చాత్య చిత్రకారులు. కంటికి కనిపించే ప్రతి వస్తువులోను ఒక రమ్యతను, మన జీవితానికి సంబంధించే బంధాన్ని వెలికితెచ్చే ప్రయత్నంలోవున్న ఈ పాశ్చాత్య చిత్రకారులను, యావత్ ప్రాక్‌దేశములు అనుకరిస్తున్నవి.

ఈ విషయం ఇక్కడ జరుగుతున్న ''నేటి కామన్‌వెల్త్ దేశాల చిత్రకళా ప్రదర్శన'' చూస్తే తెలుస్తుంది. కామన్‌వెల్త్ భవనాన్ని ఎలిజబత్ రాణి ఈ నెల మొదటివారంలో లాంఛనప్రాయంగా తెరచింది.

కామన్‌వెల్త్ ఇన్‌స్టిట్యూట్ ముఖ్యోద్దేశ్యము, కామన్ వెల్త్ దేశాలమధ్య అవినాభావ సంబంధాలను పెంపొందించడానికి, కామన్‌వెల్త్ యొక్క ఆశయాలను విపులీకరించడానికి ఏర్పడింది. ఈ ప్రదర్శనల కొరకు ఒక అధునాతన భవనము లండన్‌లో నిర్మింపబడింది. ఇందులో అన్ని కామన్‌వెల్త్ దేశాలు వారి వారి జీవితాలను, సంప్రదాయాలను, వివిధ రంగాలలో జరుగుతున్న అభివృద్ధిని, వారి గత నాగరికతలను చిత్రాల ద్వారా, నమూనాలద్వారా ప్రదర్శించారు. ఇది ఎప్పుడూ తెరచే ఉంటుంది. ఎంతో వైవిధ్యం కనిపిస్తుంది మన కామన్‌వెల్త్ దేశాల జీవిత రంగంలో. మన భారతదేశపు విభాగం ఎంతో రమ్యంగా చూపబడింది. చిత్తరంజన్ రైలు ఇంజను, తాతా ఎలక్ట్రిక్ రైలు ఇంజన్,

హిందుస్తాన్ కారు, జీపులు, లారీలు, ట్రాక్టర్లు, పెరంబూరు కోచ్ ఫ్యాక్టరీలోని రైలు పెట్టె, ఆటమిక్ రియాక్టర్లు అన్ని చిన్న చిన్న నమూనాలుగ చేసి ప్రదర్శించారు. మన నాగరికతను ఎంతో మనోహరంగా శిల్పాలతో ఏర్పాటు చేసి చూపారు.

ఈ దేశాల ప్రదర్శనలన్ని చూచి 3వ అంతస్థుకు వెళ్తే, అక్కడ చిత్రకళా ప్రదర్శన. వెళ్ళగానే మనకు ప్రముఖ ప్రపంచ శిల్పకారుడు హెన్రీమూర్ బ్రహ్మాండమైన "Standing Figure" స్వాగతం చెపుతుంది. షుమారు ఇది 8 అడుగుల కంచు శిల్పం. చుట్టూ రెండు 'గ్రహమ్ నదర్‌లాండు' చిత్రాలు, రెండు 'పాస్‌మోర్' చిత్రాలు ఉన్నాయి. ప్రవేశించగానే ఎదురుగా బ్రిటీషు చిత్రకారులవి, కుడివైపు భారతీయ చిత్రకారులవి, ఎడమవైపు కెనడా చిత్రకారులవి చిత్రాలు, శిల్పాలు ఉన్నాయి. తరువాత ఇతర దేశాల వారివి ప్రదర్శించబడ్డాయి.

ఈ ప్రదర్శన విభాగం చాలా ఇరుకు. చిన్న హాలులో ఎన్నో చిత్రాలు, శిల్పాలు ప్రదర్శించారు. ఒకదానిమీద మరొకటి ఉన్నట్లుగ వుండి, ఏదీ సరిగా చూడలేని స్థితిలోవుంది. చిత్రాలయితేనేమి, శిల్పాలయితేనేమి మొత్తం 188 ప్రదర్శించారు. క్యాటలాగు చాల చక్కగా ప్రింటు చేశారు - కాని ధర 7 ½ షిల్లింగులు.

కామన్ వెల్త్ ఇన్‌స్టిట్యూట్‌కు కళావిభాగానికి సలహాదారుగావున్న ప్రసిద్ధ కళా విమర్శకుడు ఎరిక్ న్యూటన్, ''కొన్ని దేశాలు వారి వారి కళాకరులకు ఈ కళా ప్రదర్శనలో తగు ప్రాతినిధ్యము సరిగా ఇవ్వలేదని భావించవచ్చు. కాని, వున్న కొద్ది స్థలంలో, సాధ్యమైనంతగా, అన్ని దేశాల చిత్రకారుల చిత్రాలను ప్రదర్శించడానికి ప్రయత్నం చేశాము. బ్రిటన్ ముగ్గురు చిత్రకారులవి మాత్రమే ప్రదర్శించింది. ఎంతోమంది ప్రసిద్ధులున్నా, స్థలాభావంవల్ల, మా కళాకారుల సంఖ్యను తగ్గించాము. శిల్పాలు ఎంతోబరువు, పెద్దవి అవడం వల్లను, దూర దేశాల నుండి తెచ్చి ప్రదర్శించడం ఎంతో కష్ట సాధ్యమైనది గనుకను. ప్రదర్శించవలసినన్ని ప్రదర్శించలేక పోయాము'' అని చెప్పారు. అయినా సాధ్యమైనన్ని రాతి శిల్పాలు, దారు శిల్పాలు, దంతముతో చేసిన విగ్రహాలను ప్రదర్శించారు.

మన భారతీయ విభాగంలో 22 మందివి ప్రదర్శించారు. శిల్పాలు చిత్రాలున్నాయి. ముఖ్యంగా అందరిని ఆకర్షించినవి అవినాశ్‌చంద్ర, ఎఫ్ . ఎన్. సూజా చిత్రాలు. వీరిద్దరి పేర్లు తప్పితే మరో భారతీయుని పేరును అసలు ఏ పేపరుగాని, ఏ విమర్శకుడుగాని తలచలేదు. ఈ పై చిత్రకారులిద్దరు లండన్‌లో సుమారు 7, 8 సంవత్సరాల నుండి

ఉంటున్నారు. వీరిద్దరు చిత్రకళను ఇండియాలో నేర్చుకున్నవారే . అవినాశ్ నాకు మిత్రుడు - బాగా తెలిసిన వ్యక్తి. అతని చిత్రాలలో రంగుకు ప్రాధాన్యత ఉంటుంది. బహు కొద్ది చిత్రాలలో మాత్రమే ఆకారానికి ప్రాధాన్యత ఉంటుంది. ''కల్పఫల'' అనే చిత్రం (81"x 54") నిలబెట్టిన ఇనుప స్థంబాలకు బోల్టులు బిగించినట్లు వుంది. ఇతనికి చిత్రంలో Subject కంటే technic ముఖ్యం. F.N. సూజా చిత్రం "Landscape in Green" అనేది ఎంతో మనోహరంగా వుంది. తెల్లని ఇండ్లమధ్య ఎర్రని బాట సాగిపైకి పోతున్నది. పాశ్చాత్యదృశ్యానికి భారతీయ పద్ధతిని జోడించినట్లున్నది. ఇతనికి పేరు తెచ్చిన చిత్రాలు బలమైన వేగాన్ని చూపే వికృత ఆకారమయాలు. అటువంటిది ఏదీ ఈ చిత్రంలో కనుపించదు. ప్రస్తుతం ఎఫ్ . ఎన్. సూజా 'వన్ మాన్ షో' జరుగుతున్నది లండన్‌లో. పేపర్లు బాగా వ్రాసాయి ప్రదర్శన గురించి.

ప్రముఖ ఆంధ్ర చిత్రకారులు శ్రీ కె. శ్రీనివాసులు గారిది "Earth and Life" అనే చిత్రం, చిన్నది వున్నది. ఎంతో రమ్యంగా, ముచ్చటగావుంది. నేలమీద పరున్న అమ్మాయి,ఎంతో దీర్ఘంగా ఆలోచిస్తున్నది, పసుపు రంగులో వెలుగుతున్న అర్ధ చంద్రునితో మసిబూసినట్లున్న రంగుతో చిత్రించిన అమ్మాయికి, భూమికి వున్న సంబంధాన్ని చూపుతున్నది ఈ చిత్రం. ఇటుక రంగు, నలుపు రంగు మిళితమైన రంగులో చిత్రించారు అమ్మాయిని, నేలను.

ప్రసిద్ధ చిత్రకారులు మరిద్దరివి నాకు నచ్చినవి. మోహన్ సమంత్, సయ్యద్ హైదర్ రజాలు. ప్రపంచపు ముఖ్య పట్టణాలలో వీరు తమ చిత్రాలను ప్రదర్శించారు, ఇంతకు ముందు. రజా రంగుకు ప్రాధాన్యత ఇస్తాడు. సమంత్‌ది రూపానికి ప్రాధాన్యత - కండ్లు మిరిమిట్లు గొలిపే రంగు రజా దయితే, వెలిసిపోయిన బూడిదరంగు సమంత్‌ది.

Tinted Trio అనే, దక్షిణ దేశపు స్త్రీలను చిత్రించాడు సంతానరామ్. వెలసిపోయిన ముదురు ఆకుపచ్చని రంగులో, మెరుస్తున్న ఆభరణాలలోని రాళ్ళతో బాగుందీ చిన్న చిత్రం. ప్రసిద్ధ చిత్రకారుడు సతీష్ గుజరాల్ "Sen" అన్న చిత్రం ఎంతో నిరాశను కలుగచేసింది. ఎంతో బలము తీక్షణతవున్న అతని చిత్రాలు ఎన్నో ఉన్నాయి. అవన్నీ వదిలిపెట్టి తెల్లని రంగుమధ్య గీతలున్న ఒక చిత్రం ప్రదర్శించారు. ఏమాత్రం గుజరాల్‌కు న్యాయం కూర్చేదిగాలేదు చిత్రం. రామ్‌కుమార్ Spring అన్న చిత్రం మనోహరంగా abstract పద్ధతిలో వుంది - కలర్ లేదు - Spring లేదు. కాని, బూడిదరంగు ఆకారాలలో ముచ్చటగా వుంది. ధనపాల్ Christ and cross అన్న

శిల్పం ఎక్కువ వివరాలు లేకుండా భావయుక్తంగా వుంది. మిగిలిన దారు శిల్పాలు నున్నగా, నాజూకుగా బరోడా స్కూలు పద్ధతిలో ఉన్నాయి. అంతగా చెప్పుకోతగ్గ శిల్పమేదీ భారతీయ విభాగంలోలేదు. రాఘవ కన్హేరియా Calf అన్న శిల్పంలో ముచ్చటగా ఎగురుతున్న దూడ మలచబడింది కంచుతో. మహమద్ యాసిన్ "Shehnai" అన్న చిత్రం అతని పద్ధతిని పూర్తిగా వ్యక్తపరచేదిగాలేదు. భారతీయ విభాగంలో శిల్పాలుకాని, చిత్రాలుకాని మొత్తం 10 నైరూప్య పద్ధతిలో వున్నాయి. మిగిలిన వాటికి సబ్జెక్ట్ ప్రాధాన్యత. మన భారతదేశానికి పేరు తెచ్చేవిగా లేవు మనవారి చిత్రాలు. ఎవరు సెలక్టు చేశారోగాని మనవారి చిత్రాలు, ఇక్కడ ఎవరికి నచ్చలేదు – ఒక సూజా, అవినాశ్ చంద్ర చిత్రాలు తప్ప.

కెనడా నుండి 17గురు చిత్రకారుల చిత్రాలు ప్రదర్శించబడ్డాయి. కెనడా, పశ్చిమ దేశాల కళా పద్ధతులను జీర్ణించుకున్నది చిత్రకళలో. మనం వీరి చిత్రాలు చూస్తే ఏ యూరప్ దేశాలవారి చిత్రాలనో, అమెరికన్ చిత్రాలనో చూస్తున్నట్లుంటుంది. అయినా నూతనత్వం తొణికిసలాడుతుంది చిత్రాలలో. ఎడ్మండ్ ఎలెన్ "Shore - Line" 1 అను చిత్రమంతా బూడిదరంగులో చిత్రించబడింది. అక్కడక్కడ పసుపు, ఆకుపచ్చ కలిసిన రంగు మెరుస్తుంటుంది. మధ్య బలమైన తెల్లని బద్దీలవంటి కుంచె రేఖలు, పడవలను తెలుపుతుంటాయి. ఒడ్డున చిందర వందరగా పడివున్న పడవలను ఎంతో గొప్పగా చూపించాడు చిత్రకారుడు. ఆకారానికిగల వివరాలకు పోకుండా, ఆకారాన్ని చూచాయగా చూపడంలో సఫలీకృతుడయ్యాడు. ఈ చిత్రాన్ని నేషనల్ గ్యాలరీ ఆఫ్ కెనడావారు కొనగా, దీన్ని తెచ్చి ఇక్కడ ప్రదర్శించారు.

కెనడా దేశపు చిత్రకారులందరివి ఆబ్‌స్ట్రాక్ట్ చిత్రాలే. వారిలో యూరపు దేశాలలోని చిత్రకారులకు వున్న సహజ తృష్ణ, కృషి లేదు. చాలా చిత్రాలలో స్పెయిన్ దేశపు ప్రసిద్ధ చిత్రకారుడు మీరో, అమెరికా దేశపు స్టూవార్ట్ డేవిస్ చిత్రాల అనుకరణలు కనిపిస్తాయి. ఏవో అధునాతన చిత్రకళా పద్ధతిలో చెప్పాలనే ఆవేదన వుంది. కాని చెప్పలేక పోతున్నారు. బలవంతమైన కృషి కనిపిస్తున్నది వీరి చిత్రాలలో. సహజత్వంలేదు కాని, త్వరలో కెనడా నుండి ఏదో క్రొత్త పద్ధతి రావచ్చును. అందరు కాకలు తీరిన చిత్రకారులే. ఎప్పుడో ఒకప్పుడు క్రొత్తగా చెప్పగలరు విషయాన్ని - త్వరలో అని తలుస్తాను.

ఎన్నో గొప్ప చిత్రాలను ప్రదర్శించింది ఆస్ట్రేలియా. ప్రదర్శనలోని అన్ని దేశాలకంటే ఎంతో ముందుకు పోయింది. మొత్తం 22 చిత్రాలతో ప్రదర్శనకు

నిండుదనం తెచ్చింది. దాదాపు అందరు ప్రపంచంలోని ముఖ్య కేంద్రాలలో ప్రదర్శించినవారే. పారిస్‌లో జరుగుతున్న నిరంతర కృషి, ఆస్ట్రేలియాలో కూడ జరుగుతున్నది. ఎంతోవుంది ఎన్నోరకాల నూత్న పద్ధతులలో భావాలను వ్యక్తపరుస్తున్నారు.

లారెన్స్ డాన్ ప్రదర్శించిన "Mandala" అన్న చిత్రం అబ్‌స్ట్రాక్ట్ పద్ధతిలో వుంది. గుడ్డ పేలికలను సన్నగా చేసి, అతికించబడివుంది చిత్రం క్రిందనుండి సగం వరకు. ఈ సన్నని పేలికలకు, రక రకాల రంగులు పెయింటు చేయబడివుంది. పైన గుండ్రని కొక్కెము చిత్రించబడి ముదురు నలుపు, ఇటుక రంగులో వుంది.

చిత్రం మొత్తం పైన ఈ కొక్కెమే ఎంతో నిండుగా వుంది. చిత్రాన్ని ఎంతసేపు చూచినా తనివి తీరదు. వర్ణ మిశ్రమము అమోఘంగావుంది. దీనికి వ్యతిరేకమైన చిత్రం మరొకటి ఎల్విన్‌లిన్‌చే చిత్రించబడిన "Bunyip country" అన్న చిత్రం. దీనిలో విచిత్రం పాత ప్లైవుడ్ చెక్క కాన్వాస్‌కు అతికించబడి ఉండడం. దానిమీద గుడ్డ మడతలుగా పెట్టి అతికించబడ్డది. వాటిపై పెయింటు చేశాడు నూనెరంగులలో చిత్రకారుడు. మసిబూసిన రంగు ప్లైవుడ్‌కు, తెల్లని రంగు మడచిన గుడ్డలకు, ఎంతో బరువును తెచ్చింది. చూడగానే నిలబెట్టే చిత్రం "48 x 60" సైజులోవుంది. మరొక అందమైన చిత్రము లూయిస్ జేమ్స్ చిత్రించిన 'East of the moon' అన్న చిత్రం. చిత్రమంతా ఎల్లో ఆకర్ రంగులో చిత్రించబడివుంది. రాలిపోయిన పువ్వులవలె, బహు చిన్న నక్షత్రాలవలె మెరసే రంగులతో చిత్రించాడు. గుంపులు గుంపులుగా, చీకటి ఆకాశంలో మెరసే తెల్లని నక్షత్రాల్లాగా, ఈ చిత్రంలో ముతక 'ఎల్లో ఆకర్ ' రంగులో చిన్ని చిన్ని పువ్వులు మెరుస్తుంటాయి. ఒక సంగీతాన్ని విన్నట్లుగా వుంది చిత్రాన్ని చూస్తుంటే .

ఇలా ఎన్నో రకాల చిత్రాలు, ఒకదాని కొకటి సంబంధం లేనివి ఉన్నాయి. ప్రాక్ దేశాల్లో, ఆధునిక చిత్రకళలో ముందడుగు వేసిన దేశము ఆస్ట్రేలియా అని చెప్పక తప్పదు.

చిత్రశిల్ప కళల్లో ఇంగ్లండు కున్న స్థానాన్ని నేను వేరే చెప్పవలసింది ఏమిలేదు. హెన్రీమూర్ Standing Figure 3 ఎంతో గంభీరత్వాన్ని తెచ్చింది ప్రదర్శనకు. నిలుచున్న ఈ ఆకారం, గ్రీకు స్త్రీ రూపాన్ని గుర్తుకు తెస్తుంది. నాజూకుగావున్న మెడ ఎంతో సోయగాన్ని తెచ్చింది. శిథిలమైపోయిన విగ్రహాన్ని, పురాతన వస్తు శాస్త్రజ్ఞుడు భూమి నుండి వెలికి తెచ్చినట్లుగా వుంది. రూపం విరూపమైనా, రూప లక్షణాలు అవగతము అవుతాయి. మానవ ఆకారానికిగల అందాన్ని, బలాన్ని, నాజూకుతనాన్ని, హుందాని

తెలియపరుస్తుంది. కాని, ఇంత పెద్ద శిల్పం జానెడు స్థలంలో బంధింపబడి ఏదో ఖైదులో వున్న ఏనుగులా వున్నది ప్రదర్శనలో. ఈ శిల్పాన్ని విడిగా మైదానంలో ఉంచి చూడాలి. హెన్రీమూర్ చిత్రాలను, శిల్పాలను మొత్తం 50 కు పైగా ఆక్స్‌ఫర్డ్‌లోని అష్మోలియన్ మ్యూజియమ్‌లో ప్రదర్శించారు నెలక్రితం. ఒక పుణ్యస్థలాన్ని దర్శించే యాత్రికునిలా వెళ్ళాను, ఈ ప్రదర్శన చూచేందుకు. హెన్రీమూర్ తన శిల్పాలు ఆరుబయట ఉంచేందుకు చేసినవిగాని మ్యూజియములలోను, ఇండ్లలోను బంధించేందుకు గాదు అని పదే పదే చెప్పారు. అందుకే ఆయన తన ఇంటికి వున్న విశాలమైన తోటలో శిల్పాలను తయారు చేస్తారు - అందరిలా స్టూడియోలలో కాదు.

విక్టర్ పాస్‌మోర్ Relief Construction అన్న చిత్రాన్ని, Linear Motif అన్న చిత్రాన్ని ప్రదర్శించాడు. ఒక్కొక్కదాని ధర 10,000 పౌండ్లు. సైజు 48" x 48" మరొకటి 60" x 60" విచిత్రమేమంటే రక రకాల ఆకారాలుగల కర్రలను ఒక చెక్కకు వివిధ కోణాలలో బిగించి, భావాన్ని వ్యక్తపరుస్తాడు ఈయన. ఈ బిగించిన కర్రముక్కలకు వివిధ రంగులు వేస్తాడు. బిగింపబడిన బల్లపరుపు చెక్కకు నల్లరంగు వేస్తాడు. మధ్య మరొక విశాలమైన చతురపు తెల్లని రంగుగల బల్లను బిగించాడు. మరొక Linear Motif అన్న చిత్రంలో తెల్లని బల్లపైన, సన్నని రంగు రేఖలను చిత్రించాడు, అంతే. విమానంమీదపోతూ క్రిందకు చూచినట్లుగ, లేక కొండమీద నిలబడి క్రింది గ్రామాన్ని చూచినట్లుగా ఉంటుంది ఈ చిత్రం. ఒక కర్రముక్కకు మరొకదానికి గల మధ్యదూరం రకరకాల ఆకారాల ముక్కలు, వాటి కోణాలు కలిసి ఒకవిధమైన డిజైన్‌ను సృష్టిస్తాయి. బహు విచిత్రమైన భావాలను రేపుతాయి ఈతని చిత్రాలు - చిత్రాలు కాదు రిలీఫ్ అనవచ్చునేమో. ఇంతవరకు ఎవరు చెప్పని ఒక పద్ధతిని వ్యక్తపరచాడు పాస్‌మోర్. ఇటువంటి చిత్రాలను వస్తుతఃచూచి ఆనందించవలెనుగాని, మాటలలో చెప్పడం కష్టం. ఎందుకంటే ఇది ఏదో నూతన విచిత్ర రూపంతో కూడుకున్న చిత్రం. గ్రహం సదర్‌లాండ్‌వి "Owl in Tree Form", "Ancestor" అన్న రెండు చిత్రాలున్నాయి. దాదాపు ఒకే ఆకుపచ్చని రంగులో పెయింటు చేశాడు రెంటిని. బ్యాక్‌గ్రౌండు అంతా ఖాళీగా వుండి, నిలబడి వున్న రాతి ముక్కలులాగా ఉన్నాయి ఆకారాలు. ఈయన చిత్రాలు ఎంతో అందమైన, ముతక పసుపురంగు, ఆకుపచ్చ రంగులలో ఉంటాయి. కాని, ఇప్పుడు కాంతిహీనమైన రంగులలో, వివిధ కోణాకారాలతో నిండిన చిత్రాలను చిత్రిస్తున్నారు. రంగు ఎలా ఉన్నా, ఈయన చిత్రాలను ఇట్టే గుర్తు పట్టవచ్చును. ఆయన

శైలి ఏమాత్రము మారలేదు. రంగులలో, కాంతి తగ్గింది అంతే. కుంచెను నడిపే విధానం అద్భుతం. చిన్న చిన్న ముక్కల రూపంలో రంగు పూసిన స్థలాలకు, బలమైన నల్లని గీతలను మధ్య యిమిడ్చి, ఆకుపచ్చని విశాలమైన మైదానంలాంటి బ్యాక్‌గ్రౌండ్‌లో ఉంచుతాడు. ఈయన చిత్రాల్ని చూస్తే నాకు ఆఫ్రికా దేశపు శిల్పాలను చూచినట్లున్నది. ఒక్కొక్కటి ధర 2,250; 1,650 పౌండ్లు.

బ్రిటీషు కళాకారులైన హెన్రీమూర్, గ్రహమ్‌సదర్ లాండ్, విక్టర్ పాస్‌మోర్‌లు ప్రత్యేకంగా ఈ ప్రదర్శన కోసమని చేసారు శిల్పాలు, చిత్రాలు.

సిలోన్ మంచి చిత్రాలను ప్రదర్శించింది. ప్రముఖ చిత్రకారులు జార్జి కీట్సువి ఒక రేఖా చిత్రము, ఒక వర్ణ చిత్రము ఉన్నాయి. రేఖా చిత్రం మనం Illustrated Weekly లో తరచు చూచేలాంటిదే. Nayika 2 అనే వర్ణచిత్రం ముతకరంగులలో చిత్రితమైనది. ఇటుకరంగు శరీరం, ఎరుపుచీర, నీలం బ్యాక్‌గ్రౌండ్, ఆకుపచ్చని మొక్కల ఆకులు పెనవేసుకుపోతున్న లతలాంటి రేఖలతో ఎంతో నిండుగావుంది. చిత్రములో స్తబ్దత ఆవరించి వుంది. సంతోషం, చలనంలేదు. ఈయనవి అన్నీ అలాగే వుంటాయి. అది వారి style. నిండైన స్త్రీ చాల గంభీరంగా ఉండి, ఏదో చెప్పబోతున్నది. రనిల్‌దెరనియోగర అనే యువ చిత్రకారుని "Boy & Bull" అనే చిత్రం అద్భుతంగా వుంది. కోకోష్క నడిపే క్లాసులో కొంతకాలం ఉండడంవల్ల ఆయన ప్రభావం విపరీతంగావుంది. అయినా వర్ణ మిశ్రమంలో, ఆకారాన్ని, మలచడంలో దిట్ట. సిలోన్‌కు పేరుతెచ్చే మరొక గొప్ప చిత్రకారుడు, మరొక యువ శిల్పి 'తిస్సరణసింగే' "The God that is half woman" అనే శిల్పాన్ని ప్రదర్శించాడు. ఈ పై చెప్పిన ఇద్దరు యువకులు లండన్‌లో శిక్షణ పొందినవారే, చిత్ర శిల్పకళలలో. గొప్ప మార్పును వీరిద్దరు సిలోన్ కళారంగంలో తెస్తారంటే సందేహం లేదు.

సైప్రెస్ చక్కటి చిత్రాలను ప్రదర్శించింది. డయామాన్‌టిన్ అనే చిత్రకారుని trouble అన్న చిత్రం బాగుంది. ఈ చిత్రంలో విచారం తొణికిసలాడుతున్నది. చిత్రం మన అమృతోషేర్ గిల్ చిత్రాలను జ్ఞాపకం తెస్తుంది. ముదురు నీలం, ఎరుపు రంగులలో బాగుంది. జార్గియో అనే చిత్రకారుని "Stadt Zonder Hart, Roterdam" అన్న చిత్రం చాలా మెచ్చుకో తగ్గది. ప్రపంచ ప్రసిద్ధ శిల్పకారుడు Zadkin శిల్పాన్ని రోటర్‌డామ్‌వద్ద ఉంచారు. దాన్ని చిత్రించాడు. శిల్పానికి వెనుక నది, నదిలో ఓడలు ఎంతో రమ్యంగా ఉంది.

న్యూజిలాండ్ వారు అన్నీ ఆబ్‌స్ట్రాక్ట్ చిత్రాలను ప్రదర్శించారు. సబ్జెక్ట్‌కు ప్రాధాన్యత యిచ్చేది ఒక్కటీలేదు.

హాంగ్‌కాంగ్ రెండు మూడు మోడరన్ చిత్రాలను ప్రదర్శించింది. కాని ఏమి బాగుండలేదు. చైనీసు పద్ధతిలో వేసిన చిత్రాలు బాగున్నాయి. లైమింగ్ చిత్రించిన "Vulture" అన్న చిత్రంలో గ్రద్దలోని తీక్షణతను, రేఖలలో గరకుతనం, మెచ్చుకొనవలసి వుంది.


పాకిస్తాన్ అన్నీ అధునాతన చిత్రాలను ఏడింటిని ప్రదర్శించింది. అన్నీ దాదాపు అనుకరణలే. అమెరికన్ చిత్రకారులు Klein కు, John Marin నీటిరంగుల చిత్రాలకు నమూనాలుగ ఉన్నాయి.

నైజీరియా, సియారా లియోన్, ఘనా, నార్తరన్ రొడీషియా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, సింగపూర్, మాల్టా, మలయా, జమైకా, ఈస్ట్ ఆఫ్రికా (టాంగనికా, ఉగండా, కెన్యా, జాంజిబార్), బ్రిటీషు గయానాలు ప్రదర్శించిన చిత్రాలలో ఒకటో రెండో చెప్పుకోతగ్గవి ఉన్నాయి. అంతా చాల, చాల నాసి రకమైన చిత్రాలను ప్రదర్శించాయి.

మొత్తం మీద చిత్రాలు నిరాశను కలుగచేశాయి. మొట్టమొదటి సారిగా ఇంత పెద్ద ఎత్తున జరిగిన కామన్ వెల్త్ చిత్రకళా ప్రదర్శన గురించి, ఒక కాలంలో ఆరు, ఏడు అంగుళాల కంటె ఎక్కువగ ఏ పేపరు వ్రాయలేదంటే, ఇవి ఎంత సరుకులేని చిత్రాలో గ్రహించగలరు. చిత్రాలలో అధునాతనత్వాన్ని తేవాలని తలచి నాసికరకపు పాశ్చాత్య చిత్రాల నమూనాలను తయారు చేశారన్నది కామన్‌వెల్త్ దేశపు చిత్రకారుల ఈ ప్రదర్శన తెలుపుతుంది. ఆస్ట్రేలియా అందరి మన్ననలను పొందింది. ప్రాక్ దేశాలన్నీ స్వంతంగా ఒక భావాన్ని, బలమైన, నూత్న పద్ధతిలో చెప్పాలంటే చాల కాలం పడుతుందనిపించింది. 85% చెడ్డ చిత్రాలలో మిగిలిన చిత్రాలు మినుకు మినుకుమనే ఈ ప్రదర్శన కోసం, రెండు పౌండ్లు ఖర్చు పెట్టి ఎందుకు వచ్చానా అనిపించింది, లండన్‌లో ప్రముఖులు ఎందరి ప్రదర్శనలో చూచిన నాకు.

*(భారతి, ఏప్రిల్ 1963)*

☆



# బ్రిటిష్ చిత్రకళ

ఈ సంవత్సరం ఎన్నో ప్రముఖ కళాప్రదర్శనలు జరుగుతున్నాయి లండన్‌లో, ఒక్కసారి ఇంత హడావుడి ఎందుకు జరుగుత్నుదా అని ఎవరికైనా సందేహం వస్తుంది. దానికి చాలచాల కారణాలున్నాయి.

ప్రపంచ చిత్రకళకు, చిత్రశిల్పకళా రంగాలలో పలునూత్న ప్రయోగాలకు కూడలియైన పారిస్ - రోజురోజుకు ప్రాముఖ్యతను కోల్పోతున్నది. దీనికి కారణం ఏమో చెప్పలేము. అమెరికా, ముఖ్యంగా, న్యూయార్కు నగరం ఈ పారిస్ స్థానాన్ని ఆక్రమించింది. ఇంత వరకు పారిస్ వైపు అర్రులు చాచిన చిత్రకారులు, కళాభిమానులు ఒక్కసారిగా అమెరికావైపు తిరిగారు. దానికి కారణం అమెరికా చిత్రశిల్ప కళల్లో గూడ నేటి ప్రపంచ విజ్ఞాన, రాజకీయరంగాలలో తనకుగల ప్రముఖ స్థానంవంటి ఒక ఉన్నత స్థానం కావాలని, కృషి మొదలు పెట్టడమే. ఇక్కడి చిత్రకారుల కృషికి ప్రభుత్వం, వ్యాపార సంస్థల అండ ఎంతో ఉంది. ముఖ్యంగా సైన్సులో జరుగుతున్న ప్రయోగాలను కళలలో గూడ ప్రయోగించి ఒక పెద్ద సంచలనాన్ని తెచ్చింది. ఇంతవరకు చిత్రకళలో వస్తున్న వివిధ 'ఇజము'లను మించి, క్రొత్త మార్గాన్ని కనిపెట్టిన ఖ్యాతి అమెరికాకు దక్కినది. ఒక విధంగా చూస్తే నిజానికి ఇప్పటి చిత్రకళపై ప్రేక్షకుల నమ్మికను పోగొట్టినది గూడ అమెరికాయే. జాక్సన్ పోలక్, మార్కు రోధకో చిత్రాలు చూస్తే అమెరికా నూత్న ప్రయోగం తెలుస్తుంది కళలో. చిత్రాలా లేక రంగులు పొరపాటున కాన్వాస్‌పై ఒలికిపోతే, ఆకాన్వాస్ తెచ్చి ప్రేముకట్టి ప్రదర్శించినవా అనే అనుమానానికి దారితీస్తుంది. ఈ అనుమానం మామూలు ప్రేక్షకునిది గాని, కళా మర్మములను ఎరిగిన విమర్శకునిది గాదనుకోండి. అయినా అనుమానం అనుమానమే, ప్రేక్షకునిదైనా.

నిజానికి చిత్రకళలో పారిస్ తర్వాత ఇంగ్లండు పేరున్న దేశంగా ఇప్పటివరకు చలామణి అవుతూ వచ్చింది. కాని గభాలున ఒక్కసారిగ న్యూయార్కు ఆ అఖండ ఖ్యాతిని ఎగర

గొట్టుకుపోయే సరికి, ఎక్కడలేని సంచలనం కల్గింది లండన్ కళారంగంలో . కనీసం ఇంతవరకు అనుభవిస్తున్న, తన రెండవ స్థానాన్ని అయినా పోగొట్టుకోకుండా ఉండాలనేదే, ఇప్పుడు జరుగుతున్న మూక ఉమ్మడి ప్రదర్శనలకు కారణం. కొద్ది మాత్రంగా పేరున్న ఇంగ్లీషు చిత్రకారుల ప్రదర్శనలు గూడ విరివిగా జరుగుతున్నవి. పేపర్లన్నీ బాగా వ్రాస్తున్నవి. ఇక హెన్రీమూర్, బెన్ నికల్సన్, ఫ్రాన్సిస్ బేకన్‌ల సంగతి, వారికి గల ప్రచారం గురించి చెప్ప నవసరం లేదనుకుంటాను. ఈ తాపత్రయంలో ఏర్పాటు చేసినదే ఈ ''అరువదవ దశాబ్దంలో బ్రిటిష్ చిత్రకళ'' అన్న ప్రదర్శన.

ఈ ప్రదర్శనను ఎంతో కష్టపడి ఏర్పాటు చేసినది ఇక్కడగల 'కంటెపొరరీ ఆర్ట్ సొసైటి'. సొసైటీ ఈ ప్రదర్శనపై బహు చక్కటి చిన్న క్యాటలాగు ప్రచురించినది. అది ఇలా ప్రారంభమవుతుంది. ''మనం నేటి అమెరికన్, పారిస్, ఆస్ట్రేలియా, ప్రతి యూరప్ దేశ చిత్రశిల్ప కళా ప్రదర్శనలు విరివిగ చూడడం జరిగింది లండన్‌లో. కాని ఏలనో నేటి ప్రపంచ కళారంగానికి మన బ్రిటన్ సాధించి అందించిన, అందిస్తున్న కళా రీతులను చూపే కార్యక్రమము అసలు జరుగక పోవడం అత్యాశ్చర్యకరము.''

ఇక మనకు సులువుగ అర్థం అవుతుంది ఈ ప్రదర్శనలో బ్రిటిష్ చిత్రకారులను అందరిని ఒక్కచోట చేర్చి ప్రదర్శించాలనే కుతూహలం ఉన్నట్లు. అందువల్ల ఈ సొసైటీ మొదట చిత్రకారుల చిత్రాలను ప్రదర్శించి, తర్వాత శిల్పకారులవి, గ్రాఫిక్ చిత్రకారులవి కలిపి, ఇంత భారీ ఎత్తున ప్రదర్శిస్తుందట త్వరలో.

మొత్తం 186 చిత్రాలను ప్రదర్శించారు. ఇవన్నీ ఒకసారి 'టేట్ గ్యాలరీ'లో ప్రదర్శించుటకు వీలుపడక సగం ''టేట్ గ్యాలరీ''లోను, మిగిలిన సగం ''వైట్ ఛాపెల్ ఆర్ట్ గ్యాలరీ''లోను ప్రదర్శించారు. టేట్ గ్యాలరీలో వయసు ఉన్న, బాగా పేరున్న చిత్రకారులవి, వైట్ ఛాఫెల్ గ్యాలరీలో యువతరం వారివి అని విభాగించి ప్రదర్శన ఏర్పరచారు.

ఈ ప్రదర్శన ఒక విధంగా ఇప్పుడు ఇంగ్లండులో ఉన్న చిత్రకారులను, వారివారి చిత్ర వైఖరులను పరిచయం చేస్తుంది. ప్రపంచ చిత్ర కళలో బ్రిటన్‌కు ఉన్న స్థానం తెలుస్తుంది. సామాన్యంగా ఇలాంటి ప్రదర్శనలు జరిగితే ఒక న్యాయ నిర్ణయ సంఘం ఏర్పడి, ఆ సంఘం వచ్చిన చిత్రాలలో మంచివి ఏరి ప్రదర్శిస్తుంది. కాని ఇక్కడ అలా జరుగలేదు. ఈ ఆర్ట్ సొసైటీ చిత్రకారులను రెండుగాని మూడుగాని వారికివారు మంచి వనుకున్న చిత్రాలను పంపమని అడిగి, వాటిని అలాగే ప్రదర్శించింది, ఏమి సెన్సార్

లేకుండ. నిజంగా ఇది ఎంతో హర్షించదగ్గది. చిత్రకారుడు ఏవి తను మంచివనుకుంటే అవి ప్రదర్శించే స్వాతంత్ర్యం పొందాడు. సామాన్యంగా ఈ న్యాయ సంఘంలోని వారు, తమకు తెలిసిన వారి చిత్రాలు చెత్తవైనా, ప్రదర్శనకు సెలక్టుచెయ్యడం, బహుమతులుంటే తమకు తెలిసిన వారికే ఇవ్వడం జరుగుతుంది. అప్పుడప్పుడు, ఇలాంటి పెద్ద ప్రదర్శనలలో. ఆ బెడద లేకుండా తప్పింది ఈ ప్రదర్శన ఏర్పరచిన పద్ధతి చూస్తే.

ఈ ప్రదర్శనలోని చిత్రాలను గురించి వ్రాసేముందు, కొద్దిగా, ఈ ఆర్ట్ సొసైటీ చరిత్ర వ్రాస్తాను. ఇది పెద్ద 'లార్డ్ 'లు, ధనవంతులు, విమర్శకులు కలిసి ఏర్పరచిన సొసైటీ. మెంబరుషిప్పు బహు తక్కువ. సంవత్సరానికి 28 రూపాయలు, భార్యాభర్తలకు కలిసైతే 40 రూపాయలు, మెంబర్లు అందరు చాలసార్లు కలిసి, చిత్ర శిల్పకళలపై చర్చించుకుంటారు, కళలో అనుభవజ్ఞులు చేసే ఉపన్యాసాలూ వింటారు. పెద్దపెద్ద ప్రదర్శనలు ప్రివ్యూలకు ఫ్రీగా వెళ్తారు. అమెరికా, రష్యా, యూరప్‌లలోని కళా సంచయములను, మ్యూజియములను చూడడానికి వెళ్తారు. ఇవన్నీ సొసైటీ బహు జాగ్రత్తగా నిర్వహిస్తుంది. ఇక మిగిలిన డబ్బుతో ప్రదర్శనలలోని చిత్రాలను కొని, చిత్రకారులకు సహాయపడ్తుంది సొసైటీ. మరో విశేష మేమంటే కొన్న చిత్రాలను, శిల్పాలను ఇతర కామన్‌వెల్త్ దేశాలకు బహూకరిస్తారు. అసలు ముఖ్యోద్దేశము ఈ విధంగా చిత్రాలను కొని కామన్ వెల్త్ దేశాలకు ఇవ్వాలనే. దాదాపు ఇప్పటికి రెండువేలుగ చిత్రాలైతేనేమి, శిల్పాలైతే నేమి బహూకరించింది. ఇది ఎంతో శ్లాఘించవల్సిన విషయం. మొట్టమొదటగా సొసైటీ కొన్నది. కీ.శే. ఆగస్టన్ జాన్ ''నవ్వుతున్న స్త్రీ'' అన్నచిత్రం. కొన్ని చిత్రాలను ముందుగా ఆస్పత్రులలోను, స్కూళ్లలోను, యూనివర్సిటీలలోను ఇతర కళా ప్రదర్శనలలోను ప్రదర్శిస్తుంది. ఈ విధంగా కళా రంగానికి ఎనలేని సేవ చేస్తుంది. లక్షలు ఖరీదు చేసే చిత్రాలను కొని, ప్రజలందరు చూడడానికి గాను, ఇంగ్లండులోని ఎన్నో పట్టణాలలో ప్రదర్శిస్తుంది.

ఇటువంటి ఉత్తమమైన కార్యాన్ని నిర్వహిస్తున్నది గనుక, 'టేట్‌గ్యాలరి' ఈ సొసైటీ కొన్న చిత్రాలను భద్రపరచడానికి, ఆఫీసుకు, గదులను ఇచ్చి సహాయపడింది. టేట్ గ్యాలరీకి సహితం, ఈ సొసైటీ చిత్రాలను బహూకరించింది. ఇది 1910వ సంవత్సరంలో ప్రారంభింప బడింది. బ్రతికి ఉన్న చిత్రకారుల చిత్రాలు మాత్రమే కొనాలనే సిద్ధాంతంతో నడుస్తున్నది.

ముందుగా టేట్‌గ్యాలరికి వెళ్ళాను, ప్రదర్శన చూడడానికి. ఎన్ని సార్లో వెళ్ళాను

లోగడ. కాని ఎన్నిసార్లు చూచినా క్రొత్తగానే కనిపిస్తుంది టేట్, 'మోనాలిసా' చిత్రాన్ని చూచినట్లు. ప్రదర్శనకు వెళ్లగానే మనకు ప్రముఖ చిత్రకారుడు సర్ విలియమ్ కోల్ స్ట్రీమ్ గారి చిత్రాలు కనబడతాయి. వాటితో ప్రారంభం అవుతాయి చిత్రాలు. ఈయన గురించి ఇంగ్లండులో తెలియని కళాభిమాని ఉండరు. భారతదేశంలో మన కళారచయిత శ్రీ జి. వెంకటాచలం గారిలాగా, జీవితమంతా కళకు ధారపోసిన వ్యక్తి. ముఖ్యమైన తేడా అల్లా, జి. వెంకటాచలంగారు చిత్రకళా విమర్శకులు, కోలు స్ట్రీమ్‌గారు చిత్రకారులు. చిత్రకారుడుగ ఎంత పేరుందో, అంతకంటే ఎక్కువగా చిత్రకారులను తయారు చెయ్యడంలో పేరుంది. ఎంతో మంది ఆయన వద్ద నేర్చుకొని ప్రఖ్యాతి గాంచారు ప్రపంచ చిత్రకళా రంగంలో. ఈయన మనుష్యుల చిత్రాలు, ముఖ్యంగా పోర్ట్రెయిట్స్, స్త్రీ నగ్న చిత్రాలు, ప్రకృతి దృశ్యాలు చిత్రిస్తారు. చాల మంది ప్రముఖ వ్యక్తులను చిత్రించారు ఇక్కడ. ఆయన మొదటి భార్యను మోడలుగ ఉంచి చిత్రించిన చిత్రాన్ని, దానితో బాటు మరి రెండు చిత్రాలు లార్డ్ గ్లెన్ కోనర్, వాల్టర్ బ్రాంట్‌ల పోర్ట్రెయిట్స్‌లను ప్రదర్శించారు. వీటిలో విశేషం చిత్రించిన పద్ధతి. దాదాపు ఇంప్రెషనిస్టు పద్ధతిలో చిత్రించినా, చిన్నచిన్న సన్నని గీతలలో ఫినిష్ చేస్తారు. దగ్గరగా చూస్తే చిత్రం అగ్గిపుల్లలంతటి సన్నని గీతలు రంగు రంగులలో కనిపిస్తాయి, ముఖం, శరీరం అంతా. చిత్రంలో ఎంతో జాగ్రత్తగా ఇలా వాడిన ఎర్రని గీతలు జీవాన్ని తెస్తాయి. ఒక్కొక్క పోర్ట్రెయిట్ పూర్తి చెయ్యడానికి నెలలు తీసుకుంటారు. ఈయన చేత పెయింట్ చేయించుకునే వ్యక్తికి అసాధారణ ఓర్పు కావాలి. తీసుకునే సిట్టింగులకు అంతుండదు. నాకు ఒకటి జ్ఞాపకం వస్తుంది. ప్రముఖ చిత్రకారుడు 'సిజాన్' గూడ యిలా ఎన్నో 'సిట్టింగులు' తీసుకునేవాడు చిత్రం పూర్తి చెయ్యడానికి. ఒకసారి తన భార్యను మోడలుగా ఉంచి చిత్రణ ప్రారంభించారు. షుమారు 108 సిట్టింగులు తీసుకొని చివరికి ''బహుశః నీ గౌను కాలరు కుదిరిందనుకుంటాను'' అన్నారు భార్యతో. మరి ఆ భార్యామణి ఈ మాట విన్నాక ఎలాంటి స్థితిలో ఉండి ఉంటుందో ఊహించగలం మనం.

సర్ విలియమ్ కోల్‌స్ట్రీమ్‌గారి పోర్ట్రెయిట్‌లు చాల విజయవంతంగా పూర్తి అవుతాయి. ముఖ్యంగా చిత్రాల్ని నేపుల్స్ ఎల్లో రంగులో పూర్తి చేస్తారు. పెన్సిల్ స్కెచెస్‌తోచేసిన పెయింటింగు లాగ ఉంటుంది. ఈయన చిత్రం పూర్తి అయ్యాక చూస్తే స్కెచ్‌ను అలాగే ఉంచి పెయింటు చేసినట్లు కనిపిస్తుంది. స్కెచ్‌లో గల బలం పోకుండా ఉండాలని గాబోలు.

ఈయన నాకు ప్రిన్స్‌పాల్‌గా ఉండడం ఎంతో అదృష్టం. ప్రస్తుతం లండన్ యూనివర్సిటీలోని స్లేడ్ కళాశాలకు ప్రిన్స్‌పాల్‌గా ఉన్నారు. కష్టపడి చిత్రాలు వేసే విద్యార్థులంటే చాలా ప్రేమ ఈయనకు. కామన్‌వెల్త్ ఫెలోషిప్పుకు ఇంగ్లండులో ఫైనలుగా నన్ను సెలక్టు చేసారు. అందు వల్లనే రాగలిగాను లండన్‌కు నేను.

మరొక ప్రపంచ ప్రసిద్ధ చిత్రకారుడు ఇవాన్ హిచెన్స్. ఈయన చిత్రకళ ఒక క్రొత్త రంగాన్ని సృష్టించింది. నాకు ఎందుకనో బెన్‌నికల్‌సన్, హిచెన్స్‌లలో సామ్యం కనుపిస్తుంది. ఇద్దరిలో ఎంతో వైవిధ్యం ఉన్నా, ఒకే దృష్టితో కళా సాధన చేస్తున్నవారు. ఎవరితోను వారిని పోల్చడం కష్టం. ప్రపంచంలో స్వంత పద్ధతులలో కృషి పెడుతున్న హేమాహేమీలు. హిచెన్స్ చిత్రాలన్నీ ఒకే రకంగా ఉంటాయి చూడ్డానికి. ఎందువల్లనంటే ఆయన ఎప్పుడూ చిగురాకులను, చిన్న చిన్న చెట్లను మాత్రమే చిత్రిస్తారు గనుక. పొదలలో గల ముళ్ల చెట్ల చిగురాకులను, వాటిపై ఉదయభానుని బంగరు కిరణాలను, వర్షం వాటిని తడిపి పాలిష్ చేసిన వివరణను ఎంతో ప్రజ్ఞతో చిత్రిస్తారు. మనం నిజంగా చెట్లలో ఇరుక్కుపోయామా అనిపిస్తుంది చిత్రాలు చూస్తుంటే. అలా అని ఆకులను ఉన్నవి ఉన్నట్లు వెయ్యరు. అబ్‌స్ట్రాక్ట్ పద్ధతిలో చిత్రిస్తారు. తైల వర్ణంలో చిత్రించినా, నీటి రంగుల నాజూకు తనాన్ని కలిగి ఉంటుంది. కుంచె బహు సున్నితంగా వెడల్పైన ఆకులను మలుస్తుంది. ఈ చిత్రాలను చూడడం కండ్లకు హాయి, మనస్సుకు శాంతి. ఈయన చిత్రాలన్నిటిని టేట్ గ్యాలరిలో ప్రదర్శిస్తున్నారు నిన్నటి నుండి. హిచెన్స్ జీవితంలో పెద్ద చిత్రకళా ప్రదర్శన ఇదే.

బెన్ నికల్‌సన్ మూడు చిత్రాలను ప్రదర్శించారు. అవి మెత్తని రంగులతో, సన్నని రేఖలతో, వివిధ కోణాకారాలలో మలచినవి. చూడడానికి ముచ్చటైన చిత్రాలు.

'గ్రహమ్ సదర్‌లాండ్ ' గూడ చిత్రాలను ప్రదర్శించారు. నా ఉద్దేశ్యంలో ప్రదర్శన అంతటిలోకి ఉత్తమమైన చిత్రాలు ఇవే. ఈయనకున్న రంగులలోని బలం, ఆకారాలు మలచడంలో ఉన్న భావనాశక్తి మరెవ్వరికి లేదు. చిత్రాలు అబ్‌స్ట్రాక్ట్ పద్ధతిలో ఉన్నాయి. ఏవో రకరకాల యంత్ర భాగాలను చిత్రించినట్లు అగుపిస్తుంది. టేట్ గ్యాలరిలో ఈయన చిత్రించిన ప్రపంచ ప్రసిద్ధ చిత్రం 'సోమర్‌సెట్ మామ్' పొట్రైయిట్ ఉంది. అది చూచి వారు ఇప్పుడు చేసిన నూత్న చిత్రాలు చూస్తే అసలు పోలిక ఉండదు. లోగడ చిత్రాలలో, ఈయన ఎంత రియలిస్టో అంత సర్రియలిస్ట్ ఇప్పటి చిత్రాలలో. ఒక్కొక్క చిత్రంలో ఒక్కొక్క రంగు బలంగా ఉంటుంది. సింధూరపు రంగు, ఆకుపచ్చరంగు, నలుపు

రంగులలో ఉన్నాయి మూడు చిత్రాలు. గీతలతో, తెల్లని నల్లని రంగులలో, ప్రాకే వికృత ఆకారాలు నడుస్తున్నాయా ఒకే ఆకుపచ్చ రంగు పూసిన కాన్వాసుపై, అనిపిస్తుంది. చాల విజయవంతమైన చిత్రాలు, గొప్పచిత్రాలు.

ఆశ్చర్యాన్ని కలిగించిన మరొక చిత్రాకారుడు విక్టర్ పాస్‌మోర్. ఇప్పటి వరకు ఒక్క గీతలలో మాత్రమే పూర్తి చేసిన చిత్రకారుడు ఇప్పుడు కాన్వాసుపై పెద్ద పెద్ద చుక్కల లాంటి ఆకారాలను ఇమిడ్చారు. సన్నని బద్దలను చిత్రాలకు అతికించి వాటికి తన మామూలు పద్ధతిలోనే రంగులు వేశారు. కాని రంగుల ఎన్నిక, ఆకారాలు పూర్తిగా మారి పోయినవి. ఇంతవరకు సాధారణంగా వాడని ముతుక రంగు వాడారు గీతలకు. కాన్వాసుపైకి ఉబికి వచ్చిన ఈ గీతల్లాంటి ఆకారాలు, పెద్ద పెద్ద చుక్కలాంటి రంగుల ముద్దల మరకలతో, ఎంతో వైశాల్యాన్ని అందజేస్తుంది చిత్రం. ఈయన చిత్రాలలో 'బేలన్స్' ఎంతో ప్రాముఖ్యంగా ఉన్నట్లు, తెలుపు రంగును చాల నాజూకుగా, ఎక్కువ మోతాదులోవాడినట్లు కనిపిస్తుంది.

మరొక ఆయన జాన్‌పైపర్. ఈయన చిత్రాలు నాల్గైదు చూస్తే చాలు. అంతకంటే చూడ నవసరం లేదు. చూడలేం గూడా. ఒకే పద్ధతి, ఒకే రకం రంగులో విసుగునుపుట్టించే చిత్రాలు, ప్రదర్శన అంతటిలోకి ఎవరివి అంటే ఈయన చిత్రాలే అనిచెప్పాలి. నీటి రంగులు చిత్రించే ప్రత్యేకమైన పేపరుపై నలుపు, ఇటుక రంగులను మిశ్రమం చేసి చిత్రించి, దానిపై రంగుల కాగితాలను వివిధ ఆకారాలలో కత్తిరించి అతికిస్తాడు. చిత్రం అంతా చచ్చిన రంగు చేపలు తేలుతున్నాయా అనిపిస్తుంది. అంతే కాకుండా దానిపై బ్లేడుతోనో, మేకుతోనో గీకుతాడు. కాగితం రేగి, ఈ గీతలు ఎంతో అసహ్యకరంగా కనిపిస్తాయి. చూడలేం.

మరొక చిత్రకారుడు సగర్వంగా నాలుగు కాలాలపాటు చెప్పుకోవలసిన వాడు ఫ్రాన్సిస్ బేకన్. ఈయన చిత్రించినట్లు భయంకరమైన చిత్రాలను బ్రిటన్‌లో ఎవరూ చిత్రించరు. జంతువులు తింటున్న మనుష్యులను, ఉరితీయబోయే ముందు గాజు ఖైదులో బంధింపబడి, ఏకాంతంగా భీభత్సంగా అరచే ఖైదీని, చనిపోయే క్రీస్తు చిత్రాల లాంటివి ఎంతో ప్రజ్ఞతో చిత్రించే మేధావి. 58 ఏండ్లు ఉన్నా 35 ఏండ్ల యువకుడుగా కనిపిస్తాడు. ప్రపంచం అంతటా గొప్ప చిత్రకారుడనిపించుకున్నాడు. చిత్రాలు వికృత ఆకారమయాలు. ఎరుపురంగును రక్తం కారుతున్నట్లు, నలుపురంగును చచ్చిన శవంలో నుండి జారుతున్నట్లు చిత్రిస్తారు. ఆయనకు రంగుపై ఉన్న అధికారం విపరీతం.

ఆకారాలను మనం గుర్తించగలం. ఆబ్‌స్ట్రాక్ట్ చిత్రాలు అసలు వెయ్యరు. కాని బ్యాక్‌గ్రౌండుపై ఆకారాలను నిలిపే పద్ధతి బహువింతగను, ఆబ్‌స్ట్రాక్ట్‌గను ఉంటుంది. సామాన్యంగా చిత్రంలో ఒక మనిషికంటే ఎక్కువ మందిని చిత్రించరు. ఇప్పుడు ఈయన చిత్రాల ప్రత్యేక ప్రదర్శన జరుగుతున్నది. వారం రోజుల నుండి పేపర్లు చిత్రాలను రంగులలో ప్రింటుచేసి బ్రహ్మాండంగా వ్రాస్తున్నవి. ఇప్పటి చిత్రాలలో రెండు మూడు మానవాకారాలను చిత్రించినవి చాల ఉన్నవి.

కీత్‌వాన్ ఈ మధ్య చాల ప్రాముఖ్యంలోకి వచ్చారు. ఈయన ఇప్పటి వరకు నిలుచున్న మానవులను వేయడంలో ఎంతో ప్రజ్ఞ చూపారు. ఈయన వాడే నీలి, ఆకుపచ్చ రంగుల మిశ్రమం, నేపుల్స్ ఎల్లో రంగులో ఎంతో ఎంతో మనోహరంగా ఉంటాయి. ఒకవిధమైన సముద్రపు నీటి చిక్కటి రంగును కలిగి, గంభీరంగా ఉంటాయి చిత్రాలు. రానురాను మానవ ఆకారాలను వదలి అబ్‌స్ట్రాక్ట్ పద్ధతిలో చిత్రిస్తున్నారు. ఎక్కువ రంగులు మిశ్రమం చేసి చిత్రించడం ఈయనకు ఇష్టం. విక్టర్ పాస్‌మోర్ రెండు మూడు రంగులు వాడడమే ఎక్కువ అనుకుంటే, కీత్‌వాగన్ పద్ధతి రంగుల పెట్టెలోని రంగులన్నీ సరిపోవు అన్నట్లు ఉంటుంది. కాని ఒక విధమైన సంగీతాన్ని అందిస్తాయి చిత్రాలు. అంతగ పెద్దసైజు చిత్రాలు వెయ్యరు. ఈయన చిత్రాలు యూరపు అమెరికాలలో చాల మ్యూజియములు కొన్నాయి. ఇప్పుడు నాకు ఈయన చిత్ర కళలో ఎడ్వైజరు. చాల మితభాషి. నెమ్మదస్తుడు.

నాకు మరొక ఎడ్వయిజరుగ వున్న మరొకరు ఫిలిప్ సడైన్. ఇప్పుడిప్పుడే ఇంగ్లండులో పేరు తెచ్చుకుంటున్నారు. ప్రపంచం అంతా ఎన్నో రకాల యిజములను దాటి ముందుకు పోతుంటే, ఈయన 'మథీస్'ను పట్టుకొని వ్రేలాడుతున్నారు. రంగు, ఆకారాలు అన్నీ మథీస్‌వే. నకలు అనవచ్చు. రంగులలో ఈయన స్త్రీలు అందంగా ఉంటారు చూడడానికి, పెద్ద పెద్ద (వసంతకాలంలో ఇంగ్లీషు ఆడవాళ్లు వేసుకునే) టోపీలలో టోపీల కొరకు మనం చూస్తామా చిత్రాలు? కాని ఈయన టోపీల కొరకు అయినా చిత్రాలు చూస్తారు గదా అని భావిస్తున్నట్లుంటుంది. ఒక విధంగా యీయన తైలవర్ణ చిత్రాల రంగుల్లో బరువు లేకుండ బహు తేలికగా ఉంటాయి చూస్తానికి. ''అద్దం ముందున్న స్త్రీ'' ''కుర్చీలో కూర్చున్న స్త్రీ'' లాంటి పేర్లతో చిత్రిస్తారు ఎక్కువగ.

ఈ పై చెప్పిన చిత్రకారులు చాల ప్రసిద్ధి చెందిన వారు. వారి చిత్రాలు లోగడ చేసిన పద్ధతిలోనే తిరుగుతుంటాయి కొద్ది మార్పులతో మార్పుతేవాలనే అవసరం వీరికి లేదు. ఎందుకంటే మ్యూజియములు, ధనవంతులు ఎలాగూ కొంటారు వీరి చిత్రాలు

లోగడ పేరునుబట్టి. గనుక చాల స్థిరమైన స్థాయిలో ఉండి, పాత సంగీతాన్ని మరల మరల వినిపిస్తూ, వారు ఆనందిస్తూ, మనల్ని ఆనందింప చేయ ప్రయత్నిస్తారు.

మొత్తం 116 చిత్రాలు టేట్ గ్యాలరిలో ప్రదర్శించారు. వాటిలో పైన వ్రాసిన చిత్రకారులు బాగా పేరున్నవారు. ఇక మిగిలిన వారి చిత్రాల గురించి అంతగా వ్రాయనవసరంలేదు. బహుకొద్ది మంది స్వతహా సరుకు ఉన్నవారు. మిగిలిన వారు వయసు ఉన్నా ఏ ''మిలాన్''లోని చిత్రాకారులనో 'స్పెయిన్'లోని చిత్రకారులనో అనుకరిస్తారు.

ఉన్న బహు కొద్దిమంది మంచి చిత్రకారులను గురించి వ్రాస్తాను.

'పెరి రిచర్డ్ 'చాల ప్రజ్ఞావంతుడు. ఎవరి అనుకరణ లేకుండ ఒక క్రొత్త పద్ధతిలో చిత్రించాలనే పట్టుదలతో కృషి పెడ్తున్న వ్యక్తి. చిత్రాలు చూస్తుంటే ఈయనలోని మనోబలం తెలుస్తుంది. ఎలక్ట్రిక్ తీగ చుట్టచుట్టినట్లున్న ఆకారాలు నృత్యం చేస్తున్నట్లుంటాయి. పెద్ద, బండరేఖలతో, లేత మట్టిరంగులలో పెద్ద కాన్వాసుపై చిత్రించిన చిత్రాలు చూపరులను ఇట్టే ఆకర్షిస్తాయి. గబగబా ప్రవహించే పిల్ల సెలయేరులాగ, రంగులు బండరేఖలలో ప్రవహిస్తాయి. ఆకారాలను మనం గుర్తు పట్టలేము చిత్రాలలో.

సిడ్ని నొలాన్ ఆస్ట్రేలియాలో పుట్టినా, లండన్‌లో స్థిరపడ్డారు. ఈయన ఆఫ్రికావెళ్లి చిత్రించిన ''జంతువుల చిత్రకళా ప్రదర్శన'' క్రితం నెల జరిగింది. ఎంతో పేరు తెచ్చింది ఈయనకు. దాదాపు అన్ని చిత్రాలు - సుమారు 70 చిత్రాలు - అమ్ముడు పోయాయి. జంతువులకు ఉన్న ఆకారాన్ని అలాగే ఉంచాలా, లేక ఆకారాన్ని విస్మరించి, ఆకారాన్ని ఉన్నట్లు ఆబ్‌స్ట్రాక్ట్ పద్ధతిలో చిత్రించాలా అన్న సందిగ్ధంలో ఉన్నాయి చిత్రాలు. చిత్రాలలో జంతువులు గాలిలో తేలిపోతున్నట్లు, జంతువులకంటే బ్యాక్ గ్రౌండు బలంగా ఉన్నట్లు అనిపిస్తుంది. నాకు అంతగా నచ్చలేదు చిత్రాలు.

డెరిక్ గ్రీన్స్, మెర్లిన్ ఇవాన్స్ చిత్రాలు నూటికి నూరుపాళ్ళు ''జాన్ ఆర్ప్'' చిత్రాలకు నకళ్లు. రంగులో క్రొత్త దనం తెచ్చిన చిత్రాకారులలో రోడిర్గో, లూయిస్, పాట్రిక్ హెరాక్ చాల ముఖ్యులు.

వైట్ ఛాపెల్ గ్యాలరిలో చిత్రాలు యువతరం వారివి. చిత్రాలు కూడా యువకులు, అంతగ అనుభవంలేని వాళ్ళు వేసినట్లుగనే ఉన్నాయి. కాస్త మంచి చిత్రాలు ఊరి ఆ చివర నున్న టేట్‌గ్యాలరిలో చూచి, ఈ చివర ఉన్న వైట్ ఛాపెల్‌కు వచ్చిచూస్తే ప్రయాణం వల్ల కల్గిన ఆయాసం ఎక్కువవుతుంది. కనుపించని ఎవరి చిత్రాలకోసమో

కళ్ళు చూస్తున్నట్లుంటుంది. అన్నీ దాదాపు అమెరికన్ చిత్రకళకు అనుకరణలు. స్థిరత్వం, తమలో తమకు నమ్మకంలేని బలహీనత, తన్నుకువస్తుంది, చిత్రాల నుండి. కాస్త కాకపోతే కాస్తయినా ''రాయల్ ఎకాడమి చిత్ర కళా ప్రదర్శనే'' నయమనిపిస్తుంది, ముసలి artists వారి మసక కళ్ళజోడులలోనుండి చూస్తూ ఏమి చిత్రిస్తున్నారో వారికే కనిపించకుండా వేసిన చిత్రాలువలె. అది రాయల్ ఎకాడమి చిత్రకళా ప్రదర్శన సంగతి.

హెరాల్డ్ కొహెన్‌తో ప్రారంభిస్తాను. 'ఏమండి' అని పలుకరిస్తే చాలు ''నేను రెండేళ్ళు అమెరికాలో చిత్రకళా మాస్టారుగా ఉన్నానన్నట్లు పోజిస్తారు. నిజంగానే పనిచేశారనుకోండి. అది ఈయనకున్న గొప్ప. మంచి పలుకుబడి ఉన్న వ్యక్తి అవడంవల్ల కొన్ని గ్యాలరీలు చిత్రాలు కొన్నాయి. చిత్రాలకంటే ఎక్కువగా ఈయనే మాట్లాడుతారు. నాలుగు రంగులు పెద్ద ఆకాశం అంత కాన్వాస్‌పై పల్చగా పూసి ఫ్రేముకడ్తారు. ఈయనకు చిత్రకళలో ఇన్స్పిరేషన్ అమెరికా నుండి, అమెరికన్ చిత్ర కారుల నుండి వస్తుందని ఆయనే చెప్పుతారు. తరచు వెళ్తూంటారు, ఇన్స్పిరేషన్‌ను తెచ్చుకుంటానికి తన వద్ద లయిపోయినప్పుడల్లా.

ఈయన సోదరుడు బెర్నార్డ్ కొహెన్‌గూడ చిత్రకారులే. ఈయన బహు లేతరంగులలో చిత్రాలు వేస్తే, హెరాల్డ్ బహు ముతక రంగులో వేస్తారు. అంతే తేడా. బెర్నార్డ్‌గారు సర్కస్ రింగులు పుచ్చుకున్నారు ఈ మధ్య. అవే తరచు ప్రత్యక్ష మవుతాయి చిత్రాలలో. ఒకసారి త్రాళ్ళ ముడులుగా, ఒకసారి ఒలింపిక్ రింగులుగా ఇందులో ప్రచురించిన చిత్రం ''ముడి'' అన్నది ఫోటోలో బాగుంది. అసలు చిత్రం చూస్తే, ఊసుపోక సరదాగా చిత్రించారా అనిపిస్తుంది. ఈయన కూడా అమెరికానుండి ఇన్స్పిరేషన్ తెచ్చుకుంటున్నారు, సోదరుని వలె. ఇంగ్లీషు చిత్రాకారుడు పెరి రిచ్చర్డ్ నుండి కూడా కొంత ఇన్స్పిరేషన్ వస్తున్నట్లు అనిపిస్తుంది. ఇద్దరి చిత్రాలు అన్నదమ్ములవి ఉన్నాయి ప్రదర్శనలో.

ఇక్కడ ప్రదర్శనం అంతలోకి నచ్చినవి డేవిడ్ హాక్ అనే యువచిత్రకారునివి. ఇతని చిత్రాలలో ప్రాక్ దేశ చిత్రాలలో ఉన్న వయ్యారం, రాగం ఉన్నది. ఈజిప్షియన్ చిత్రాలు చటుక్కున గుర్తుకు వస్తాయి. అయినా తన స్వంత ముద్ర కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది. ఎక్కువగా ఇద్దరు ముగ్గురు మనుష్యులకంటె చిత్రాలలో వెయ్యరు. 'పెండ్లి కూతురు - పెండ్లి కొడుకు' అనో 'స్నానం చేస్తున్న అతను' అనే పేర్లతోనో వేస్తారు. అందరికి అర్థం అవుతాయి చిత్రాలు.

జాన్ ష్లమ్బ్ అనునతను వేసిన ''నల్లబల్ల'' అన్న చిత్రం ఒకమాదిరిగా ఉంది. నల్లటి కాన్వాస్‌పై రంగురంగుల సన్నని కాగితం ముక్కలు బద్దలుగా అతికించి చేసిన చిత్రం.

అన్ని రంగులు దూరంగా నిలబడి చూస్తే మిళితం అయి బోర్డుపై రంగుల రాట్నం తిరుగుతున్నట్లుంటుంది. దూరానికి బాగా ఉన్నట్లు అనిపించినా దగ్గరకు వచ్చి చూస్తే రంగులలో తీవ్రత ఉండదు. బ్యాక్ గ్రౌండుకు, రంగుల ఆకారానికి సామ్యం ఉన్నట్లు లేదు.

ఆర్.బి.కితాబ్ చిత్రాలు బాగున్నాయి. ''పాప్ చిత్రకళ'' అని ఈ మధ్య క్రొత్త ''ఇజం'' చిత్రకళలో వచ్చింది. చిత్రంపై రకరకాల ఫొటోలు, బద్దలు, చెక్కలు, న్యూస్ పేపర్లలోని ఫొటోలు బొమ్మలు, సీసా మూతలు ఏదైనా సరే అతికించి సగం చిత్రం మాత్రమే చిత్రించి, మిగిలింది ఒదిలేస్తారు. కాన్వాసుపై ఆకారాలు, రూపాలు రియలిస్టు పద్ధతిలో చిత్రించినవి. గజిబిజిగా చిత్రించి, క్రొత్త భావాలను చెప్పాలనే ప్రయత్నం ఈ పద్ధతి ద్వారా వ్యక్తం అవుతుంది. అందులో పేరున్న చిత్రకారులలో కితాబ్ చాల ప్రసిద్ధి చెందినవారు. ఈయన చిత్ర ప్రదర్శన చిత్ర 3 నెలల క్రితం జరిగింది. చాల విజయవంతమైంది. దీనికి గూడ అమెరికన్ ఇన్స్పిరేషన్. ఇప్పుడు యువతరం పాశ్చాత్య చిత్ర కారులలో నూటికి 90 మంది ఈ 'పాప్' చిత్రకళలో చిత్రిస్తున్నారు.

జోటిల్సన్ అనే అతని చిత్రాలు ఎంతో రమ్యంగా ఉన్నాయి. ఇక్కడ ప్రచురించిన చిత్రానికి ''వాక్స్ పెట్టె'' అని పేరు. చెక్కలు నాలుగు అంగుళాల మందమువి కోసి, పెట్టెలాగ చేసి, అందులో ఉంచారు Vox అన్న అక్షరాలు. మేకులతో బిగించారు అక్షరాల్ని. నోరులో కనిపించే ఆశ్చర్యార్థకం గుర్తులు గూడ, బహుమందపాటి చెక్కలో కోసి, మేకులతో బిగించినవే. అవి పండ్లు కావచ్చు, లేక నోరు అనే పెట్టెలో ఉన్న చుట్టలు కావచ్చు, సిగరెట్లు కావచ్చు. పెదవులను లేత గులాబి రంగులో చిత్రించాడు. పెదవులకు గులాబి రంగు, మిగిలినది నలుపురంగు తప్పితే మరో రంగు వాడలేదు. మిగిలిందంతా చెక్కకు ఉండే సహజమైన రంగును అలాగే ఉంచారు. ప్రదర్శనలో చాలా బాగున్న చిత్రాలలో వీరివి ముఖ్యం.

ఆస్ట్రేలియన్ల చిత్రాల పద్ధతిలో చాలమంది వేశారు. స్టీవెన్సన్ అన్న అతను 'సురా' చిత్రాల లాంటి, రంగుల చుక్కల చిత్రాలు వేశారు. దూరానికి ఈ చిన్నచిన్న రంగుల చుక్కలు కలిసిపోయి, ఎంతో మనోహరంగా కనిపిస్తాయి.

ఇక మిగిలినవి చెత్త.

ఇలా రెండు భాగాలుగ ఏర్పరచిన ప్రదర్శనలు చూచివచ్చి, తీరికగా కూర్చుని ప్రదర్శన గురించి ఆలోచించాను. అసలు ఈ ప్రదర్శనలు ఎందుకు ఏర్పరిచినట్లు? ఏర్పరచి


సాధించినదేమిటి? బ్రిటిష్ చిత్రకళ ఎలాంటి పురోగతితో, నూత్న భావాలతో ఇప్పుడు ప్రపంచ చిత్రకళా రంగంలో పరుగులు తీస్తున్నదో చూపించాలని, ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. తీరా చూస్తే పురోగమనముగాదు తిరోగమనము అని తేలింది. ఉన్న నాలుగు (బ్రిటిషు పాతపేర్లు బెన్‌నికల్‌సన్, పాస్‌మోర్, ఫ్రాన్సిస్ బేకన్, జాన్‌పైపర్‌లు) పేర్లు తప్పితే క్రొత్తగా వచ్చిన పేర్లు బహు తక్కువ. ఇప్పటితరం బ్రిటిషువారి చిత్రకళలో నూతనత్వం అసలు గోచరించదు. నూతనత్వపు ఛాయలు గూడ గోచరించవు. అమెరికా చాల చాల ముందడుగు వేసింది. ఎన్నో రకాల క్రొత్త భావాలతో పద్ధతులతో, ఇటలీ ముందుకు పోతున్నది యూరప్‌లో.

ప్రదర్శనలో అందరికి పెద్ద పెద్ద సైజు చిత్రాలు వెయ్యాలనే ఉబలాటం కనిపిస్తుంది. చిత్రాలు పెద్దవైనంత మాత్రాన గొప్పవి కావు. ''పాల్ క్లీ'' చిత్రాలు అంగుళాలలో కొలవవచ్చు. అయినా అవి చిరస్థాయిగా నిలచేవి. ఈ ప్రదర్శనలోని చిత్రాల్ని, గజాలలో కొలవాలి. సగం మంది దాదాపు ముతుక రంగులలో చిత్రిస్తే, మరి సగం మంది లేత రంగులలో చిత్రించారు. ఏదో దారితెన్ను లేక, గాలివానలో కొట్టుకుపోతున్నట్లున్నారు ఇప్పటి బ్రిటిషు చిత్రకారులు. ఎప్పటికి వారికి, మరల ఏదో ఒక అండదొరికి, నిలబడగలరో, ఎవరూ చెప్పలేరు. పాతతరం చిత్రకారులకున్న బలం, వారి చిత్రకళపై వారికున్న నమ్మకం లేదు, ఇప్పటి యువ చిత్రకారులలో. అందుకే బాగా పరుగెత్తుతున్న అమెరికన్ల వైపు అర్రులు చాచి చూస్తున్నారు.

అతి త్వరలో ఈ బ్రిటిషు యువ చిత్రకారులు ఒక స్థాయిని చేరుకొని, వారిలో వారు నమ్మకం కుదుర్చుకోగలరని ఆశిస్తున్నాను. అది లేనిదే చాల రంగులలో సరి క్రొత్త భావాలను చెప్పడం, ప్రపంచ కళారంగంలో స్థానం సంపాదించడం.

*(భారతి, సెప్టెంబరు, 1963)*

★



# అమెరికన్, బ్రిటిష్ శిల్పాలు

చిత్రాలను చూడడం వేరు, శిల్పాలను చూడడం వేరు. వాటిని ప్రదర్శనాలయాలలో చూస్తాం సామాన్యంగా, లేకపోతే భవన నిర్మాణంలో కలసి ఉండగా చూస్తాం. అజంతా, లేపాక్షిలోని చిత్రాల్ని చూడాలంటే మనం వెళ్లి చూడాల్సిందే. అవి కదలవు. ఎల్లోరాలోని బ్రహ్మాండమైన శిల్పాలు మనల్ని చిన్ని, సామాన్య మానవులుగా చేస్తాయి. ఎంత అధికులమైనా మనం మన ప్రపంచంలో, వాటి దగ్గరకు వెళ్తే, ఆ శిల్పాలు ఎంతో ఎత్తునుండి క్రిందికి చూస్తాయి. మ్యూజియంలలోను, ప్రదర్శనలలోనూ అయితే మనం చిత్రాలను, శిల్పాలను తెచ్చి మనకు యిష్టమైన, అంగీకారమైన వెలుగు నీడలలో ఉంచి చూసి ఆనందిస్తాం. చిత్రాలను మనం ఏర్పరచిన వెలుగులో చూడాలి, శిల్పాలకంటే. దీనికి చాల కారణాలు ఉన్నాయి. చిత్రాలు ఆరుబయట ఉంచితే ఎక్కువ కాలం శిల్పాలు మన్నినట్లు మన్నవు. చిత్రాలను మనం ఒకచోట నిలుచుండి చూడవచ్చు. కాని శిల్పాలను చుట్టూ తిరుగుతూ చూడాలి. అందువల్ల ఆరుబయట కంటె చిత్రాలను భవంతులలో ఉంచితేనే ఎక్కువ ఆనందించగలము. శిల్పాలలో రెండు రకాలున్నాయి. ఆరుబయట ఉంచి చూచి ఆనందించవలసినవి. భవంతులలో ఉంచి ఆనందించవలసినవి. మన దేవుని విగ్రహాలు రాగి, కంచు లోహాలతో పోత పోసినవి చిన్నవి గనుక, గుడులలో ఉంచి ఆరాధిస్తాము. ఇవి పెద్దవిగా చేయవచ్చు. కాని, చిన్నవైతే వీలుగా ఉంటుంది, ప్రతిష్ఠించి పూజించడానికి. మైసూర్‌లోని గోమతేశ్వర్ విగ్రహము లాంటివి అసలు లేవు ఇండియాలో. ఇండియాలో ఉన్న శిల్పాలు ఎక్కువగ చిన్నవే, గుహాలయాలలోనివి మినహాయించితే. శిల్పాలను చేసేటప్పుడే శిల్పకారులు నిర్ణయించుకుంటారు, అవి ఆరుబయట ఉంచవలసినవో లేక భవంతులలో ఉండవలసినవో. ఆరు బయట ఉంచవలసినవి సైజులో పెద్దవిగను, వెలుతురు వాటిపై పడినప్పుడు మరింత శోభించేవిగను, పరిసర ప్రాంతాలకు సరిపోయేవిగను ఉంటాయి. ఇటువంటి శిల్పాల్ని

చూడడం ప్రకృతి మధ్య ఎంతో అందంగా ఉంటుంది. ఆ అవకాశం ఇండియాలో నాకు ఎప్పుడూ కలుగలేదు.

అన్ని శిల్పాల్ని ఆరు బయట ప్రదర్శించారు. ఇది ఆరవ ప్రదర్శన లండన్‌లో. ఏ మాట కామాట చెప్పుకుంటే ఇంగ్లీషువారికి కళలంటే చాల ప్రీతి. క్రొత్త క్రొత్త పోకడలను పోవడంలో కాస్త ఎక్కువ చురుకుదనం కలవారు. 1948లో మొట్టమొదటిసారిగా లండన్ కౌంటీ కౌన్సిలు (అంటే కార్పొరేషన్ అన్నమాట) శిల్పాన్ని ఆరుబయట పార్కులో ప్రదర్శించింది. ఆ ప్రదర్శన ఎంతో విజయవంతమైంది. సుమారు అయిదు లక్షల మంది ప్రదర్శనను చూశారట. అప్పటినుండి ప్రతి మూడు సంవత్సరముల కొకసారి, ఇలాంటి పెద్ద ప్రదర్శనలను ఏర్పాటు చేస్తున్నది లండన్ కౌంటి కౌన్సిలు. ఇది చూచి మిగిలిన నగరాలు, ప్రపంచంలో పలుచోట్ల, ప్రదర్శనలను ప్రారంభించాయి. ఇండియాలో ఏ మునిసిపాలిటీగాని, కార్పొరేషను గాని ఇలా శిల్ప ప్రదర్శనలను - కనీసం జాతీయ శిల్ప ప్రదర్శనలను - ఏర్పాటు చేసినట్లు నాకు తెలియదు. ఏమైతేనేం, ఒక క్రొత్త పోకడలో లండన్ నగరం ముందడుగు వేసి మార్గదర్శకమైనది ప్రపంచంలోని యితర నగరాలకు.

ఈ శిల్ప ప్రదర్శన చాల ప్రాముఖ్యత గలది. ఇంగ్లండులో ప్రస్తుతం ఉన్న హేమాహేమీలైన శిల్పకారులవి, అమెరికాలో గల హేమాహేమీలవి ఎంచి తెచ్చి ఉంచారు ప్రదర్శనలో. ఈ రెండు దేశాలలోని ప్రస్తుత శిల్పకళా స్థాయి తెలియజేస్తుంది యీ ప్రదర్శన. దీనికి కౌన్సిల్ ఎంతో శ్రమ తీసుకున్నది. ఎంతో ఖర్చుపెట్టింది. ఇటువంటి మహత్తర కార్యక్రమాన్ని దిగ్విజయంగా సాగించినందుకు కౌన్సిల్‌ను శ్లాఘించవలసిందే తప్పకుండ.

లండన్ కౌంటి కౌన్సిల్ అధీనంలో పెద్దవి, చిన్నవి పార్కులు ఎన్నో ఉన్నాయి. అందులో అన్నిటికంటె పెద్దది, ప్రసిద్ధి చెందినది 'బెటర్సిపార్క్'. ఇది నగరంలో దాదాపు మధ్యన ఉంది. 'చెల్సి' ఏరియాలోనికి వస్తుందనుకుంటాను ఈ పార్కు. చెల్సి ఏరియాలో పెద్ద పెద్ద హోదాలు కలవారు, ధనవంతులు నివసిస్తారు. చాలా ఖరీదైన ప్రాంతం. ఈ బెటర్సీ పార్కు థేమ్సు నది ఒడ్డునే ఉంది. పార్కులో కూర్చుని థేమ్సును, నగరమందలి బ్రహ్మాండమైన భవంతులను చూస్తూ జీవితం గడపవచ్చు. అంత అందమైన పార్కు యిది. అలాంటి పార్కును ఎన్నుకొనడంలోనే ఉంది, ప్రదర్శనకు రమ్యత. పార్కులో ఎన్నో చిన్న చిన్న కొలనులు. వీటిలో చేపలు పట్టుతూ గంటలు గడుపుతారు పిల్లలు, పెద్దలు గాలాలు ముందుంచుకుని. పార్కు అంతా ఎత్తు పల్లాలతోనిండి

ఉంటుంది. మధ్య మధ్య సన్నని బాటలు వంకరలు తిరుగుతూ, పార్కంతా నడిపిస్తాయి మనల్ని. ఇలా నడుచుకుంటూ పోతే, పార్కు మధ్య శిల్పాలు తలలెత్తి మనల్ని చూస్తుంటాయి - ఎవరా, ఎంతమందా వచ్చేది అని.

అమెరికాలోని శిల్పాలను న్యూయార్కులోని 'మ్యూజియమ్ ఆఫ్ మోడరన్ ఆర్ట్సు' వారు సెలక్టుచేసి పంపారు. ఈ ఆర్ట్ మ్యూజియం ప్రపంచ సుప్రసిద్ధ మ్యూజియమ్‌లలో ఒకటి. దాదాపు ప్రపంచంలోని ప్రసిద్ధ చిత్ర శిల్పకారులందరి శిల్పాలు, చిత్రాలు ఈ మ్యూజియమ్‌లో ఉన్నాయి. గనుక మ్యూజియమ్ ఆఫ్ మోడరన్ ఆర్ట్‌వారు సెలక్టుచేశారూ అంటే, అమెరికాలోని హేమాహేమీ శిల్పాల్ని పంపారు అన్నమాట. ఇరవై అమెరికన్‌లవి. బ్రిటిషు వారివి యిరవై. బ్రిటన్ తరుపున 'ఆర్ట్సు కౌన్సిల్ ఆఫ్ గ్రేట్ బ్రిటన్' ఎన్నిక చేసింది శిల్పాలను.

లండన్‌లో ఎక్కువగా అమెరికన్ చిత్రాలను చూస్తాం. ఎప్పుడూ వారివి ప్రదర్శనలు జరుగుతూనే ఉంటవి. ఈ మధ్య అమెరికన్ ప్రదర్శనలు విరివిగ సాగుతున్నాయి, యూరప్, ఇంగ్లండులలో. కాల్డర్, గాబో, లెప్పేడ్జ్, ఆర్కిపెంకో మొదలగు బహు కొద్దిమంది అమెరికన్ శిల్పకారుల శిల్పాలు తప్పితే, మిగిలినవారివి అంతగా తెలియవు బ్రిటన్‌లో. అందుకే గాబోలు మ్యూజియం ఆఫ్ మోడరన్ ఆర్ట్సు డైరెక్టర్‌గారు ఈ ప్రదర్శనకు శిల్పాలు పంపుతూ ''ఈ ప్రదర్శన నేటి అమెరికన్ శిల్పకళను, శిల్పకారులను బ్రిటన్‌కు పరిచయం చేస్తుంది'' అన్నారు. ముఖ్యంగా ఈ ప్రదర్శనలో బ్రతికి ఉన్న శిల్పకారులవి, ఈ మధ్యనే చేసినవి ప్రదర్శించడం జరిగింది. అమెరికన్ ప్రదర్శకులు తమ శిల్పాల గురించి చెపుతూ ''మా శిల్పాల ఎన్నిక రెండు పద్ధతులపై జరిగింది. ఒకటి: ప్లాస్టిక్‌లోను, ప్రత్యేకమైన లోహములలోను చేసిన నూతన శిల్పాలను ప్రదర్శనకు తేలేదు. ఆరు బయట ప్రదర్శనకు వీలైనవే ప్రదర్శనకు తెచ్చాము. రెండు : శిల్పాలు అన్నీ శిల్పకారులు క్రొత్తగా చేసినవే.''

ఈ ప్రదర్శన రెండు దేశాలలోని ప్రముఖ శిల్పకారుల నూత్న శిల్పాలను చూపుతుంది. ఇది ఒక విధంగా రెండు దేశాల మధ్య 'భేటి' అని చెప్పవచ్చు. ఇంగ్లీషువారి హెన్రీ మూర్, బార్బరా హెప్‌వర్త్‌లు, అమెరికన్ మార్కెట్‌లో అమెరికన్ శిల్పకారుల కంటే పెద్ద 'డిమాండ్'లో ఉన్నారు. పెద్ద పెద్ద వ్యాపార సంస్థలు, మ్యూజియములు వీరిద్దరివి విరివిగా కొంటున్నాయి. క్రితం మే నెలలో హెన్రీమూర్‌కు ఇటలీలో ''ఆంటోనియా ఫెల్ట్రినెల్లీ ఫౌండేషనువారు తమ అంతర్జాతీయ బహుమతిని

రు. 2,10,000 యిచ్చారు. ఈ బహుమతి ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. అంటే మూర్‌కు ప్రపంచంలో ఉన్న స్థానం చూడండి! అమెరికన్‌లు, తమ అధునాతన శిల్పాలను ప్రదర్శించి, తమ పోకడలు ఎంత బలమైనవో, వినూత్నమైనవో తెలియపర్చాలనే గట్టి పట్టుదల ఉన్నట్లు కన్పిస్తుంది ప్రదర్శనలో. ఏమైతే నేం ఇదొక మహత్తర అవకాశం ఈ ప్రదర్శనను చూడడం.

ప్రదర్శనకు వెళ్తుంటే ముందుగా మనల్ని చూచేది హెన్రీమూర్ ''నిలుచున్న స్త్రీ''. దీన్ని లోగడ జరిగిన కామన్ వెల్త్ ప్రదర్శనలో ప్రదర్శించారు. ఈ శిల్పాన్ని ఎత్తుగా ఉన్న చిన్న గుట్టపై ఉంచారు. అసలే నిలువుగా పొడుగ్గా ఉన్న (9 అడుగుల నాలుగు అంగుళాలు) ఈ సోయగపు వయ్యారి భామను గుట్ట ఎక్కించితే, మరీ పొడవై, తల ఆకాశాన్నంటి నట్లుంటుంది. ఏదో చేతులు విరిగి పోయిన గ్రీకు మూర్తిలా ఉంది. ఆరు బయట, పార్కులో విహరిస్తూ, పార్కుకు అందం తెచ్చింది ఈ కంచు మూర్తి. నిజానికి ఎంతో అదృష్టవంతుడు మూర్. ప్రతిభాశాలులెంతమంది ఉన్నా, ఈయన ఇరువదవ శతాబ్దంలో పెట్టని కోటై నిలచారు. అసలు ఇంగ్లండుకే మకుటాయమానం. అందుకే కాబోలు ఈమధ్య లండన్ వచ్చిన అమెరికన్ వాస్తుశాస్త్రజ్ఞుడు గోర్డన్ బంకర్ ''ఎనిమిది వందల సంవత్సరాల నుండి వచ్చిన ఇంగ్లీషు శిల్పకారులలో, మొట్టమొదటి గొప్ప శిల్పకారుడు హెన్రీ మూర్.'' అన్నాడు. ఇక నాలాంటివాడేమి వ్రాయగలడు హెన్రీ మూర్ గురించి!

మరొక విచిత్రమైన శిల్పం బార్బరా హెప్‌వర్త్‌ది. హెన్రీ మూర్‌ది ప్రదర్శనకు రాగానే మొదటగా కనిపించేదైతే, హెప్ వర్త్‌ది వెతగ్గా వెతగ్గా ఓమూల కుప్పలో, చిన్న కొలను ప్రక్కన, కునుకులు తీస్తుంటుంది. ఏదో పర్వతం ముక్క విరిగి, ఒరిగిపోయి ఉన్నది కాబోలు అనిపిస్తుంది. విచిత్ర మేమంటే ఇది చాల చాల సింపుల్‌గా మలచిన కంచు శిల్పం. ఇంతకంటె సింపుల్‌గా చేసినది మరొకటి లేదు ప్రదర్శనలో. కీర్తిశేషులు హోమర్ షెల్డ్‌కు అంకితంచేయడం కొరకు, ప్రత్యేకంగా ఆయన మెమోరియల్ కోసం, చేసిన శిల్ప మిది. పది అంగుళాల మందం, పది అడుగుల మూడు అంగుళాల ఎత్తు, ఆరు అడుగుల ఆరు అంగుళాల బ్రహ్మాండమైన పల్చని పలక. బియ్యపుగింజను తలక్రిందుగ ఉంచినట్లు ఉంటుంది. శిల్పం పైభాగంలో పెద్ద గుండ్రని కన్నము తొలచబడింది. ప్రత్యేక తరహా పలకలోని గుండ్రని రంధ్రము తల, ముఖము ఆకారముగ మనల్ని ఊహింపజేస్తుంది. ఎంతో ఎత్తయిన, సున్నితంగా మలచబడ్డ శిల్పం. హోమర్ షెల్డ్ ఎంత అతిసామాన్య వ్యక్తో శిల్పంగూడ అంత సామన్యంగాను, నగిషీలు, వంపులు, వయ్యారాలు లేకుండా

స్థిరంగా, ప్రశాంతంగా ఉన్న గంభీరమైన శిల్పం. ప్రదర్శన అంతా చిన్నిలోయ, గుట్టల మధ్య ఉంటే, ఈ శిల్పాన్ని మాత్రం ప్రత్యేకంగా దూరంగా ప్రశాంతమైన స్థానంలో, నీడలో కొలను ప్రక్క ఉంచారు. ఇది మెమోరియల్‌కు తగ్గ వాతావరణము అని తలచారు.

మూడవ వ్యక్తి ఇటీవల అకస్మాత్తుగ పేరులోనికి వచ్చిన రెజ్ బట్లర్. ఈయన అసలు ఆర్కిటెక్చర్ చదివి, కొంతకాలం ఆర్కిటెక్ట్‌గా ఉన్నాడు. తర్వాత ''ఆర్కిటెక్ట్స్ జర్నల్''కు టెక్నికల్ ఎడిటరుగా ఉద్యోగం చేశాడు. 1950 నుండి శిల్పాలను చేస్తూ శిల్పకారుడుగా స్థిరపడ్డాడు. ప్రపంచ ప్రసిద్ధ ఆర్కిటెక్ట్, మన చండీఘర్ నగర నిర్మాత లీకర్బ్యూసియే మొదట గొప్ప చిత్రకారుడు, తర్వాత ఆర్కిటెక్ట్‌గా మారి ప్రసిద్ధి చెందాడు. బట్లర్ ఆర్కిటెక్ట్‌గా ఉండి శిల్పకారుడయ్యాడు. ఇద్దరికి చాల పోలికలున్నాయి. బట్లర్ నేనున్న లండన్ యూనివర్శిటిలో శిల్పకళలో అధ్యాపకుడు. ఆయన్ను చాలసార్లు కలుసుకున్నాను. విమర్శనాపూర్వక దృష్టి ఉన్న వ్యక్తి. ఈ మాట ఎందుకు వ్రాస్తున్నానంటే చాలామంది చిత్ర, శిల్పకారులకు విమర్శనాజ్ఞానం అంతగా ఉండదు. ఈ విమర్శనాదృష్టిని కళా విమర్శకులకు వదిలివేస్తారు - ఏదో అది తమ వృత్తి కాదు అన్నట్లు. మన ఇండియన్ శిల్పాల గురించి ఎంతో ఆసక్తి చూపారు. హిందూ, బౌద్ధ శిల్పాలంటే ఎంతో గౌరవం. 1953లో అంతర్జాతీయ ప్రదర్శనలో ''అన్‌నోన్ పొలిటికల్ ప్రిజనర్''కు బహుమతి వచ్చింది. అప్పటినుండి ఈయన చాల ప్రసిద్ధి కెక్కాడు. ఈయన నిలుచుండి చేతుల పైకెత్తి, జారుతున్న బరువైన జుట్టును ఎగనెట్టుతున్నట్లున్న స్త్రీ శిల్పాన్ని ప్రదర్శించారు. 8 అడుగుల ఎత్తు గల కంచు శిల్పం. ఈ శిల్పాన్ని చూస్తే మన ఇండియన్ శిల్పానికి ఏదో చవుకరకం నమూనా అనిపిస్తుంది. తన స్వంత పద్ధతిని మార్చి, మరో పద్ధతి కొరకు వెతుకుతున్న స్థితి ఈయనది. బట్లరు శిల్పాన్ని చూచి నిరుత్సాహపడతాం. ఏదో ఊసుపోక చేసిన శిల్పమా యిది అనిపిస్తుంది.

రాల్ఫ్ బ్రౌన్ యిప్పుడే పైకి వస్తున్న శిల్పకారుడు. ప్రస్తుతం రాయల్ కాలేజిలో ట్యూటరుగా ఉంటున్నాడు. చాల బలమైన శిల్పాలను చేస్తాడు. ఈయన శిల్పాలు ''నిలుచున్న స్త్రీ'', ''కూర్చున్న స్త్రీ'' లాంటివే అన్నీ. అయినా ఎంతో బాధ, జీవితంలో గల విచారాన్ని ఒలకబోస్తాయి. పగిలిపోయిన జీవితాన్ని సూచిస్తుందా అన్నట్లు శరీరం, ముఖం అంతా పెద్ద పెద్ద గాట్లతో పగిలిపోయి ఉంటుంది శిల్పం. అవయవ నిర్మాణంలో ఎంతో తేడాలతో, ఎత్తు పల్లాలతో, విచిత్రమైన ఉబికినట్లుగ వుండే శరీరాలను చేస్తాడు శిల్పంలో. నిజంగా అవి దీనంగా మనల్ని పలకరిస్తాయి. శిల్పకారుడు ఎంతగానో జీవితాన్ని పరిశోధించిన వ్యక్తిగా అగుపిస్తాడు. ఈ సంవత్సరం బియనాలె ప్రదర్శనకు ఈయన

శిల్పాన్ని, పారిస్‌కు సెలక్టుచేసి, బ్రిటన్ తరపున పంపారు. ఇచ్చట ప్రదర్శించిన ''తిరిగి ఉన్న స్త్రీ'' అన్న శిల్పం అయిదు అడుగుల రెండు అంగుళాలది. ఎంతోమందిని ఆకర్షించింది.

జార్జి హెర్లిక్ అనే అతను వియన్నాలో జన్మించాడు. వసుధః చిత్రకారుడు. ముప్పది ఏండ్ల తదనంతరం చిత్రలేఖనాన్ని వదలి శిల్పాన్ని సాధన చేశాడు. 1937లో పారిస్‌లో జరిగిన అంతర్జాతీయ కళా ప్రదర్శనలో గోల్డు మెడల్ సంపాదించడంతో పేరులోకి వచ్చాడు. 1947 నుండి ఇంగ్లండులో స్థిరపడిపోయాడు. సహజ రూప చిత్రణలో మంచి ప్రావీణ్యత ఉన్న వ్యక్తి. ఇచ్చట ప్రదర్శించిన శిల్పం ''నిద్ర పోతున్న దూడ'' అన్నది. చిన్న సైజుది. ప్రపంచం అంతా ఒక దోవన పోతుంటే. తను మాత్రం కదలక మెదలక తాను ఉన్నచోటే అంటిపెట్టుకుని ఉండే తత్వం గలవాడుగ అగుపిస్తాడు శిల్పం చూస్తుంటే. శిల్పంలో ఉన్న గొప్పతనం ఏమిటి? ఎందుకు చేసినట్లు అని ప్రశ్నించుకుంటే, ఏసమాధానం దొరకదు. ఆయన తృప్తికి, ఆయన మలచుకొన్న సహజరూప శైలి శిల్పం. మన నందిని చూస్తే ఎంత సజీవంగా ఉంటుంది! ఆకారం సహజంగా ఉన్నట్లు ఉన్నా, నిజానికి నంది దేనికి ప్రతిరూపం కాదు . గజ్జెలు, నందికిగల నగిషీలు, ఆకులవంటి చెవులలో శిల్పకారుని ఆనందాన్ని, నందీశ్వరునిలో తను పొందుతున్న తన్మయత్వాన్ని చూడగల్గుతాం. అటువంటి సృజనాత్మక విధానం ఉంది మన శిల్పంలో. అందుకే మనవి గ్రీకు, రోమనులవలె ప్రకృతి వస్తువులకు నమూనాలుగా గాక, అలౌకిక ఆనందాన్నిచ్చే శిల్పాలుగ, ప్రసిద్ధి పొందినాయి. ఈ నిద్రిస్తున్న దూడను చూస్తే చిత్రకళాశాలలో నేర్చుకొంటున్న నాలుగవ లేక ఐదవ సంవత్సరపు విద్యార్థి, పరీక్షల కొరకు జాగ్రత్తగా మలచిన శిల్పంలాగ ఉన్నది. ఒకటి మాత్రం అగుపిస్తుంది. శిల్పం సునాయసంగా చాల ఈజీగ, సులువుగ చేసినట్లు కనిపిస్తుంది. ఈ సులువు అనుభవాన్ని బట్టి వస్తుంది. ఇదొక్కటే సహజత్వానికి దగ్గరగా ఉన్న శిల్పం ప్రదర్శనలో - బ్రిటిషువారి విభాగంలో.

రాబర్ట్ క్లాట్‌వర్తీ ''నిలుచున్న ఆకారము'', మాక్ విలియమ్ ''పడుకున్న స్త్రీ'', బెర్నార్డ్ మెడోస్ ''నిలుచున్న సైనికుడు'' లాంటివి ఎన్నో ఉన్నాయి. బ్రిటిష్‌వారు అన్నీ నిలుచున్న ఆకారములు తప్పితే మరోటి చెయ్యలేరా అనిపిస్తుంది. ప్రపంచంలోని ఎన్నో ఆకారాలను శిల్పంలోకి తేవచ్చు. ఎన్నో లోహములలో చేయవచ్చు. ఇప్పుడు వస్తున్న ప్లాస్టిక్ రబ్బరును ఉపయోగించవచ్చు శిల్పంలో. ఈ విధమైన ప్రయోగాలను వదలి ఇంకా హెన్రీమూర్ చుట్టూ తిరగడం, ఏమంత అభివృద్ధికరంగా ఉన్నట్లు కన్పించదు. హాస్కిన్

యొక్క బోల్టులతో బిగించిన పెద్ద ఇనుప పలకలు, బ్రియాన్ నీల్ 'క్రూసి ఫిక్షన్', చాద్విక్ ''రెక్కలతో ఉన్న ఆకారము'' ఎంతో బాగున్నాయి. ఏమైనా క్రొత్త ఆకారాలను, పద్ధతులను తెస్తే వీరిలోనే ఎవరైనా తేవాలి. మధ్య వయస్కులు, వయస్సు మీరిన హెన్రీమూర్ లాంటి వారినుండి ఇక ఏమంత క్రొత్తదనం ఆశించలేం. యువకులైన బ్రియాన్ నీల్ లాంటివారు ఎంతో ఉత్సాహంగా శిల్పాలను మలుస్తున్నారు.

మొత్తంమీద క్రొత్తదనం ఏమంత లేకపోయినా, అందరూ ప్రముఖులే. ఇంతమంది శిల్పాలను ఒక్కసారి ఒక్కచోట చూడడం ఎంతో ఆనందం కల్గిస్తుంది.

అమెరికన్ విభాగం నిజానికి చాలమందిని ఆకర్షించింది. ఎంతో ఉత్తమమైనవి ఎన్నికచేసి తెచ్చారు అమెరికా నుండి. చెప్పాలంటే ''క్రొత్త ఒక వింత''. వారి ఊహలు, చేష్టలు చంద్రమండలంలో విహరిస్తాయి. ఎన్నో రకాల లోహాలను శిల్పంలో ఇమిడ్చారు. వారికి కావలసిన ఆకారాలను, ఆకులనుండి, గడ్డిపరకల ఆకారాల నుండి, చెట్టు బోదెల నుండి, స్తంభాల నుండి, ఇది అది అని ఏమిటి - ప్రకృతిలో ఉన్న ప్రతి దానినుండి గ్రహించారు. అంటే ఎంతగా వారు తమ మనో నేత్రాలను తెరచి వెతుకుతున్నారో తెలుస్తుంది. అమెరికా గూడ ఒక 'యిజాన్ని' సృష్టించగలదు అని చెప్పాలని వారు తీవ్రంగా కృషి పెట్టినవైనం తెలుస్తుంది. ''ఆబ్స్ట్రాక్ట్ ఎక్స్‌ప్రెషనిజమ్, యాక్సిడెంటలిజమ్, ఇప్పుడు వచ్చిన క్రొత్త ''పాప్ ఆర్ట్'' అనే వివిధ పద్ధతులు చిత్రలేఖనంలో యిరువదవ శతాబ్దాన్ని ఒక్కసారి ఊపివేసాయి. వీరి తాకిడి ప్రపంచంలోని ప్రతి యువ చిత్రకారుని మీద పడింది, బలంగా - ఎంతో బలంగా.

'జార్జి రికే' యొక్క శిల్పం ''వేసవికాలం'' అన్నది ఎంతో రమ్యంగా ఉంది. ఇది కదిలే శిల్పం. గాలికి ఊగే రేకుల శిల్పం. 13 అడుగుల బారుగల సన్నని రేకులు ఆరు కట్టబడి ఉన్నాయి, కొద్ది కొద్ది దూరంలో. ఈ బారు రేకులు మొదలు కొద్దిగా వెడల్పుగా ఉండి పైకి పోనుపోను అతి సన్నవై ఆకారంలో మొగలి రేకులు లాగ ఉన్నాయి. సన్నని తీగలతో బంధించారు, మొదలుకు కొద్ది పైభాగంలో. గాలి ఏమాత్రం వీచినా ఇవి ఒకదానిలో మరొకటి ఇరుక్కుని ఒకదానికి మరొకటి తగిలి సన్నగా సంగీతాన్ని వినిపిస్తాయి. వెండిలాంటి తెల్లని రంగులో ఉన్న ఈ శిల్పం సూర్యరశ్మిలో మరింతగా తళుక్కు తళుక్కున మెరుస్తూ ఎంతో ఆహ్లాదంగా కంటికి, వీనులకు వినసొంపుగ ఉన్నది. సన్నని చిరు చలిగాలిలో, అక్కడ విసరిన శిల్పాల మధ్య గల పచ్చగడ్డిపై కూర్చొని, శిల్పాలను చూస్తూ ఆనందిస్తుంటే, ప్రతి అయిదు నిముషాలకు ఒక విమానం పై నుండి పోతూ మోతచేస్తూ పలుకరిస్తాయి. ఇటువంటి శిల్ప ప్రదర్శన ఒక అనుభవం. మరువలేని

ఆనందం. ముఖ్యంగా ఈ ''వేసవి కాలం'' అన్న శిల్పం, ప్రకృతిలో సరిగ్గా కలిసిపోయిన శిల్పం.

నిజానికి ఈకదిలే శిల్పాలను సృష్టించింది అలగ్జాండర్ కాల్డర్. ఇవి సృష్టించి శిల్ప కళారంగంలో సంచలనాన్ని తెచ్చిన వ్యక్తి. వీటిని ''మోబైల్స్'' అంటారు. అసలు ''మోబైల్'' అని నామకరణం చేసింది అమెరికన్ ప్రఖ్యాత చిత్రకారుడు డబ్‌హాంప్. అప్పటినుండి అలగ్జాండర్ కాల్డర్‌కు మరొకపేరు ''మోబైల్స్'' అయింది. విచిత్రం ఏమంటే ఈ ''మోబైల్స్'' మనిషి, ఈ దఫా ''స్టబైల్స్'' ప్రదర్శించాడు. అంటే ఇవి కదలవు అన్నమాట. ఆకారాలు, రంగులు అన్ని మోబైల్స్ లాగే ఉంటాయి ఒక్క కదలిక తప్ప. పెద్ద 14 అడుగుల పొడవైన స్టబైల్‌ను ''గొల్లభామ పురుగు'' లాంటి దాన్ని ప్రదర్శించాడు. నల్లని రంగు వేసి ఉన్నదేమో, యిది ఏదో పెద్ద పురుగు ప్రాకుతున్నది పార్కులోని గడ్డిలో, అనిపిస్తుంది దూరానికి. కదలిక లేక పోయినా కదులుతున్నట్లు అనిపిస్తుంది, ఆ మలచిన తీరు. పల్చటి రేకులకు కత్తిరించి చేసినది. ముచ్చటగా, అసలు ఏ శిల్పానికి సంబంధం లేకుండా, ప్రత్యేకంగా ఉంది. చూడగానే ''కాల్డర్‌ది'' అని తప్పక చెప్పుతుంది. కాని, ఈయన మోబైల్స్ బాగుంటాయి స్టబైల్స్ కంటే. వారి శిల్పాలను ప్రదర్శించడంలో ఒక ప్రత్యేకత వున్నది. వీటిని తాడుతో వ్రేలాడదీయాలి, అన్ని శిల్పాల మాదిరి ఒక దిమ్మపై ప్రదర్శించడం గాక. అలా వ్రేలాడదీస్తే గాలికి కదులుతూ, రంగు రంగులలో ఉన్న చిన్న చిన్న రేకులు, చువ్వలు వాటి కవి తిరుగుతూ, చిన్న రంగులరాట్నంలా, సరదాగా ఉంటుంది చూడ్డానికి. నిజానికి ఏ ప్రదర్శనకైనా సరే జీవాన్ని తెస్తాయి ఈయన శిల్పాలు. ఈయన స్టబైల్స్‌కు పేరు పెట్టింది ప్రఖ్యాత శిల్పకారుడు జీన్ ఆర్ప్. కాల్డర్‌ను కలిసినప్పుడు ఒకసారి జీన్ ఆర్ప్ అడిగాడు ''నిరుడు నువ్వు ప్రదర్శించిన వాటిని ఏమన్నావ్ - స్టబైల్సా?'' అని అప్పటినుండి వీటికి స్టబైల్స్ అన్నమాట ఖాయంగా నిల్చింది.

మరొక ప్రఖ్యాత శిల్పకారుడు లెనార్డ్ బాస్కిన్ ''చనిపోయిన మనిషి'' అనే ఆరడుగుల పది అంగుళాల కంచు శిల్పాన్ని ప్రదర్శించాడు. అప్పుడే ఎక్కడో భూగర్భంనుండి త్రవ్వి తీసినదిలాగ ఉంది. ఆకారాలు అస్పష్టంగా మలచబడి తిన్నగా పరుండబెట్టిన శిల్పం. ఈయన గ్రాఫిక్స్ చాల బాగుంటాయి. దారు శిల్పాలు గూడ ఎంతో బాగుంటాయి. అసలు వీటిని చూడగనే మనం చెప్పగలం, ఇవి బాస్కిన్‌వి అని. కాని, ఎందువల్లనో ఈ 'చనిపోయిన మనిషి' అన్న శిల్పం అంతగా నచ్చలేదు. అసలు బాస్కిన్ యొక్క పద్ధతి, ఆయన శిల్పాలు, లితోగ్రాఫ్‌లలో ఉండే సునిశిత పరిహాసం దీనిలో లేదు.

హారిబెర్టోయా యొక్క, కంచుతో చేసిన చెట్టు లాంటి పల్చటి రేకు ఎంతో బాగాఉంది. ఇదికూడ భూమిలో నుండి త్రవ్వి పైకి తీసిన, ఏ క్రీస్తుపూర్వపు శిల్పమో అన్నట్లుంది. రేకు అంతా తుప్పు తినివేసిందా అన్నట్లూ, బుద్ధుడు సిద్ధి పొందిన బోధి చెట్టులాగానూ ఉంది.

ఉలినింప్ ''బర్త్ ఆఫ్ వీనస్'' అన్నది సహజరూపంలో మలచిన శిల్పం. ఇది ఫౌంటెన్. తోకలపై నిలచిన నాలుగు నీటి గుర్రాల తలలపై పెద్ద ముత్యపుచిప్ప ఉంది. అందులో వయ్యారంగా ఒరిగి శయనించిన వివస్త్ర స్త్రీ రూపం. చిన్నది ఫౌంటెన్. వీనస్ అన్న ఈ స్త్రీ బాగా లావుగ ఉండి (అమెరికన్ ''హాట్ డాగ్స్'' తిన్నందువల్ల గాబోలు) ప్రఖ్యాత చిత్రకారుడు రూబెన్స్ నగ్న స్త్రీ చిత్రం మాదిరిగా ఉంది. వీనస్ అనగానే మనకు ''బోటిచెల్లీ'' యొక్క మరపురాని చిత్రం జ్ఞప్తికి వస్తుంది. 17,18వ శతాబ్దపు ఇటాలియన్, డచ్ చిత్రకారులు వీనస్‌ను సృష్టించి, కళలో మన ఊహకు అందని స్థాయికి తీసుకుని పోయారు. ఆ స్థాయిని అందుకోవడం ఇక మన తరం కాదు, లియనార్డో డావిన్సీ ''మోనాలిసా'' తరువాత అందమైన చిత్రం బోటిసెల్లీ ''బర్త్ ఆఫ్ వీనస్'' అని నా ఉద్దేశ్యం. ఈ ప్రదర్శనలోని వీనస్ మాత్రం చాల చవుకబారుగా ఉంది.

జాలియస్‌శ్మిమిట్ ఎంతో ముచ్చటైన శిల్పాన్ని ప్రదర్శించాడు. దీన్ని చూడగానే మన చితోడ్‌గడ్ శిల్పస్తంభం జ్ఞప్తికి వస్తుంది. ప్రాక్‌దేశాల ప్రభావం ఎంతగానో ఉందీయనలో. ప్రపంచ ప్రసిద్ధ శిల్పకారుడు జాడ్కిన్ వద్ద కొంత కాలం ఉన్నాడు, శిల్పాల్ని చేస్తూ. ఈ ప్రదర్శనలోని చాలామంది శిల్పకారుల్లో ఇటాలియన్ శిల్పకారుల ప్రభావం మెండుగా కన్పిస్తుంది. జూలియస్ శిల్పం ఇనుములో మలచినది. నగిషీ పని చేసిన నెక్లెసులా ఉంటుంది, ఇతని శిల్పం తీరు. ఈయన దీనికి అసలు పేరు పెట్టలేదు. అంటే మనకు ఏది తోస్తే అది ఊహించవచ్చును. దీన్ని అమెరికాలో ఆకాశాన్నంటే హర్మ్యాలతో పోల్చవచ్చునేమో! అమెరికన్ ఆర్కిటెక్చర్ పైకి చెట్టు పెరిగినట్టు పెరుగుతుంది. అసలు న్యూయార్క్ నగరాన్ని చూస్తే ఎన్నో పుట్టగొడుగుల్లాగ పెరిగిన భవనాలు, చిన్న చిన్న కిటికీలతో నిండి, రాత్రిపూట వెలుతురు కిటికీల గుండా బయటికి ప్రసరిస్తూ, ఎంతో విచిత్రంగా కనిపిస్తుంది. రాక్‌ఫెల్లర్ భవనం చూచాక, జూలియస్‌కు ఈ శిల్పం చేయాలని ఊహ కల్గిందేమో - తెలియదు. ఆర్కిటెక్చర్‌కు శిల్పానికి ఎంతో సామ్యం సాధించారు, యిరువదవ శతాబ్దపు శిల్పకారులు - ముఖ్యంగా అమెరికన్లు. ఈ ప్రదర్శనలో ఈ శిల్పం చాలమందిని ఆకర్షించినది.

జోస్ డి రివేరా యొక్క ''కాపర్ కన్‌స్ట్రక్షన్'' అన్న మూడు అడుగుల చిన్ని రాగి శిల్పం ఒక చిన్ని గేయం లాంటిది. రాగిరేకును కత్తిరించి మలచినది. తామరాకు గాలికి ఎలా ఒక ప్రక్కకు వంగి మడత పడుతుందో అలా మడచిన రేకు. దీన్ని గుండ్రని చిన్ని ఇనుపస్తంభంపైన ఉంచారు. నిజానికి ఇది గాలిలో రెపరెప లాడుతున్న తామరాకులాగ ఎంతో సునిశితంగా ఉంది. ఆకు లోపలి భాగం పాలిష్ చేశారు. బయట వైపు కిలుము పట్టింది. ఎండలో మెరుస్తూన్న లోపలిభాగం అప్పుడే నీటిలో మునిగి తేలిన ఆకులాగ ఉంది.

జాసన్ సెలీ శిల్పం ఎనిమిది అడుగులు ఎత్తయినది. ఇది 'క్రోమ్ ప్లేటెడ్ స్టీల్‌తో' చేసినది. శిల్పం అంతా రేకులతో చేసినదే. ఈ రేకులు కారు ముందు బారుగ పాలిష్ చేసివుండే 'నికిల్ బంపర్స్'. వీటిని బాగా మండే మంటలో కాలిస్తే రకరకాల పంచ వర్ణాలుగ నికిల్ పైభాగం కనిపిస్తుంది. వర్షాకాలంలో నిండి పారేకాలువలోని నీటిపై పెద్ద పెద్ద మచ్చలు కనిపిస్తాయి - రంగు రంగులుగా. రోడ్లపై గల మట్టి, నూనె మొదలగునవి అన్ని కలిసిన ఈ జిడ్డు, నీటిపై తేలుతూ, సూర్యరశ్మి పైన పడగానే ఇంద్రధనుస్సులోని రంగులలాగ కనుపిస్తుంది. దూరానికి ఈ శిల్పం రంగు రంగులుగా కనిపిస్తుంది. అసలు బలం చూపడానికై చేసిన శిల్పమిది. జంతువుయొక్క ప్రక్క ఎముకల మాదిరిగ ఉన్నది శిల్పం యొక్క మధ్య బాగం, దానిపై నుండి ప్రక్కలకు, పైకి సాగిన తీక్షణమైన కత్తిలాంటి మొనల, వంపుల ఆకారాలు ప్రత్యేకత. చొరుచుకుపోతున్నదా తన చుట్టూ ఉన్న వాతావరణాన్ని అనిపిస్తుంది. నాకు బాగా నచ్చిన శిల్పాలలో ఇది ఒకటి.

మరొక బహు చక్కటిది డిమిత్రి హాద్జి యొక్క సైనికుడు తలపై ఉంచుకొనే ఇనుప టోపీ. డిమిత్రి దీనికి పుట్టగొడుగు నుండి ఆకారాన్ని మలుచుకున్నట్టుగ అగుపిస్తుంది. పెక్కు కప్పులతో ఒకదానిపై మరొకటి చేరి నిలువుగ ఉన్న బారైన శరీరానికి రక్షణగా నిలుస్తుంది.

ప్రదర్శన చూస్తే యిప్పటి ప్రపంచంలో ఉన్న రెండు రకాల అభిప్రాయాలు తెలుస్తాయి. ఒకటి భావం కోసరం ఆకారాన్ని పూర్తిగా విస్మరించింది. కాలానికి తగినట్లుగ భావాల్ని వ్యక్తపరుస్తూ, ఆ భావానికిగాను ఈ కాలంలో దొరికే నూత్న లోహాలు, ఇతర పదార్థాలతో శిల్పాలను మలచడం. ఇది అమెరికన్ పద్ధతి. మరొకటి రూపాన్ని పూర్తిగ ధ్వంసం చెయ్యకుండ, దాన్ని తమకు అనుకూలంగా, కాలానికి సరిపోయేలా సరిపెట్టడం. ఇది ఇంగ్లీషు పద్ధతి. నిజానికి ఇంగ్లీషువారికి ఒక సంస్కృతి, ఒక సంప్రదాయసిద్ధ పద్ధతి

ఉంది. దాన్ని పూర్తిగ విధ్వంసం చెయ్యడం అంటే అంత సులువుగా జరిగే పనే కాదు . అమెరికన్‌లకు ఒక సంప్రదాయం, ఒక సంస్కృతి లేదు. అందువల్ల వారు సులువుగ క్రొత్త మార్గాలను, తాము పోగొట్టుకుంటున్నామే తమకున్న దానిని అనే మథన మనసులో లేకుండా, త్రొక్కగలరు. ఈ విభిన్న మార్గాల కూడలి ఈ ప్రదర్శన.

మైకెలాంజెలోని ''ఏమయ్యా! ఒక మంచి శిల్పానికి నిదర్శన ఏమిటి?'' అని అడిగితే అన్నాడు: ''పొరపాటున కొండపై నుండి జారిపడితే ఏమాత్రం చెక్కు చెదరకుండా ఉండేదే మంచి శిల్పం'' అని. ఈ సూత్రం ఎంత వరకు ఉపయోగిస్తుంది ఇప్పుడు? గాజుతో, రేకులతో చేసిన శిల్పాలు ఈ యుగపు నిదర్శనాలు. ఆమైకెలాంజెలో పెట్టిన పరీక్షకు నిలుస్తాయా? విచిత్రం! కాలానికి తగినట్లు పద్ధతులు, పద్ధతులకు తగినట్లు శిల్పాలు మారుతున్నాయి.

ఈలాంటి ప్రదర్శనలను మన ఎకాడమి ఏర్పాటు చేస్తే ఎంతో బాగుంటుంది. మన హైద్రాబాదులోని పబ్లిక్‌గార్డెన్‌లో ఏర్పాటుచేస్తే, ఒక నూత్న ప్రయోగాన్ని ఇండియాలోనే మొదటిసారిగ చేసినవారమవుతాము. మన అనుభవాన్ని ఇతర రాష్ట్రాలు పంచుకుంటాయి. ఆంధ్రప్రదేశ్ లలితకళా ఎకాడమీ ఈనూత్న ప్రయోగాన్ని తలపెడ్తే తప్పక విజయవంతం అవుతుందని భావిస్తాను.

*(భారతి, 3 డిశంబర్ - 1963)*

★



# ఐకన్‌లు

వేసవి కాలంలో చాలా కళాప్రదర్శనలు, శిల్పప్రదర్శనలు జరుగుతాయి లండన్‌లో. అమెరికను యాత్రికులు యూరప్ చూడడానికై వస్తారు. లండన్‌లో ఆగి కొన్ని రోజులుండి వెళ్తారు యూరప్‌కు. యూరప్‌నుండి ఎంతోమంది లండన్ వస్తారు. కళాభిలాషవున్న వారందరు యిక్కడ జరిగే ప్రదర్శనలు చూస్తారు. అందువల్ల గ్యాలరీలు అన్ని ఎంతో వుత్సాహంగా వివిధ ప్రదర్శనలు ఏర్పాటు చేస్తాయి.

టేటు గ్యాలరిలో బ్రహ్మాండమైన ప్రదర్శన జరుగుతున్నది. పికాసో శిల్పాలన్నిటిని ఎంతో శ్రమపడి ప్రపంచం నలుమూలలనుండి తెచ్చి ప్రదర్శిస్తున్నది టేటుగ్యాలరి. కామన్‌వెల్త్ ఇన్స్టిట్యూట్‌లో కెనడా చిత్రకళా ప్రదర్శన జరుగుతున్నది. ఆఫ్రికన్ పురాతన శిల్పాల్ని, 13వ, 14వ శతాబ్దపు యూరప్ చిత్రాల్ని, మథీస్, డ్రైన్ రేఖాచిత్రాల్ని, పురాతన బ్రిటిష్ నీటిరంగుల చిత్రాల్ని, హెన్రీమూర్ క్రొత్త శిల్పాల్ని, రష్యన్, యుగోస్లావియాల నుండి ఐకన్‌లను, గ్యాలరీలు ప్రదర్శిస్తున్నవి. కళా పిపాసకునికి ఈ ప్రదర్శనలు విందు భోజనంలాంటివి.

ఇక్కడ ''టెంపులు గ్యాలరి'' అని ఒక్కటి వున్నది. ఇది చాలా ఫేషనబుల్ 'బ్రామ్‌టన్' రోడ్డులో వుంది. చిన్ని ముచ్చటైన గ్యాలరి. ఇక్కడనే 'ఐకన్' చిత్రాలు ప్రదర్శిస్తున్నారు. ఎంతోమందిని ఆకర్షిస్తున్నది ఈ గ్యాలరి. ఐకన్‌లను గురించి చదివాను లండన్ యూనివర్శిటిలో 1964లో. కొన్నిటిని గురించి వివరంగా నోట్సు వ్రాశాను, నేషనల్ మ్యూజియమ్‌లోచూచి. కాని ఈ రోజుల్లో అంతగా ప్రాముఖ్యత యివ్వడంలేదు ఎవ్వరూ వీటికి. ఇన్ని ఐకన్‌లను ఒక్క చోట చూడడం విశేషం. అందువల్లనే గాబోలు అందరూ ఈ ప్రదర్శన చూస్తున్నారు. నేను యిదివరకు యిన్ని ఎక్కడా చూడలేదు లండన్‌లోగాని, అమెరికాలోగాని. ఈ చిత్రాలపై కొద్దిమంది పుస్తకాలు వ్రాశారు. కాని అంతగా తెలియదు వీటిగురించి సామాన్య ప్రజలకు. వీటిపై రీసెర్చి చేసి తెలుసుకోవలసింది ఎంతో వుంది.

'ఐకన్' అన్నది గ్రీకు పదం. దీనికి 'ప్రతిబింబము' అని అర్థం. గ్రీకు ఆర్థడాక్స్ చర్చి వీటిని ప్రాముఖ్యతలోనికి తెచ్చింది. గ్రీక్‌చర్చి యిహలోకంలోవున్న పరలోకం. అంతటి ఆధిక్యతను తనకు తానే ఆపాదించుకుని, భగవంతుని ప్రతిబింబిస్తుంది. క్రీస్తును గురించిన బైబిలుకు సంబంధించిన కథల చిత్రాలు ప్రతిబింబిస్తాయి ఐకన్‌లలో. అసలు ఈ ఐకనులకు మూలం ఈజిప్టులోని సమాధి చిత్రాలు. ఈజిప్షియన్‌లు చనిపోయే ముందు, వారి రూపచిత్రాలను చిత్రింపించి, వారి 'కాఫిన్'లలో పెడ్తారు. చచ్చిపోయిన శవాలను వారి వారి రూప చిత్రాల 'కాఫిన్'లలో వుంచుతారు. అది మూలం ఈ ఐకన్‌లకు. గ్రీకు ఆర్థ్‌డాక్స్ చర్చి ఈ పద్ధతిని తీసికొని పూర్తిగా క్రిస్టియన్ చిత్రకళగా మార్చివేసింది. విపరీతంగా ఐకన్‌లను ప్రచారంలోనికి తెచ్చింది. రష్యన్‌లు ఈ కళను యింకొంచెం సాగించి స్వంతం చేసుకున్నారు.

ఈ ఐకన్ చిత్రాలు చర్చిలో పూజించడానికై వుపయోగించేవారు. పండుగ వూరేగింపులలో వీటిని మోసుకొని వెళ్లేవారు, హృదయాలకు హత్తుకొని. బైజాన్‌టైన్ ఎంపైర్‌లో యిలా ప్రచారంలోనికి వచ్చేముందు, ఐకన్ చిత్రాలు ఎన్నో ఆటంకాలను ఎదుర్కోవలసివచ్చింది. ఈ ఎంపైర్ తూర్పు ప్రాంతాలలో ( టర్కీకి దగ్గర ప్రాంతాలు) అరబ్ నాగరికత, మత సాంప్రదాయాలు ఎక్కువగా వుండేవి. అరబ్బులు దైవాన్నిగాని, మత ప్రవక్తలనుగాని రూప చిత్రాలుగాగాని, శిల్పాలుగాగాని మలచి ఆరాధించరు. విగ్రహారాధన వీరికి విరుద్ధం. ఈ ఐకన్‌లు దైవ రూపాలను చిత్రించి చూపుతాయి గనుక ఈ తూర్పు ప్రాంతాలవారు నిరసనగ విజృంభణ లేవదీసారు. మతాధి పతులు విగ్రహారాధనను నిరసిస్తూ, ఈ ఐకన్ చిత్రాలను తగలబెడుతూ, సభలను ఏర్పాటుచేస్తూ ఈ విషయాన్ని రాజకీయంగా మార్చి అలజడి లేవదీసారు. పశ్చిమ ప్రాంతంఅంతా ఐకన్‌లను పూజిస్తే, అరబ్ మత సంప్రదాయ ప్రాంతం, ఐకన్‌లను నిరసిస్తూ వచ్చింది.

ఈ మత గురువుల వొత్తిడి కొంత కాలం సాగింది బైజాన్‌టైన్ రాజులపై, రాజ్యాంగ వ్యవహారాలపై. కాని బైజన్‌టైన్ దేశం అంతటా, చాలమంది ప్రజలు, ఐకన్‌లను పూజించేవారు. క్రీ.శ. 787లో బైజాన్‌టైను మహారాణి 'నికెయ రెండవ మహాసభ' ఏర్పాటు చేసింది. ప్రజలు ఐకన్ చిత్రాలను పూజించడంలో తప్పులేదని, భగవంతుని ఆరాధించడంలో మహదానందం వున్నదని, ఈ చిత్రారాధనను ఎక్కువగా ప్రజలు అనుసరించాలని ఆ సభలో తీర్మానింపబడింది. దీనితో ''ఐకన్'' చిత్రరచన ఎంతో విజృంభణతో సాగింది. బైజాన్‌టైన్ ఎంపైర్ అంతా ఈ ఐకన్ చిత్రాలు పూజింప బడసాగినవి. రాజాంగీకారం, ప్రభుత్వపు అండ ఈ చిత్రరచనకు బాగా దోహదం

చేశాయి. యూరప్ అంతటి నుండి ప్రజలు వచ్చి, ఈ చిత్రాలను కొని పూజించడం ప్రారంభించారు.

దీనికి ఒక ముఖ్యకారణం వున్నది. ఈ చిత్రాలు ఆరాధించేవారికి ఏ జబ్బులున్నా నయమైపోతాయని, భగవంతుడు ఎప్పుడూ వీరి యింట్లోనే నివసిస్తాడని, పిలిస్తే దేవుడు బదులు పలుకుతాడని, యింకా ఏవేవో కథలతో గూడిన నమ్మకాలు ప్రచారంలోకి వచ్చాయి. ఇకనేం ప్రజలు వేలంవెర్రిగా వీటిని ఆరాధించడం సాగించారు. చిత్రాన్ని ఎంతో భక్తితో ముద్దుపెట్టుకొని దేవుణ్ని వరాలు కోరేవారు. అందువల్ల ఎన్నో ఐకన్‌లు రంగులుపోయి, జిగురు పూసుకొని, మైనపువత్తి పొగలతో కప్పుకొని, అసలు గుర్తించడానికే కష్టంగా వుంటాయి. వీటిని గుర్తుపట్టడం, ఏ దేశంలో చిత్రించబడ్డాయో కనుక్కోవటం ఎంతో కష్టమైన పని. ఈ చిత్రాలు యుగోస్లావియా, రష్యాలలోగూడా ప్రచారంలోనికి వచ్చాయి, విస్తరంగా.

ఈ చిత్రాలను చెక్కపై చిత్రించడం వాడుకలో వుండేది. చిత్రించదలచిన చెక్కను ఎన్నుకొని, జాగ్రత్తగా, చిత్రించేందుకు వీలుగా పదును చేస్తారు. లేకపోతే చెక్క బీటలువారి పగిలిపోతుంది. నిమ్మ, బర్చి, అల్డర్, ఓక్ చెక్కలను వాడేవారు. ఇవి రంగులువేసిన తర్వాత, చాలా కాలం నిలచేవి. తర్వాత సైప్రెస్ చెక్కలను గూడ వుపయోగించారు. దంతపు ఐకనులను గూడ చూశాను. ఇవి చాల అరుదు.

చర్చి ఎంతోమంది చిత్రకారులచేత ఐకనులను చిత్రింపించేది. చాలమంది చిత్రకారులు మతగురువులే. మోనాస్టరీలలోని చిత్రకారులు, చర్చి పూజలకొరకు చిత్రించేవారు. ఈ చిత్రకారులు జీవితాన్ని చర్చికి అంకితం చేసిన సాధువులు. అందువల్లనే ప్రజలలో ఎంతో భక్తి ఈ ''ఐకను''లంటే. ఇవి చర్చిలో తయారు చేయబడ్డవి గనుకనే ఎన్నో కథలతో, మూఢనమ్మకాలతో కూడుకొని, ప్రజలలో నమ్మకాల్ని పెంపొందింప చేసేవి.

ప్రజలలో వీటి అవసరం ఎంతో వుండడం వల్ల చర్చిలోని ముఖ్యమైన చిత్రకారులు ఐకన్‌లలోని 'ముఖము'లను మాత్రమే చిత్రించేవారు. వీరి శిష్యులు మిగిలిన చిత్రాన్ని చిత్రంచుట్టూ వున్న డిజైనులను పూర్తిచేసేవారు. ఆ విధంగా చర్చికి, ప్రజలకు, కావలసినన్ని చిత్రాలను అందజేసేవారు చిత్రకారులు. ముఖ్యంగా 'ముఖములను మాత్రమే చిత్రించే ప్రముఖ చిత్రకారులను రష్యన్‌లు 'లిచ్‌మికి'అని, మిగిలిన చిత్రాన్ని పూర్తిచేసే శిష్యులను 'డోల్చినికి'అని పిలుస్తారు. చిత్రంలోని బ్యాక్ గ్రౌండు భాగానికి

తగరంలాంటి సన్నని బంగారము లేక వెండి పొరలను అతికించేవారు చెక్కకు. ముందుగా ఈ భాగాన్ని ఎరుపు ద్రాక్షరసంతో శుభ్రపరుస్తారు. చిత్రంలోని ఈ బంగారపు మెరుపును 'స్వెత్' అంటారు రష్యన్‌లో. అంటే 'వెలుగు' అని అర్థం. ఇది దేవుని యొక్క ప్రకాశం. మన హిందూ చిత్రాలలో గూడ ఈలాంటి పద్ధతేవుంది. దేవుని తలవెనుక సూర్యుని లాంటి వెలుగు ప్రకాశిస్తుంది. అది ఆయన మహిమను, దైవత్వాన్ని సూచిస్తుంది. కొన్ని ఐకన్‌లలో కంచు, బంగారపు పొరలను గూడ వాడేవారు రష్యనులు. దీన్ని 'ఇనొకోప్' అంటారు. రష్యనులు ఈ ఐకన్ చిత్రాలను ఇంటి గదిలోని కుడివైపు మూలలో వుంచుతారు. చిత్రం ముందు ఎప్పుడూ క్రొవ్వువత్తి వెలుగుతూ వుంటుంది. ఈ విధంగా క్రీస్తుమతం సర్వవేళలా ఇంటిలో వెలుగుతుంది.

రష్యాలోని 'కియాఫ్' నగరంలో ఐకన్ చిత్రాలు రచించడం జరిగింది మొట్టమొదటి సారిగా. అప్పటికి బహుకొద్ది క్రిస్టియన్ చర్చిలు మాత్రమే వున్నాయి రష్యాలో. అసలు క్రిస్టియన్ మతం మొదటినుండి రష్యాలో లేదు. రష్యనులు క్రీ.శ. 988 వరకు ఎంతోమంది దేవుళ్లను ప్రార్థించేవారు. విగ్రహారాధన విపరీతంగా వుండేది. ఈ నగరంలో వున్న బహుకొద్ది చర్చిలు రష్యనులకు కాదు, ఇతరదేశాలనుండి వ్యాపారం చేయడానికై, ఈ నగరానికి వచ్చిన వ్యాపారస్థుల కోసం నిర్మించబడినాయి. కీవ్ ఎంతో ప్రాముఖ్యమైన వ్యాపార కేంద్రం. క్రీ.శ. 988లో ప్రిన్స్ ఆఫ్ కీవ్ అయిన ''వ్లాడిమియొ'', గ్రీకు ఆర్థడాక్స్ మతాన్ని స్వీకరించాడు. రాజు తలచుకుంటె దెబ్బలకు కొదవేమిటి? తాను మతం పుచ్చుకున్నాడు గనుక, తన రాజ్యంలో వున్న ప్రజలందరు ఈ మతం పుచ్చుకోవాలని శాసించాడు. రష్యాలో శాసనం వచ్చిందంటే, అధికారులు క్రమం తప్పకుండా అనుసరింపచేస్తారు ప్రజల్ని. మొదటినుండి అలాంటి పద్ధతి వారిది. ఇకనేం ప్రజలందరు మరో ఆలోచన లేకుండా బాప్టిజం తీసుకున్నారు. అంతవరకు వారు పూజిస్తున్న వివిధ దైవ విగ్రహాలు, చిత్రాలు అన్నిటిని ధ్వంసం చేయించాడు రాజు వ్లాడిమియొ. ఎన్నో చర్చిలను కట్టించాడు. గ్రీక్ ఆర్థ్‌డాక్స్ ఎంపైర్‌కు జీవమైన కాన్‌స్టాంటినోపుల్ నగరానికి ప్రతిబింబంగా తయారయింది ''కీవ్'' నగరం. ఇప్పటి రష్యాఅంతా అసలు కీవ్‌ను ఆధారంగా చేసుకొనే పెరిగింది అని చెప్పవచ్చు. నగరం ''ఐకన్'' చిత్రాలకు కేంద్రమైంది. ఎన్నో చిత్రాలు యిక్కడి చర్చిల నుండే వచ్చాయి. వ్లాడిమియొ మొట్టమొదటి చర్చికి శంఖుస్థాపన చేసాడు. ఇదే రమ్యమైన 'వర్జిన్ ఆఫ్ ది డైమ్' చర్చి. ఇది రష్యన్ ఐకను చిత్రాలకు, గోడపై చిత్రాలకు ఎంతో ప్రసిద్ధి. ఇతని చిన్నకొడుకు యారొస్లావ్ క్రీ.శ. 1036లో 'హగియ సోఫియ' అనే బ్రహ్మాండమైన చర్చిని కట్టించాడు. ఇది తండ్రి కట్టించిన చర్చిని మించివుంటుంది సౌందర్యంలో.

కీవ్ నగరంలోని సుందరమైన ఐకన్‌లను చిత్రించినది ముఖ్యంగా గ్రీకు చిత్రకారులు. కారణం ప్రముఖ గ్రీకు చిత్రకారులను రష్యాకు పిలిపించడం జరిగింది. వారికి సహాయపడుతూ ఎంతోమంది రష్యనులుగూడావున్నారు. ఈ ఐకన్‌లు చర్చి ఆఫ్ డైమ్, హగియ సోఫియా, చర్చి ఆఫ్ సెంట్ మైఖేల్, చర్చి ఆఫ్ ది మోనాస్ట్రి ఆఫ్ ది కేవ్స్‌లలో కన్పిస్తాయి. రష్యనులు ఎంతో జాగ్రత్త తీసుకున్నారు ప్రారంభంనుండి ఈ ఐకన్ చిత్ర రచనలో. బైజాన్‌టైన్ చిత్రాలు సంప్రదాయసిద్ధంగా చిత్రింపబడి ఎక్కడా ఏమార్పు లేకుండా ఒకే మాదిరిగా వుంటాయి. కాని రష్యనులు వారి చిత్రాలలో రూపాలను సహజ సిద్ధంగా వుండేట్లు, ముఖములో మృదుత్వం వుండేట్లు ( బైజాన్‌టైన్ చిత్రాలలోని రూపచిత్రాల ముఖ కవళికలు చాల బిరుసుగా వుంటాయి) చిత్రించారు. చిత్రంలోని రూపాలదేహం బలంగాను, రూపచిత్రాల విషయంలో రేఖామయంగాను వుంటాయి.

కీవ్‌లోని ఐకన్ చిత్రరచనలాగే చెప్పుకోవలసిన మరొక ముఖ్యకేంద్రంగా నోవోగ్రాడ్. 13వ, 14వ శతాబ్దాలలో ఈ నగరం ఎంతో ప్రాముఖ్యతలోనికి వచ్చింది. ఇక్కడి చిత్రకారులు కీవ్ చిత్రకారుల వలెనే బైజాన్‌టైన్ ఐకను చిత్రాలనుండి తమ శైలులను రూపొందించుకున్నారు. వీరి పద్ధతులలో ముఖ్యంగా కన్పించేది గుండ్రని, బాగా దిగజారిపోయిన భుజాలు. ఈ చిత్రాలలో ఎరుపు, బంగారు మెరుగురంగు మిశ్రమం ఎక్కువగా వుంటుంది. తెలుపు, లేత ఆకుపచ్చని రంగు, ప్రపంచప్రసిద్ధమైన ఒక విధమైన రష్యన్ బ్లూ రంగుల మిశ్రమం ఒక ప్రత్యేకత. ఈ మిశ్రమానికే నోవోగ్రాడ్ చిత్రకారులు ప్రసిద్ధి. వీరి చిత్రాలలోని మతగురువులు వరుసగా నిలబడి వుంటారు. వీరి శరీరాలు చాల దృఢంగా వుంటాయి. మరొక ప్రత్యేకత గుండ్రని తలలు. రష్యనుల తలలు గుండ్రంగా వుంటాయి, గనుక చిత్రం చూడగానే ఇది రష్యనుల ఐకన్ అని చెప్పవచ్చు. అలాంటి ప్రత్యేకత కొరకే రష్యను చిత్రకారులు ( గ్రీకు చిత్రకారుల సహాయంతో మొట్టమొదటగా ప్రారంభించినా) ఎన్నో మార్పులు తెచ్చారు, ఒరిజినల్ ఐకన్‌ల శైలులలో.

రష్యను చిత్రకారులలో చెప్పుకోదగ్గ ప్రతిభావంతులు ఆండ్రూ రూబ్లేఫ్, థియోనిసియస్‌లు. వారిద్దరు సంప్రదాయ సిద్ధంగా చిత్రరచన చేశారు. ఏ మాత్రం మార్పులన్నా సహించలేదు. ప్రజల అవసరం తీర్చడానికై, రష్యన్ చర్చిలు లోహపు ఐకనులను ఎక్కువగ ముద్రింపించి తయారు చేయించేవి. వీటినుండి ఎన్నో కంచు, ఇత్తడి ఐకనులను ముద్రింపించారు. ఇదొక్కటే సులభమైన మార్గం ప్రజలకు ఐకనులను త్వరగా అందించడంలో. ఇంత విజృంభణగ సాగిన ఐకన్ చిత్రాలకు క్షీణదశ వచ్చింది. కాన్‌స్టాంటి నోపుల్‌ను 1453లో 'టర్కీ' [illegible] తర్వాత. దీనితో ఈ నగరపు

A.C. No. 83863

రూపే మారిపోయి, ఎంతో అభివృద్ధి అయింది ముఖ్యంగా వ్యాపార రంగంలో. వ్యాపారం పెరగడంవల్ల మధ్యరకపు ధనిక తరగతి క్రొత్తగా పైకివచ్చింది. వీరు చిత్రాలను కొనడం ప్రారంభించారు. వీరి అభిరుచులు వేరు. దానితోబాటు కళాభిరుచులు గూడ వేరుగానే వున్నాయి. మాస్కో నగరానికి ఇటాలియన్ ఆర్కిటెక్ట్స్ రావడం, వారితోబాటు క్రొత్తరకపు అభిరుచులను తేవడం జరిగింది. మాస్కోలోని పెక్కుభవనాలను ఇటాలియన్‌లచేత కట్టించారు రష్యనులు. ఇటాలియన్‌ల కళాభిరుచి ఐకన్ చిత్రకళ క్షీణదశకు శంఖుస్థాపన చేసింది.

యుగోస్లావియా గూడ ఐకన్‌లకు చాలా ప్రసిద్ధి. ఓహ్రిడ్‌లో ఐకన్‌లను చిత్రించడం జరిగింది. బైజాన్‌టైన్ పద్ధతి అప్పటికే ఎంతో బలంగా వుంది. ఈ పద్ధతినుండి తప్పించుకొని క్రొత్తరకపు కళను సాగించడం ఎంతో కష్టం. అయినా యుగోస్లావియా మార్పుకు ప్రయత్నం చేసింది. అందువల్లనే 13వ శతాబ్దపు యుగొస్లావియా ఐకన్ కళలో బిరుసైన, సంప్రదాయసిద్ధమైన ''బైజాన్‌టైన్ శైలి'', సొగసైన, ఆహ్లాదకరమైన ''స్లావిక్ శైలులు'' కనిపిస్తాయి. కాన్‌స్టాంట్‌నోపుల్‌ను టర్కీ రాజులు జయించడంతో నగరంలో ఎన్నో మార్పులు వచ్చాయి. సెర్బియన్ చర్చిలలోని చిత్రకారుల సంప్రదాయాన్ని పోనివ్వకుండా సాగించారు చిత్రరచన. కాని అది ఎంతో కాలం జరుగలేదు.

16వ శతాబ్దంలో టర్కీ దేశం జయించిన ప్రాంతాలలో చిత్రమైన మార్పులు వచ్చాయి ఐకన్ చిత్రకళలో. చిత్రరచనలో, రేఖలతీరులో ఎంతో బలహీనత, దేహపురంగులలో మామూలుగా వుండే యూరోపియన్ రంగులకు బదులు, నల్లని, నీలపు ముతుక రంగులు వచ్చాయి.

18వ శతాబ్దము వచ్చేసరికి దాదాపు ఐకన్‌ల పద్ధతి మారిపోయింది. బలమైన ముతకరంగులతో ఏదో గ్రామీణ చిత్రకళ మాదిరిగా తయారయింది. ఈ ఐకన్ చిత్రకళ మతసంప్రదాయాన్ని ప్రతియింటిలోనికి తెచ్చింది. ప్రజలలో దైవభక్తిని పెంపొందించింది. చర్చి అభివృద్ధికి ఎంతో దోహదమిచ్చింది. కాలం మారుతూ, ప్రజలలోని అభిరుచులు మారుతూ వుండే సరికి, ఐకన్ పద్ధతి కాలానికి వెనుకబడసాగింది. ఇప్పుడు ఐకన్ ఒకనాటి కళ.

ఇప్పుడు చూస్తే, క్రొత్తగా వుంటుంది. ఆనాటి కళ. ఆనాటి అభిరుచి ఒక వినూత్నమైన అనుభవం యిప్పుడు.

*(భారతి, సెప్టెంబర్ 1967)*

★

# ఆఫ్రికన్ కళా సంపద

భాష, సంప్రదాయాల కట్టుబాట్లలాగే, కళ కూడా ఒక జాతిని మరొక జాతి నుండి వేరుపరిచి, దాని సహజ గుణాలని బయట పెట్టగలదు. ఆఫ్రికాలో కళకి సరిహద్దులు లేవు. ఖండం అంతా కళ ఏకధారగా ప్రవహించింది. ఎన్నో మతాలుగా విడిపోయి ఉన్న ఆఫ్రికా ప్రజలని, దారానికి పూస గుచ్చినట్లు కలిపి, తన గొప్పదనాన్ని చూపి, మనల్ని విభ్రాంతుల్ని చేస్తోంది. ఆఫ్రికన్‌ల కళా సృష్టి అంతా వారి నిత్యజీవితంలో భాగాలయి పోయాయి.

ఒకప్పుడిది 'అనాగరిక కళ'గా పరిగణింపబడినా, నేడు తన పూర్తి నిజమైన విలువని చాటుకోగలుగుతోంది. రాజకీయ రంగాల లోనేగాక, లలిత కళారంగాలలోనూ ఆఫ్రికా ప్రాముఖ్యత పెరుగుతోంది.

ఇతర ప్రాంతాలలో, అందులో నూ పాశ్చాత్య దేశంలో, ఆఫ్రికా కళా సాంప్రదాయాలు తమ ప్రభావాన్ని బాగా నిరూపించుకుంటున్నాయి. రూపాలని రూపాలుగా మాత్రమే కాక, అ రూప స్వభావంతో చూచే దృక్పథం ఆఫ్రికన్ కళాసాంప్రదాయాలు నేర్పినవే. పికాసో, మోడిలియాని, బ్రాంకుసే మొదలయిన వారి చిత్ర, శిల్ప కళలలో ఆఫ్రికా ప్రభావాలు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి.

ప్రపంచంలోని ఏ అంతర్జాతీయ ప్రాచీన వస్తు ప్రదర్శనశాల, లేక కళావస్తు ప్రదర్శనశాలకి వెడితే పాశ్చాత్యశాఖ, ఇండియన్‌శాఖ, ఆఫ్రికన్‌శాఖ, దక్షిణ అమెరికాశాఖ అంటూ కనిపిస్తాయి. మొదటిసారి చూసిన వారికి ఆఫ్రికన్ శాఖలోని వస్తువులు మోటుగా, అనాగరీకంగా ఉన్నాయయా అనిపిస్తుంది. కాని, ఈ ఆకారాల వెనుక సాంప్రదాయాలని, భావనలని కొంచెం లోతుగా పరిశీలిస్తే ఎంతో ఆనందం కలుగుతుంది. చవక రకం పూసలు, జనపనార, కొబ్బరిపీచు - వీటితో బ్రహ్మాండమయిన

కళాఖండాలు సృష్టిస్తారు ఆఫ్రికన్ కళాకారులు. భయమే కాక, హాస్యం దైవత్వం కూడా ఉట్టిపడతాయి వారి శిల్పాలలో.

ఘనా, నైజీరియా, కాంగో, న్యూగినీ, దహోమీ వంటి ఆఫ్రికన్ దేశాలు కళారంగంలో బాగా అభివృద్ధి చెందిన దేశాలు. ఇక్కడి శైలి పద్ధతులు, ఆఫ్రికన్ కళా సాంప్రదాయాలకి ప్రాతినిధ్యం వహిస్తాయి. (ఈజిప్టు ఆఫ్రికాలోనే ఉన్నప్పటికీ దానిని అరబ్బుదేశం కిందే జమ కట్టాలి కాబట్టి ఆ దేశం కళని గురించి ఇందులో వివరణగ వ్రాయలేదు.)

ఆఫ్రికాశిల్పం మనల్ని అధికంగా ఆకర్షిస్తుంది. అసలు ఈ ఖండంలో (అంటే నల్ల జాతులలో) చిత్రలేఖనానికి అంత ప్రాముఖ్యత రాలేదు. కొన్ని పండుగల సమయాలలో మాత్రం రంగు రంగులుగా ఉండే 'Face Mask' లని తగిలించుకుంటారు. కాని ఆసియా, యూరోప్‌ల చిత్రలేఖన సాంప్రదాయాలతో వీటిని పోల్చలేము. ఈ Face Mask లతో పాటుగ ఈటెలు, డాలులు తయారుచేస్తారు. వీటిని చూస్తే మనస్సుకి హత్తుకు పోయేట్లుగా ఉన్నా, ఆకారాలు పరిచయం లేని వికృత రూపాలుగ వుండి భయాన్ని కలుగచేస్తాయని అనడంలో సత్యం వున్నది.

నైజీరియాలోని 'ఇబో' తెగవారి కపటముఖాలు చాలా భయంకరంగా ఉంటాయి. దయ్యాలనీ, భూతాలనీ జ్ఞాపకం చేస్తాయి! ఆడవారు వాడేవి, మగవారు వాడేవి వేరువేరుగా ఉంటాయి. ఇవి తెల్లరంగు పూసి ఉంటాయి.

నిజానికి 'కామరూన్' దేశం వారి Face Mask లు శిల్పాల క్రిందకే వస్తాయి. వెడల్పుగా, పలకలుగా ఉంటాయి. కళ్లు గొట్టాలలాగా ముందుకు పొడుచుకుని వస్తాయి! ముక్కూ అంతే! దీనికి తోడు తలమీద ఆకలిగొన్న మిడిగుడ్ల కుక్కల తలలు, పక్షులు, బల్లులు చెక్కుతారు...

కాంగో, టాంగనీకా, రోడీషియా, జాంబియా ప్రాంతాలలో పల్చని Face Masks లను చెక్కుతారు. సూక్ష్మంగా ఉన్న శిల్పంలా ఇవి నాజూకుగా కనిపిస్తాయి.

ఘనాలో ''తలగడ''లు ఎంతో ముచ్చటగా ఉంటాయి. మరుగుజ్జు మనుష్యులు ఒక రిద్దరు చతురస్రంగా ఉన్న దిమ్మని మోస్తూ ఉంటారు. ఆ దిమ్మ, పై తల ఆన్చటానికి వీలుగా మలిచి ఉంటుంది. ఇది 'క్యూబిజమ్'ను జ్ఞాపకం చేస్తుంది.

దక్షిణ కాంగోలో పొగతాగే హుక్కాలు చాలా పనితనం కలిగినవిగా ఉంటాయి. ఎగతాళిగా నవ్వుతున్న ఆడవారిని, నిమీలిత నేత్రాలతో దీర్ఘంగా, విచారంగా ఆలోచించే

పెద్దమనుషులనీ హుక్కాలుగా చెక్కుతారు. లోపల డొల్లగా ఉండడంచేత కాల్చే పదార్థాన్ని పైప్‌లాగా పీలుస్తారు.

''దహోమీ'' అనేదేశంలో నగ్నంగా కనిపించే స్త్రీల చెక్కడాలు, ఆ చెక్క శిల్పాల నెత్తిమీద గంపలు చెక్కుతారు. ఆ శిల్పాల గంపలనే ఆహార పాత్రలుగా, పళ్లాలుగా వాడ్తారు. అందులో భోజన పదార్థాలు వుంచుకొని భోం చేస్తారు. కళ నిత్యజీవితంలో ఎలా కలిసిపోయిందో తెల్పేందుకు ఇది మరొక నిదర్శనం.

కాంగో దేశ శిల్పాలు చాలా అందంగా ఉంటాయి. వాటిలో పాశ్చాత్య సాంప్రదాయాలు బాగా కనిపిస్తాయి. కాని సహజంగా ఉండేట్లే కనిపించినా , తమ ఆఫ్రికన్ శైలిని మరుగు పరుచుకోవు.

బ్రిటిషు మ్యూజియంలో ఒక ద్వారం, తలుపులతో ఉంది. వీటి నిర్మాణం రోమన్ పద్ధతులని పోలి ఉంటుంది. కాని తయారు చేసినవారు 'కుయు' తెగవారు. ఈ ద్వారం, తలుపుల మీద ఆధునిక దృశ్యాలు చాలా ఉంటాయి. సైకిలు తొక్కే తెల్లజాతివారు, మల్లయుద్ధాలు చేసేవారు, బజారుకి వెళ్లే ఆడవారు వగైరా. వీటిని చూస్తే మన కోణార్క్ గుర్తుకి వస్తుంది. సర్రియలిస్టు శిల్పాలు కొదవలేనన్ని వుంటాయి.

కాంగో దేశంలో పాశ్చాత్య ప్రభావాలు చూస్తాము, కాని అవి జాతీయ పద్ధతులలో లీనమయిపోక అతికించినట్లు కనిపిస్తూ ఉంటాయి కొన్ని సమయాలలో. అందుకనే ఇక్కడ సృజనాత్మకమయిన అభివృద్ధి తక్కువ అనే అనుమానం కలుగుతూ ఉంటుంది.

ఇక్కడి కళా సాంప్రదాయాలు ఇటీవలకాలాలకు చెందినవే. మనకు తెలిసినంత వరకు. క్రీ.శ. 1800 ప్రాంతంలో ప్రారంభమయిన కళా ఉద్యమాలు గమనింపతగ్గవి. దీనిని బట్టి నైజీరియా కళా ఖండాల మీద పాశ్చాత్య ప్రభావాలు చాలా ఉంటాయని గ్రహించవచ్చు.

ఇక్కడి వారికి అడంబరంగా ఉండే దుస్తులు ధరించటం ఇష్టం. వాటిని కొన్నిటిని చూస్తూ ఉంటే, మన చరిత్రలో రాజాధి రాజులు ధరించిన దుస్తులు జ్ఞాపకం వస్తాయి. 14వ శతాబ్దం బొమ్మలనిబట్టి చూస్తే మామూలు వాళ్లు కూడ కిరీటాలు, నగిషీలు చెక్కిన లేసు అల్లకాల దుస్తులు, ధరించేవారని గ్రహించవచ్చు.

''నైజీరియన్ స్త్రీ శిరస్సు'' చాలా సొగసయిన శిల్పం. దీనిలో పాశ్చాత్య ప్రభావాలు

కన్పించినా ఇది జాతీయత కోల్పోని కళాసృష్టి. ''వేటగాడు'' శిల్పం కూడా మనల్ని బాగా కదల్చివెయ్యగలదు. శిల్పంలో కళ్లు ఒక ప్రత్యేకత 1951లో లండన్‌లో జరిగిన ''వలస ప్రాంతాలలో సాంప్రదాయక కళా ప్రదర్శన''లో ఇవి చూసి హెన్రీమూర్ దిగ్భ్రాంతుడై అదే పద్ధతిలో తాను ఒక శిల్పాన్ని స్వయంగా తయారు చేశాడట.

ఘనా దేశం ధనికదేశం. బంగారం బాగా దొరికే ప్రదేశం కాబట్టి, బంగారంలో శిల్పాలు వారు చేయడంలో ఆశ్చర్యం లేదు. తలమీద పాగాలు, వంటినిండా వస్త్రాలు కల ఈ శిల్పాలలో, ఠీవి ఉట్టిపడుతూ ఉంటుంది. చెక్కడాలలోనే కాక, తివాసీల తయారీలో కూడా ఘనా దేశీయులు సుప్రసిద్ధులయ్యారు. వారి రంగురంగుల తివాసీలని చూస్తూ ఉంటే బందరు, కలంకారీ పని జ్ఞాపకం వచ్చింది నాకు. ప్రపంచంలోకల్లా ఈ దేశంలోనే 'కోకో' ఎక్కువగ పండుతుంది.

న్యూగినీలో మనుష్యులు, జాతరలలో జంతువుల Face Mask లను ధరించి నృత్యం చేస్తారు వానలు కురవాలని, పంటలు పండాలని. న్యూగినీలో తయారయిన ''పిట్ట'' రాతిలో చెక్కినది. అప్పుడే విత్తులో నుంచి బయటకు వస్తున్న మొక్కని స్ఫురింపచేస్తుంది. పిట్ట రెక్కలు సవరించుకుని పైకి ఎగిరిపోతుందా అనేట్లు ఉంది.

ప్రకృతిలో సృష్టికి సమాన స్థానం ఉంది! మొక్క, పిట్ట, చేపన్నా ఒకటే కదా! అన్ని సృష్టి వైచిత్ర్యాలే.

*(ఆంధ్ర సచిత్ర వారపత్రిక, 11.11.1966)*

★

# కళలో కవిత్వం చెప్పే జీన్ ఆర్ప్

''నా ఉబ్బెత్తు శిల్పాలు, నీటి రంగు చిత్రాలు, ఆకారవికారాలు మానవుడు మరచిపోయిన వాటిని తిరిగి నేర్పే సాధనాలు - కండ్లు తెరిచి అతనికి అతను కనే కలలు'' అంటాడు జీన్ ఆర్ప్

వేలకువేలు చిత్రకారులు శిల్పకారులు, యుగయుగాల నుండి ఉన్నా, వారందరిలో బహుకొద్దిమంది మాత్రమే చిరస్థాయిగా మిగులుతారు, కళల గురించి మాట్లాడుకుంటే కొందరి జీవితాలు మాత్రమే పదేపదే చదువుతాం. వారి వారి రంగాలలో ఇలా నిలవాలని, తర్వాత తరంవారు తమను తలచుకోవాలనే, ఈ సృజనాత్మక కళాకారులు తమ జీవితాలను అంకితం చేస్తారు, తాము నమ్మిన కళల కోసరం. అయినా, కాలం, వారిలో కొందరిపైనే విజయ పరంపరలు కురిపిస్తుంది. వారే మైలురాళ్లు మనకు. ఒక్కొక్క మైలురాయి ఒక్కొక్క కాలానికి, ఒక్కొక్క అనుభవానికి నిదర్శనం. విచిత్రం ఏమిటంటే యిలా మిగిలిన, నిలచిన అజేయులు, విభిన్నంగా, ఒకరి కొకరు బహుదూరంగా నిలచి స్వయం కృషి సాగిస్తారు. ఒకే తరంలో ఉన్నా వారు, తమ స్థాయిలో ఉన్న యితరుల ప్రభావం వారిపై బడకుండా ఉండటానికి, ఎంతో శ్రద్ధ వహిస్తారు. తమ సాధనకు ఆటంకం కలుగుతుందని, తమ గురి చెదురుతుందని భావిస్తారు. అలా కాకపోతే వారి నిశ్చలతకు భంగం కలుగుతుంది. వారి తపస్సు భగ్నం అవుతుంది. అందువల్లనే ఒకే తరంలోని యిద్దరు ప్రముఖ చిత్రకారుల చిత్రాలను చూస్తే కన్పిస్తుంది వారి భిన్నత్వం, శైలిలో.

పాశ్చాత్య దేశాలలో కళా రంగాలలో వచ్చిన, వస్తున్న మార్పులు మనకు తెలిసినవే. ఆధునిక విజ్ఞానం ఎంత వేగాన పరుగులు తీస్తోందో, అంత వేగాన కళారంగంలోని పద్ధతులు గూడ పయనం చేస్తున్నాయి. ఇలా పరుగులు తీయడం మానవనైజం. లేకపోతే ఏమిటి, ప్రశాంతంగా ఉన్న కాలంలో, శాస్త్ర విజ్ఞానాన్ని అభివృద్ధి చేసి, మారణ యంత్రాలను

తయారుచేస్తాడు మానవుడు. తన మేధస్సుకు తానే పులకరిస్తాడు. తీరా యివి మానవ విధ్వంసానికి దారితీసే సమయానికి, శాంతికాముక ప్రయత్నాలను సాగిస్తాడు. ఎంత వైవిధ్యం అతనిలో! శాంతి లేదు మానవునకు. ఇలా మానవుడు చెడుగుడు ఆడవలసిందే. లేకపోతే కాలచక్రం ఆగిపోదూ!

చిత్రకళారంగంలో ఎన్నో మార్పులను చూశాం. ప్రకృతికి, మానవునికి, ఉన్నది ఉన్నట్లుగ ప్రతిరూపాలను తయారుచేశాం. ఆనందించాం. మరల మనకే అందులో తృప్తి కలుగలేదు. ప్రకృతిని ఉన్నది ఉన్నట్లుగాక, ప్రకృతిని చూచి స్వంత అనుభవాల్ని తమ మనోభావంతో జోడించి చిత్రాలను చిత్రించాం. మరల అందులో ఏదో అసంతృప్తి. అసలు ఎందుకు ప్రకృతిని చిత్రించాలి అని? ఇలా భిన్నాతి భిన్నంగా సాగుతున్నది, కళారంగంలోని కృషి. ఏది ఏ పద్ధతిలో సాగినా ఒక భావం కోసరం, ఆ భావనలోని రసోత్పత్తి కోసరం, ప్రయత్నిస్తున్నాడు సృజనాత్మక చిత్రకారుడు. ఒక నిగూఢ సత్యాన్ని బయలు పర్చాలని తపన. ఇలా తపన చెందిన మేధావులలో ఒకరు 'జీన్ ఆర్ప్'.

జీన్ ఆర్ప్ అంతగా ప్రజలందరికీ తెలియదు - హెన్రీమూర్ తెలిసినట్లు. కాని చిత్రకారులందరికి తెలుసు ఆర్ప్ గురించి. జీవితాన్ని కళ కోసరం ధారపోసిన, బహు కొద్ది మంది వ్యక్తులలో ఈయన ఒకరు. మొట్టమొదటిసారి ఆర్ప్ చిత్రాల్ని అన్నిటిని ప్రపంచం నలుమూలల నుండి తెచ్చి, ప్రపంచ విఖ్యాత 'టేట్' గ్యాలరీలో ప్రదర్శించి, ఇంగ్లండు గౌరవించిందీ చిత్రకారుణ్ణి. అలా తనను తానే గౌరవించుకుంది. ఇంతటి పెద్ద ప్రదర్శన వల్ల ఎంతోమందికి అవకాశం కల్గించింది, చిత్రకారుని పూర్తి జీవితాన్ని చదవడానికి. బ్రిటన్‌లోని ఆర్ట్స్ కౌన్సిల్ యిలా విశిష్ట ప్రదర్శనలను ఏర్పాటుచేసే కార్యక్రమాన్ని ఈమధ్యనే తలపెట్టింది. ఈ ప్రదర్శనకు ముందు ''కాకోష్కా'' అనే చిత్రకారుని కళా ప్రదర్శనాన్ని ఏర్పాటు చేసింది బ్రహ్మాండంగా.

ఆర్ప్ 1887 సెప్టెంబరు 16న స్ట్రాస్‌బర్గ్‌లో జన్మించారు. మొదటినుండి తీవ్రవాది. ఏదీ అంతగా అతన్ని ఆకర్షించినట్లు కనిపించదు. అసంతృప్తి ఎక్కువ. ఈ అసంతృప్తే అనుకుంటాను, ఒక తృప్తిని వెతుక్కునేందుకు దారి తీసింది. అదే అతనికి ఒక మార్గాన్ని చూపింది జీవితంలో. 1904లో 'స్కూల్ ఆఫ్ అప్లయిడ్ ఆర్ట్స్'లో చేరాడు కళాభ్యాసానికి. ఆయన వ్రాస్తారు తన స్కూలులో విద్యాభ్యాసం గురించి, ''ఎండి పోయిన పువ్వులను, దూది, గుడ్డపేలికలు మొదలగునవి కూరి ఉంచిన పిట్టల బొమ్మలను నిరంతరంగా 'కాపీ' చెయ్యడం వల్ల నా డ్రాయింగును విషపూరితం చెయ్యడమే గాకుండా

వివిధ కళారంగాలలో కృషిని, రసాస్వాదనను, ధ్వంసంచేసింది. అందుకే కవిత్వంలో తలదాచుకున్నాను.''

ఇలాంటి వ్యక్తి జీవితం ఎలా సాగుతుందో ఊహించగలరు. తాను శిల్పకారునిగ, చిత్రకారునిగ కంటె ఎక్కువగా రాణించారు. శిల్పకారుడుగా ఎంత పేరుందో రచయితగా, గ్రంథకర్తగా, కవిగా అంత పేరుంది. అందుకే నాకు ఆయన శిల్పాలు చూస్తుంటే గేయాలు చదువుతున్నట్లుంటుంది. కవిత్వాన్ని ప్రత్యక్షరూపంలో, శిల్పాలుగా చూడడం ఒక అనుభవం. ఆయన శిల్పకవి.

ప్రదర్శనకు ఉదయమే వెళ్లాను. అంత ముందుగా ఎవరూ వచ్చి ఉండరని, చల్లగా ఉన్న లండన్ వాతావరణంలో, థేమ్స్ నది ఒడ్డునే, నడచి చేరుకున్నాను. మూగగా ఉన్న ప్రదర్శనాలయంలో లైట్లమధ్య నగ్నంగా, నున్నటి శిల్పాలు బిడియం లేకుండ మెరుస్తున్నాయి. అక్కడక్కడ గోడకు చిత్రాలు, రంగులు పొదిగిన జిగినీ గొలుసుల్లా, తెల్లని గోడలకు వ్రేలాడుతూ, స్త్రీల మెడలలోని నగలకు ప్రతి రూపాలుగా నిలిచాయి. పాము మెలికలు తిరిగినట్లు వంకర టింకరలుగా ఉన్న గదులలో, మనల్ని గది నుండి మరొక గదికి శిల్పాలు నడిపిస్తాయి. మొత్తం 189 - చిత్రాలయితేనేమి, శిల్పాలయితే నేమి, నేసిన తివాచీలు అయితేనేమి, రేఖా చిత్రాలయితేనేమి మరి ఎన్నో ఉన్నాయి. పాలరాతిలో మలచినవి, రాతిలో చెక్కినవి, చెక్కలతో పేర్చినవి, రంగులు వేసిన శిల్పాలు, పాలిష్ చేసిన కంచు ఆకారాలు, ఎంతో అందంగా రంగుల చిత్రాలతో మిళితమై, ఒక క్రొత్త శోభతో ప్రదర్శన వెలుగుతున్నది.

హెన్రీమూర్‌కు ఈయనకు సంబంధం లేదు. ఇద్దరు రెండు విభిన్న శిఖరాలు. ఒకరు తృప్తిగా ఒక స్థాయికి చేరి కూర్చుంటే (హెన్రీమూర్), తృప్తి ఎరుగక పరుగులు తీస్తున్నవారు మరొకరు. ఒకరిది సంగీతం అందిస్తే, మరొకరిది గేయాలు వినిపిస్తాయి. ఒకరిది మానవ రూపాలకు ప్రతిసృష్టి అయితే (హెన్రీమూర్‌వి) మరొకరిది మానవాతీత రూపాలకు ప్రతిసృష్టి. అయినా యిద్దరూ అజేయులే.

ఆర్ప్ ప్రదర్శనను చూస్తుంటే నాకు ఎంతోమంది ప్రముఖ శిల్పకారులు మనసులో మెదిలారు. అందరితో పోల్చి చూచుకున్నాను ఆర్ప్‌ను, ఏవిధంగా ఈయన ప్రత్యేకమైన వాడా అని. ఈయన ఎవరితోనూ కలువలేదు. ఏకాకిగా నిలబడిన సాహసి. ఒకరికి నచ్చినా నచ్చకపోయినా అడవిలో తన మార్గాన్ని తాను నరుక్కుంటూ పోయిన బాటసారి. అడవిలోని ప్రతి చెట్టు తనకు తెలుసు. ఏ చెట్టును నరకాలో, దేనిని నరకగూడదో

తెలుసుకొని, అలా ముందుకు సాగుతూ పోతున్న ఏకాకి. అందుకే ఆయన చిత్రాలలో చెట్ల రూపాలు కనిపిస్తాయి. పండ్లు, పువ్వుల ఆకారాలు పలుకరిస్తాయి. ఆర్ప్ అంటాడు ''నిరంతరంగా ప్రకృతి సృష్టించే, వివిధ రకాల ఆకారాలను చూస్తాను. ఆ ఆకారాలను పెంచడం కొరకు ప్రయత్నించాను. నా దృఢ నమ్మకాన్ని చెట్ల విత్తులలోను, నక్షత్రాలలోను, మేఘాలలోను, మొక్కలలోను, జంతువులలోను, మనుష్యులలోను, చివరికి నా అంతరాంతరాళాలలోను ఉంచుకొని ప్రయత్నం సాగించాను''. ఎంత బలంగా 'ఆర్ప్' కృషి చేశాడో తెలుస్తుంది దీనివల్ల. ఈపైవన్నీ పెరిగేవే, ఎప్పటికప్పుడు తమ రూపాలను మార్చుకొనేవే. ఇలాంటి మార్పులతో తన జీవితంలోంచి, క్రొత్త కళను సృష్టించేందుకు ప్రయత్నించాడు. అతను చెక్కలో చేసిన రిలీఫ్స్‌ను చూస్తే తెలుస్తుంది. రకరకాల ఆకారాలలో చెక్కలను కోసి, బల్లపరుపుగా ఉన్న చెక్కకు అతికించి, వాటికి వివిధ రంగులను వేస్తాడు. అవి చూస్తుంటే విశాలాకాశంలో ఎగిరే మేఘాలలా అనిపిస్తాయి.

ఎన్నో చిత్రకారుల గ్రూపులలో సభ్యుడుగ చేరాడు. వాటి నమ్మకాలను తాత్కాలికంగా బలంగా నమ్మేవాడు. కాని వాటి నుండి విడిపోయేవాడు వెంటనే . దేన్నీ పూర్తిగా నమ్మేవాడు కాదు. అతి చంచలం అతని మనసు. జూరిచ్ 'డాడాయిస్టుల'లో ఈయన ఒకడు. కాని దానికీ గూడ దూరంగానే వెళ్లాడు. ''గార్డియన్''లో ఒక ప్రఖ్యాత కళా విమర్శకుడు ఈతని అనిశ్చల స్థితి గురించి వ్రాస్తూ ''క్రొత్తగా వచ్చిన కళా రంగంలోని పెక్కు సంఘాలలో ఇతని స్థానం హాస్యాస్పదంగానే ఉంటుంది ఎప్పుడూ. 1916 - 1919ల మధ్య జూరిచ్‌లో వచ్చిన డాడాయిజమ్‌లో యితని స్థానం తల్లిలాంటిదా లేక నర్స్‌లాంటిదా? ఇరువదవ శతాబ్దంలో తన మిత్రులు 'కిరికో', ' ఎర్నెస్ట్'లు తమ స్వప్నాలను చిత్రిస్తున్నప్పుడు యితను వారితోబాటు ''సర్రియలిస్టేనా?'' నిజానికి యితను ఈ క్రొత్త సంఘాల (అంటే డాడాయిజం, సర్రియలిజం) స్థాపకులలో ఒకడు కాదు, వీటిపై అభిమానమున్న వేదాంతి, కవి.''

ఏ సంఘానికి చెందినా, చెందకపోయినా, తను నమ్మిన దానినే ఆసాంతం కొనసాగిస్తూ బ్రతికాడు ఆర్ప్. దీన్ని ఎవరూ కాదనలేరు. ఇంత పట్టుదల గలవాళ్లు బహుకొద్దిమంది. తన రచనల ద్వారా, చిత్రాల ద్వారా ప్రచారం చేశాడు తన నమ్మకాలను. అతని బలమైన రచనలు ఎంతోమంది తోటి ప్రముఖ చిత్రకారులను మార్చినవి, మలచినవి, స్థిరంగా పాతుకుపోయిన కళా పద్ధతులను విడిచిపెట్టి కొత్త భావాలను వెళ్లగ్రక్కమని, నూతన యుగారంభంలో గొంతెత్తి అరచిన వ్యక్తి. ''చెట్టు నుండి ఉద్భవించే పండులాగ, తల్లినుండి

బయలుపడే బిడ్డ మాదిరి, కళ మనుష్యుని నుండి ఆవిర్భవించే ఫలం'' అన్న ధైర్యశాలి. ఇతని భావాలను వ్యక్తపరిచే భాష గూడా శిల్పాలంత గంభీరతను, గట్టిదనాన్ని కల్గి ఉంటాయి.

''సర్రియలిజమ్ నాకు అండగా నిలిచింది కాని మార్చలేక పోయింది.'' ఇలా అనగలిగే ధైర్యం సర్వెడాల్‌కి గాని, మాక్స్ ఎర్నెస్ట్‌కుగాని, మరెవరికైనా సరే లేకపోయింది. మిత్రుడు మాక్స్ ఎర్నెస్ట్ వ్రాస్తాడు - ఆర్ప్‌ను గురించి, ''ఆర్ప్ మంత్రయుక్తమైన భాష, మనల్ని మనం పోగొట్టుకున్న స్వర్గంలోకి, అనంత రహస్యాలలోకి, తీసుకువెళ్లి, విశాల విశ్వం యొక్క భాషను అర్థం చేసుకునే పద్ధతిని నేర్పుతుంది.'' ఇది ఎంతవరకు నిజమో ఆర్ప్ తన కళ గురించి తాను చెప్పింది తెలియజేస్తుంది.

''నా ఉబ్బెత్తు శిల్పాలు నీటి రంగు చిత్రాలు, ఆకార వికారాలు మానవుడు మరచిపోయిన వాటిని తిరిగి నేర్పే సాధనాలు - కండ్లు తెరచి అతనికి అతను కనే కలలు.''

ఇంత భావపూరితంగా చెప్పే చిత్రకారుడు, మరొకతను లేడేమో అనిపిస్తుంది. ఇంతటి ప్రజ్ఞాశాలిపై ఎరిక్ న్యూటన్ విమర్శను చూడండి.

''ఆర్ప్ శక్తి అతను ప్రకృతి ప్రసాదించిన అనంత రూపాలను ఆస్వాదించడంలో ఉంది: కాని అతని బలహీనత, ఈ అనంత రూపాలను పూర్తిగా వినియోగించుకోలేక పోవడంలో ఉంది. ప్రకృతి యొక్క అనంత రూపాలలో గల వైవిధ్యానికి న్యాయం చేకూర్చేందుకు కావలసిన పూర్ణత్వం, అతని అంతరాంతరాళంలో లేదు.'' ఈ ప్రదర్శన ఎన్నోసార్లు, ఎంతోసేపు విమర్శనాపూర్వక దృష్టితో చూచినా, నాకు, ఈ విమర్శ విపరీత మనిపించింది. ఏ విమర్శకుడు గూడ ఇలా వ్రాయలేదు ఆర్ప్ గురించి. న్యూటన్‌కు ఎందువల్లనో 'ఆర్ప్' చిత్ర, శిల్పకళలు అంతగ నచ్చలేదు.

ఆర్ప్ వస్తువులో గుండ్రని తనాన్ని ఎంతో ప్రజ్ఞతో మలచగలిగారు. ఈ పద్ధతిలో చేసిన శిల్పాలు, చిత్రాలు ఎంతో గొప్పగా ఉన్నాయి. కాని, కోణాలను తే ప్రయత్నించినప్పుడు అంత విజయవంతం కాలేదు. ''బార్‌బరాహెప్ వర్త్'' ''గాబో''ల శిల్పాలు చూచినవారికి ''ఆర్ప్'' యొక్క ఈ పద్ధతి శిల్పాలు పేలవంగా కనిపిస్తాయి. అతని మనసు గుండ్రని ఆకారాలపై జారినట్లు, పలకల ఆకారాలపై నిలువదనిపించింది. ''గాబో''లో ఉన్న వేగం ( ఆకారంలో) ఆర్ప్‌లో లేదు. ''ఆర్ప్'' మేఘాలు కదులుతాయి, జారతాయి. కాని పరుగెత్తవు. ఒక నిశ్చలత ఉంటుంది శిల్పాలలో. కాని, ఈ పరుగెత్తే స్వభావం చిత్రాలలో తేగలిగారు.

ఈ ప్రదర్శనలో ఒక చిరస్మరణీయ ఆనందము, శోభ పెల్లుబుకుతుంది. జీవితాన్ని సుఖమయం చెయ్యాలని పెట్టిన శ్రమగా కనిపిస్తుంది. ఒక్కొక్క రూపం ఒక్కొక్క భావాన్ని మూగగా అందిస్తాయి, గానం చేస్తాయి గేయాలతో - అవి గూడా ఆర్ప్‌వే.

పాలరాతిలో మలచిన, ఒక స్త్రీ శిల్పంలోని రూపంలో పండిన యౌవనం నవ్వుతుంది. జీవితంలో ముఖ్యమైన భాగం జవ్వన దశ. అందులోనే బలం, హుందా, గర్వం, స్వచ్ఛత ఉంటాయి. ఆ దశలోనే మనం వీరకృత్యాలను చేస్తాం. జీవితాన్ని నిజంగా అనుభవిస్తాం. శరీరాన్ని శుభ్రపరచి, ఎన్నో సుగంధ ద్రవ్యాలను రాసి శోభామయంగ, ఆస్వాదనా పూరితంగ చేస్తాం. ఈ శిల్పం ముఖ్యంగా పాలరాతిలో చెయ్యడం గమనించండి. ఈ శిల్పాన్ని చూస్తే యివన్నీ కండ్లముందు కనిపిస్తాయి. ఇంతకంటే భావయుక్తమైన శిల్పాన్ని నేను చూడలేదు. గ్రీకులు చేసారు అద్భుతాలు పాలరాతితో. కాని యిది అత్యద్భుతం. గ్రీకు స్త్రీ మూర్తులు మనల్ని తలతిప్పి చూచేట్లు చేస్తే, ఆర్ప్ చిత్రం మనల్ని ఊహించి ఆనందిచేట్లు చేస్తుంది. ఊహభావాలకు దగ్గరగా తీసుకువెళ్తుంది. మనల్ని గానం చేయిస్తుంది. ఆర్ప్ యొక్క భావనకు అతని జీవిత పరిపూర్ణతకు యిదే సాక్ష్యం.

మరొక చిత్రంలో చెక్కను కోసి, మరొక చెక్కపై అతికించి, రంగులు వేశారు. మేఘం శరవేగంలో సాగుతున్నదని దీని భావం. కాని యిందులో మేఘం బరువుగా నీటితో నిండి ఉన్నట్లు ఉంది. ఎప్పుడు ఎక్కడైనా సరే గబుక్కున వర్షించేమాదిరిగా ఉంది. కాని దానిలో వేగం లేదు. నడక ఉంది. బరువుగా జారుతున్న మేఘం ప్రక్కలకు, చిన్న చిన్న పిల్ల మేఘాలు గుంపులు గుంపులుగా చేరి, ఏవో కబుర్లు చెప్పుకుంటున్నట్లుగా ఉన్నాయి. ఈ చిత్రంలో ఆకారాలకు గల అవినాభావ సంబంధం గమనించదగ్గది, గ్రహించతగ్గది.

మరో శిల్పంలో పిశాచము తల మలచబడింది కంచులో. వికార రూపమైన ఈ తల, కోణాల మొనలతో ఉండి ఒక హేయ భావాన్ని కలుగజేస్తుంది. బరువు, బలం ఉంది తలలో. ఈ తల పికాసో శిల్పాలను జ్ఞప్తికి తెస్తుంది. ఈ శిల్పం 'ఆర్ప్' గాదు మరెవరో చేశారంటే గూడ నమ్మేదిగా ఉంది. ఆర్ప్ యొక్క పద్ధతికి భిన్నంగా ఉంది. ఆర్ప్ యొక్క సునిశితత్వం యిందులో ఉన్నా, అంతగా నాకు నచ్చలేదు. మరొక శిల్పం పాలరాతిలో వయ్యారంగ వెనుకకు వంగిన స్త్రీ రూపాన్ని ప్రదర్శించాడు. ఈ శిల్పాన్ని మోకాళ్ల నుండి పై భాగం చెక్కాడు. చేతులు లేవు. కాని నాజూకుతనం, స్త్రీ శరీరంలో ఉన్న సోయగం, అవయవాల నిండుతనం ఎంతో సమ్మోహితులను చేసింది చూపరులను. ఇలా చాల స్త్రీ రూపాలను చేశాడు ఆర్ప్.

''సాలీడు'' అన్న మరో శిల్పం చాల గొప్పగా ఉంది. బల్లపరుపుగా ఉన్న మందపాటి ఇత్తడి దిమ్మను, డిజైన్ మాదిరిగా తివాచీలలో, 'ఆర్ప్' నేయించారు. ముతుక రంగులలో నేయించి గోడకు వ్రేలాడదీసిన తివాచీలను పాలిష్‌చేసిన గోడకు వ్రేలాడదీశారు. గోడకు కరచుకొని ఉన్న మరొక శిల్పం సాలీడు మాదిరిగా ఉంది. సాలీడు కాళ్లు ఒకదానికి ఒకటి పెనవేసుకొని బారుగా, చిక్కుబడినట్లున్నాయి. చిన్న చిన్న రంగుల రేఖా చిత్రాలను అద్దాల బీరువాలో ఉంచి విడిగా ప్రదర్శించారు.

ఈ ప్రదర్శన 'కోకోష్కా' ప్రదర్శనలా చాలమందిని ఆకర్షించలేదు. కోకోష్కా ప్రదర్శనలో ఎప్పుడు చూచినా కనీసం100 మందికి పైగా ఉండేవారు. నడవడానికి హాలులో కష్టం అనిపించేది. మన తెలుగు సామెత 'ఇసుక వేస్తే రాలడంలేదు' అన్నట్లుగా ఉన్నారు జనం. కోకోష్కా చిత్రాలు ఆబాలగోపాలానికి అర్థం అవుతాయి. కాని ఆర్ప్‌వి కొంతమందికి మాత్రమే అర్థం అవుతాయి. అందువల్ల ఆ కొంతమంది మాత్రమే ఈ ప్రదర్శనకు వచ్చారు.

ఆర్ప్ ప్రభావం ఇప్పటి యువతరం అమెరికన్ చిత్రకారులపై ఎక్కువ కన్పిస్తున్నది. ఈ మధ్య ''సమకాలీన అమెరికన్ కళ'' అన్న ప్రదర్శన బ్రహ్మాండంగా జరిగింది. అందులో ప్రముఖ అమెరికన్ చిత్రకారుల చిత్రాలున్నాయి. ఆర్ప్‌ను పోలినవి ఉన్నాయి. ఆర్ప్ చెక్కను, రాతిని, కంచును, స్టెయిన్‌లెస్ స్టీల్, ఇనుము, మరెన్నో లోహాలను ఉపయోగించారు. ఏ పదార్థం యిచ్చినా దాన్ని చిత్రకళ, శిల్పకళలకు ఉపయోగించగలిగే ఊహాశక్తితో జీవితాన్ని సాగించి, సాధించి, గెలిచారు.

కొంతమంది చిత్రకారుల శిల్పాలను, చిత్రాలను చూచి ఆనందించాలి. మరికొంత మందివి చూడడమే గాక, ఊహించి ఆనందించాలి. ఈ రెండవ తెగకు చెందిన ప్రజ్ఞాశాలి ఆర్ప్.

*(భారతి, జూన్ - 1963)*

★



# రోదాం

''ప్రతి ఒక్క మేధావీ ఆ కాలంలోని వారికి ఒక గడ్డు సమస్య. అంతుపట్టని యింద్ర జాలం''. అన్నాడు సోమర్ విల్‌స్టోరి.

''మానవ శరీరం నడుస్తున్న సుందరాతి సుందరమైన గుడిలాంటిది'' అన్నాడు రోదాం.

చిత్రశిల్ప కళారంగంలో రోదాం పేరు విననివారు వుండరు. ఈ పేరు కళా రంగంలో చిరస్థాయిగ పాతుకుపోయింది. సోమర్ విల్‌స్టోరి అన్నట్లు, మైకలాంజిలో తర్వాత వచ్చినవారిలో యింతకంటే గొప్ప శిల్పకారుడు, ప్రపంచంలో పుట్టలేదనడంలో, ఏమాత్రం ఆశ్చర్యం లేదు. మైకలాంజిలో శిల్పాలు మానవరూపాలకు ప్రతిరూపాలైతే, ఈయనవి జీవభరిత రూపాలు. ఇలా జీవాన్ని శిల్పాల్లోకి ఒలికించడం ఎవ్వరూ చేయలేదు చరిత్రలో.

లండన్‌లోని రోలండ్, బ్రౌన్, డెల్ బాగో గ్యాలరీల్లో రోదాం శిల్పాలు ప్రదర్శిస్తున్నారు. శిల్పాలన్నీ కంచులో పోతపోసినవి. ప్రదర్శనాలయంలోకి వెళ్తె ఏదో నృత్యమందిరంలోకి వెళ్లినట్లుంటుంది. నర్తకులు నృత్యం చేస్తుంటే, తన్మయత్వంతో మనం అలా కండ్లు అప్పగించి చూస్తుంటాం, నోరు తెరుచుకొని, నృత్యాలను చూస్తూ. తీక్షణంగా మనల్ని చూస్తున్న శిల్పాలు, విమర్శనాపూర్వకంగా పరీక్షిస్తున్న ఎవరెవరివో శిల్పంలో మలచిన తలలు, నాట్యభంగిమలను చూపే వయ్యారపు చేతులు, దృఢమైన మగచేతులు; అసలు దేనిని గమనించక, దీర్ఘాలోచనాపరుడైన ఎవరా వ్యక్తి? యిలా యింకా ఎందరో వున్నారు శిల్పరూపాలలో. ప్రదర్శనలోనికి వెళ్తే ఎంతో మంది మనుష్యుల మధ్యకు నడిచివెళ్లి నట్లుంటుంది - కాని ఎవరూ మాట్లాడరు, మనతో - అవన్నీ శిల్పాలే గదా మరి!

''ఈయన సృష్టించిన శరీరాలు ఒకదాని నొకటి అంటుకొని, వ్రేలాడుతూ,

జంతువులమాదిరి కరచుకొని వుంటాయి. శరీరాలు ముఖములమాదిరిగా వింటాయి. చేతుల మాదిరిగా పైకి ఎగురుతాయి'' అంటాడు రిల్కే. 'రిల్కే' అన్న వ్యక్తి ఎన్నో సంవత్సరాలుగా రోదాఁకు సెక్రటరీగా పనిచేశాడు. రోదాఁతో చిత్ర శిల్పకళల గురించి, ముఖ్యంగ ఇతని శిల్పాల గురించి, భావాలగురించి తరచి తెల్సుకున్న వ్యక్తి. శిల్పాలు చూస్తే తెలుస్తుంది రోదాఁ ఎంతగా మానవ శరీరాన్ని అవగాహన చేసుకున్నదీ. శరీరంలోని వయ్యారపు వంపుసొంపులు, బలం, ఆచ్చర్య చకితుల్ని చేస్తాయి. ఇంతగా మానవశరీరాన్ని ఆరాధించిన వ్యక్తి మరొకరు లేరేమో! సర్వ సృష్టిని చూచాడుగాబోలు మానవ ఆకారంలో.

కొంతమందికి ప్రకృతి మూలమైతే, మరి కొంతమందికి మానవరూపమే మూలాధారం. కొంతమంది మానవ శరీరంలో సర్వాంతర్యామిని చూస్తారు, మరి కొంత మంది ప్రకృతిలో దైవ సాక్షాత్కారాన్ని చూస్తారు. ప్రకృతి, పురుషుడు మూలంలో ఒకరేనేమో!

ఇంతగా మానవరూపాన్ని ఆరాధించిన శిల్పి రోదాఁ 14 నవంబరు 1840లో పారిస్‌లో పుట్టాడు. చిన్నప్పటినుండీ కళలంటే ఎంతో అభిలాష. శిల్పాలను చేస్తూ, కంసాలి పనిచేస్తూ ఎంతో కాలం గడిపాడు. లెక్కలు అంటే మహాభయం, ఏవగింపు. తన 35వ ఏట శిల్పకారునిగా పెద్ద సంచలనాన్ని తెచ్చాడు. బ్రసెల్స్‌లో ఒక శిల్పాన్నిచేసాడు 'ది ఏజ్ ఆఫ్ బ్రాంజ్'అని. ఆ శిల్పాన్ని ఒక సైనికున్ని మోడలుగవుంచుకొని 18నెలలు కష్టపడిచేసాడు. ఇది రోమన్ శిల్పాల మాదిరిగ వుంటుంది. నగ్నంగా వున్న యువకుడు వయ్యారంగా ఒక చేతిని తలమీద వుంచుకొని, మరొక చేతిని మడచి, బలాన్ని చూపిస్తున్న వస్తాదులాగ, నిల్చుండి వుంటాడు. ఈ శిల్పం ప్లాస్టరు నమూనాను, పారిస్‌లో 1877లో, సెలాన్ ప్రదర్శనలో, ప్రదర్శిస్తే, సెలాన్ కమిటివారు ఈ శిల్పములోని సహజత్వాన్ని నమ్మలేకపోయారు. అంత సజీవంగా వుంది. నిజమైన మనిషినే, ప్లాస్టరులో కాపీ తీసి చేసిన శిల్పమని, ప్రకటించారు. ఇకనేం, పత్రికలన్ని ఈ విషయాన్ని పట్టుకొని ప్రచారం చేసాయి. సెలాన్‌లో ప్రదర్శించడమంటేనే ఎంతో గౌరవం చిత్రకారులకు. మొదటే ఇలాంటి అపవాదు వస్తే, చిత్రకారుని జీవితం ధ్వంసమే - అందులోనూ యింత చిన్నతనంలో - జీవితం అంతా ముందు వుండగా. రోదాఁ పట్టుదలగల వ్యక్తి. దేన్నీ సామాన్యంగా వదిలే తత్వం గాదు. సెలాన్ కమిటీని ఎదుర్కొన్నాడు. బ్రస్సెల్స్ లోని ఒక సిపాయిని మోడలుగా వుంచి చేసిన శిల్పమని, మోడల్‌ను, బ్రస్సెల్స్ నుండి రప్పిస్తానని అన్నా, ఎవరూ వినలేదు. సిపాయి మోడల్‌ను తీసిన ప్లాస్టరు కాపీని, ఫోటోలు తీసిపంపితే, ఈ పార్శిలే విప్పలేదు కమిటి. పంతంగల శిల్పి - అందులోనూ ఫ్రెంచి

శిల్పి గదా. అవమానాన్ని భరించగలడా!! మంత్రిగారితో చెప్పి కమిటీని వేసి నిజాన్ని తేల్చవలసిందిగ కోరాడు. ప్రభుత్వ కమిటి రోదాఁ శిల్పం నిజంగా మనిషిని చూచి చేసినదే అని తేల్చినా, సెలాన్ కమిటి ఒప్పుకోలేదు. చేసేది లేక వూరుకున్నాడు రోదాఁ,విరక్తి, విచారంతో.

బౌచర్ అనే తోటి శిల్పకారుడు ఒక 'పిల్లల గ్రూపు'ను చేయవలసిందిగ కోరితే, రోదాఁ ఒప్పుకున్నాడు చేసి ఇవ్వడానికి. ఎంతోకాలం తీసుకోకుండా, బ్రహ్మాండంగా మలచిన ఈ శిల్పాన్ని చూసి, బౌచర్ ఆశ్చర్యపోయాడు. ఇది చేయగల్గిన వ్యక్తి 'ది ఏజ్ ఆఫ్ బ్రాన్జ్' చేయడంలో ఏమాత్రం అనుమానం లేదని, పారిస్‌లోని చిత్రకారులందరితో కలిసి మరల మంత్రిగారిద్గగరకు వెళ్లి, రోదాఁ పై గల అపవాదును తొలగించమని కోరారు. ఇలా అందరు చిత్రకారులు, శిల్పకారులు కలిసి ఏకాభిప్రాయాన్ని వెలిబుచ్చడం పారిస్‌లో ఏనాడూ జరుగలేదు. జయం లభించింది రోదాఁకు. మంత్రిగారు శిల్పకారునికి ఒక మెడలును బహూకరించి, ఈ శిల్పాన్ని స్టేటుకుగాను కొన్నారు. అంతేగాక కళాభవనానికి శిల్పాలతో వున్న ద్వారాన్ని చేయమని, ప్రభుత్వం తరపున క్రొత్త పనిగూడ యిచ్చారు మంత్రిగారు. ఇది ఎంతో సంతోషాన్ని తెచ్చినా, సెలాన్ కమిటి చేసినపనికి, తనపై అపవాదును తొలగించడానికి ప్రభుత్వం తీసుకున్న కాలానికి, ఎంతగానో విచారించాడు. ఏనాడూ సెలాన్‌ను క్షమించలేదు. కాని ఈ ప్రచారం రోదాఁకు ఎంతో పేరు తెచ్చింది. ప్రజలు గొప్ప శిల్పకారునిగా పొగడడం ప్రారంభించారు. 'నిజమైన మనిషినుండి నమూనాలను తీసి, శిల్పాలను మలచానని నిందవేశారు గనుక, ఈ దఫా, ఈ ద్వారాలపై వుబ్బెత్తుగ వుండేట్టుగ, ఎన్నో శిల్పాలను మలుస్తాను, అన్నీ చిన్న సైజులో. అప్పుడు ఎవరూ నేను మోసం చేసానని అనరు. ఈ ద్వారానికి కవి ''డాంటే''ను ఆధారంగా తీసుకుంటాను' అని రోదాఁ ప్రకటించాడు.

రోదాఁ పేరు చిరస్థాయిగ నిలచిపోయింది ఈ శిల్పద్వారం వల్లనే. జీవితాన్ని ధారపోసాడు దీన్ని మలచడంలో. కాని పూర్తి చేయకుండానే చనిపోయాడు. ఎన్నిసార్లుగనో మొదటగ అనుకున్న డిజైనును మార్చాడు. అసలు ఒప్పుకుంది చిన్న ద్వారాన్ని చేస్తానని, కాని వుబ్బెత్తు రూపాలతో ఆ ద్వారం అంతా మానవాకారాలతో నిండిపోయింది. ఒక మహా కళాఖండాన్ని వూహించి చేయసాగాడు.

జూడిత్ క్లాడెల్ చక్కగ చెప్పింది ఈ శిల్పాన్ని గురించి. 'తన ఆత్మసంక్షోభాన్ని, భగవంతుని ఆధిక్యతను సవాలుచేసే మానవ తత్వాన్ని, చూపుతూ, ఒక బ్రహ్మాండమైన విజయచిహ్నాన్ని నిలబెట్టాలనే ప్రయత్నం ఇది.' తన యువదశలో మత తత్వాన్ని

నిరసించేవాడు, రోదాఁ. 'జూడిత్' తనతో రోదాఁ అన్న మాటల్ని వ్రాస్తుంది యిలా. 'ప్రతి ఒక్క మానవునిలోనూ, ప్రతి సమయంలోనూ, రెండు ప్రభావాలు ఒక్కసారిగ ప్రసరిస్తాయి. ఒకటి దైవము వైపు చూస్తే, మరొకటి దయ్యము వైపు సాగుతుంది' రోదాఁను బాగా అర్థం చేసుకున్నవారిలో జూడిత్ ఒకరు.

ఈ 'గేట్ ఆఫ్ హెల్' అన్న శిల్పఖండంలో 186 శిల్పాలున్నాయి. మానవునిలో వున్న అన్ని హావ భావాలను చూపే అద్దం లాంటిది. ప్రతి శిల్పం వయ్యారంతో మలచబడింది కోపాన్ని, ఆలోచనల్ని, విచారాన్ని, భయాన్ని, బాధల్ని చూపే మానవ ప్రతిరూపమయం. ముఖ్యంగా చూపదలచుకున్నది సోమర్ విల్స్టోరి అన్నట్లు, ''మానవ గమనంలోని జీవాన్ని, ఈ పెద్ద శిల్పంలో యిమడ్చడం కొరకు ఎన్నో వివిధ శిల్పాలను మలచాడు రోదాఁ. ప్రతి వొక్క శిల్పం ఒక మహత్తర కళాఖండం. ప్రతి ఒక్కశిల్పానికి కొన్నివందల స్కెచ్‌లు వేశాడు - వ్యూహాతీతం గదూ! థింకర్, కిస్, ఏడమ్, ఈవ్, ది త్రీ షేడోస్ మొదలగు ప్రసిద్ధ శిల్పాలన్ని ఈ గేటులో యిమడ్చడానికి చేసినవే''.

పాల్‌గజెల్ అనే ఆయన వివరించాడు రోదాఁ ఎలా శిల్పాల్ని మలచేది. స్టూడియోలో ఎంతోమంది మగ, ఆడ మోడల్స్ వుండేవారట ఎప్పుడూ. వారందరికి జీతాలు యిస్తూవుండేవాడు. అందరూ నగ్నంగా తిరుగుతూ, వయ్యారంగా నడుస్తూ వివిధ భంగిమలలో హావభావాలను ప్రసరిస్తూ వుండేవారు. రోదాఁ ఆ స్టూడియోనే తను నివసించే గదిగా వుపయోగిస్తూ శిల్పాలను మలచేవాడు, విశ్రాంతి తీసుకునేవాడు. ఈ విధంగా తాను మానవసందోహంలో నివసిస్తూ, జీవితాన్ని ప్రతిఫలించాడు కళలో. ఎన్నోవేల స్కెచ్‌లు వేశాడు. వీరందరిని చూస్తూ, మానవ అంగ యంత్రాంగ అంతరంగాన్ని బాగా ఆకళింపు చేసుకున్నాడు. యిలాంటప్పుడే అన్నాడు రోదాఁ ''నేత్రాలను, తెలివిని ఎలా వుపయోగించాలో తెలిసిన వారికే మేధస్సు ఫలిస్తుంది. వారే మేధావులు''. ఎంత నిజమో యిది. ఆయన శిల్పాలే నిదర్శనాలు. ఈ 'మానవ మోడల్స్'ను సదా చూడడమేగాక, వారిని బాగా అర్థం చేసుకున్నాడు. వారి జీవితాలలోని కష్టసుఖాలను విన్నాడు. ఎవరి యిష్టం వచ్చినట్లు వారిని ప్రవర్తింపనిచ్చాడు. ''ఆ విధంగా వారిని చూస్తూ, శిల్పాలను మలుస్తూపోగా యింతింతగా సాగి అంతంత అయ్యింది ఈ ద్వారం. సంవత్సరాలుగా సాగింది శిల్పనిర్మాణం'' అని వివరిస్తాడు కవియైన రిల్కే. దీన్ని గురించి చెప్తూ రోదాఁ అంటాడు. 'నా ప్రతి ఒక్క శిల్పాన్ని గురించి మాటలలో చెప్పాలంటె, కనీసం ఒక్కొక్క శిల్పం గురించి చెప్పడానికి సంవత్సరం తీసుకుంటుంది.'' ఈ ద్వారంలో 186 శిల్పాలున్నాయి మొత్తం. బహుశః పరలోకంలో వుండి ఈ శిల్పాలను గురించి, ఇంకా చెప్తూనే వున్నారేమో మరి! 186 శిల్పాలు గదా!!

గత కాలపు మహాకవి 'డాంటే' వూహలు, మరో శతాబ్దంలో మారుమ్రోగినాయి. ఇవి రోదాఁలోని చిత్రకారుణ్ణి నిద్రనుండి లేపినాయి. వినూత్న రూపాలతో, నూత్న శతాబ్దాన్ని ప్రతిబింబింపచేశాడు. కవి డాంటే వూహలను ఆధారంగా తీసుకొన్న రోదాఁ తన ప్రయత్నంలో, మానవుల్ని వూహలుగా మార్చి, యుగాయుగాలుగా వస్తున్న కళను క్రొత్త పుంతలు త్రొక్కించాడు.

దాదాపు ప్రతిశిల్పం ఏదో ఒక వాదనతోనో, లేక దురదృష్టంతోనో ముగిసింది. ''బాల్జాక్'' శిల్పాన్ని చెయ్యవలసిందిగా సొసైటీ ఆఫ్ లెటర్స్ సంస్థవారు అడిగారు రోదాఁను. దానికి ముఖ్యకారణం ప్రముఖ రచయిత 'జోలా'. ఎంతోమంది ఈ శిల్పాన్ని చేస్తామని ముందుకు వచ్చినా, సొసైటి రోదాఁను చెయ్యవలసిందిగా నిర్ణయించింది. ఏడు సంవత్సరాలు కష్టపడి చేశాడు. తీరా అంతా తయారయ్యాక చూపితే 'బాల్జాక్‌కు బదులుగా రోదాఁ మనకు ఒక మంచుమనిషి నిచ్చాడు' అని పేపర్లు, ప్రజలు ఎగతాళిచేసి, నవ్వులాటగా తీసుకున్నాయి. సొసైటీ ఈ శిల్పాన్ని తీసుకో నిరాకరించింది. ఇది రోదాఁవద్దనే వుండిపోయింది. పెద్ద తల, గాలికి చెల్లాచెదురైన జుట్టు, పెద్ద మడతలతో వున్న వదులైన బట్టలు, అంతా ఒక బుట్టబొమ్మ మాదిరిగ వుంటుంది శిల్పాన్ని చూస్తుంటే.

ఇలాగే మరొకటి 'బర్గర్స్ ఆఫ్ కలెయిస్' అన్నది. కలెయిస్ అనే పట్టణపు కౌన్సిలువారు 'యూస్టాష్‌డి సెయింట్ పియరే' అన్న పేరుగల ఒకవ్యక్తి శిల్పాన్ని చేయమని కోరింది. యుద్ధకాలంలో ఆ పట్టణానికి ఎంతో పేరుతెచ్చాడు ఈ వ్యక్తి. చేయడం మొదలుపెట్టాక, రోదాఁకు వుత్సాహం పెరిగి, ఒకతని శిల్పాన్ని చేసేబదులు మరొక అయిదుగురిని చేర్చి, ఒక సమూహచిత్రాన్ని చేసాడు. ఇతను అంత వీరుడైనప్పుడు, అతనిని అనుసరించే వారు గూడ వుండాలని తలచి, ఇలా చేసాడు. కౌన్సిలువారిని ఒక్క శిల్పానికి యిస్తానన్న 15000 ఫ్రాంకులకంటే, ఏమి ఎక్కువ యివ్వనక్కరలేదని కోరాడు. దీన్నిబట్టి మనకు తెలుస్తుంది శిల్పకారుని తత్వం. కళకొరకు ధనాన్ని త్యజిస్తాడు - అసలు డబ్బు ప్రధానంగాదు. తోటి చిత్రకారులందరు రోదాఁ వట్టి పిచ్చివాడు, యింత పెద్ద శిల్పానికి యింత తక్కువ తీసుకోవడమేమిటని నిరశించారు. ఈ శిల్పంలోనివారు ఎంతో దీనంగా, బీదతనాన్ని ఒలికిస్తారు. వంగిన శరీరాలతో వుండే ఈ శిల్పాన్ని 'పారిస్' నగరం నిరాకరించింది. ఫ్రెంచివానికున్న హుందా, ఠీవి ఈ శిల్పంలో లేవని విమర్శించింది. దీన్ని నేను అమెరికాలో ఫిలడల్ఫియా నగరంలో చూచాను. ఈ శిల్పానికి మరొక నమూనా యూరప్‌లోని 'కోపెన్‌హాగన్'లో వుంది. విడిగా చేసిన శిల్పాలన్నిటిలో యిదే పెద్దది.

రోదాఁ చాల ఆడంబరంగా బ్రతికాడు. రోజూ మంగలివాడు యింటికి వచ్చి, గంభీరమైన ఫ్రెంచి గడ్డాన్ని అందంగా కత్తిరించి, దువ్వి, సెంటు రాసేవాడు. అలాంటప్పుడు సెక్రటరీ దగ్గర కూర్చుని, వచ్చిన వుత్తరాలు చదవడం, జవాబులు వ్రాయడం జరిగేది. ఆయన జవాబులు చెప్పే వేగానికి, షార్టుహేండ్ వచ్చినవారికి తప్ప, మామూలు సెక్రటరీకి చాలకష్టం.

రోదాఁకు యింగ్లీషు అసలు రాదు. ఫ్రెంచి తప్పితే మరోభాష రాదు. భార్యకు అసలు చదువే రాదు. అయినా ఎంతో శ్రద్ధగా తాను చేసే శిల్పకళకు తోడ్పడింది. స్టూడియోను వెయ్యి కన్నులతో కాపాడేది. రాత్రి నిద్రపోయే ముందు, మట్టితో చేసిన శిల్పాలన్నిటిపై నీరుచల్లి, గుడ్డచుట్టి చాలా జాగ్రత్తగా కాపాడేది. రోదాఁ చాలా మితభాషి. ఆయనచేత మాట్లాడించడం, ఒక ప్రయత్నం అని చెప్పవచ్చు. ఫ్రెంచిలో మాత్రం, మాట్లాడితే, చాల ధారాళంగా మాట్లాడేవాడు. ''రోజూ మాట్లాడుతుంటే, మనసులో వచ్చే దీర్ఘాలోచనలకు అసలు అవకాశంలేదు'' అనేవాడు.

మానవ రూపాన్ని ఆరాధించి, మన ముందు ప్రతిరూపాలను ప్రతిష్ఠించిన ఈ మేధావి చివరిదశలో, వేదాంతి అయ్యాడని అనిపిస్తుంది నాకు. ఈయనను చిరస్థాయిగ కళా రంగంలో ప్రతిష్టించిన శిల్పం 'గేట్స్ ఆఫ్ హెల్' అన్నది. నిజానికి ఈ శిల్పం ద్వారం కానేకాదు. ఈ ద్వారాన్ని తెరవలేం. అలాగనే చేసిన శిల్పం యిది. అన్ని గొప్ప శిల్పాలు ఈ ద్వారం నుండి వచ్చినవే. ఆకారాలన్నీ యిందులో యిముడ్చుట కొరకు చేసినవే. ఈ ద్వారం 'డాంటే' యొక్క 'డివైన్ కామెడి'కి రూపమయ వర్ణనకాదు, మైకలాంజిలో చేసిన బ్రహ్మాండమైన 'ది లాస్ట్ జడ్జిమెంట్' కాదు. ఇది శిల్పకారుడు మానవజాతి స్థితిపై పెట్టిన మహోన్నత ధ్యానం. అంతర్ దృష్టితో చూచే అవలోకన. దీనిలోని నరకం అందరూ అనుకునే నరకం గాదు. అది మానవ జీవితంలో, నెరవేరని హృదయ బాధలకు ప్రతిరూపం. ఇదీ ఆయన నరకానికిచ్చిన అర్థం.

'ప్రతి మేధావి ప్రపంచాన్ని ఒక క్రొత్త దృష్టితో చూస్తాడు' అన్నాను ఒక సారి నేను. అలానే చూచాడు రోదాఁ.

(ఫ్రెంచి ఉచ్చారణ ప్రకారం Rodin పేరుని రోదాఁ అనే అంటారు.)

*(ఆంధ్ర పత్రిక వీక్లీ డిశంబర్ 1, 1967)*

☆

# బెన్ నికల్‌సన్

19వ శతాబ్దం మొదటి నుండి వచ్చిన చిత్రకారులను చూస్తే వారిలో ఎంతో పట్టుదల, ఒక నూతన విషయాన్ని చెప్పాలనే బలమైన వాంఛ కనిపిస్తుంది. దానివల్ల వారు సంఘానికి చాల దూరం అవ్వవలసి వచ్చింది. వీరి చిత్ర కళ సంఘానికి అర్థం అవ్వలేదు. అందువల్లనే వారు సంఘంచే దాదాపు వెలివేయబడ్డారు.

ఈ శతాబ్దపు చిత్రకారుల జీవితాలను చూస్తే, వారు ప్రజల నుండి ఎంత అనాదరణను పొందారో తెలుస్తుంది. ప్రజలు ఎప్పుడూ, అన్ని రంగాలలోను తల దూర్చాలనే మనస్తత్వం గలవారు. అన్ని విషయాలు తెలుసుకోవాలనే కుతూహలం కనిపిస్తుంది. కుతూహలం ఉంటే తెలుసుకోవచ్చు. తెలుసుకోడానికి విమర్శనాపూర్వక దృష్టి, ఎదుట వానిని అర్థం చేసుకునే శక్తి అవసరం. అలాకాకుండా, ప్రతిదీ తేలికగా తెలుసుకోగలం అనుకునేవారితోనే వస్తుంది చిక్కు- ముఖ్యంగా చిత్రకారులకు.

ఎన్నో నూత్న భావాలకు, రంగాలకు దారితీసిన ఈ 19వ శతాబ్దం చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుంది. భావాలలో ఒక ఝుంఝూమారుతం లేపింది ఈ యుగం. చిత్రకళలో ఊహించలేని మార్పులను తీసుకొచ్చింది- ప్రగతినే మార్చింది. చిత్రకారుల్ని ప్రజల నుండి వేరు చేసింది. దాదాపు అందరు చిత్రకారులు, ఎన్నో కష్టాలకు లోనయ్యారు, వారి నూత్న మార్గాన్వేషణా కృషిలో. అయినా పట్టు విడువక, తాము నమ్మిన విషయాల్ని క్రొత్త పద్ధతులలో చిత్రిస్తూ నిలచినవారు, విజయపరంపరలను పొందారు. అలా విజయం తర్వాత విజయం సాధించినవారిలో బెన్ నికల్‌సన్ ఒకరు.

కొంతమంది చిత్రకారులు ఎంతో వ్యయ ప్రయాసలకు లోనవుతారు చిత్రకళాభ్యాసంలో. డబ్బు లేకనో, ఇంటి వద్ద వారు అంగీకరించకనో. కొంతమంది బాల్యం నుండి చిత్రకళపై అభిలాష ఉండి, ఏదోవిధంగా దానిలోనే జీవితమంతా కృషిచేస్తారు.

మరికొంతమంది ఏ నలభైయ్యో ఏటనో, లేక అరవయ్యో ఏటనో ప్రారంభిస్తారు కళాభ్యాసం. కొంతమంది కుటుంబమే కళాకారుల నిలయమై ఉంటుంది. అటువంటి కుటుంబాలలో పుట్టిన వారికి అంత కష్టముండదు ఆ రంగంలో రాణించడానికి అంతకుముందే కుటుంబమంతా కళారంగానికి సంబంధించినవారితో పరిచయాలు ఏర్పడి ఉంటాయి గనుక, మార్గం సుగమమవుతుంది. కొంతమంది అసలు కళారంగాలకు సంబంధించని కుటుంబాల నుండి వస్తారు. వారు చిత్రకారులుగ స్థిరపడాలంటే, చాల శ్రమతో కూడుకున్న విషయం. మరో విచిత్రమైన రకంవారు ఉన్నారు. వారు తమ కుటుంబంలోనివారి మాదిరిగా చిత్రకారులు అవడానికి కృషి చేస్తారు. కాని అంతవరకు తెలిసి ఉన్న కళా సంఘాలతో, పెద్దలతో సంబంధాల్ని తెగతెంచుకుని క్రొత్త మార్గాలను త్రొక్కుతూ, క్రొత్త పరిచయాల్ని సమకూర్చుకుంటారు. అందరికంటే ఈ తెగవారు బహు ఘటికులు. ఎంత బలమైన అడ్డునైనా దాటి, పట్టుదలతో ఎంతకాలమైనా ఓర్చి, విజయం పొందుతారు.

బెన్ నికల్‌సన్ వేసిన చిత్రాలు మొదట అమ్ముడుపోక గ్యాలరీలలో, అలా గోడలకు వ్రేలాడుతూ ఉండేవి ఎప్పుడూ. గ్యాలరీ యజమానికి, నికల్‌సన్‌కు గూడ కష్టంగానే ఉండేది. అయినా ఓర్పుతో తాను నమ్మిన పద్ధతిలోనే చిత్రిస్తూ వచ్చారు, ఒకరికి నచ్చినా నచ్చకపోయినా. ఈ పట్టుదలే ఆయనకు విజయపరంపరలను తెచ్చి, ఈనాడు ప్రపంచ ప్రసిద్ధ ఆధునిక చిత్రకారులలో ఒకరుగా గుర్తింపబడడానికి ఆధారమైంది.

బెన్ నికల్‌సన్ చిత్రకళా ప్రదర్శన యిప్పుడు జరుగుతున్నది. లండన్‌లోని రెండు ప్రయివేటు గ్యాలరీలు ఒక్కసారిగా ప్రదర్శిస్తున్నాయి చిత్రాల్ని. ఇలా ఒక్కసారి, రెండు ప్రదర్శనలు, ఒక చిత్రకారునివి ఒకే నగరంలో జరగడం విచిత్రమే. ఈ మధ్య యిలాంటి పెద్ద పెద్ద ప్రదర్శనలను ఏర్పాటు చేయడం ఎక్కువైంది లండన్‌లో. పికాసో గ్రాఫిక్స్ ప్రదర్శన ప్రారంభమైంది నేటి నుండి మరొక గ్యాలరీలో.

బెన్ నికల్‌సన్ ఏప్రిల్ 10, 1894లో డెన్‌హేమ్‌లో (ఇంగ్లండులో) జన్మించారు. తండ్రి సర్ విలియమ్ నికల్‌సన్. ఆయన వారి కాలంలో ప్రఖ్యాత చిత్రకారుడు ఇంగ్లండులో. తల్లి మేబెల్ ప్రిడ్, మేనమామ జేమ్స్ ప్రిడ్ గూడ చిత్రకారులే. బెన్ నికల్‌సన్ తల్లిదండ్రులకు పెద్దవాడు. కాని, ఎంతో వ్యత్యాసముంది తండ్రికి నికల్‌సన్‌కు. తండ్రి ఎంతో సరదా అయిన వ్యక్తి. ఎప్పుడు విందులిస్తూ పెద్ద పెద్దవారిని ఇంటికి పిలవడం, తాను వారి యిండ్లకు వెళ్లడం, కబుర్లు చెప్పడం, స్నేహితులతో కలిసి మెలిసి ఉండేవాడు.

ఆయనకు సంఘంలో పెద్ద గౌరవం ఉంది. బెన్ నికల్సన్ ఎవరితోను సరదాగా తిరగడు, తాను ఉన్నదే తన ప్రపంచం. ఎప్పుడూ ఏకాంతంగా, మనుష్యులకు సాధ్యమైనంత దూరంలో ఉంటాడు. తండ్రిలా సరదాలు, విందులు నచ్చవు.

తల్లిని గూర్చి, తండ్రి చిత్రాల గురించి నికల్సన్ అంటాడు: ''మా నాన్న వేసిన స్టిల్ లైఫ్ '', ప్రకృతి దృశ్యాలు అన్నీ ''సిక్కర్ట్'' వేసిన చిత్రాలులా ఉంటాయి. ఆ చిత్రాలలో కవితా మాధుర్యం ఉంది. కాని ఆయన మేధావి కాదు. అయినా మానాన్నగారి కాలంలో ప్రఖ్యాతి చెందినవే''.

''మా అమ్మ కుటుంబంలో అందరికంటె చాలా తెలివిగలది. ఎంతో అందమైనది. మా ఇంటికి వచ్చిన స్నేహితులు, పెద్దలు మా నాన్నతో ఎంతోసేపు చిత్రకళను గురించి మాట్లాడడం, మా నాన్న జోక్‌లు విసరడం ఆవిడకు నచ్చేదికాదు. 'వంట యింటిలో బల్ల శుభ్రం చేయాలి' అని లేచిపోయేది. నిజానికి మా అమ్మకు ఆ అవసరం లేదు. ధనికుల మవడంవల్ల, ఎంతోమంది నౌకర్లున్నారు యింట్లో అన్ని పనులు చేయడానికి.''

దీన్నిబట్టి చూస్తే తల్లి పోలికలు చాలవరకు యితనిలో వచ్చాయనిపిస్తుంది. అసలు రచయిత అవ్వాలని ఎంతో ఆశపడ్డాడు. కాని ఎందువల్లనో అది ఫలించలేదు. మొదటి నుండి స్వతంత్రభావం కలవాడు. స్లేడ్ స్కూల్లో చేరాడు. అంతగా రుచించలేదు స్కూలు పద్ధతి. అతనిలో ఏమాత్రము స్కూలు ప్రభావం పడలేదు. ఫ్రాన్స్ వెళ్లి ఫ్రెంచి నేర్చుకున్నాడు. మిలాన్ వెళ్లి ఇటాలియన్ భాష నేర్చుకున్నాడు. ఇలా యూరప్ తిరిగాడు. చిత్రాలు వేసేవాడు అడపాదడపా. అలా 27వ ఏడు వరకు ఏమంత చెప్పుకోదగ్గ విశేషాలేం లేవు అతని జీవితంలో. ఫ్రాన్సులోని కళాప్రదర్శనలు, అతనిలో చాల మార్పులు తీసుకొచ్చాయి. ఆధునిక చిత్రాలంటే అభిలాష విపరీతంగా పెరిగింది.

ఒకసారి పాల్ రోసన్‌బర్గ్ గ్యాలరీలో పికాసో 'క్యూబిస్ట్' చిత్రం చూచాడు. బహుశః 1915 నాటి పికాసో చిత్రమై ఉంటుంది. ఆ చిత్రం ఎంతో బలంగా ఆకర్షించింది. జీవితంలో మర్చిపోలేనంతగా నాటుకపోయింది హృదయంలో. ఆ చిత్రంలో ఒక చోట పికాసో ముతుక ఆకుపచ్చని రంగు వాడాడట. అది చెప్పనలవికానంత ఆకర్షణీయంగా ఉందనీ, ఇప్పటికీ తన చిత్రాలలోని స్థాయిని చూడవలసి వస్తే, ఆ చిత్రంతో పోల్చుకుంటానని వ్రాశారు. తర్వాత 3 సంవత్సరాలు, తన మొదటి భార్యతో కలిసి చిత్రాలు వేశారు. కాని అవి అంతగా నచ్చక, వేసిన చిత్రాలపైనే మరల, మరొక చిత్రం వేసేవారు. ఈ 3 సంవత్సరాలు అతనికి తన చిత్రకళలో ఎన్నో పరిశోధనలకు అవకాశం

కల్గించింది. అప్పుడే గియటో, సిజాన్, మతీస్, డిరైన్, బ్రాక్, పికాసో, మాన్డ్రియాన్‌ల ప్రభావం అతని చిత్రాలపై పడింది. కాని ఎక్కువ చిత్రాలు ఆ కాలంలో వేసినవి మిగలలేదు. తర్వాత 12 సంవత్సరాలకుగాని మోక్షం కలగలేదు. అంటే ఇతని చిత్రాలకు అన్ని సంవత్సరాల వరకు పేరు రాలేదు. ఇంతకాలం పట్టింది తన కాళ్లపై తాను నిలబడి ''ఇదీ నా పద్ధతి చిత్రకళలో'' అని చెప్పడానికి.

మొదటనుండి యితని చిత్రాలు చూస్తే మనకు ఒకటి తోస్తుంది. ఎంత తండ్రి పద్ధతి నచ్చకపోయినా, తండ్రి వేసిన సబ్జక్ట్ ఇతనిని వదలలేదు. ఇతని మాటల్లో: ''మా నాన్న వేసిన స్టిల్ లైఫ్‌లు, ఆయన చిత్రాలలోగల కవితామాధుర్యం నన్ను బాగా ఆకర్షించాయి. ఆయన సేకరించిన నాజూకైన, మచ్చలు - చారలు గల కూజాలు, పాన పాత్రలు, పలు పలకల గాజు గ్లాసులు, ఇంటినిండా ఎక్కడ చూచినా ఉండేవి. మా నాన్న మాదిరిగా చిన్న చిన్న చిత్రాలు వేయడం అంటే నాకు చాల యిష్టం.'' ఎన్నో చిత్రాలు ఈ పాత్రలతో ఉన్నవి వేశారు. స్టిల్ లైఫ్‌కు మారుపేరు నికల్‌సన్ అనవచ్చు. ఇతన్ని తలుచుకుంటే స్టిల్ లైఫ్‌లే గుర్తుకొస్తాయి. హెన్రీమూర్‌ను తలుచుకుంటే, వయ్యారంగా పడుకున్న నగ్న స్త్రీలు జ్ఞప్తికి వచ్చినట్లు. ఎన్నో ప్రకృతి దృశ్యాలను వేశారు. భవంతులు, చర్చిల్లో గల స్తంభాలు, తోటల్లోని చెట్లు వేశారు. నిజానికి ఇవన్నీ ఈయనకు నచ్చలేదు. గాలిలో తేలిపోతున్నట్లు ఉంటాయి ఈయన చిత్రించిన చెట్లు, భవంతుల చిత్రాలు. వాటికి, భూమికి గల అవినాభావ సంబంధం, ఆకర్షణను చూపలేకపోయారు. ఈ చిత్రాలు నికల్‌సన్‌వి అంటే నమ్మలేనంత పేలవంగా, చవుకగా ఉంటాయి. అది గ్రహించే గాబోలు ఆయన అవి వేయడం మానుకున్నారు తర్వాత తర్వాత. మనుష్యుల చిత్రాలు వేసినట్లు ఎక్కడా కనిపించదు. ఇతని పరిధి బహు పరిమితం. ఆ పరిధి స్టిల్ లైఫ్. ఈ పద్ధతి అతని జీవితానికి గూడా వర్తించవచ్చు. ఆయన యిల్లు, ఆయన తప్పితే అందరిలా అందరితో కలసి మెలసి తిరగరు. ప్రముఖ కళా విమర్శకులు వీరా, జాన్ రస్సెల్ ఇతని ఇంటికి వెళ్లితే (స్విట్జర్లాండులో ఉంది ఇల్లు) నోటీసు 3 భాషలలో వ్రాసి తలుపుకు అతికించి ఉందట. (యూరపులో అందరికి ఇంగ్లీషురాదు.) దానిలో ''మీరు కొండ దిగి క్రిందకు వెళ్లి, వచ్చే ముందు ఫోన్‌చేసి రండి'' అని. ఆయన యిల్లు చిన్న కొండపై ఉంది. ఇతని ఫోటోగ్రాఫులు సంపాదించడంగాని, ఇతనితో మాట్లాడడంగాని బహు కష్టం. తన చిత్రాలే మాట్లాడేటప్పుడు తనతో పనేమిటనే తత్వం ఆయనది. ఇలాంటి తత్వంగల వ్యక్తి చిత్రాలు గూడ, ఒకే స్టిల్‌లైఫ్‌కు పరిమితమై ఉండడంలో ఆశ్చర్యంలేదు.

ఒక స్టిల్ లైఫ్ ఎన్నికచేసి చూస్తే ఎంతో పేలవంగా అనిపిస్తుంది. ఎక్కడ ఏ వస్తువు

ఉంచాలి? ఎలా ఉంచాలి? అన్న సమస్య అతనిని బాధించినట్లు అన్పిస్తుంది ఈ చిత్రంలో. ఒక దారి తెన్ను తెలియని స్థితిలో ఉన్న చిత్రకారునికి, అది చిత్రించడానికి ఏర్పాటు చేసుకున్న వస్తువులపై ఉన్న మక్కువ మాత్రమే కన్పిస్తుంది. పిల్లవానికి చిత్రించడంలో ఉండే ఆతురత యిందులో కనిపిస్తుంది. వస్తువులను ఎంత తేలికగా చిత్రించవచ్చు అనే సాధనలో ఉన్న ఈ చిత్రం 1927లో చిత్రించారు. చిత్రంలో స్థాయిలేకపోయినా ముందుముందు వేసే చిత్రాలకు పునాదులు ఇందులో ఉన్నాయని స్పష్టంగా కన్పిస్తుంది. 1933-35ల మధ్య వేసిన మరో చిత్రం చూస్తే చిత్రకారునిలో వచ్చిన మార్పులు కనిపిస్తాయి. ఇక్కడ చిత్రకారునికి చిత్రంపై అధికారం ఉంది. ఒక వినూత్న పద్ధతిలో చెప్తూ, కవితా మాధుర్యాన్ని జోడించగల్గారు. ఇక్కడ పాత్రలు, టేబిల్, దూరంగా ఉన్న గోడ అన్నీ కలిసి, ఒక ఏకత్వాన్ని ఇస్తున్నాయి. పాత్రల రూపాలు ముఖ్యంగా కంటికి కనుపించే రూపాలుగాక, ఊహారూపాలుగా ఉన్నాయి. పలకలమయమై వివిధ అంతస్థులలో ఏర్పరచబడ్డాయి. ఇవన్నీ ఆయన తండ్రి పోగుచేసిన ఇంటిలోని పాత్రల రూపాలేమో! వాటినే మరలమరల వేస్తూ ఇప్పటికి ఇలా మలచ గలిగారేమో!! చిత్రంలో ఏ వస్తువు కా వస్తువు, తన స్థానాన్ని గట్టిగాపట్టుకుని, ప్రక్కదానితో కలవడం లేదు. కూజావేరు, నిమ్మబద్దలు, టేబిల్ కత్తి అన్ని వేరు వేరుగా ఉన్నాయి. భిన్నత్వంతో కూడుకున్న ఈ చిత్రంలో చిత్రకారునియొక్క పరిపక్వ దశ తెలుస్తుంది. మొదటి దానిలో చిత్రమంతా రంగులతో చిత్రించారు. రెండవదానిలో కొన్నిచోట్ల మాత్రమే రంగులు చిత్రించి, మిగిలింది దాదాపు తెల్లగా వదలివేసారు. రంగును వాడటంలో ఎంతో పరిమితి ఉంది, వారి చిత్రాలలో. అందరి చిత్రకారులలా చిత్రమంతా రంగు ఉండాలనే పద్ధతిగాదు. ఇది మరొక విశిష్టత నికల్‌సన్‌లో. ఈ విశిష్టత ఎంతో సాధనపై వచ్చింది. ఎన్నో చిత్రాలు పూర్తిగా వేశారు రంగులలో. ఎన్నో, రేఖాచిత్రాలూ వేశారు. యూరప్ ఖండమంతా తిరిగి భవంతులు, చర్చిలు, చెట్లు, కొండలు విడివిడిగా, రంగులలో వేస్తూ వీటిని అన్నిటిని కలిపి ఒకే చిత్రంలో ఇమిడ్చి రంగులువేసేవారు. చివరికి అన్నీ వదలి ఒకటి రెండు రంగులలో, స్టిల్ లైఫ్ ను సబ్జక్ట్‌గ తీసికొని, అవే చిత్రించారు కొన్ని వందలు.

మరల మార్పు కొద్దిగా, బహుకొద్దిగా, కల్గింది ఈయన చిత్రాలలో. ఇది ఉబ్బెత్తు చిత్రాలను చేయడం. నిజానికి చిత్రాలను అందరు చిత్రిస్తారు. కాని ఈయన చేస్తారు. ఈయన చేసే పద్ధతిని శిల్పాలనాలా, చిత్రాలనాలా అనే సందిగ్ధత వెలిబుచ్చారు, నా మిత్రుడు, ప్రపంచ విఖ్యాత విమర్శకుడు సర్ హెర్బర్ట్ రీడ్. ఇది కొద్దిగా క్లిష్టమైన విషయమే. ఈయన చెక్కకుగల బల్లపరుపు భాగమును, పలువిధాల ఎత్తులలో చెక్కి,

వాటికి రంగులు వేస్తారు. ఇవిచూస్తే ఈ భాగాలు చిత్రంలో రిలీఫ్ శిల్పాలులాగ ముందుకు వచ్చి ఉంటాయి. ఈమధ్య ఇటాలియన్ చిత్రకారులు ఎన్నో రకాలుగా చేస్తున్నారు ఈ పద్ధతిలో చిత్రాలు. తన చిత్రాలలో నికల్సన్, సబ్జెక్ట్‌కు ప్రాధాన్యత ఇవ్వలేదు. వివిధ రకాల ఆకారాలను చిత్రించారు అంతే. చిత్రం ఏమిటో - అంటే స్టిల్ లైఫో, మనిషో, మనిషి యొక్క తలో, ప్రకృతి దృశ్యమో వీటి వివరణ ఉండదు. విభిన్న ఆకారాల కలయికలే ఈ చిత్రాలు. దీన్ని 'కాంపోజిషన్' అంటారు ఆయన. ఇటువంటి వాటిని ఎలా విశదీకరించడం? ఎంతో కష్టం. వీటిని చూడాలిగాని వివరించి వ్రాయలేం.

చెక్కమందాన్ని పలు విధాలుగా చెక్కి, రకరకాల ఆకారాలను మలచి, వాటికి రంగులను వేసిన మరో చిత్రం, ఒక ఆకారానికి మరొకదానికి గల సంబంధం, ఒక ఏకత్వం చూపుతుంది. ముఖ్యంగా దీన్ని రంగులలో చూస్తే ఎంతో ఆహ్లాదంగా ఉంటుంది. లేతరంగులను వాడతారు ఈయన - చిత్రమంతా అక్కడక్కడ ఆకారాలకు తెలుపువదలి. మధ్య మధ్య కొన్ని ఆకారాలకు బలమైన ముతుక ఇటుకరంగు, నలుపురంగు, గులాబిరంగులు వాడతారు. ఇవన్నీ కలిసి రంగుల రాట్నం తిరిగినట్లు చిత్రంలో తిరుగుతూ, ఎంతో శోభను వెదజల్లుతాయి చిత్రాలు. మరొక చిత్రంలో పేకాట ముక్కలను పేర్చారు బల్లపైగల గుడ్డపై. ఎరుపు, నీలం రంగులు ముతకవి వేశారు. ఆకుపచ్చని గీతలు గుడ్డపై అడ్డంగా గీశారు. బలమైన రేఖలు, పేకముక్కలకు వెనుక వున్న నీడ, ఎంతో గట్టిగా ముక్కలను పట్టుకున్నట్లు అనిపిస్తుంది. పేకముక్కలు గుంపుగా ఒక్కచోటనే ఉన్నా, బల్ల అంతా ఆక్రమించినాయా అనే అభిప్రాయాన్ని కల్గిస్తాయి. బహు ముచ్చటైన చిత్రం.

ఇప్పటి చిత్రాలలో ఎక్కువగా రంగుకంటే ఆకారాలకు ప్రాధాన్యత ఇచ్చారు నికల్సన్. చిత్రం అంతటా ఏ ఒక్కచోటో, రెండు చోట్లో ముతుకరంగు వాడి, మిగిలినదంతా రేఖలతో పూర్తిచేశారు. ఒక్క కప్పుసాసరు చిత్రాన్ని పలువిధాలుగ ఎన్నో సార్లు చిత్రించారు. రంగులేదు. సన్నని దారములాంటి లైన్లు చిత్రాలలో నటిస్తాయి. ఈ రేఖను ఎంతో హృద్యంగమంగా వివరించారు విమర్శకులు డేవిడ్‌లూస్. ''గాలి, నీరు, వెలుతురు మాదిరిగా, ఈ రేఖలు రాగమయ ప్రకృతి దృశ్యంలో, అడ్డుగా నిలచిన కొండలనే రంగులను చీల్చుకుపోతాయి'' అని. ఆహా! ఎంతటి వర్ణన! నికల్సన్ చిత్రాల్ని మాటలలో చెప్పడాన్ని ఈయన ఒక్కరే సాధించారు. అవి ఎంతగా డేవిడ్‌లూస్‌ను కదిలించకపోతే ఇలా వ్రాస్తారు! అందుకేగాబోలు ఫ్రెంచి విమర్శకులు ఛార్లెస్ ఎస్టీనే ''నేటి ఇంగ్లీషు కళలో ఉన్నత స్థాయికి ఉదాహరణ బెన్‌నికల్సన్, హెన్రీమూర్, గ్రహమ్ సదర్‌లాండ్'' అన్నారు. విమర్శకులు

ఎమిలీ గినార్ ఇతనిని ప్రముఖ ఇంగ్లీషు చిత్రకారులు గెయిన్స్ బరో, కాన్‌స్టబుల్, బోనింగ్‌టన్, టర్నర్‌ల స్థాయిలో చేర్చారు.

ఇతని చిత్రాలు అందరికి నచ్చుతాయి. చిత్రాలలోని వర్ణ సమ్మేళనం అటువంటిది. ప్రకృతిలోని కాలాల మార్పులలో ఉండే శోభ, ఈ చిత్రాలలో ఉంటుంది. అందుకే అందరినీ ఆకర్షిస్తాయి. ఇతనిలోని నిజాయితీ, గర్వాన్ని ఎరుగున్నవారు పొగుడుతారు. స్నేహితులకు తగినంత సహాయం చేసేతత్వం ఉంది. నికల్‌సన్ అంటారు. ''1930లో 'మాన్ డ్రియాన్' లండన్ నగరానికి వచ్చాడు కాందిశీకుడుగా. అప్పుడే పరిచయమైంది అతనితో. అతనివద్ద అసలు డబ్బులేదు. మా గ్రూపుకు దగ్గరలోనే (గ్రూపు అంటే బ్రిటిష్ చిత్ర శిల్పకారులుగాబో, హెన్రీమూర్, 'బార్బారాహెప్ వర్త్' లన్నమాట!) అతనికి ఒకరూము సంపాదించాం, ''హేమ్‌స్టెడ్‌లో'' అనే చిన్ని వూరిలో ఎంతో కష్టపడి అతని చిత్రాల్ని అమ్మే ప్రయత్నం చేసేవాళ్లం. 30 పౌండ్లకు, 40 పౌండ్లకు అమ్మేటప్పటికి తలప్రాణం తోకకు వచ్చేది'' అని. ఆ చిత్రాలు ఇప్పుడు ఒక్కొక్కటి 10,000 పౌండ్లు 15,000 పౌండ్లు చొప్పున అమ్ముడవుతున్నాయి.

బెన్ నికల్‌సన్ చిత్రాలు చూస్తే అతనిపై 'మాన్ డ్రియన్' ప్రభావం విపరీతంగా పడ్డట్లు కనిపిస్తుంది. బ్రాక్ ప్రభావం గూడ ఎక్కువగా ఉంది. నికల్‌సన్ అంటాడు ''బ్రతికి ఉన్న చిత్రకారుల ప్రభావం ఉంది నాపైన. చైనీస్, గ్రీక్, స్పానిష్, ఫ్రెంచి, ఇటాలియన్‌ల ప్రభావమూ ఉంది. సజీవమైన కళ అంటూ ఉంటే, అది, ఈ కాలంలోనే ఉంది ప్రపంచంలో. టోబి, రోత్‌కో, శామ్‌ఫ్రాన్సిస్, బుర్రి, విక్టర్ పాస్‌మోర్‌ల చిత్రాలంటే ఎంతో ఇష్టం.'' ఇతని చిత్రాలు ఈ ప్రదర్శనలోను, అక్కడక్కడ విడివిడిగా ఇతర చోట్లను, చూచినమీదట, ఇంతమంది, ఇన్ని దేశాల ప్రభావం ఉన్నట్లు నాకు కన్పించదు. ఆ దేశాలంటే, ఆ చిత్రకారులంటే అభిమానం ఉండవచ్చు. అది వేరు విషయం. ప్రభావం వేరే విషయం. మాండ్రియాన్, బ్రాక్‌ల మిశ్రమం 'బెన్ నికల్‌సన్' అనిపిస్తుంది నాకు. ఇది తప్పవచ్చు. కాని నా అభిప్రాయం అలా అని. ఇతను ఈ ఇద్దరివి కలిపి తన చిత్రాలుగా చేశాడనిగాదు. వారిద్దరి నుండి తన మార్గానికి కావలసిన సూత్రాలను సంపాదించారని.

ఏది ఏమైనా విజయం ఇతన్ని చాలాకాలానికి వరించింది. 1952లో కార్నేగి ఇంటర్నేషనల్ మొదటి ప్రైజు రావడం నుండి ఈయన పేరు పైకి ప్రాక ప్రారంభించింది. 1956 లో గొగన్‌హైమ్ మ్యూజియమ్ ప్రదర్శనలో మొదటి బహుమతి పొందారు. ఇప్పుడు బెన్‌నికల్‌సన్ భార్య ఫెలిసెటాన్ వోగ్లర్‌తో స్విట్జర్లండ్‌లో ఉన్నారు. ఈవిడ ప్రసిద్ధ ఫోటోగ్రాఫర్.

ఇంగ్లండు పేరును ఆధునిక చిత్రకళలోకి చిరస్థాయిగా ఎక్కించిన ప్రతిభాశాలి బెన్‌నికల్సన్. ఇంగ్లీషువారు సగర్వంగా, ఏ దేశవాసులైనా గర్వాతిశయంతో చెప్పుకోదగ్గ చిత్రకారుడు. ఈయన ప్రభావం ఆధునిక యువ చిత్రాకారులలో విపరీతం. దాదాపు అన్ని ప్రపంచ ప్రసిద్ధ గ్యాలరీలు ఈయన చిత్రాలను కొన్నాయి. ఈయన అంటారు ''నీకు నీవే 'నేను బాగా అభివృద్ధిలోకి వచ్చే చిత్రకారుడను. ఏదో ఒకరోజు ఒక మహత్తరాన్ని సాధించవచ్చు' అని అనుకోవాలి.''

నిజానికి ఇలా అనుకోకపోతే, ఏ సృజనాత్మక కళాకారుడు, ఏది సాధించలేడు. ఇది ముఖ్యంగా యువచిత్రకారులలో అవసరం. అలా అని కృషి చేస్తేనే, మనం ఏదో ఒకటి సాధిస్తాం, ఎప్పుడో ఒకరోజున.

*(భారతి, ఆగస్ట్ 1963)*

★

# మహోన్నత చిత్రకారుడు - బ్రాక్

చాలామందిని చనిపోయిన తరవాత, మృతజీవులక్రింద పరిగణించి మరచిపోతాం. కాని కొంతమందిని మృతజీవులైనా, సజీవులగనే లెక్కవేస్తుంటాము. అలాంటివారు చరిత్రలో బహుకొద్దిమంది. ఒక్కొక్క కాలం, ఒక్కొక్కరకపు తత్త్వవేత్తలను, విజ్ఞాన వేత్తలను, కళాభిజ్ఞులను సృష్టిస్తుంది. కొంతమంది అల్లకల్లోలంగా ఉన్న సమయంలో శాంతిని ప్రసాదించేందుకు జనిస్తే, మరికొంతమంది శాంతంగా ఉన్న కాలంలో సంచలనాన్ని ఉత్పన్నం చేసేందుకు ఉద్భవిస్తారు. కాని విచిత్రం, ఇవన్నీ కాలగర్భంలో కలిసిపోయేవే. గతంలో జరిగిన చెడైనా, మంచైనా భావికి అండగా ఉండడం సహజం. ఇటువంటి సమయం ఒకసారి చిత్రకళా రంగంలో గూడా వచ్చింది.

అప్పటివరకు కడుపులో నీళ్ళు కదలకుండ మెత్తని సోఫాలో కూర్చొని, చూస్తూ ఆనందించవలసిన నున్నటి ఫోటోగ్రాఫులవంటి చిత్రాలను, ఇంప్రెషనిజం చిత్రాలు వచ్చి ఆటంబాంబులా తుడిచివేశాయి. ప్రజలు, విమర్శకులు ఈ క్రొత్త కళారంగాన్ని ఇంకా జీర్ణం చేసుకొనే లోపునే ''సిజాన్'' ఒక క్రొత్త పద్ధతిని, 'క్యూబిజమ్' అనే విత్తనాన్ని నాటి మరణించాడు. దీనితో వచ్చిన ప్రళయం, కళారంగంలో, అసలు కళా పద్ధతినే పూర్తిగా మార్చివేసింది. ఒకవిధంగా చెప్పాలంటే, నేడు ఉన్న అనేక రకాల 'సిజాన్' మూలం 'సిజాన్' పద్ధతే.

సిజాన్ చనిపోయిన తర్వాత 1907లో పారిస్‌లో ఆయన చిత్రాలన్నీ కలిపి, పెద్ద ప్రదర్శనం జరిపారు. సిజాన్ బ్రతికి ఉండగా మిత్రుడు ఎమిరి బెర్నార్డ్‌కు వ్రాసిన ఉత్తరాన్ని గూడ ప్రచురించారు. అందులో అంటాడు సిజాన్ ''లోగడ నే చెప్పినదాన్ని మరల ఒకసారి చెపుతాను. ప్రకృతిని గోళాకారము, వర్తుల స్థంభాకారము, కూచి ఆకారములలో చూచినట్లయితే, ప్రకృతి స్వభావ సిద్ధమా అన్నట్లు, భూమికి సమానాంతరముగ ఉన్న

రేఖలు వెడల్పును, నిలువుగ ఉన్న రేఖలు లోతును కల్పిస్తాయి. నిజానికి ప్రకృతి భూమిపై కంటే భూమిలోపలనే ఎక్కువగా ఉంది.''

వస్తువులను ప్రకృతిని గోళాకార, స్తంభాకార, కూచి ఆకారాలలో చూచి చిత్రించే పద్ధతిని పికాసో, బ్రాక్‌లు ఎంతో తీక్షగా సాగించారు. అప్పటివరకు చిత్రిస్తున్న వస్తువు ఆకారాన్ని విధ్వంసం చేసి, ఒక క్రొత్త పోకడలో చెప్పారు. దానివలన వారు చిత్రాలలో కావలసిన వివిధ కోణాకారాలను తేగలిగారు. అందుకే ముఖ్యంగా ఈ క్రొత్త చిత్రకళా రంగంలో పికాసో, బ్రాక్‌లు జంటగా నిలుస్తారు.

ప్రపంచాన్ని తన చిత్రాలతో మైమరపింపచేసిన బ్రాక్, 31 ఆగష్టు 1963న తన 81వ యేట పరమపదించారు. ఈ వార్తను ప్రపంచంలోని అన్ని రేడియోలు, పేపర్లు ప్రకటించాయి. పారిస్ నగరం మొత్తం దుఃఖించింది. అంతటి వ్యక్తి సాధించిన విషయాన్ని, ఆయన జీవితాన్ని, సాధ్యమైనంత వివరంగా తెలుపుతాను.


బ్రాక్ 1882 మే నెల పదమూడవతేదిన 'అర్జంటెయిల్' అనే పట్టణంలో జన్మించాడు. ఇది పారిస్ నగరానికి చాలా దగ్గర. తండ్రికి ఇండ్లకు రంగులు వేసే వృత్తి. తర్వాత చిన్నషాపు స్వంతంగా పెట్టి రంగులు అమ్మేవాడు. బ్రాక్ తండ్రితో బాటువెళ్ళి, ఇండ్లకు రంగులువేసే వాడు చిన్న తనంలో. తండ్రికి ఒక్కగా నొక్క కొడుకు గావడంవల్ల, గారాబంగాపెరిగాడు. చిన్నతనంలో మంచి హుషారైన వాడు. ప్రపంచ ప్రసిద్ధ చిత్రకారుడు రావల్‌డూఫీ సోదరునితో కలసి తరచుగా తిరిగేవాడు. ఫ్లూట్ నేర్చుకున్నదికూడా ఇతని వద్దనే. అంత సరదాయైనవాడు, తర్వాత తర్వాత ఎందువల్లనో అంతగా అందరితో తిరిగేవాడుకాదు. చివరి దశలో అసలు దాదాపు ఇల్లు వదలి కదలేవాడుకాదు. దగ్గరగా ఉన్న చిత్రకళాశాలలో కొంతకాలం కళాభ్యాసం చేశాడు. బ్రాక్‌కు ఎనిమిదవ సంవత్సరం వచ్చేసరికి తండ్రి లెహోవ్రే అనే ఊరు వచ్చి స్థిరపడ్డాడు. అక్కడే బ్రాక్ కొంతకాలం, రంగులు వేసే మరొకతనివద్ద పనిచేశాడు. తండ్రివేసే పద్ధతుల్ని ముఖ్యంగా, పాలరాతి లాంటి రంగుల్ని వెయ్యడం. రాతిలో చారలను చూపడంలాంటి ట్రిక్కులను, సరదాగా ఉండడం వల్ల ఎంతో జాగ్రత్తగా నేర్చుకున్నాడు. ఈ పద్ధతులను తర్వాత తర్వాత తన 'స్టిల్‌లైఫ్' చిత్రాలలో విరివిగా చూపించాడు. అంతగా చదువుపై శ్రద్ధ ఉన్నట్లు, చదివినట్లు కనిపించదు.

1900వ సంవత్సరంలో 'పారిస్'కు వచ్చి స్థిరపడ్డాడు. చిత్ర కళాశాలలో, స్టూడియోలలో, ఎకాడమీలలోను తిరిగి ఎంతో అనుభవాన్ని సంపాదించాడు. అసలు

బ్రాక్‌కు అదృష్టం అతనికున్న స్నేహితులవద్ద నుండి వచ్చింది. ఈనాటి ప్రపంచ ప్రసిద్ధ చిత్రాకారులందరు అతనికి చిన్ననాటి స్నేహితులు. వారందరు కలిసి ప్రదర్శనలు ఏర్పాటు, చేస్తే బ్రాక్‌ను గూడ కలుపుకునేవారు. అలా అందరితోబాటు ఇతను గూడ నలుగురికి తెలియడం జరిగింది. రావల్‌డుఫీ, ఒథాన్‌ఫ్రీజ్, ఫ్రాన్సిస్ పికాబియా, మేరి లారెన్సిన్, మథీస్‌లాంటి వారందరు స్నేహితులు. ఇంక అంతకంటె ఏమి కావాలి? అటువంటి వాతావరణం, అటువంటి మిత్రబృందంలో ఉండి, ఎంతో చురుకైన వాడవడం వల్ల, ఇట్టే పైకి రావడం జరిగింది.

1906లో జీవితంలో మొట్ట మొదటి ప్రదర్శన జరిగింది. 'సెలాన్-డి-ఇన్‌డిపెన్‌డెన్ట్స్' అనే ప్రదర్శనను మిత్రులందరు కలిసి ఏర్పాటు చేశారు. అందులో ఆరు చిత్రాలను ప్రదర్శించాడు బ్రాక్. ఈ ప్రదర్శన 'ఫావ్' చిత్రకారులందరు కలిసి ఏర్పాటు చేసింది. ఈ 'ఫావ్' పద్ధతిలో వేసిన రంగులు, చాల ముతుకగా ఒక రంగును ఏ యితర రంగుతో మిశ్రమం చేయకుండ, చిత్రించినట్లుగ వుంటాయి చిత్రాలు. ఇంప్రెషనిజమ్ పద్ధతిలోవలె గాలిలో ఎగురుతున్న చిత్రాలవలె, మంచుతెరలలో కనిపించి కనిపించని చిత్రాలవలె, మసక మసకగా మెరిసే పద్ధతి గాదు ఇది. బలాన్నీ, ఒక విధమైన గ్రామీణ చిత్రకళా పద్ధతిని పుణికి పుచ్చుకున్న పద్ధతి. చిత్రాలు చూస్తే మన జామినీరాయ్ చిత్రాలవలె కొట్టవచ్చినట్లు కనిపిస్తాయి. వీరికి చిత్రంలో కాంపోజిషన్ ముఖ్యం, బలం ముఖ్యం. అంతేగాని ఇంప్రెషనిజం పద్ధతిలోని ఆకార స్వరూపాలు కాదు. దీని వలన ఇంప్రెషనిజం కంటె ఎక్కువ సౌలభ్యం ఉంది. చిత్రీకరణలో, ముఖ్యంగా కొట్టవచ్చే రంగులలో చిత్రించే పద్ధతి బాగా నచ్చింది బ్రాక్‌కు. అందుకే ఎన్నో చిత్రాలు, ఆ కాలంలో ఫావిజమ్‌లో చిత్రించాడు. అతనిపై అప్పుడు డుఫీ , ఫ్రీజుల ప్రభావం విపరీతంగా కన్పిస్తుంది.

పారిస్ వదిలి ఫ్రాన్స్‌లో చాలచోట్ల తిరిగాడు. ఫావిజమ్‌లో చాల చిత్రాలు వేశాడు. ఎన్నో ప్రకృతి దృశ్యాలను ముఖ్యంగా కొండలను, సముద్రపు ఒడ్డులను, ఓడ రేవులను చిత్రించాడు. అతనిలో మరొక మార్పు తెచ్చింది మిత్రుడు డేనియల్‌హెన్రి కాన్ వీలర్. ఇతను క్రొత్తగా చిత్రాలను అమ్మే షాపు ప్రారంభించాడు. పికాసో, డ్రైన్, వ్లామ్‌నిక్, వాన్‌డాన్ జన్‌ల చిత్రాలను కొన్నాడు. మొట్ట మొదటగ బ్రాక్ చిత్రాన్ని కొన్నది కూడా ఇతనే. తర్వాత కొన్ని మాసాలకు 'బ్రాక్' చిత్రాలన్నిటిని కొనివేసాడుట. దాన్ని బట్టి బ్రాక్ చిత్రాలు ఎలా అమ్ముడు పోయాయో తెలుస్తుంది. అదృష్ట వంతుడి క్రింద లెక్క, బ్రాక్ - మిగిలిన చిత్రకారులతో పోలిస్తే. చిత్రాలు అమ్ముడు పోక పోవడం అన్నది ఏనాడూ



జరుగ లేదు జీవితంలో. ఈ హెన్రికాన్ వీలరే ఇతన్ని 'పికాసో'కు పరిచయం చేసింది. ఈ పరిచయం బ్రాక్‌ను ప్రపంచ విఖ్యాత చిత్రకారులలో ఒకర్నిగా చేసింది. పికాసో అప్పుడు మిత్రులు లియోస్టీన్, అపోల్‌నెయిర్, మాక్స్‌జాకబ్, జాన్‌గ్రిన్‌లతో తిరుగుతుండే వాడు. మొట్టమొదటిసారిగా పికాసో చిత్రాలను చూచి సంభ్రమాశ్చర్యాలను పొందాడు బ్రాక్. చిత్రాన్ని చూడగానే అతను పికాసోతో అన్న వాక్యమిది - ''చూడవయ్యా! నీ చిత్రాలను గురించి నీవేమి చెప్పుతావో నా కనవసరం. మేము మంటలు గ్రక్కేందుకు పెట్రోలు త్రాగమని చెప్పడానికై నువ్వు చిత్రరచన చేస్తావు''. ఈ సంభ్రమాశ్చర్యాలు, తాను ఇంతవరకు చూడని క్రొత్త పద్ధతి, పికాసోయొక్క చిత్రకళా విధానం ఇతన్ని కలవరపరచినై. తాను చేసే ఫావిజమ్ పద్ధతితో ఇంక లాభంలేదు, ఏదో మార్పు తేవాలి తన చిత్రాలలో అనుకున్నాడు. అందుకై ద్విగుణీకృత నిశ్చయంతో చిత్రాలను వెయ్యడం ప్రారంభించాడు.

1907-1908 లలో బ్రాక్ ''ఎల్ఎస్టాక్ వద్ద గల ఇండ్లు'' అనే చిత్రాన్ని చిత్రించాడు. మథీస్ చూచి మొట్ట మొదటిసారిగా ''అవి చిన్న చిన్న క్యూబులుగ కనిపిస్తాయి'' అన్నాడు. 1909లో బ్రాక్ చిత్రించిన స్టిల్ లైఫ్స్, ప్రకృతి దృశ్యాలను చూచి ఒక కళా విమర్శకుడు వీటిని 'చిత్రమైన క్యూబు ఆకారా'లని వర్ణించాడు. దానితో ''క్యూబిజమ్'' అనే పద్ధతి వాడుకలోనికి వచ్చింది. ఇలాగే పికాసో గూడా చేశాడు కొన్ని చిత్రాలు. కనుక ఈ ఇద్దరిలో ఎవరు ముందు ఇలా క్యూబుల పద్ధతిలో చిత్రించింది అని తెలియచెప్పలేం. దీనికి వీరిద్దరు ముందు కారకులే. చాలమంది విమర్శకులు 'క్యూబిజానికి మూల కారకులు వీరిద్దరిలో ఎవరు?' అని తలలు బద్దలు కొట్టుకొన్నారు - ఎవరెస్టు పర్వతం ఎక్కి, ముందుగా ఎవరెస్టు శిఖరముపైన కాలు ఉంచినది ఎడ్మండ్ హిల్లరీయా, లేక టెన్సింగా అని తలలు బద్దలు కొట్టుకున్నట్లు. ఏది ఏమైతేనేం ప్రపంచ చిత్ర కళా రంగంలో, ఒక వినూత్న చిత్ర శైలిని సృష్టించిన ఇద్దరిలో, ఒకడుగ 'బ్రాక్‌ను' ప్రపంచం గుర్తించింది.

సిజాన్ క్యూబిజాన్ని సృష్టించాలని చిత్రాలు వెయ్యలేదు. అసలు ఒక శైలి కొరకు గాదు వేసింది చిత్రాలు. తన భావాన్ని క్రొత్త రూపంలో చిత్రించాలని పెట్టిన కృషి. దాన్ని ముందుకు తీసుకుపోయి ఒక ప్రత్యేక ఆకారాన్నిచ్చింది బ్రాక్, పికాసోలు. ''1909 నుండి పికాసో నేను ఎంతో సఖ్యతతో, ఒకే విధమైన దృఢ నిశ్చయంతో, ఒకే ధ్యేయంతో కృషిచేశాం. మేము కలిసి ఉండకపోతే అసలు ఈ శైలి ఉద్భవించేది కాదు. ఇలా జరగాలని ఉంది గాబోలు అందుకని జరిగింది'' అని చెప్పుకున్నాడు బ్రాక్.

బ్రాక్ తనచిత్రాలలో ఖాళీస్థలాన్ని అసలు ఉంచలేదు. చిత్రాన్నంతా పూర్తిగా ఆకారాలతో నింపాడు. సిజాన్, కాన్వాసులో చిత్రించకుండ చాల భాగాన్ని వదిలివేసేవాడని, చాల రంగులను వాడేవాడని చెప్పాడు ప్రఖ్యాత ఫ్రెంచి కళా విమర్శకుడు, జాక్‌డేమ్స్. ముఖ్యంగా బ్రాక్ చిత్రాల్ని లేత ముదురు ఆకుపచ్చ, ముతుక ఎల్లో ఓకర్ రంగులలో పూర్తి చేసేవాడు. అప్పటివరకు సిజాన్ ఎవరినైనా మోడలును ఉంచుకొని చిత్ర రచన చేశాడు. 1910 నుండి మోడలును పూర్తిగా వదిలివేసి చిత్ర రచన చేయనారంభించాడు. అప్పుడు ఉత్పన్నమైన సమస్యలను చెపుతూ, ''అసలు మోడలును పూర్తిగా విసర్జించాలని నిర్ణయించుకున్నాను. కాని అంత సులభంగాలేదు. ప్రారంభించాను పట్టుదలతో. చిత్రం ఎలా వస్తుందో పూర్తి అయ్యాకగాని తెలియదు. అది ఒక సాహస కృత్యం. ఇందులో మనసు అసలు పని చెయ్యదు'' అన్నాడు. అంటే చిత్రం ఎలా వస్తుందో అతనికే తెలియదు. ఒక ఉద్దేశ్యంతో చిత్ర రచన చెయ్యలేదన్న మాట. చెయ్యి ఎలా సాగితే తాను అలా చిత్రిస్తూ, ఇంద్రియాలకు అతీతమైన జ్ఞానంతో సాగించిన చిత్ర రచన అది.

1912 నుండి న్యూస్ పేపర్లను కాన్వాస్‌పై అతికించి, అక్షరాలను పెద్దగా చిత్రంలో ఇమిడ్చి, ఇసుక రంగులలో చిత్రించాడు. తృప్తిగాలేక తాను తండ్రివద్ద చిన్నప్పుడు నేర్చుకున్న పద్ధతులను, అనగా పాలరాయి మాదిరిగా అతినున్నగ చిత్రించడం, పాలరాతిలోని చారలను చిత్రించడం సాగించాడు. అప్పటివరకు చిత్రిస్తున్న ప్రకృతి దృశ్యాలను, మానవాకారాలను వదలి పూర్తిగా ''స్టిల్ లైఫ్ '' చిత్రాలను చిత్రించడంలో నిమగ్నమైపోయాడు. స్టిల్ లైఫ్ చిత్రాలు వేయడంలో దిట్ట అని పేరు పొందాడు.

మొదటి ప్రపంచ యుద్ధం వచ్చింది. ప్రభుత్వం ఇతన్ని మిలిటరి సార్జంటుగా నియమించింది యుద్ధంలో. తన బాధ్యతను ఎంతో ప్రజ్ఞతో నిర్వర్తించి మన్ననలను పొందాడు. బాగా గాయాలు తగిలాయి యుద్ధంలో. దానితో తిరుగుముఖం పట్టాడు యుద్ధ భూమినుండి. చాలకాలం పట్టింది మరల చిత్ర రచన చేసే స్థితి వచ్చేటప్పటికి.

ఇప్పుడు రంగుల్లో ఎంతో మార్పు వచ్చింది. అప్పటివరకు కండ్లు జిగేలుమనే రంగులు వాడిన అతను, రంగుల వర్ణాన్ని ఎంతో తగ్గించాడు. దాదాపు 18వ శతాబ్దం చిత్రకారుల మాదిరి రంగులను వాడాడు. కొంతమంది ఈ చిత్రాలు చూచి ఫ్రెంచి ఆర్ట్‌లో మరల ఒక ''ఓల్డ్ మాస్టర్ని'' చూచాం అన్నారు. తన ఈ చిత్రాల్ని చూచి ''నాకు ఉద్రేకాల్ని అణచే నిబంధనలంటే ఇష్టం'' అని చెప్పుకున్నాడు. అందుకనే గాబోలు వర్ణాల్ని అంతగా

అణచి వేశాడు తన చిత్రాల్లో. అయినా ఇది ఎంతో కాలం నిలువలేదు. మరల కాంతివంతమైన రంగులను వాడసాగాడు.

తను కాగితాలను చిత్రాలలో ఎందుకు అతికించేది చెపుతూ, ''మేము చేసిన ఈ పద్ధతిని సరిగా అందరు అర్థం చేసుకోలేదు. కాని ఇది చాల సులభం. మేము తలపెట్టిందల్లా రంగుకుగల ప్రాధాన్యతను, ఆకారాలకు సంబంధం లేకుండా నిలబెట్టి చూపాలని. మేము ఇలా వాడిన కాగితాలను చూచి విమర్శకులు విస్మయం చెందారు. ఇది ఉదాత్తంగా అనిపించలేదు చిత్రకళలో వారికి'' ఎన్ని కాగితాలు అతికించినా, నిజానికి, రంగులకుగల ప్రాధాన్యతను చూపాలని ఎంతో ప్రయాసపడిన మాట నిజం. దీన్నే చెపుతూ విమర్శకుడు రెబెక్కా వెస్ట్ అంటారు ''బ్రాక్ తన రంగులను భూమి నుండి తీసుకున్నాడు. అతని మొదటి చిత్రాలను చూస్తే భూమికిగల బ్రౌను రంగు, గడ్డికిగల ఆకుపచ్చదనం, రాళ్ళకుగల బూడిదరంగులు కనిపిస్తాయి''. తన రంగుల్ని భూమి నుండి ఆకాశం వరకు విస్తరింప చేశాడు ఈ మహోన్నత చిత్రకారుడు.

ఇతను వేసిన చిత్రాలను పరిశీలనగా చూస్తే మనుష్యుల చిత్రాలను బహు కొద్దిగ చిత్రించినట్లు కన్పిస్తుంది. ఆ చిత్రించిన వైనా స్తబ్దతతో, చలన రహితంగా ఉంటాయి. మనుష్యుల ఆకారాలు గూడ ఏ స్టిల్ లైఫ్ ను చిత్రిస్తున్నట్టుగానో చిత్రించాడు. అందుకే గాబోలు అపోలినైర్ ''మనిషి ముఖం కంటే రాతిని చూచి ఎక్కువగ చలించాడు బ్రాక్'' అన్నాడు. తను వేసిన స్టిల్ లైపులలో వయోలిన్, పండ్లు, సీసాలు, సీసా మూతలు, నిమ్మపండ్లు, ఆపిల్ పండ్లు, పేక ముక్కలు ఎన్నో చిత్రించాడు విరివిగా. తన ప్రపంచం అంతా వీటితో నింపేశాడు.

రెండవ ప్రపంచ యుద్ధం వచ్చింది. రంగుల కరువు వచ్చింది. శిల్పాల్ని చెయ్యడం సాగించాడు. కాని అంత ప్రజ్ఞావంతుడు గాదు శిల్ప కళలో. ఎక్కువగా చేసిన ముఖాలు శిల్పంలో ప్రొఫైల్స్ - అంటే ముఖం ప్రక్క భాగం చూపడం - మనం రాజపుత్ర మొగల్ శైలి చిత్రాలలో ఉన్న మాదిరిగా నన్నమాట. చేపలు, గుర్రపు తలలు, ఎగిరే పిట్టలు శిల్పంలో మలచాడు. తాను చేసిన చేపల శిల్పాన్ని వివరిస్తూ ''నీటిని శిల్పంగా మలచాను'' అన్నాడు.

స్టిల్ లైఫ్ చిత్రాలలో ఎగురుతున్న పిట్టల్ని చిత్రించాడు. అయన చివరి కాలంలో ప్రతి చిత్రంలోను ఒక పిట్ట ఉన్నదా అనిపిస్తుంది. ఆయనకు పిట్టలపై అంతమక్కువ ఎందువల్లనంటే అవి భూమికి ఆకాశానికి మధ్యగల స్థలంలో ఎగురుతూ ఉండే విధానమే

అనుకుంటాను. ఇతని చిత్రాలు గూడా ఈ ఆకాశం, భూమికి గల మధ్య స్థలాన్ని, పూర్తి చెయ్యాలనే కృషితో సాగించినవి. ''సిజాన్'' వదిలి వేసిన ఖాళీ స్థలాన్ని ఇతను పూరించాడు.

ఈ శతాబ్దంలో బ్రాక్‌కు గల స్థానం ఎట్టిది అంటే, చాలమంది ముఖ్యమైన విమర్శకులు ఆయన్ని ముగ్గురులో ఒకరుగ చేర్చారు. పికాసో, బ్రాక్, మథీస్‌లు ముగ్గురు ఈ శతాబ్దంలో అత్యంత ప్రతిభావంతులు. బ్రాక్ స్థానం ముగ్గురిలో చివర వానిగ నిర్ణయించారు. 'టైమ్స్' పత్రిక విమర్శకుడు దీనికి కారణం వ్రాస్తూ, ''పికాసో, మెథీస్‌లు ఇద్దరు ఎంతో విభిన్నులైనా, తమ కళా సాధనలో, ఈ శతాబ్దపు కళారంగం గమనాన్నే పూర్తిగా మార్చివేశారు. వీరిద్దరి ప్రభావం లేని చిత్రకారుడు దాదాపు ఎవరూ లేరు. కాని బ్రాక్ 'ఫావిజమ్' సాధన చేసినప్పుడు మథీస్ నీడ క్రింద ఉండవలసి వచ్చినది. క్యూబిజం తర్వాత, పికాసో అంచెలు అంచెలమీద దాటిపోయాడు బ్రాక్‌ను వదిలి'' అన్నాడు. బ్రాక్ నిజంగా ఎవరినీ తన ప్రభావంతో ముంచెత్తలేదు. ఇతర చిత్రకారులు అందరూ బ్రాక్ చిత్రాల్ని చూచి ఆనందించి మెచ్చుకున్నారేగాని బ్రాక్‌ను అనుకరించి సాధన చెయ్యలేదు. వెతగ్గా వెతగ్గా మనకు బెన్ నికల్సన్ దొరుకుతాడు బ్రాక్ ప్రభావంపడ్డ వ్యక్తిగ. అంతకుమించి బ్రాక్‌కు శిష్యులు లేరనే చెప్పాలి.

నిజానికి బ్రాక్ ఒక క్రొత్త రంగం సృష్టించాడు స్టిల్ లైఫ్ చిత్రాలతో. ఒకదాన్లో అప్పుడే వండిన చేపలు ఎంతో జాగ్రత్తగా తెచ్చి బల్లపై ఉంచినట్లుంది. చిన్న టవలు, రెండంటే రెండే పండ్లు ఉంచబడి, ఇక తినడమే తరువాయి అనిపిస్తుంది. చిత్రం చేపలతో ప్రక్కలకు సాగుతూ ఉంది ఎంతో బలంగా. వెడల్పు అధికం అవుతుంది చిత్రంలో. దీన్ని అరికట్టాలని గాబోలు బ్యాక్ గ్రౌండ్‌లో నిలువాటి గీతలను వాడారు బ్రాక్. అడ్డంగాసాగే చిత్రాన్నిపై పైకి పొడిగించాలని గాబోలు. ఈయన స్టిల్ లైఫ్ చిత్రాలు గజిబిజిగా ఉంటాయి. ఇది మాత్రం ఎంతో సింపుల్‌గా కొట్టవచ్చినట్లుంటుంది. తను చెప్పదలచుకున్నది చిత్రంలో తికమకలు లేకుండా చెప్పారు. టేబులుపై ఉన్న పెద్ద గుడ్డ చిత్రం అంతటికి ఒక బరువును, హుందాను తెచ్చింది. దీనిలో విపరీతంగా మథీస్ ప్రభావం కనుపిస్తుంది. అసలు ఇది మథీస్ చిత్రమే అంటే గూడా ఎవరు అభ్యంతరం చెప్పకుండ నమ్ముతారు. అయినా రంగులలో బ్రాక్ తన ముద్రను వేశారు ఈ చిత్రంలో.

స్టిల్ లైఫ్ చిత్రాలలో వంగపండు రంగును, పసుపు రంగును అత్యంత ఆహ్లాదకరంగా ఉపయోగిస్తారు. వంగపండు రంగులో నలుపు చారలతో, ముదురు ఆకుపచ్చని పెద్ద

పండ్లతో చిత్రించిన చిత్రాలు, నగిషీ పని చేసిన వివిధ ఆకారాల కూజాలు, పురాతనమైన మేజాలు, వాటి తరినబట్టిన కోళ్ళు, చారలు చారలుగల చెక్క తలుపులు, ఇలా ఎన్నో అమోఘమైనవి చిత్రించారు.

ఈయన 'గదిలోపల' అన్న చిత్రం చీకటిగా ఉండి, ఒకవైపు నుండి వెలుతురు తెరచిన కిటికీలోనుండి వస్తూ, వస్తువులపై పడుతూ ఉన్నవి, చాల పేరు పొందినవి. ఈయన చిత్రాలు చూచినవారికి ''చార్డిన్'' చిత్రాలు గుర్తుకు వస్తాయి. ఇరువదవ శతాబ్దపు చార్డిన్'' అని కూడా కొంతమంది అన్నారు ఇతన్ని. ఇక్కడ గల కొన్ని చార్డిన్ చిత్రాలను నేషనల్ గ్యాలరీలో చూచాను. పారిస్‌లోని 'లూర్' మ్యూజియమ్‌లో గూడ చూచాను. ఇద్దరికి గల సామ్యం రంగులను మిశ్రమం చేయడంలో ఉంది. కాంతిని బలవంతంగా తగ్గించి, రంగులను తమ అధీనంలో ఉంచుకునే ఈ ఇద్దరిది పద్ధతి చాలగొప్పది.

బ్రాక్ చాల రేఖా చిత్రాలను, స్త్రీ మూర్తులను చిత్రించారు. నిజం చెప్పాలంటే చాల నాసికరకంగా ఉన్నాయి రేఖా చిత్రాలు. కాని స్త్రీ మూర్తుల చిత్రాలు బాగున్నాయి. రేఖలలో గూడ, చిత్రాలంత గొప్ప తనాన్ని చూపే ప్రజ్ఞ పికాసో కొక్కడికే ఉంది. బ్రాక్ తనకుగల బలహీనతను చిత్రాలలోని రంగులలో కప్పి పుచ్చుకుంటాడు. ఇతని డ్రాయింగులు చూస్తే మనకు ఈ విషయం చటుక్కున తెలుస్తుంది.

''పళ్ళు అమ్మే స్త్రీ'' అన్న చిత్రం చాల అందమైన చిత్రం. ఇటువంటివి చాల చిత్రాలు ప్రపంచంలో చాల మ్యూజియములు సేకరించాయి. ఇక్కడ గ్రీకు స్త్రీ మూర్తులు ఆకారం కన్పిస్తుంది. స్త్రీ చిత్రం ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌లో మలచినట్లుందిగాని చిత్రించినట్లు లేదు. స్త్రీ శరీరావయవములు నాజూకు తనాన్ని, వయ్యారాన్ని కోల్పోయాయి. దీనత్వం కనిపిస్తుంది. రేఖలు నలిగిన పరుపులా, స్త్రీ చుట్టూ తిరుగుతాయి. ఈ చిత్రాన్ని రంగులలో చూస్తే ఎంతో ఆహ్లాదంగా ఉంటుంది బహుకొద్దిగా చిత్రించిన స్త్రీమూర్తి చిత్రాలలో ఇది ఒకటి. సామాన్యంగా స్త్రీని ఒంటరిగా చిత్రించే కంటే, స్టిల్ లైఫ్ వద్ద కుర్చీలో కూర్చోబెట్టి చిత్రించినవి చాల ఉన్నాయి. స్టిల్ లైఫు చిత్రించడంలో నైపుణ్యాన్ని ఎంతగానో ఒలికిస్తాడు బ్రాక్. ఈ మధ్య ఇరువదవ శతాబ్దపు చిత్రకారులవి కొన్ని చిత్రాలు లండన్‌లో 'మార్ల్‌బరో' గ్యాలరివారు ప్రదర్శించారు. పెద్ద చిత్రం సుమారు 6' x 8' సైజుది ఈ ప్రదర్శనలో ఉంది బ్రాక్‌ది. నిజంగా ఎవరినైనా నోరు తెరిపిస్తుంది అంత గొప్ప చిత్రం.

బ్రాక్ విచిత్రమైన వ్యక్తి. అతనికి అతనే సాటి. ప్రముఖ చిత్రకారులకు అనుకరణ

చేసేవారెందరో ఉన్నారు. కాని ఈయనకు లేరు. అంతమాత్రాన, ఇతని చిత్రాలలో అంత పస లేదా అంటే, నిజంగాదు. రంగుల నైపుణ్యంలో 'మానే' 'సూరే'లనుమించి ఒక ఇంద్రజాలాన్ని సృష్టించగల వ్యక్తి. అతి సామాన్య వస్తువులను స్టిల్ లైఫులో ఇమిడ్చి, ఎంతో ఉన్నత స్థాయికి తెచ్చాడు. ప్రతి వస్తువులో అందాన్ని చూడగల వ్యక్తి.

మూర్తి చిత్రాలలో కొన్నిటికి రెండు మూడు ముఖాలను ఒకే వ్యక్తికి చూపుతూ చిత్రించినవి గూడా ఉన్నాయి. ఇవి 'పికాసో' చిత్రాలను చూచిన తర్వాత వేసినవి. తన రంగులతో ప్రత్యేకంగా ఉన్నా, పికాసో వాటికి నాసిరకమనే చెప్పాలి. అసలు ఈ పద్ధతి తనదిగానప్పుడు ఎంత శ్రమపడినా మెప్పించలేడు గదా!.

ఈయన పికాసోతో కలిసి స్టిల్ లైఫు, మూర్తిచిత్రాలు చిత్రించే కాలంలో, విపరీతంగా ఎల్లో ఓకర్ రంగు, ఇటుక రంగు వాడాడు. తెలుపు గూడ విపరీతంగానే ఉపయోగించాడు. తర్వాత రంగులను ఎంతో జాగరూకతతో ఎంచుకున్నాడు తన ముద్రపడేటట్లు. ఈయన చిత్రాల్లోని రేఖలు, నదిలోని చిరు తరంగాలవలె ఉంటాయి. అన్ని వస్తువులను వివిధ కోణాలలో పెనవేసుకొని, చలనం లేకుండా ముడుచుకున్న ముత్యంలా మెరుస్తుంటాయి. ఇలా చలనం లేకుండా ఉండడం ఈజిప్షియన్ శిల్పాలలో, చిత్రాలలో చూడవచ్చు. ఈజిప్టు చిత్రాలలోని పిట్టలు ఎగురుతున్నా, మనం చలనాన్ని చూడలేం. అలాగే దుముకుతున్న ''అస్సీరియన్'' సింహాలలో స్థిరత్వాన్ని, గమన రాహిత్యాన్ని గ్రహించగలం.

''శిల్పము'' అనే ఒక శిల్పంలో ఇద్దరి తలలు ఏదో తీవ్రంగా వాదులాడు కుంటున్నట్లుగ మలచబడినవి. ముక్కాలి పీటల మాదిరిగా ఉండి ఆఫ్రికన్ శిల్పాలను జ్ఞప్తికి తెస్తుంది. శిల్పాలలో ఈయన చేపలను, గుర్రపు తలలను, స్త్రీల ముఖాల ప్రక్క భాగములు కనిపించే లాంటివి (profiles) మలచారు. ఎముకలతో గూడ చాల శిల్పాలు చేశారు. ఇవి. ఊసుపోక చేసినవిలా ఉన్నాయి. ఆ మాటకువస్తే గోగాన్, డెగా, పికాసో, మథీస్‌లు చిత్రకారులైనా, వారు చేసిన శిల్పాలు చూస్తే ఆశ్చర్య మేస్తుంది. రంగులు కుంచెలను ఎలా నడపగలరో అలానే మట్టిని, రాయిని గూడ మలచగలిగారు. బ్రాక్ గొప్ప చిత్రకారుడు గనుక అతను చేసిన శిల్పాలు గూడ గొప్పగా ఉన్నాయని విమర్శకులు అన్నా, అందులో నిజము సున్న.

ఈయన వేసిన చిత్రాలలో బహుకొద్ది మార్పులు కన్పిస్తాయి. స్టిల్ లైఫులు, స్త్రీ స్టిల్ లైఫులు అంత గొప్పవికానివి, కొన్ని ప్రకృతి దృశ్యాలు ఉన్నాయి అంతే. పికాసోను చూస్తే, రోజుకొక క్రొత్త సృష్టి చెయ్యగల అతీతుడు. అది నయాగరా జలపాతం. కాని బ్రాక్

పరిమితి బహుకొద్ది. అయినా చిత్రకళా రంగానికి మణిపూసలాంటి పద్ధతులలో చేసిన మహానుభావుడు. అందులో సందేహంలేదు.

బ్రాక్ అంటారు ''చూడండి! మనిషి బ్రతకాలిగదా. బ్రతకడం అంటే నా ఉద్దేశంలో రోజు రోజుకు కొద్దిగా మారుతుండడమన్నమాట''.

కాని, ఇది ఈయనకంటే పికాసోకు బాగా వర్తిస్తుంది. అందుకే గాబోలు సంవత్సరం రెండు సంవత్సరాలముందు, బ్రాక్ డిజైనులతో బంగారు ఆభరణాలను తయారు చేశారు. వీటిని రంగులలో ఈమధ్యనే ''టైమ్స్'' పత్రిక ప్రచురించినది. ఈ నగల్ని పారిస్‌లో ప్రదర్శించారు. డిజైనులు ఎంతో అందంగా చాల బాగున్నాయి. ఈయన లితోగ్రాపులు, ఎచింగ్‌లు చాల ముచ్చటగా ఉంటాయి. శిల్పాలకంటే, ఈ లితో గ్రాపులు, ఎచింగ్‌లు చాల విజయవంత మయ్యాయి.

బ్రిటన్‌లోని ''హెన్రిమూర్''ను బ్రాక్‌తో పోల్చవచ్చును. హెన్రీమూర్ బహుకొద్ది మార్పులతో శిల్పాలు చేశారు బ్రహ్మాండంగా. అలాగే బ్రాక్ బహుకొద్ది మార్పులతో చిత్రాలు చిత్రించారు అమోఘంగా. ఇద్దరు చరిత్రలో చిరస్థాయిగ నిలుస్తారు.

ప్రపంచంలోని ఎన్నో మ్యూజియములు, గ్యాలరీలు, సంపన్నులు ఈయన చిత్రాలుకొన్నారు. ఎంతో మంది ఈయనపై, ఈయన చిత్రాలపై పుస్తకాలు వ్రాశారు. ఇంత గొప్ప వ్యక్తి బహు నిరాడంబరుడు. చిన్నప్పుడు ఎంతో సరదాగా నలుగురితో తిరుగుతుండేవాడు. ఆటల పోటీలలో మంచి పేరు తెచ్చుకున్నాడు యువకుడుగ ఉన్నప్పుడు. అలాంటి వ్యక్తి చిత్రకారుడుగ పేరు పొందుతున్న కొలది, సంఘానికి దూరదూరంగా ఉండడం అలవాటు చేసుకున్నాడు. అసలు నలుగురువున్న చోట ఆయన కనిపించడు. ఇంటివద్ద స్నేహితులను పార్టీలకు పిలిచి సరదా చేస్తాడు. పారిస్‌లోని పార్క్‌మాన్ సురిస్‌వద్దగల ఇంటిలోనో లేక వరెంగెనిల్లె గ్రామంలోని తన ఇంటిలోనో ఉండి కాలక్షేపం చేయడమో, క్రొత్త చిత్రాలను వెయ్యడమో చేస్తుంటాడు.

1912లో పెండ్లి అయిన దగ్గర నుండి, అతని దశ తిరిగింది. చిత్రకారునిగ ఖ్యాతి రా నారంభించింది. అందువల్లనేనేమో విడాకులు లేకుండానే జీవితమంతా ఏకపత్నీ వ్రతుడుగ ఉన్నాడు. సామాన్యంగా పాశ్చాత్యదేశాల్లో, ముఖ్యంగా పారిస్ నగరపు చిత్రకారులలో, ఇలా ఉండడం అరుదు. పికాసోకు ఇప్పటి భార్య అయిదవదనుకుంటాను.

బ్రాక్ మొట్టమొదటి పెద్ద ప్రదర్శన 1933లో 'బాసిల్'లో జరిగింది.1934లో ప్రదర్శించగా, చాల చిత్రాలు అమ్ముడు పోయాయి లండన్‌లో. 1939లో కార్నేగ్ ప్రైజు వచ్చి బ్రాక్‌ను ప్రపంచంలోని దిట్టలలో ఒకనిగా ముద్ర వేయడం జరిగింది చిత్ర కళారంగంలో. 1945లో అస్వస్థతవల్ల చాలకాలం చిత్ర రచన అసలు చెయ్యలేదు. నెమ్మదిగా కోలుకున్న తర్వాత 1953లో 'లూర్' మ్యూజియంలో సీలింగుకు 3 చిత్రాలను వేయడం పూర్తి చేశాడు. 1956లో బ్రహ్మాండమైన ప్రదర్శన జరిగింది. ఎడిన్ బరోనగరానికి ఎన్నో వేల మంది, బ్రిటన్ దేశం అంతటినుండి వచ్చి ప్రదర్శనలో చిత్రాలను చూచి ఆనందించారు. తర్వాత లండన్‌లో 'టేట్' గ్యాలరీలో ప్రదర్శించారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ''ఆనరరి డాక్టరేటు'' బిరుదమునిచ్చి గౌరవించింది బ్రాక్‌ను. 3 సంవత్సరముల క్రితమే 'గ్రాండ్ ఆఫీసర్ ఆఫ్ ది రీజియన్ ఆఫ్ ఆనర్' పొందాడు. వీటి అన్నిటికంటె మించి ఈ సంవత్సరం ఏప్రిల్‌నెలలో ''లూర్ మ్యూజియమ్‌లో'' ఈయన తయారు చేసిన బంగారు, వెండి, ఆభరణాలను ప్రదర్శించటం జరిగింది. ఇంతవరకు బ్రతికివున్న చిత్రకారునివిగాని, శిల్పకారునివిగాని ప్రదర్శనలు ''లూర్ మ్యూజియం''లో ఏర్పాటు చేయబడలేదు. ఇది మహోన్నత గౌరవంగా ఎంచవచ్చు. ఈ ప్రదర్శన త్వరలో న్యూయార్క్‌లో జరుగబోతున్నది.

బ్రాక్ మరణ వార్తవిని లండన్‌లోని విశ్వ విఖ్యాత నేషనల్‌గ్యాలరి డైరెక్టరు సర్. ఫిలిప్ హెండి '' ఈ శతాబ్దంలో ప్రతి ఒక్కరు సదా చెప్పుకునే ముగ్గురు చిత్రకారులలో బ్రాక్ ఒకడు. మిగిలిన ఇద్దరు పికాసో, మథీస్, ఇక ఇప్పుడు మిగిలిందల్లా ఒక్క పికాసో మాత్రమే. భావికాలానికి వారు ''ఓల్డు మాస్టర్స్'' అనుకోవడంలో సందేహంలేదు'' అన్నారు.

''ఈ యుగపు మహోన్నత చిత్రకారుని కోల్పోయాము'' అన్నారు హెన్రీమూర్.

*(భారతి, నవంబర్ 1963)*

★

# డన్ అంతర్జాతీయ చిత్రకళా ప్రదర్శనము

లండన్ నగరాన్ని ఈమధ్య పెద్ద పెద్ద కళా ప్రదర్శనలు ముంచెత్తుతున్నవి. నిరుడు కురిసిన విపరీతమైన మంచు, ఈ సంవత్సరం గూడ కురుస్తుందేమోనని భయంతో ఎదురు చూచిన లండన్ నెమ్మదిగా తేరుకుంటున్నది. సరే, హాయిగా బ్రతుకవచ్చులే ఏ భయం లేకుండా అనుకునే సరికి, ఎక్కడలేని బ్రహ్మాండమైన కళా ప్రదర్శనలతో క్రిక్కిరిసిపోయింది, ఈ సంవత్సరం. ఇక లండన్‌కు విశ్రాంతి ఏది? అంతే మరి, ఎంత చెట్టుకు అంతగాలి అన్నట్టు !

ఇప్పుడు 'గోయా' కళాప్రదర్శన ఇంతవరకు ప్రపంచంలో ఎన్నడూ, ఎక్కడ జరుగనంత గొప్పది జరుగుతున్నది. ఇప్పుడే ముగిసింది ''డచ్'' అంతర్జాతీయ ప్రదర్శన. మొన్ననే 'కెనడా దేశపు చిత్రకళ' అని భారీ ప్రదర్శన ప్రారంభం అయింది. ఇంకా కొత్తవాటికి మళ్లీ అప్పుడే సన్నాహాలు జరుగుతున్నవి. ఇలా ఎడతెరపి లేకుండా 'బిజి'లో పడవలసిందే లండన్ కళాభిలాషులు. అందుకే ఒక్కొక్కసారి విసుగెత్తి ఈ ప్రదర్శనలు మనల్ని వదలవు గనుక మనమే వీటిని, లండన్‌ను వదిలి ఎక్కడికైనా పోయి హాయిగా గాలి పీల్చుకుందా''మని గాబోలు వారంతా పండుగ సెలవు రోజులలో దూరంగా ప్రశాంతంగా ఉన్న, చిన్ని చిన్ని బీచీలకు, గ్రామాలకు పోతారు ''హాలీడే టూర్స్'' అనే పేరుతో.

ఇది ఇక్కడ వుండే లండనర్స్‌కు విసుగేమో గాని, నాలాంటి విదేశీయులకు మాత్రం గాదు. ఎన్నాళ్లుంటాం గనుక యిక్కడ. అందుకని ఉన్ననాళ్లు ఈలాంటి సదవకాశాలు చాలా రావాలని ఆశిస్తాం.

సర్ జేమ్స్‌డన్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యాన జరిగిన డన్ అంతర్జాతీయ చిత్ర కళాప్రదర్శనాన్ని ఆర్ట్సు కౌన్సిల్‌వారు ఏర్పాటు చేశారు ''టేట్'' గ్యాలరీలో. మొత్తం

101 చిత్రాలు, వందమంది చిత్రకారులవి (బ్రతికి ఉన్న వారిని) ప్రదర్శించారు. అందరు ప్రపంచ కళారంగంలో ఆరితేరిన హేమా హేమీలు. ''ఎవరు 100 మంది గొప్ప వారీ ప్రపంచంలో'' అనే సమస్య వస్తే ఆర్ట్స్ కౌన్సిల్ వారు ''మన మెందుకు నిర్ణయించాలి, లేనిపోని చిక్కుల్లో పడతాం, తీరా ఒకరిని వదలి ఒకరిని తీసుకొంటే''నని సర్‌కెన్నత్‌క్లర్క్, సర్ ఆంథోని బ్లంట్, గొర్డన్ వాష్ బర్న్, గేబ్రియన్ వైట్, గేవిడ్ కారిట్, న్యూయార్క్‌లోని మ్యూజియమ్ ఆఫ్ మోడరన్ ఆర్ట్‌లోని ఆల్ఫ్రెడ్ బార్‌లపై ఈ భారం ఉంచారు. అక్కడితో చిక్కు తీరింది. ప్రదర్శనలో ఉన్న 6 బహుమతులు ఒక్కొక్కటి 5000 డాలర్లు యిచ్చారు ఆరు చిత్రాలకు. ఇస్తూ ''ఎన్నో బహుమతులు అంతర్జాతీయ కళా ప్రదర్శనలో ఇప్పటికే పొందిన హేమా హేమీలకు మరల ఈ బహుమతులు యిచ్చే కంటే, అంతటి నిపుణులు, గొప్పవారై ఉండి గూడా వారికి తగిన గౌరవం లభించని యితర చిత్రకారులకు ఈ బహుమతులు ఇస్తున్నాం'' అన్నారు. ఇకనేం సాగింది గాలి దుమారం. బహుమతులు పొందినవారు ఇవాన్ ఆల్‌బ్రయిట్, అలెక్స్‌కోల్ విల్లే, సాయ్ ఫ్రాన్సిస్, ఇన్నియో మర్లొట్టి, కెంజో వొకాడా, పావలో వలార్జ. నేను ఇంతవరకు అసలు వీరి పేర్లు వినలేదు. అలాగే ఇంగ్లండులో చాలమంది ఈ గెలిచిన వారి ఎవరిపేర్లు వినలేదని తలుస్తాను. లండన్‌లో కొంతమంది కళా విమర్శకులు ఈ బహుమతులు పొందినవారిని పట్టుకొని వారి చిత్రాలు, వారి అనుభవాలు, వారిని ఎవరు పికాసోతోను, జాన్‌మిర్‌తోను, డాలితోనూ పోల్చేరని దులిపేసారు. నిజానికి ఇందులో సందేహంలేదు. వీరి చిత్రాలు గొప్పవే కావచ్చు. కాని, నేటి అమెరికన్ చిత్రకారులతో గాని, ఈ పై చెప్పిన 'పికాసో' లాంటి వారితో గాని పోల్చలేం. అంతర్జాతీయ ప్రదర్శనలలో మాత్రం పికాసో, డాలి లాంటి వారితో పోటీబడడం నిజంగా కష్టమే. ఏది ఏమైనా చాలమందిని ఈ ప్రదర్శన ఆకర్షించింది. ఇంత భారీ ఎత్తున, ఇంతటి ముఖ్యమైన ప్రదర్శన 1945 నుండి జరుగలేదట లండన్ నగరంలో అంటే దీని ప్రాముఖ్యత అవగతమవుతుంది.

చాలమంది ముఖ్యమైన చిత్రకారులు పాల్గొనలేదు, వారికి గ్రూపు ప్రదర్శనలో పాల్గొనడం యిష్టంలేక. ఇది చాల విచారించతగిన విషయం. అయినప్పటికి యీ ప్రదర్శనకు ఎన్నో ప్రసిద్ధ గ్యాలరీలు, చిత్రకారులు, రాయబార కార్యాలయాలు తోడ్పడినవి చిత్రాలు సేకరించటంలో. ఇది ఎంతో కష్టతరమైన పని. క్యాటలాగుకు పీఠిక వ్రాస్తూ ఎమ్. బెవర్ బ్రూక్ ''నేను ఈ ప్రదర్శనలో ఇంకా కొన్ని రూపమయ చిత్రాలు ఉంటే బాగుంటుందని తలచాను. మంచికో చెడుకో గాని మనం 'ఆబ్‌స్ట్రాక్టిజమ్'లో నివసిస్తున్నాము, అదీగాక మా ఉద్దేశ్యం ప్రస్తుతపు క్లిష్టతరమైన చిత్రకళా రంగాన్ని సూటిగా

ఉన్నది ఉన్నట్లు చూపాలని'' అందుకే గాబోలు, వెతికి వెతికి, మారుమూలల ఉన్న రూపమయ చిత్రకారుల చిత్రాలు తెచ్చి, ప్రదర్శనలో యిమిడ్చి, బహుమతి గూడ యిచ్చారు - ఒక చెత్త చిత్రానికి.

ఈ ప్రదర్శన ప్రజల్ని అమితంగా ఆకర్షించడంలో విశేషంలేదు. చాలమంది చిత్రకారులు గూడ పదేపదే చూడ్డానికి వచ్చారు. ఎంతో చక్కగా ఏర్పాటు చేసారు లైటింగు. లేకపోతే చిత్రాలపై లైటు వెలుతురు పడి మెరుస్తాయి చిత్రాలు వెండిలాగ. ఈ విషయంలో చాల జాగ్రత్త తీసుకొన్నారు 'టేట్' గ్యాలరివారు. ఎంతోమంది ప్రముఖ చిత్రకారుల చిత్రాలున్న ఈ ప్రదర్శనలోని ముఖ్యమైన చిత్రాల గురించి వ్రాస్తాను.

ప్రదర్శనలో చాలమందిని ఆకర్షించిన చిత్రం పికాసో ''విశ్రాంతిగా పడుకున్న నగ్న స్త్రీ'' చాల పెద్ద చిత్రం 76'' X110''. దీన్ని 1959లో చిత్రించాడు. 'పికాసో' ఒక పెద్ద సుందర భవంతిని 'మౌంట్ సెంట్ విక్టోరియా' వద్ద కొన్నాడు. ఈ భవంతి కొండకు ఉత్తరపు భాగాన, దాదాపు కొండమీదనే ఉన్నది. ఈ పర్వతము చిత్రకారులకు, కళాభిలాషులకు అందరికి సుపరిచితమే. ఈ పర్వతాన్నే చిత్రించాడు 'సిజాన్' ఎన్నో చిత్రాలలో. పర్వతాన్నీ, చుట్టూ ఉన్న పెద్ద పెద్ద కొమ్మల చెట్లనీ లెక్కలేనన్ని చిత్రాల్లో చిత్రించాడు. పికాసో 1959లో ఈ ఇంటిని కొనగానే తానుగూడ ఈ పర్వతాన్ని చిత్రించాలని అభిలాష పడ్డాడట. పర్వతాన్ని పర్వతంలా మరల చిత్రించి సిజాన్‌తో పోటీపడ దల్చుకోలేదట. ఈ కొండ, పికాసోకి పడుకున్న వయ్యారపు నగ్నస్త్రీగా కనిపించింది. కొండలోని లోయలు, ఎత్తు పల్లాల్ని ఆయన స్త్రీతో పోల్చుకున్నాడు. దాని రూపమే యీ చిత్రం. ఎంతో ఆహ్లాదకరముగా ఉన్న లేత నీలి ఆకాశంలో, ముదురు ఆకుపచ్చని ఆకుల కొమ్మలు, ముదురు నీలి ఆకుపచ్చని గడ్డిపై, అప్పుడే అభ్యంగన స్నానం ముగించిన పృథు ఘన స్తన సుందరి విలాస శయనం, తెల్లని, బూడిద, గులాబిరంగుల మిశ్రమంలో నున్న శరీరపు కాంతితో ఆకాశముతో పోటీ పడుతున్నది. ఈవిడ తప్పక యూరప్ వనితయే అయి ఉండాలి. లేకపోతే ఆ శరీరంలో అంతటి తెల్లదనం ఉండదు. చిత్రంలో ఉన్న ఈవిడ ''ఏమిటో తనను ఇంతమంది ప్రేక్షకులు యిలా ఎగాదిగా చూస్తున్నారు'' అని ఆశ్చర్యంతో చూస్తున్నట్లున్నది. ఎంతోమంది ఈ చిత్రం చుట్టూ గుమి గూడి ఉండి చూడడంలో ఏదో ఒక విధమయిన ఇంద్రజాలం పికాసోలో ఉన్నదని తలుస్తాను. ఈ చిత్రానికి చుట్టుప్రక్కల ప్రదర్శించిన చిత్రాలు ఎంతో గొప్పవి అయితేనే నిలుస్తాయి. లేక పోతే నాసిరకంగా కనిపిస్తాయి. ఈ చిత్రం చూస్తుంటే

నాకు ''రూబెన్స్'' చిత్రాలు జ్ఞాపకం వస్తాయి. ఆయన గూడ ఎంతోమంది నగ్న స్త్రీ చిత్రాలను చిత్రించాడు - బలంగా, గుండ్రంగా ఉన్నవారిని మాత్రమే. కాని, వాటిలో చలనం లేదు. స్త్రీలు నడుస్తున్నా పరుగెడుతున్నా, వారి శరీరం చిత్రాలలో చూపించాలని ప్రత్యేకంగా వేశాడా 'రూబెన్స్' అని ఒక్కొక్కసారి అనిపిస్తుంది. కాని పికాసో చిత్రాలలో పికాసో ఉండి, మనతో మాట్లాడుతున్నట్లుంటుంది. అంటే అంత సజీవంగా ఉంటాయి ఆయన చిత్రాలు. ఆయన వలెనే అంత బలంగాను, గట్టిగాను ఉంటాయి చిత్రాలు. ఒక్కొక్కసారి అనిపిస్తుంది నాకు - పికాసోలోని అంశమే హెన్రీమూర్‌లో గూడ ఉందని. లేకపోతే మూర్ పికాసోలా ప్రకృతినిస్త్రీ రూపంలో పోల్చి, అద్భుతంగ అంతగ ఎలా మలచగలిగాడు. తన శిల్పాల్లో? ''విశ్రాంతిగా పడుకున్న స్త్రీ'' చిత్రంలో పికాసో, ఎంత కొద్ది టైములో చిత్రాన్ని పూర్తిచేసిందీ తెలుస్తుంది. ఎంత వేగమో కుంచె నడక! తనకు ఏ రంగు ఎక్కడ ఎలా వాడాలో, ఎంత ఖుణ్ణంగా, సరిగ్గా ఊహించగలడో తెలుస్తుంది. ఏదో తనకు బాగా అలవాటైన చిత్రాన్ని మరల చిత్రించాడా అన్నంత సులువు అగుపిస్తుంది. ఈ చిత్రంలో ఒకవిధమైన గంభీరత, చేతులు, కాళ్ల మడచిన తీరులో క్రొత్తదనం ఉంది. ఈ చిత్రం గ్యాలరి లేరిస్ (పారిస్) వారు యిచ్చారు లండన్‌లో ప్రదర్శించేందుకు.

గమ్మత్తులు చేయడంలో 'సల్వదార్ డాలి' అందెవేసిన చెయ్యి. ఎక్కడ ప్రదర్శించినా ఒక అలజడి తెస్తాడు తన చిత్రంతో. ఒకసారి తన చిత్రం 'క్రీస్తు'ను బ్రసెల్స్ అంతర్జాతీయ పారిశ్రామిక ప్రదర్శనలో ప్రదర్శిస్తామంటే, ప్రత్యేకంగా తన చిత్రము మాత్రమే ప్రదర్శించుటకు ఒక క్రొత్త భవంతి కట్టితేగాని, ప్రదర్శించనన్నాడు. అలాగే కొత్త భవంతి కట్టారు. ఆ చిత్రాన్ని స్విట్జర్లాండ్ ప్రభుత్వము అనుకుంటాను, కొన్నది. పికాసోలాగా ఇతను గూడ స్పెయిన్‌లో పుట్టాడు. ఒక్కొక్కప్పుడు అనుకుంటాను, అసలు స్పెయిన్‌లో పుడితేనే చాలు గొప్ప చిత్రకారుడవుతాడని. వెలాజ్ క్విజ్, ఎల్‌గ్రీకో, గోయా, జాన్‌మిరోలు గూడ స్పెయిన్ వాళ్లే. 1929లో సర్రియలిస్ట్ చిత్రకారులతో చేరి, ఎన్నో చిత్రాలు వేశాడు సల్వదార్ డాలీ. తరువాత విడిపోయి సహజ రూపచిత్రాలు, మతసంబంధమైన చిత్రాలు వేసి పేరు, ధనం విపరీతంగా గడించాడు. తర్వాత అసంబద్ధమైన, అసంగతమైన విషయాలను చొప్పిస్తూ, తన చిత్రాలలో పెద్ద పెద్ద చిత్రాలను ''సర్రియలిస్ట్'', డాడాయిస్ట్''ల మాదిరి చేయసాగాడు. అతని చిత్రాలు చూస్తే అతని కళానైపుణ్యానికి ఆశ్చర్యం వేస్తుంది. ఎంతో జాగ్రత్తగా రంగులు కలిపి మిశ్రమం చేసిన చిత్రాలు. డచ్ చిత్రకారుడు 'వెర్‌మీరు' చిత్రాలను మరపింపచేస్తాయి. అతను నిజానికి రూప చిత్ర రచనలో ''రెంబ్రాంట్'', ''రూబెన్స్‌ల'' తెగకు చెందినవాడు.

తన నూత్న భావాలను చొప్పించి, ఎంతో సునిశితంగా సహజరూప పద్ధతులలో చేస్తూ, గమ్మత్తులను ఇరికిస్తాడు. ఈ ప్రదర్శనలోని తన చిత్రాన్ని ఈ క్రింది విధంగా వివరించాడు, డాలి.

''ఒక విధమైన ఊదారంగులో ఉన్నది. దగ్గరగా చూస్తే ఆబ్‌స్ట్రాక్ట్ చిత్రం. రెండు మీటరుల దూరం నుండి చూస్తే ''రాఫెయిల్''యొక్క ''స్టియిన్‌మెడోనా''. పదునైదు మీటరుల దూరం నుండి చూస్తే ఒకటిన్నర మీటరుల దేవతా చెవి.'' చిన్ని చిన్ని బెజ్జములు గల రేకుపై చెవిని చిత్రించి, మెడోనా చిత్రాన్ని చిత్రించిన కాన్వాస్‌పై దాన్ని ఉంచి చూస్తే ఎలా ఉంటుందో అలా ఉంది. దగ్గరగా చూస్తే రేకు బెజ్జములలో నుండి మెడోనా చిత్రం కన్పిస్తుంది. దూరానికి రేకుపై చిత్రమే కన్పిస్తుంది గాని బెజ్జముల ద్వారా కన్పించే మెడోనా అంతగా అగుపించదు. ఇది అసలు చిత్ర మర్మము. ఒకే కాన్వాస్‌పై రెండు చిత్రాలు కన్పించేలా చిత్రించడమే విశేష ప్రజ్ఞతో కూడుకున్న పని తనం. చిత్రంపై తెల్లని కాగితాన్ని గుచ్చి దానికి వ్రేలాడదీసిన దారం, ఆ దారానికి చిన్ని లేబిల్ కూడ చిత్రించాడు. ఎంతకాలం పట్టిందోచిత్రించడానికి, చెప్పలేం.

ఈ చిత్రం ఉన్న గదిలోనే పికాసో చిత్రం గూడ ఉంచారు. ఇక ప్రేక్షకులకు 'డాలి' చిత్రం చూడడం, 'పికాసో' చిత్రం చూడడంతో మెడ నొప్పి పుట్టి ఉంటుంది. ఒక గోడకు డాలి చిత్రం, మరొక గోడకు పికాసో చిత్రం ఉంచారు. ఇక రూములో ఉన్న యితర చిత్రాలు అసలు లేనట్టే ఉన్నాయి.

మార్క్ చాగల్ రష్యాలో జన్మించాడు 1887లో ఇప్పుడు వెనిస్, పారిస్‌ల నగరాలలో నివాసం. చాలమంది యితన్ని పికాసో, బ్రాక్‌ల తెగకు చేరుస్తారు. ఇతని లోకం అంతా ఊహామయం. గాలిలో ఎగురుతున్న (తేలుతున్న!) మనుష్యులు (పక్షుల ముఖం మనుష్యులా!) తల క్రిందులైన యిండ్లు, పూలకుండీలలో యిరుక్కొని ప్రేమించుకుంటున్న ప్రేమికులు మొదలైన చిత్రాలు. బైబిల్ లోని ''వోల్డ్ టెస్టమెంట్'' కథలను ఆధారంగా తీసుకొని చాల చిత్రాలు చిత్రిస్తారు. ''సెయింట్ ఛాపెల్'' అన్న తైలవర్ణ చిత్రం విచిత్రంగా ఉంటుంది. మేరీ కన్య అనుకుంటాను, పూలగుత్తిని పట్టుకుని ఉన్నట్లున్న చిత్రాన్ని, ఒక పావురము, మనుష్య ముఖములు గల ఒక నెమలి, గాలిలో ఎగురుతూ, ఒక కాలితో కుంచె, రంగుల చిన్ని పాలెట్‌ను పట్టుకొని ఉంది. తీక్షణంగా పరీక్ష చేస్తున్నట్లున్నది తాను చిత్రించిన మేరీ చిత్రాన్ని. పైన వెన్నెల కురిపిస్తున్న పెద్ద గుండ్రని చంద్రుడు, క్రింద మహాపట్టణం ఉన్నాయి. పెద్ద చర్చి, పట్టణం మధ్యగ

ప్రవహిస్తున్న నది ఉన్నాయి. ఏమిటో కథ అర్థంగాదు. ఎక్కువ ముతుక నీలిరంగు, ఎరుపులలో చిత్రం కొట్టవచ్చినట్లు ముందుకు, వస్తుంది. పసుపురంగును అక్కడక్కడ చిందించాడు. ఇతని చిత్రాలు మన జానపద చిత్రాల రంగులను గుర్తుకు తెస్తాయి. తైలవర్ణంలో చిత్రించినా ఇతని చిత్రం పెద్దకుంచెతో చిత్రించిన నీటిరంగుల చిత్రాల మాదిరిగా ఉంది. బహు పల్చనిరంగులను వాడతాడు. దగ్గరగా సూటిగ చూస్తే కుంచెను గిరికి గిరికి, రాచి రాచి చిత్రించిన మాదిరి ఉంటుంది. ఈ మధ్య చాల చర్చిలకు అలంకరణ చేస్తున్నాడు తన చిత్రాలతో. అప్పుడే యివి లండన్ మార్కెట్లలోనికి అమ్మకానికి వచ్చాయి, ప్రింటుల రూపంలో. ఇతను జూయిష్ ఎక్కువగ జూయిష్ మత సంబంధమైన బొమ్మలు వేసారు. ఇశ్రేయిలు దేశంలో ఈయన చిత్రాలు చాల వున్నాయి. హిందువులు రాజారవివర్మ చిత్రాలు ఎంత ఎక్కువగా కొన్నారో అలానే జూయిష్ వాళ్ళు ఛాగొల్ చిత్రాలు కొంటారు.

అమెరికన్ చిత్రకారుడు మారిన్ గ్రేవ్స్ ''కొంగ'' అన్న చిత్రం నాజూకుగ ఉంది. ఈ చిత్రం ప్రదర్శనలోని చిత్రాలతో కలవక విడిగా ఉంటుంది దీన్ని ఏ చైనీయులో, ఇండియనో వేసారంటే ఆశ్చర్యంలేదు. నిలబడి ఉన్న తెల్లని కొంగ, బూడిదరంగు బ్యాక్ గ్రౌండులో మెడ ఎత్తి చూస్తున్నది, దూరంగా. ఏమాత్రపు ఈనాటి ' యిజముల'' ప్రభావం లేకుండా ఉన్న చిత్రం. ప్రాక్ దేశపు కళలు, వేదాంతాలంటే ఈ చిత్ర కారుడికి చాల యిష్టం. ప్రాక్ దేశపు చిత్రకళలను తన చిత్రాలలో చూపిస్తారు. ఈమధ్యనే అమెరికా వదలి డబ్లిన్ (ఐర్లండ్) వచ్చి ఉంటున్నారు. రాతిలోను, లోహములలోను శిల్పాలను చేస్తున్నారు, డబ్లిన్‌లోని తన యింట్లో. ఈ 'కొంగ' టెంపెరా పద్ధతిలో చిత్రించిన నీటి రంగుల చిత్రం. మన భారతీయ చిత్రకారులు వేసే చిత్రాలతో దీన్ని పోలిస్తే, ఎంతో నాసిరకం. అమెరికాలో ఉన్నవాడు, కీ.శే. 'మార్క్‌టోబి' అనే చిత్రకారునికి సహాధ్యాయి గనుక యితనికి గూడ మంచిపేరు వచ్చిందేమో అనే సందేహం కలుగుతుంది.

మరొక బహు రమ్యమైన చిత్రం ఆల్బెర్టొబర్ అనే అతనిది. ఇతను ఇటాలియన్. వైద్య విద్య అభ్యసించాడు. యుద్ధ ఖైదీగా 'టెక్సాస్' జైల్లో చాలాకాలం ఉన్నాడు బందీయై. ఈ అనుభవం అతని జీవితంలో జీర్ణించుకుపోయింది. ఖైదులో ఉండగానే ప్రారంభించాడు చిత్ర రచన. ఎప్పుడూ ఖరీదైన వస్తువులను, రంగులను వాడడు. బాగా చిరిగిపోయిన గుడ్డ పేలికలు, పనికిరాని చెక్క ముక్కలు తీసుకొని చిత్రనిర్మాణం చేస్తాడు. తెల్లని ముతుక గుడ్డపై బహు పల్చటి వెడల్పయిన చెక్కలను అతికించాడు, రెండు

వరుసలలో ఎగుడు దిగుడుగా. దూరానికి ఏదో చెక్కలతో కట్టిన దడిలాగ ఉంటుంది. పైన ఎర్రని రంగును, క్రింద నల్లని రంగును పూశాడు గుడ్డకు. నిజమైన చెక్కలను పేర్చడం వలన శిల్పానికి ఉండే ఒక విధమైన బరువు వచ్చింది. చెక్కలను అమర్చిన తీరు, ఎరుపు, నలుపు రంగులు, దూరం నుండి చూస్తే మనలను ఆకట్టుకుంటాయి. ఆ గదిలో ఉన్న అన్ని చిత్రాలను మించింది ఈ చిత్రం. ఎంతో అందమైన ఈ చిత్రం అందరి మన్ననల నందింది. నాకు వీరి చిత్రాలంటే అమితమైన ప్రేమ.

మరొక ఇటాలియను 'రెనాటో గుట్ సా' యొక్క 'గదిలోని స్టిల్ లైఫ్ ' అన్న చిత్రం చాలమందిని ఆకర్షించింది. ఇతన్ని అందరు 'కమ్యూనిస్టు ఆర్టిస్టు' అంటారు. ఉండేది రోమ్‌లో. ఇతను ఇటాలియన్ కమ్యూనిస్టు పార్టీలోని సెంట్రల్ కమిటిలో మెంబరు. కమ్యూనిస్టుపార్టీ చిత్రకారులకు మంచి అండగా నిలుస్తుంది. నలుపు, తెలుపు, ఎరుపు రంగులలో చేసిన ఇతని చిత్రం సైజులో చాల పెద్దది. గదిలో చిందర వందరగ నున్న రంగులు, సీసాలు, బుట్టలు, బల్లపై పడి ఉన్న వైన్ బుడ్లు, కాగితాలు ఎంతో సమంజసంగా ఉన్నాయి. తాను ఏది వేసినా సామాన్య మానవునకు అర్థం అవ్వాలనే తత్వం గల వ్యక్తి - అంటే అచ్చు ఫోటోగ్రాఫులా చిత్రించాలనేవాడు గాదు. టెక్నిక్ చిత్రకారునికి వదిలి, చిత్రం ఏమిటో అన్నది ప్రేక్షకునికి తెలిస్తే చాలని యితని ఉద్దేశ్యం.

ఫోటోగ్రాఫుల్లాంటి చిత్రాలు అంటే ఒక చిత్రకారుడు ముందుకు వస్తాడు కెనడా నుండి. అలెక్స్ కోల్‌విల్లె అనే ఇతని చిత్రాలకు, కలరు ఫోటో గ్రాఫులకు తేడా ఉండదు. ''సెంట్ జాన్ నది, కుక్క కుర్రవాడు' అన్న యితని చిత్రం ఇంగ్లండులోని రాయల్ ఎకాడమి ఓల్డ్ మెంబర్ల చిత్రాల తెగకు చెందుతుంది. ఎందుకంటే , ఈ మధ్య రాయల్ ఎకాడమి ప్రదర్శన జరిగింది. అందులోని చిత్రాల సంగతేమో గాని మద్రాసులోని మూర్ మార్కెట్ జ్ఞప్తికి వచ్చింది. దీన్ని గురించి తర్వాత వ్రాస్తాను. మొన్ననే ప్రారంభమైన 'కెనడియన్ చిత్రకళా ప్రదర్శన' లో ఇతనివి ఏడెనిమిది చిత్రాలున్నాయి. అవి అన్నీ చూశాక ఇతన్ని ఖచ్చితంగా తూయవచ్చు. ఇతను లోగడ వార్ ఆర్టిస్టుగ కెనడియన్ ప్రభుత్వం క్రింద ఉన్నాడు. అప్పుడు నేర్చుకున్నాడేమో అధికారులను ఎలా మెప్పించాలి చిత్రాలతోనని, లేక ఎటువంటి చిత్రాలు తన పై అధికారులకు నచ్చుతాయి అని. నా ఉద్దేశ్యంలో ఇతని చిత్రాలు ఏడెనిమిది చూశాక, ఇతను ముందుగ తాను చిత్రించదలచుకున్నది, కలర్ ఫోటో తీసి, అది ప్రింటు చేయించి దాన్ని చూచి అచ్చంగా అలాగే చిత్రిస్తాడని. ఇతని కంటె అమెరికన్ ''జాన్ వైత్' నయం, కాస్త కాకపోతే

కాస్తయినా. చిత్రాలు ''తోటలో పరుగెత్తుతున్న కుక్క' ''కుక్కతో ఉన్న బాలుడు'' తోట, కుక్క, నది లాంటి పేర్లతో వుంటాయి. చెత్త చిత్రాలలో అతి చెత్త. బహుశః రష్యాలో నైతే, ఏ లెనిన్ ప్రైజో వచ్చి ఉండేది - చిత్రకళా రంగాన్ని, అతి సామాన్య మానవుని అభిరుచికి దగ్గరగా తీసుకువచ్చినందుకు. ఉన్నది ఉన్నట్లు చిత్రిస్తాడని గాదు నాకు నచ్చకపోవడం. రూబెన్స్, వెర్‌మీర్, అగస్టస్ జాన్ లాంటివారి చిత్రాలు గూడా ఉన్నవి ఉన్నట్లు చిత్రించే పద్ధతే. అయినా అవి ఎందువల్ల చిరస్థాయిగ నిలచే కళాఖండాలు? కెనడాలో ఇంత చవుకరకపు చిత్రకారులు చాలా మంది ఉన్నారు.

అల్బర్టోజాకొమెత్తీ ''కూర్చున్న స్త్రీ'' అన్న చిత్రం చాలా బాగుంది. ఇతను 1901లో స్విట్జర్లండ్‌లో జన్మించాడు. పారిస్‌లో ఉంటాడు. ఇతను శిల్ప కళారంగంలో ఒక విప్లవం తెచ్చిన వ్యక్తి. సన్నని బహు బారైన, నడచే మనుష్యులను తీగలతో, ప్లాస్టర్‌తో చేసి నూత్నత్వాన్ని తెచ్చాడు శిల్పకళలో. ఇతని చిత్రాలు గూడ అటువంటివే. స్కెచ్ వేసినట్లే ఉంటాయి చిత్రాలు. సన్నని కుంచెతో కూర్చొన్న మనిషిని స్కెచ్ చేస్తాడు. పల్చగ బ్యాక్ గ్రౌండుకు రంగుపూస్తాడు అక్కడక్కడ. అంతే చిత్రం చూస్తే పూర్తిచేయకుండ మధ్యలో వదలివేసినదిలా ఉంటుంది. దాదాపు ఒకటి రెండు లేత రంగుల కంటె ఎక్కువ ఉండవు ఏ చిత్రంలోనైనా సరే. ఇతని చిత్రాలు, శిల్పాలు, సన్నని జాజి పువ్వులవలె సునిశితంగాను, ఎంతో రమ్యంగాను ఉంటాయి. ఇతని ప్రభావం యువతరం వారిమీద విపరీతం. నే నున్న స్లేడ్‌లో యితను చేసిన స్కెచ్ యొక్క లితోగ్రాపు ఉంది. అది ఇంటిలో నిలుచున్న మనిషి. క్రెయాన్ స్కెచ్ ఎంత సేపు చూచినా తనివితీరదు. అతని రేఖల నడక అద్భుతం

''రుఫినో టొమాయో'' మెక్సికో దేశపు చిత్రకారుడు. మెక్సికోలో ఉన్న నలుగురైదుగురు ప్రపంచ ప్రసిద్ధ చిత్రకారులలో ఒకడు. ఇతను మెక్సికో, అమెరికాలలో చాల భవంతులలో ఫ్రెస్కోలు, చిత్రాలు చిత్రించాడు గోడలపై. ముఖ్యంగా మెక్సికన్ జానపద కళను ఆధారంగా తీసుకొని అభివృద్ధిపరచుకున్నాడు తన శైలిని. ''నీడలో ఉన్న ఆకారాలు'' అవి రెండు నిలుచున్న ఒక ఆడ, ఒక మగ ఆకారాలున్న చిత్రం. ఇతను ఎరుపు ఇటుకరంగు, నలుపులను అత్యంత ఆహ్లాదంగా మిశ్రమించేసి చిత్రిస్తాడు. ఏదో విధమైన భయానక సూచనలు అగుపిస్తాయి రంగులలో. అరుస్తున్న నక్కలు, చీమకళ్లు, రెండు మూడు తలల మనుష్యులు లాంటి చిత్రాలు చూచాక, ఇతను, భయాన్ని చిత్రాలలో చొప్పించాలని సీరియస్‌గ యత్నిస్తున్నట్లు అగుపిస్తుంది. ఇతను ''పాలెట్‌నైఫ్''ను

కాన్వాస్‌పైన నడిపించడం ఒక అద్భుతం. కుంచెకు బదులుగ పాలెట్ నైఫ్ వాడుతూ మిశ్రమం చేసిన రంగులు (కాన్వాస్ పైనే) ఎంతో బాగుంటాయి ఇతను మెక్సికోలో, అమెరికాలో బహుళ ప్రచారంలో ఉన్న చిత్రకారుడు ప్రస్తుతం.

ఇక న్యూయార్క్‌లో నివసిస్తున్న మన భారతీయ చిత్రకారులు మోహన్ సమంత్ ఇండియాలో ఉండగనే ప్రసిద్ధిలో ఉన్నవాడు, యువకుడే కాని ఎం. ఎఫ్ . హుస్సేన్, కె.కె.హెబ్బర్ చిత్రకారులంత ప్రసిద్ధిగాదు. అంటే మొదటిరకం ఇండియా హేమాహేమీల తరగతిలో లేడన్న మాట. ఇండియాలో ఉండగ రంగులు కాంతివంతంగా ఉండేవి యితని చిత్రాలలో. ఢిల్లీలో చూచాను ఇతనివి చాల చిత్రాలు లోగడ. ఇక్కడ ప్రదర్శింపబడినది ''సూర్యుని రథం'' అన్న చిత్రం చాలా పెద్ద సైజుది. నిమ్మపండు రంగులో చిత్రించాడు కాన్వాసంతా. చిత్రాన్ని రెండుగ విభజించాడు వెడల్పయిన కుంకుమరంగు బద్దీలవంటి చారలతో. దిమ్మలాగ ఉన్న ఈ దీర్ఘ చతురస్రము క్రింద చక్రాలు ఉన్నాయి లేత ఎరుపు రంగులో. నేననుకోవడం సూర్యరశ్మిని ముఖ్యంగా ఉద్దేశ్యంలో ఉంచుకొని చిత్రించినదని తలుస్తాను. కాన్వాసుపై సన్నని మెత్తని యిసుక మందంగా పోసి ఆరిన తర్వాత దానిపై నిమ్మపండు పసుపు రంగు వేసాడు. ఒకవిధంగా రిలీఫ్ చిత్రం క్రిందకు వస్తుంది యిది. ప్రదర్శనలో దీన్ని అంతగా ఎవరు పట్టించుకున్నట్లు లేదు. ఈ ప్రదర్శన దేశాలవారిగ ఎన్నికచేసి ప్రదర్శించినదిగాదు. అయినా మన యిండియన్ చిత్రకారులలోని అవినాశ్‌చంద్ర చిత్రంగాని, ఎఫ్. ఎన్. సూజా చిత్రంగాని ఉంటే చాల బాగుండేది. ఇండియాకు తగిన స్థానం ఉండేది ప్రదర్శనలో. ఏది ఏమయితేనేం భారతీయునిగ నాకు చాల సంతోషము గల్గింది, మన దేశీయుని చిత్రం గూడ ప్రదర్శనలో ఉన్నందువల్ల.

ఇక అమెరికన్ చిత్రాల సంగతి. మంచివి ఉన్నాయి. ఇరువదవ శతాబ్దంలో ఎంతో ప్రజ్ఞతో ముందుకు పరుగెడుతున్న అమెరికన్ చిత్రకళ, ప్రపంచాన్ని విస్తుపరిచింది. ''ఆబ్‌స్ట్రాక్ట్ ఎక్స్‌ప్రెషనిజమ్'' ''పాప్ ఆర్టు'' లను కనుగొన్న కీర్తి అమెరికాకే దక్కింది. ఈ పాప్ ఆర్ట్ యూరప్ అంతా విజృంభించింది. ముఖ్యంగా యువ చిత్రకారులలో ఒక క్రొత్తదనంతో ఎన్నడూ ఊహించని పద్ధతిలో సాగుతున్నది ఈ శైలి. మనం నిత్యం చూచే వస్తువులనే పేర్చి చిత్రాలు చేయడం, కనుపించిన సిగరెట్టు పెట్టెలు, సినిమా పోస్టర్లు, ఎడ్వర్టయిజ్‌మెంట్సు యిలా ఏది బడితే దానిని తిరిగి చిత్రిస్తారు కాన్వాస్‌పై. అంటే ఈ పద్ధతిలో ఆశ్చర్యానికి, నవ్వుకు ప్రాధాన్యత ఉంది. ఈ చిత్రాలు చిత్రించడానికి చాలకాలం పడుతుంది ఆకారాన్ని, రంగులను ఉన్నవి ఉన్నట్లు చిత్రించాల్సిన అవసరం చాల ఉంది.

ఈ క్రొత్త పాప్ చిత్రకళకు మూల కారకుడు రాబర్ట్ రోషన్‌బర్గ్ ఇతను టెక్సాస్‌లో జన్మించాడు 1925లో ఇతని చిత్ర ప్రదర్శన యిప్పుడు మొదటిసారిగ లండన్‌లో జరుగుతున్నది. పేపర్లు టెలివిజన్ మంచి ప్రచారం యిచ్చాయి. ఇతని చిత్రాలలో విశేషం ఏమంటే, చిత్రాన్ని రెండు మూడు విడివిడి చిత్రాలుగ విభజించడం. అలా విభజించి దూరదూరంగా ఉంచి వీటిని త్రాళ్లతోను, గొలుసులతోను కలుపుతాడు. టైల్సు, చెక్కముక్కలు, లేక నిజమైన అలారం టైంపీస్‌లు పనిచేస్తున్న యంత్రభాగాలు యిముడుస్తాడు చిత్రంలో. చిత్రంలోనే గడియారం పనిచేస్తుంటుంది. విచిత్రం గదూ! ఇవి చిత్రాలో శిల్పాలో చెప్పలేను. కాని, వీటి ప్రభావం చూచేవారిమీద బలంగా ఉంటుంది. ఇంత వరకు మనకు చిత్రమంటే ఒక కాన్వాస్‌పై ఆకారాలను, ఆకార రహిత భావాలను చిత్రించడం. కాని, ఆ భావాన్ని పూర్తిగా విసర్జించి అక్కడక్కడ ఏర్పరచిన పలు చిత్రాల్ని, అన్నిటిని కలిపి, ఒకే చిత్రంగా ఎందుకు చూపించగూడదు? అన్న భావనను తెచ్చిన సాహసి కాని ఇలా చేసి విజయం సాధించడం చాల కష్టతరమైన విషయం. అతనికి గూడ ఎరుపు, ఆకుపచ్చరంగులంటే చాల యిష్టం.

ప్రసిద్ధ అమెరికన్ చిత్రకారులు రాబర్ట్ మదర్‌వెల్, మార్క్‌టోచి, బెన్‌షాన్, లారీరివర్స్, జేమ్స్‌మూక్‌గ్రిల్, జాక్ లెవిన్, విలియమ్ డి కూనింగ్, కితాజ్, ఎల్స్‌వర్త్ కెల్లీ, రాబర్ట్ ఇండియానా, అడాల్ఫ్ గోటిలెబ్, ఎడ్విన్ డికెన్‌సన్ ఇంకా చాలామంది ప్రదర్శించారు. ఇంత మంచి ప్రముఖాతి ప్రముఖుల చిత్రాలు ఒక్కచోట చూడడం మహాభాగ్యం. అందరు ఎవరికి వారు విడిగా తను స్వంత శైలిని సృష్టించుకున్నవారే.

స్టూవర్ట్ డేవిస్ పేరు తెలియని వారుండరు కళా రంగంలో 1894లో ఫిలడెల్ఫియాలో జన్మించాడు డేవిస్. ఇతని చిత్రాలలో అక్షరాలు, అంకెలు ఉంటాయి చిత్రించి. ముఖ్యంగా కానవచ్చేది బలమైన జానపద రంగుల మాదిరి ముతుక రంగులు. రెండు మూడు రంగుల కంటె ఎక్కువ వాడడు. అవి అయినా దేనితోను మిశ్రమంచేసి కాదు, వేటికవే ప్రత్యేకంగా చిత్రించబడి ఉంటాయి. చాలా వెడల్పయిన రేఖలతో, ఏదో వాస్తు శాస్త్రజ్ఞుడు బిల్డింగ్ ప్లాను వేసుకునే ముందు, బిల్డింగులో కిటికీలు ఎక్కడ ఉండాలి, ద్వారాలు, బీరువాలు ఎక్కడెక్కడ ఉండాలి అని ఊహించి వేసిన చిత్రంలాగ ఉంటుంది. ఇక్కడ ప్రచురించిన చిత్రం 'బజారు'. మనం వీధిలో ఉన్న వివిధ రకాల షాపులు, వాటికుండే ఎడ్వర్‌టైజమెంట్లు, లైట్లు అన్ని చూడవచ్చు ఒక్కొక్కసారి యితని చిత్రాలు చూస్తే, తివాచీలు వేయడానికిగాని, పెద్ద పెద్ద కిటికీ తెరగుడ్డలకు గాను, డిజైనులు యిమ్మనిగాని బట్టలమిల్లులవారు అడిగితే వేసాడా అనిపిస్తుంది.

అస్కార్ కొకోష్కా ఆస్ట్రియాలో జన్మించాడు. ఇక్కడ అక్కడ ఎక్కడ బడితే అక్కడ యూరప్‌లో నివసించాడు. ఇప్పటి ఆధునిక కళ అంటే అంతగా నచ్చదు ఈయనకు. ఈయన చిత్రాలు గూడ స్కెచెస్ లాగ ఉంటాయి. ఇతని చిత్రాలను రెండు మూడు శైలులుగ విభజించవచ్చును. ఈయన చిత్ర ప్రదర్శనం ఇక్కడ జరిగి ఎంతో విజయవంతమైనది. త్వరలో దాన్ని గురించి వ్రాస్తాను. ఇప్పటి ప్రదర్శనలోని చిత్రం ''థేమ్స్‌నది దృశ్యం.'' అన్నది. 1959లో చిత్రించాడు దీన్ని. చాల వేగంతో చిత్రించడం యితని స్వభావం. ఎన్ని రంగులున్నాయో అన్నిటిని వాడతాడు చిత్రాలకు. స్కెచ్చస్ వేస్తాడు. దాన్ని చెరుపుతాడు. గుడ్డతో మరల వేస్తాడు, మరొకటి వేస్తాడు. ఇలా చిత్రించిన దానిపై మరల చిత్రించడంవల్ల చూడడానికి సరిగ్గా స్కెచ్ గూడ వెయ్యడంచేత గాదేమిటి అనిపిస్తుంది. ఇది ఇతని శైలి. ఇతని చిత్రాలు నాకు యింప్రెషనిస్టును చిత్రకారుడు ''మానే'' చిత్రకారుని జ్ఞప్తికి తెస్తుంది. ఇతని చిత్రాలలో ఎక్కువగ ప్రకృతి దృశ్యాలకు ప్రాధాన్యత ఉంటుంది. దాదాపు యూరపులో ప్రతి నగరాన్ని చిత్రించాడనుకుంటాను. పోర్ట్రెయిట్స్ వేయడంలో చాల ప్రసిద్ధి. అవిగూడ యిలాగే చిత్రిస్తాడు. ఇతనికి చేతివ్రేళ్లు వేయడం అంటే యిష్టం బాగా. అందుకనే యితను వేసిన పోర్ట్రెయిట్స్ చూస్తే, చిత్రంలోని వ్యక్తి ముఖం కంటె, అతని చేతివ్రేళ్లు వేయడానికి ఎక్కువ శ్రద్ధ తీసుకున్నాడా చిత్రకారుడు అని అనిపిస్తుంది. ఏవో భంగిమలతో ఉన్నట్లు ఉంటాయి, ఆ చిత్రించిన చేతులు, వ్రేళ్లు గూడ. ఈనాడు ప్రపంచ ప్రసిద్ధ తొమ్మిది పది మంది చిత్రకారులలో ఈయన ఒకడు. ఈతని చిత్రాలు చూస్తూ మనం ఎంత కాలమైనా గడపవచ్చు. మనిషి చాల సాత్వికుడు.

'బ్రాక్ '''స్టిల్ లైఫ్'' చిత్రాన్ని ప్రదర్శించాడు. జాన్ మిరో చిత్రం ఒకటి, దేనితో కలువకుండ ప్రదర్శనలో విడిగా ఉంది. ఇతను గూడ స్పెయిన్‌లోనే జన్మించాడు 1893లో. ఇక్కడ ప్రదర్శించిన చిత్రంలో, ఒక బాలిక పెద్ద పెద్ద గుండ్రని (మన పూరీ జగన్నాధుని కండ్లలాంటి) కండ్లతో నిలుచున్నది. ఇతను గూడ ఎక్కువగ నీలం, ఎరుపు, పసుపు, తెలుపు రంగులను వాడతాడు ముతకగా. చిన్నపిల్లలు గీసే చిత్రాలకు ఇతని చిత్రాలకు అసలే తేడా ఉండదు. ఇతని చిత్రాన్ని చూపి ఇది ఏ 4వ లేక 5వ తరగతి పిల్లలో వేసారంటే ఎవరూ నమ్మకుండా ఉండలేరు. అలా కనుపిస్తాయి చూడడానికి. మన గ్రామాలలో కొన్ని గుడిసెల గోడలకు సున్నంతో రకరకాల ముగ్గులు, బొమ్మలు వేయగా చూచాను. ఎక్కువగా నాకు మన ఆంధ్రలో కంటే, ఒరిస్సాలో కనుపించాయి యిలాంటి మనుష్యుల బొమ్మలు, యిండ్ల గోడలపై. ఇతని రంగులు

ఎక్కువగ నల్లని బ్యాక్‌గ్రౌండులో కనిపిస్తాయి. దీపావళి రోజులలో వెలిగించిన రకరకాల, రంగురంగుల ప్రేలిన , అవ్వాయి సువ్వాయిలు ఎలాగ కనుపిస్తాయో నల్లని ఆకాశంలో పైకెగసి, అలా ఉంటాయి ఇతని చిత్రాలు, నల్లని బ్యాక్‌గ్రౌండులో. ఈ మధ్య తన చిత్రాలకు చాల లితోగ్రాఫులు తీసాడు. నాకు ఇతని చిత్రాల కంటె లితోగ్రాఫులే బాగుంటాయి. పారిస్‌లోని యునెస్కో బిల్డింగుకు కూడ చిత్రరచన చేశాడు. ఇతని చిత్రాలు ముతుక రంగులలో, దారములాంటి సన్నని గీతలతో పిల్లలు వేసిన ఆకారాల లాంటి చిత్రాలతో మనల్ని చిన్నపిలల్ని చేస్తాయి. మరచిపోయిన మన బడిని, ఆనాడు మనం వేసిన బొమ్మల్ని జ్ఞప్తికి తెస్తాయి.

సహజరూప చిత్రాలలో అమెరికన్ ఎడ్విన్ డికిన్‌సన్ చిత్రం ఎంతో అమోఘంగా ఉన్నది నాకు ఇతని చిత్రాల్ని 'గోయా' చిత్రాలతో పోల్చవచ్చునని అనిపిస్తుంది. ఒక గదిలో కూర్చొని వివిధ రకాల సంగీత వాద్యాలను వాయిస్తున్నవారి చిత్రం. పెద్ద చిత్రం. ఇతను వాడిన ఆకుపచ్చ తెలుపు రంగుల మిశ్రమం అద్భుతం. 'గోయా' ఎంతో ప్రజ్ఞతో ''టెర్రావర్టా'' ఆకుపచ్చరంగును వాడతాడు. మరల ఈనాడు డికిన్‌సన్ వాడాడు అలాగ. బహు సున్నితమైన రంగుల మిశ్రమంతో ఒకవైపు నుండి వస్తున్న వెలుతురును చిత్రించాడు వాద్యాలపై, మనుష్యులపై. ఎంతసేపు చూచినా తనివితీరని ఆనందాన్ని యిస్తుంది. ఇక్కడ ఉన్న రిచెర్డ్ డిబెన్‌కర్న్, జేమ్స్ మేక్‌గ్రెల్, ఎడ్వర్డ్ హూపర్ ( అమెరికా) లూసిన్ ఫ్రాయిడ్ ( జర్మని) బాల్తుస్ ( ఫ్రాన్స్) పాల్‌డిలావాక్స్ ( బ్రసెల్స్) మొదలగు సహజ రూప చిత్రకారుల చిత్రాల కంటే ఎంతో బాగుంది డికిన్‌సన్ చిత్రం. ఇదొక్కటే సహజరూప చిత్రం. ప్రజ్ఞతో గూడినది ప్రదర్శన అంతటిలోకి. ఇతను అమెరికాలో చాల ప్రసిద్ధ చిత్రకారుడు. ప్రదర్శనలో ఇచ్చిన **Award** కెనడియన్ చిత్రకారునికి యివ్వడం కంటె యితనికి యిచ్చి వుండవలసింది.

ఇంకా డుబుఫే (ఫ్రాన్సు) మాక్స్ ఎర్నెస్ట్ ( జర్మని) సిడ్నీ నొలాన్, ఆర్థర్ బాయిడ్ ( ఆస్ట్రేలియా) హెరాల్డ్ టేన్ ( కెనడా) కెన్జో ఒకాడా ( జపాన్) హాన్స్ హార్తుంగ్ ( జర్మని) మొదలగు ప్రసిద్ధ చిత్రకారులు మంచి చిత్రాల్ని ప్రదర్శించారు.

ఇక ఇంగ్లీషు చిత్రకారులలో గ్రహం సదర్‌లాండ్, సెర్రిరిచర్డ్స్, జాన్ పైపర్, విక్టర్ పాస్‌మోర్, లౌరి, పీటర్‌బ్లేక్, ఆలన్ డేవిడ్ ప్రదర్శించారు. అందరు పాతవారే. చూచిన చిత్రాలే దాదాపు అన్ని, యిదివరకు. వారి చిత్రాలు మారవు. పేరు వచ్చిన శైలితోనే మరల మరల చిత్రాలను వేస్తూ కాలక్షేపం చేసే చిత్రకారులు వీరందరు. క్రొత్తదనం ఏమీ లేదు, ఒక ఆలన్ డేవిడ్‌లో తప్ప. ఆలన్ డేవిడ్ స్కాట్లండ్‌లో పుట్టాడు. ఇతని

చిత్రాలు చూస్తే మార్క్ చాగల్ చిత్రాలలోని రంగులు కనిపిస్తాయి. అవే ఎరుపు నీలి రంగులు. ఇతనుగూడ ముతకగ వాడతాడు రంగుల్ని. ''స్టెయిన్డ్ గ్లాస్ విన్డోస్ ' కొరకు వేసిన చిత్రాలా అనిపిస్తాయి. ఒక రూపం ఉండదు. 'జాన్‌మిరో' ఆకారాలు (బండగా), ఆఫ్రికన్ మాస్కుల చారలు మిళితంచేసి, జానపదుల ముతుక రంగులలో వేస్తాడు చిత్రాలు. చూడగనే కొట్టవచ్చినట్లు ఉంటాయి. ఇలానే వేసే పద్ధతి యితనిది. కాని, ప్రదర్శనలోది మాత్రం ఇటువంటిది కాదు. రకరకాల యంత్ర భాగాలు అన్ని దగ్గర దగ్గరగా కూర్చి చేసిన పెద్ద చిత్రం. మసక చీకటిలో మినుకు మినుకు మంటున్న దీపపు కాంతిలో ఉన్న పౌండ్రి షాపులాగ ఉంది చిత్రం. ఎప్పుడూ వాడని బ్రౌన్, నలుపు, క్రిమ్సన్ రంగులు వాడాడు. దీన్ని యిప్పుడు 'టేటు' గ్యాలరి కొన్నది.

ఇంకా వ్రాస్తే చాలమందిని గురించి వ్రాయవచ్చు. ఈ పై వారందరు పేరున్న చిత్రకారులు. అంతకంటే ముఖ్యంగా క్రొత్త క్రొత్త పంథాలను త్రొక్కినవారు. వీరి కృషి వలననే ఎన్నో రకాల క్రొత్త ''యిజము' లు కళారంగంలో మరల రావడానికి అవకాశం ఉంది. ఈ ప్రదర్శన మన దేశంలోకి తెచ్చి ప్రదర్శిస్తే బాగుంటుంది. ఇండియాలో ఉండి, వారికివారే , హేమాహేమీలమనుకుంటున్న చిత్రకారులకు కనువిప్పు కల్గుతుంది. యువ చిత్రకారులకు అసలు ఆధునిక చిత్రకళంటే ఏమిటో తెలుస్తుంది. లేకపోతే యింకా పుస్తకాలలో బొమ్మలు చూచి అనుకరించో, అనుసరించో చిత్రాలు వేసే రాత తప్పదు. ఇటువంటి ప్రదర్శనలు దేశంలోకి తేవాలని మన కళా ఎకాడమీలు ప్రభుత్వానికి నచ్చచెప్పి వప్పించాలి. లేకపోతే మన ఆధునిక చిత్రకళ, చిత్రకారులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్లు ఉంటారు.

ఇప్పుడు మన దేశంలో ఫ్రాన్స్ పుణ్యమా అంటూ ఏర్పరచిన చిత్రకళా ప్రదర్శన చాలమందికి కనువిప్పు అయి ఉంటుందని ఆశిస్తాను. ఇంకా ఇంకా ఇతర దేశపు ప్రదర్శనలు మన దేశంలోను, మన దేశపు ప్రదర్శనలు ఇతర దేశాలలోను జరిగితే చాల మంచిది.

*(భారతి, మార్చ్ 1964)*

☆





## ఇక నా గురించి

నాగురించి ఏముంటుంది అంతగా వ్రాయడానికి? సరే అడిగారు గాబట్టి వ్రాస్తాను క్లుప్తంగా. మొన్న ఈ మధ్య శ్రీమతి నియోమి మిచిసన్ నాచిత్రం ఒకటి కొన్నారు. ఈవిడ యిక్కడ ప్రముఖ నవలా రచయిత్రి, గ్రంథకర్త, భర్త శాసనసభ్యుడు, సోదరుడు జె.బి. ఎస్. హాల్డేన్. మన ఇండియాలో ఉన్నరు నా చిత్రాన్ని గ్లాస్కోదగ్గర వున్న ఆర్గైల్ కవుంటీలో ఉంచుతారు.

స్కాట్లాండ్ ఎడ్యుకేషనల్ బోర్డ్‌కు ఈవిడ డిప్యూటీ ఛైర్ పర్సన్. తరచు ప్రపంచం అంతా పర్యటిస్తుంది. స్పెక్టేటర్, బి.బి.సి, లిస్నర్‌లలో వ్యాసాలు వ్రాస్తున్నది.

నా అమెరికా వెళ్లే వ్యవహారం ఇంకా ఒక రూపందాల్చలేదు. నన్ను మెసాచుసెట్స్ యూనివర్శిటీవారు (నే పంపిన నా చిత్రాలు ఫొటోలు, కలర్ ట్రాన్స్‌పరెన్సీలు చూశాక) పోస్ట్ గ్రాడ్యుయెట్ కోర్సుకి సెలెక్ట్‌చేశారు.

స్కాలర్‌షిప్పు వారిచ్చేది సరిపోదని వ్రాశాను. మరల ఎంత ఇచ్చేది వ్రాస్తామని అన్నారు,

ఛైర్మన్ ఆఫ్ ది ఆర్ట్ డిపార్ట్‌మెంట్, మెసాచుసెట్స్ యూనివర్సిటీ. ఈయనే స్వయంగా చు నాతో పర్సనల్‌గా ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి, నన్ను పోస్ట్ గ్రాడ్యుయేట్‌కు తీసుకుంటానికి ఒప్పుకున్న ఆయన. ఈయన ప్రముఖ చిత్రకారులు. నా చిత్రాలు నేషనల్ గ్యాలరీ, న్యూఢిల్లీలో చూచారట. చాలా నచ్చాయట. ఇలా నలుగుతున్నది వ్యవహారం కొద్దికాలం పడుతుంది, ఏ సంగతి తెలియడానికి.

ఇక్కడ మూడవ సంవత్సరం ఎక్స్‌టెండ్ చేస్తానన్నారు కామన్ వెల్త్ ఫెలో షిప్పు కమిటీవారు నా కోర్సు వచ్చే జులైకి పూర్తి చేస్తున్నాను. ఆ తర్వాత యు.యస్. ఎ. లేక ఇండియా.

నావి రెండు లితోగ్రాఫులు లిస్బన్‌లో ప్రదర్శించారు. ఇది పోర్చుగల్‌లోని గ్రవూరా అనే ఆర్ట్ ఎకాడమీవారు ఏర్పాటు చేసింది. ముఖ్యంగా పోర్చుగీస్‌వారి గ్రాఫిక్స్ ( అంటే లితో గ్రాఫులు, ఎఛింగ్‌లు) ప్రదర్శిస్తుంది. ఈమధ్య ప్రముఖ యూరోపియన్ చిత్రకారులను ఆహ్వానించి, వారి చిత్రాలను ప్రదర్శిస్తోంది. ఈ అకాడమి ప్రదర్శించడం అంటే ఎంతో గొప్పగా తలుస్తారు యూరప్‌లో. నావి ''ఎగ్జిబిటెడ్ ఆన్ ఇన్విటేషన్'', అంటే ప్రదర్శనకు వచ్చిన చిత్రాన్ని జడ్జీలుగ నియమింపబడ్డ స్కాలర్స్ ఏవి ప్రదర్శనలో ఉండతగినవో కాదో నిర్ణయించేసి కొన్ని చిత్రాల్ని మాత్రమే సెలక్ట్ చేస్తారు. కాని నలుగుర్నో అయిదుగుర్నో నన్ను అడిగినట్లుగానే ఆహ్వానంపై పిలిచి వారి చిత్రాలు ప్రదర్శిస్తారు. ఎవరు జడ్జి చెయ్యరు వాటిని. దీన్ని మహాగొప్ప గౌరవంగా భావిస్తారు చిత్రకారులు - ఇది ''ఎగ్జిబిటెడ్ ఆన్ ఇన్విటేషన్'' అంటే.

యూరోపియన్ ప్రముఖులు ప్రదర్శించారు, యీ ప్రదర్శనలో. ఇది గ్రూపుషో. నే నొక్కణ్ణే ఆఫ్రో ఏషియన్ దేశాల నుంచి ప్రదర్శించింది ఇందులో. రెంటిలో నాది ఒకటికొన్నారు. నా చిత్రాలు లండన్ యూనివర్సిటీ ద్వారా వెళ్ళాయి. మీకు తెలుసుగా మన ఇండియన్స్ అంటే పోర్చుగీసు వారికి పడదని.

సర్ హెర్బర్ట్‌రీడ్ గారు నావి రెండు లితోగ్రాఫులు తీసుకున్నారు, పెర్సనల్ కలక్షన్‌కు. ఈయన ప్రపంచంలో యిప్పుడువున్న నలుగురు అయిదుగురు ''అథారిటీస్ ఆన్ ఆర్ట్''లో ఒకరు. ఈయన గురించి విననివారు, వారి పుస్తకాలు చదవని వారు కళారంగంలో ఎక్కడా ఉండరు. ఈయన కలక్షన్సులో పికాసో, హెన్రీమూర్‌లవంటి వారి చిత్రాలు శిల్పాలు ఉన్నాయి. నా చిత్రాలు ఎంతో నచ్చాయి వీరికి. నేను నా స్కాలర్‌షిప్ ప్రయత్నానికి మీపేరు ''రిఫరెన్సుకి'' యివ్వచ్చా అంటే ' నా పేరును ధారాళంగా ఉపయోగించు


కోవచ్చు'' రిఫరెన్సుకి యు.యస్.ఎ.లో ఎవరికి వ్రాసినా ''నీ గురించి, నీ చిత్రాల గురించి చాలా ఘనంగా వ్రాస్తాను''. అన్నారు. నేను ఆయన్ని ఫొటో తీశాను. మేమిద్దరం కలసి వున్నది అంతగా ''క్లియర్''గా రాలేదు. కొద్దిగా అవుటాఫ్ ఫోకస్ అయింది. ఆయన కలక్షన్స్‌లోనికి వెళ్ళిన మొదటి ఇండియన్ ఆర్టిస్ట్ చిత్రాలు నావే.

అక్కడక్కడ కొద్దిగ అమ్మాను చిత్రాలు. వారు అంతగా ప్రముఖులుగారు. నచ్చితే చిత్రాలు కొనేవారు. అంటే టెక్నికల్‌గా స్టాండర్డ్ చూచి కొనే తెగకు చెందరన్నమాట.

ఇక వుంటాను.

*(భారతి, జనవరి 1964)*

☆



# చిత్ర కళ - నా భావన

ఎవరైనా ఎందుకు చిత్రిస్తారు? అది ఇతర్లకు అర్థం అవుతుందా లేదా అని ఆలోచిస్తారా చిత్రకారులు?

నీరు పల్లములోకి ప్రవహిస్తుంది. పిట్ట పాడుతుంది. అది సహజగుణం. అలానే చిత్రకారుడు తనలో కలుగుతున్న ఒక అలజడిని బయటకు వెలిబుచ్చుతాడు. ఇంతవరకు జరిగిందేమంటే తాను చూచింది, ఇతర్లు చూచింది ఒక్కటే కాబట్టి, తనకు చిత్రించే గుణం వున్నది గనుక చిత్రించాడు. అంతే. అది ఎవరికి గందరగోళం సృష్టించలేదు. అగమ్యగోచరంగా కన్పించలేదు. 'ఆల్టామేరా' గుహల్లోని కుడ్య చిత్రాలు ఉదాహరణ. వాటివల్లనే మనకు తెలియవచ్చింది వారు ఎలా బ్రతికారో, ఏ ఏ జంతువుల్ని వేటాడారో, ఎటువంటి ఇండ్లలో నివసించారో, కుటుంబాల్ని ఎలా పోషించారో, ఏ ఏ వస్తువులు వాడేవారో తెలిసాయి. ఆవిధంగా చరిత్రను భద్రపరచారు - వారికి తెలియకుండానే.

మానవుడు ప్రకృతితో కలిసిపోయి బ్రతికాడు, ప్రేమించాడు, ఆరాధించాడు. తరువాత ప్రకృతిని తన అవసరాలకు వీలుగా మలచుకోవాలని ప్రయత్నించాడు. సాధించాడు. బయట మంచు కురుస్తుంటే ఇంట్లో వుండి వేసవికాలంలో వున్నట్లుగాను, మలమల మాడిపోతున్న ఎండలు బయట వుంటే ఇంట్లో చల్లని మలయ మారుతాలు వీసే వాతావరణాన్ని సృష్టించగలిగాడు. నీటిమీద, గాలిలో ఎగిరిపోగల సత్తాను సంపాదించాడు. భూమిమీద ఉన్న మానవుడు చంద్రమండలం మీద కాలు మోపాడు. ఊహించ లేనంతగా ఎదిగాడు. భూమిలో నుండి వజ్రవైఢూర్యాలను, బంగారు, వెండి ఖనిజాలను, సముద్ర గర్భంలో నుండి ముత్యాలను వెలికి తీసి అలంకరించుకున్నాడు. ప్రపంచాన్నంతటిని ఒక్క టి.వి. సెట్టులో చూడగలిగే అంత సామర్థ్యాన్ని పొందాడు.

తనకు భౌతిక శరీరం, మనసు, ఆత్మ ఉన్నదని గ్రహించి, ఏది భౌతికమో అది ఆకారం - కృశించేదీ అదే, నశించేదీ అదే, అని ఆధ్యాత్మికంగా గుర్తించడం జరిగింది.

దానిలోనే నిబిడీకృతమై ఉన్నాయి మిగిలిన రెండూ మనసు, ఆత్మ మనసు పరిపరి విధాల పోతుంది, గుఱ్ఱంలా పరుగెడుతుంది. భౌతికాన్ని అంటిపెట్టుకొని వుండి ఆడిస్తుంది. తన కోర్కెలన్నిటిని భౌతిక శరీరంతో తీర్చుకుంటూ ఆనందిస్తుంది. చిక్కుల్లో పెడ్తుంది శరీరాన్ని. మనసును నమ్మలేం. స్వాధీనంలో పెట్టాలి. లేకపోతే ఎగురవేసిన గాలిపటంలా ఎక్కడెక్కడికో పోతుంది. దారం తెగిన గాలిపటంలా ఏ చెట్టు చివర్నో, ముండ్ల పొదల్లోనో చిక్కుకుంటుంది. మనసుకు సర్కస్‌లో ఉన్న ఏనుగులా శిక్షణ ఇస్తే మావటివాడు ఆడించినట్లుగ ఆడి అందరికి ఆనందం ఇస్తుంది. లేకపోతే అడవిలోని సింహంలా గర్జించి అపాయం పాలు చేస్తుంది మనల్ని. మానవుడు పెట్టవలసిన కృషంతా మనసును ఎలా కంట్రోల్లో ఉంచాలా అనే

ఇక ఆత్మ సంగతి. ఇదొక విచిత్రం. శరీరంలో బందీగా వుంటుంది మనసుతో కలిసి. శరీరంతో గాని, మనసుతో గాని సంబంధం లేకుండా నీటిపై నూనెలా ఉంటుంది. ఆత్మకు తెలుసు తనకు మృత్యువు లేదని. ఈ శరీరం నశించిపోతే ఆత్మ పరుగు పరుగున వెంటనే మరో ఆకారంలోకి వెళ్తుంది. శరీరంతో పాటు నశించేది మనసు అని గూడ తెలుసు. అందువల్ల ఆత్మ ఈ రెండిటి త్రోవలో వెళ్ళనే వెళ్ళదు. తనది వేరే మార్గం. ఆత్మ పరమాత్మ కొఱకు వెతుకుతుంది. మనసు డాన్సురాని, య్యాక్టింగ్ రాని తెలుగు హీరో, తెలుగు భాషరాని తెలుగు హీరోయినుల వింత వింత డాన్సుల మయమైన తెలుగు సినిమా చూడాలని వెతుకుతుంది సినిమా పత్రికల్ని. ఆత్మ ఇహలోకంలో వుండి పరలోకపు ఆలోచన్లతో మునిగి వుంటుంది.

పొత్తుకుదరని భాగాల సముదాయం మనం. మనిషి మనిషికి తేడా, దేశ దేశానికి తేడా కన్పిస్తుంది. తేడా వున్నదని గ్రహించే శక్తి మాత్రం వుంది - ఆలోచన వున్నది గనుక. అన్నిటిని సమన్వయం చేసికొని జీవిస్తుంటాడు మానవుడు. సుఖపడాలని ఆశ. విచక్షణా పూర్వకంగా తనను తాను సరిదిద్దుకొని ఉత్తమ మానవుడవ్వాలని కోరిక.

కాని తృప్తి లేదు - ఏదో వెలితి

తాను చూడలేనిది, తెలియనిది ఒక స్వర్గంగా భావించాడు, మరొకటి నరకం అనుకున్నాడు. స్వర్గంలో ఎవరు వుంటారో ఊహించాడు - అక్కడ ఎంత హాయిగా, సుఖంగా వుంటుందో! నరకంలో వుంటే ఎంత భయమో అని జడిసి పోయాడు. అంతా మిధ్యగా తోచింది - అది సత్యం అని నమ్మాడు. జీవితం జీవన్మరణాల మధ్యగల దూరం అని తర్కించి ఒక నిర్ణయానికి వచ్చాడు తెలియనిది తెలుసు కోవడమే, కండ్లతో

చూడలేనిది ఆత్మపరంగా చూడగలనని, చేరుకోలేని పరమాత్మ తన ఆత్మలోనే వున్నాడని, తనకు తాను చెప్పుకొని సమాధానపడ్డాడు.

ఇవన్నీ వూహాలే. నిజాలు ఎవరికి తెలుసు? అసలు నిజం అంటే ఏమిటి? ఎవరి నిజం నిజం! నిజం అందరికి భిన్న విభిన్నాలుగా వుంటుంది. పలు విధాలైన భావాలు, నమ్మకాలు, భ్రమలు, ఊహలు మనిషిని ముంచెత్తుతున్నాయి - ఆది మానవుని దగ్గర నుండి.

కళ అన్నిటికి స్పందిస్తుంది. మతాలను ఆధారంగా తీసికొని స్వైర విహారం చేసింది చిత్రకళ. వివిధ మతాలు తమ ప్రాబల్యం కొఱకు, 'కళ'ను ఉపయోగించుకున్నాయి అని చాల మంది అంటారు. కళే మతాన్ని ఉపయోగించుకున్నదేమో! క్రీస్తు పుట్టుక, మెడోనా తల్లి క్రీస్తు బిడ్డడు, శిలువపై వున్న క్రీస్తు, దేవకన్య దూత వచ్చి మెడోనాతో "నీకు క్రీస్తు అనే పరమ పురుషుడు పుట్టడానికి భగవంతుడు నిర్ణయించాడు'' అని చెప్పడం క్రీస్తు చనిపోయి దైవసాన్నిధ్యాన్ని చేరుకోవడం, లాంటి చిత్రాలు నిదర్శనాలు. రోము నగరంలోని "Vatican" చర్చి భవనంలోని "సిస్టీన్ ఛాపెల్'' సీలింగ్ పై "మైక్ లాంజెలో'' అనే ఇటాలియన్ చిత్రకారుడు చిత్రించిన చిత్రాలు, మతాన్ని మించిపోయి, ప్రపంచాన్నంతటిని మతం వైపు చూచేట్లుగ, భగవంతుని పై ధ్యాస మరలేందుకు, దోహద కారులైనాయి. క్రైస్తవ కథల్ని అండగా తీసికొని ప్రతిసృష్టి చేసినాయి. క్రీస్తును దేవునిగా చూపించాయి మన కండ్లకు. బౌద్ధమతంలో యశోదకు బుద్ధుడు జన్మించే తీరు, పరినిర్వాణం, జాతక కథలు, అజంతా గుహకుడ్య చిత్రాలు, ఊహాతీతంగా, ప్రపంచం లోని ఎన్నో దేశాల్లో బౌద్ధ శిల్పులు చెక్కిన శిల్పాలు అనంతం - వర్ణనాతీతం. అలాగే మన హిందూ మత ధర్మాలను చెప్పేందుకు మలచిన గుడులు, గోపురాలు, ఎల్లోరా గుహలు, జైనుల "మౌంటు అబూ'' "గోమతేశ్వర్'' చెక్కడాలు అపూర్వం. కళ అపూర్వంగానూ వుంటుంది భ్రమను గూడ సృష్టించగలదు. ఎంత మంది ప్రవక్తలు, ఎంత బోధించినా, ఎన్ని గ్రంథాలు వ్రాసినా ఒక్క కళాఖండం మానవునిలో కల్గించినంత చలనాన్ని సాధించలేవు. తిరుపతి పుణ్యస్థలంలోని శిల్పి మలచిన వెంకటేశ్వర స్వామి శిలా విగ్రహాన్ని దర్శించడానికి వచ్చే జన సందోహాన్ని చూస్తే, తెలుస్తుంది కళ ఎంత ప్రాధాన్యత సంపాదించిందో వారి హృదయాల్లో.

అపురూప మయం చిత్రం

ప్రకృతికి ప్రతి సృష్టి చేస్తాడు మానవుడు. తన బింబాన్ని అద్దంలో చూచుకొని మురిసిపోయే మానవుడు, ఉన్నది ఉన్నట్లుగ చిత్రించిన దాన్నే ఎక్కువగా ప్రేమిస్తాడు.

అందుకే రాజారవివర్మ చిత్రాలు, ఫొటో గ్రాఫులు అందరికి నచ్చుతాయి. ఏ శ్రమ పెట్టకుండ, మేధస్సు ఉపయోగించకుండ, ఆనందించడానికి వీలుపడుతుందో దానికి ఆకర్షింపబడతారు చాలమంది. ఒక విధంగా దైవ సంబంధి చిత్రాలు గూడ అలాంటి వేనేమో! చూచింది మ్రొక్కడం. భగవంతునిగా ధ్యానించడం - ఆ భగవంతుని ఆకారంలో తెలిసిన రూపం వున్నది గనుక.

రూపానికి వశీకరణ మంత్రం వుంది. అది బంధిస్తుంది పంజరంలోని చిలుకలా. మన ఆకారమే రూపం. అదే బంధం. అందులోనుండి బయట పడాలని తపన జీవికి.

ఉన్నదానితో తృప్తిలేదు. ఏదో తెలుసుకోవాలని, దేనిలోనో ఏదో నిగూఢ రహస్యం వుందని, అంతర్గతమైన సత్యం వున్నదని అదే మనశ్శాంతిని ఇస్తుందని భ్రమ. భ్రమ లేకుండా జీవితం లేదు. అలా వుండిపోయి జీవించాల్సిందేనా!

తెనాలి రామలింగ కవి "ఉద్భటార్య చరిత్ర" తృతీయా శ్వాసంలో మంజు భోజుడు అంటాడు :

"విష్ణుడన రుద్రుడనగ వాగ్విభుడనంగ
దగిన నామాంతరంబులు దాల్చి నీవు
భ్రమము సమకూర్తు వెఱుగని ప్రాకృతులకు
నీమహత్వంబు చిత్రంబు నీలకంఠ"!

తెనాలి రామకృష్ణునకు త్రిమూర్త్యాత్మక పరబ్రహ్మము ఒక్కడే.

చిత్రకారుడు ఒక్కడే 'భ్రమ'ను రూపమయంగా రూపాతీతంగా రూపరహితంగా ప్రదర్శించగల్గుతాడు. తనలో నుండి తాను బయటకు వచ్చి - అశాశ్వతమైన భౌతిక శరీరం నుండి, అగమ్యగోచరమైన భావనలోకి, అనంతమైన అంతరిక్షంలోకి ప్రయాణం చేస్తాడు. అంతః చక్షువులతో చూస్తుంటే, ఏదో ఒక భగవత్ దర్శనమైనట్లుగా వుంటుంది. సారించిన దృష్టితో యావత్ ఖగోళాలను ఒక్కసారిగా చూడవచ్చు. శరీరమే ఒక ఖగోళమవుతుంది. దేదీప్యమానంగా వెలుగుతున్న, తన శరీరంలోనుండి, కాంతి వరదలుగా బయటకు వచ్చేస్తుంటుంది. ఏ వస్తువును ముట్టుకున్నా వ్రేళ్ళ చివరల నుండి వచ్చే వెలుగు, ఆ వస్తువును వెలిగిస్తుంది. వస్తువు కాంతితో మెఱిసి పోతుంది. తాను సూర్యుడు. అంతర్గతంగా వున్న వెలుతురు, తన ద్వారా బయటకు ప్రసరిస్తుంది. ప్రజ్వరిల్లుతుంది.

ఆ స్థితిలో వేసిన చిత్రాలు, వచ్చిన చిత్రాలు, చిత్రకారుని పరిధికి మించినవిగా వస్తాయి. ఏదో మహత్తర శక్తి తనను గాలిలో ఎగిరింప చేసి, ఎక్కడకో తీసికొని పోయింది. ఒక్కసారి దివ్యదర్శనం అయిన తర్వాత, చిత్రకారుడు మానవుని ఉనికిని దాటివెళ్ళిపోతాడు. మరల మానవునిగా ఈలోకంలోనికి తిరిగిరాడు. వస్తాడు నామ మాత్రంగా, భౌతికంగా. అందరి మధ్య తిరుగుతూ మాట్లాడుతాడు. కాని ఆత్మ పరాధీనం అయిపోతంది. తన కళ ఎవరినో పూజించడానికే తప్ప, తనకుగాని, చూచిన వారికి గాని అర్థం అవ్వాలనేటటు వంటి ధ్యాస లేని కళను మాత్రమే సృష్టించగల్గుతాడు. ఈ స్థితిలో వున్న చిత్రకారుని కళ, అర్థంగాక పోయినా చూచినవారు స్పందించి తీరుతారు. ఎందుకంటె ఈ కళ హృదయాల్ని హత్తుకుంటుంది వారికి. ఇది భక్తిలాంటిది. భక్తిగీతాలు పాడేవానికి, వినే వారికి ఉన్న సమన్వయం భగవంతుని మీద ఉన్న ప్రేమే కారణం. జీవాత్మ పరమాత్మలో కలవడం అన్నా, పరమాత్మ ఆత్మలో వుండడం అన్నా ఇదేనేమో! "ఈ మమతలలో అనుభావాలలో ఈశ్వరుణ్ణి చూడగలిగితే, ఇదంతా ఈశ్వర ప్రేమలీలగా తీసికో గలిగితే యీ లోకపు - "భ్రమలన్నీ ఆనంద హారతులుగా మండి పోతాయి వాంఛలన్నీ ప్రేమలో ఫలిస్తాయి" అంటారు రవీంద్రనాథ్ ఠాగూరుగారు 'గీతాంజలి'లో చలంగారు అనువదించిన గీతాంజలిలో

ఇది భ్రాంతి ఇదొక మాయ. మానవ జాతిని కప్పిన దట్టమైన పొగమంచు. ఈ పొగ మంచును సూర్య రశ్మి మాత్రమే విచ్ఛిన్నం చేయగల్గుతుంది. ప్రత్యక్ష దైవ సంభూతుడు చిత్రకారుడై, మానవునిలోని మాయ తెఱలను తొలగించడానికి, కళలను కనిపెట్టాడేమో అనిపిస్తుంది. కళ ఏమి చేస్తుంది అనే ప్రశ్న వస్తుంది నాకు. జవాబు కొఱకు ఎప్పుడూ ఆలోచిస్తూ వుంటాను. చిత్రకళకు మంత్రజాల శాస్త్రం తెలుసు. ఇంద్రజాల మహేంద్రజాలాల్ని సృష్టిస్తుంది. చిత్రాల్ని చూచే ప్రేక్షకుడ్ని, తనను తాను మరచిపోయేట్లుగ చేస్తుంది. ప్రేక్షకుడ్ని తాను నిత్యం చేస్తున్న దైనందిక పనుల నుండి వేరు చేసి అనుభూతుల ద్వారా చిత్రాల్ని చూచి ఊహించేట్లుగ చేస్తుంది. ఊహాల్ని మేఘాలపైకి ఎక్కించి, ప్రయాణం చేయిస్తుంది. ఇహాన్ని మరచి పరలోకంలోకి తీసుకు వెళ్తుంది. క్రొత్త రంగుల్లో, క్రొత్తలోకంలో, స్పష్టాస్పష్ట ఊహల్తో, ఆనందడోలికల్లో ఉయ్యాల లూగిస్తుంది. ఆత్మను పరమాత్మ వైపుకు మరలిస్తుంది. తెలిసిన దానికంటె తెలియనిది, తెలుసుకునే యత్నంలో ఆనందం వుంది, అని తెలియ చెప్తుంది. తెలియని భగవంతుని తెలిసికోవాలని జీవితం అంతా, తపిస్తుంటాం. అవగాహన అవ్వని దేవుడ్ని అనంతుడనుకుంటాం. భూగోళానికి పైనున్న అంతరిక్ష మండలాలలో ఎగురుతూ,

అక్కడి వెలుగును చూస్తూ, విస్తు పోతుంది ఊహ. ఊహ అనంతం. అనంతంలో అంతర్గతం అయిపోతుంది ఊహ - కట్టెలు కాలిస్తే వచ్చే పొగ ఎలా అనంతంలో అంతర్గతం అయిపోతుందో, మాయమై పోతుందో అలా శూన్యంలో కలిసిపోతుంది. జీవి అనంతంలో కలిసిపోతుంది. ప్రేక్షకులు చిత్రాల్ని చూస్తే అలానే అందులో లీనమై పోయి, చిత్రకళ - వారూ ఒకటయిపోతారు - తాదాత్మ్యం చెందుతారు. భక్తుడు భక్తి గీతాలను గానం చేస్తూ భగవంతునిలో తాదాత్మ్యం చెందినట్లు.

ఇదీ చేస్తుంది చిత్రకళ. అందుకే మానవుడు కళద్వారా ముక్తి పొందుతాడు అన్ని కళలు ఆ అనంత స్వామిని, నిరాకారుని, నిర్గుణున్ని స్తోత్రం చేయడానికి పుట్టినవే. అందుకే, ఆ భావనతోనే నేను నైరూప్య కళ ద్వారా ఆ నిరాకారుడిని పూజిస్తాను. నాలోనుండి వచ్చేనాద వాదాలు ఆ నైరూప్య చిత్ర కళ.

చిత్రకారుడు గాని, చిత్రాలు గాని, చిత్తరువులు వీక్షించే కళా ప్రియులు గాని అందరం ఆ విశ్వరూప సందర్శనానికే ఉన్నాం.

*(25-1-2000)*

☆

## PAINTINGS AND SCULPTURE REPRODUCED IN THE BOOK


| | | |
|---|---|---|
| 1. | Cover Page | : S.V. RAMA RAO<br>*"Music"* |
| 2. | Back Cover | : PABLO PICASSO<br>*"Three Musicians" 1921* |
| 3. | Page : 14 | : PABLO PICASSO<br>*"The Meal"* |
| 4. | Page : 28 | : MANDRIAN<br>*"Composition"* |
| 5. | Page : 34 | : AMRITA SHERGIL<br>*"Banana Seller" 1937* |
| 6. | Page : 42 | : K. SRINIVASULU<br>*"Green Room" 1950* |
| 7. | Page : 46 | : JAMINI ROY<br>*"Three Women"* |
| 8. | Page : 62 | : BARBARA HEPWORTH<br>*"Single Form" 1961-2* |
| 9. | Page : 72 | : GRAHAM SUTHERLAND<br>*"Thorn Heads" 1945-46* |

10. Page : 84 : LOUISE NEVELSON
*"Royal Tide" 1960*

11. Page : 96 : "THE VIRGIN OF THE DON"
*A Russion Icon*

12. Page : 114 : AUGUSTE RODIN
*"The Age of Bronze" 1876-77*

13. Page : 132 : BRAQUE
*"Still life with a Mandolin" 1937*

14. Page : 154 : S.V. RAMA RAO
*Detail of a Painting*

15. Page : 158 : S.V. RAMA RAO
*"Flowering time"*

☆

A C No. 83863
-500 044.

యస్వి అవలోకనలో

# చిత్ర శిల్ప జగత్తు



యస్వి రామారావు